సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM


పేజీలు: 16 | సంపుటి: 17
వెల: ₹ 5.50 | సంచిక: 220

గురువారం 31-10-2024


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి దీపావళి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కొత్త చెత్త
హోరాహోరీగా సాగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల సమరం చివరి ఘట్టంలో 'చెత్త' చుట్టూ తిరుగుతోంది.
- వివరాలు 6లో▶



ట్రంప్‌ను ఓడించండి
ట్రంప్ ఏమాత్రం స్థిరత్వం లేని మనిషి అని, ప్రతీకారమే అతడి విధానమని డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మండిపడ్డారు.
- వివరాలు 6లో▶



స్పెయిన్‌లో వర్ష బీభత్సం
కుండపోత వర్షాలు, వడగళ్ల వానలతో స్పెయిన్ అతలాకుతలమవుతోంది. ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి.
- వివరాలు 6లో▶



బెంగళూరులో రహస్య పర్యటన
బ్రిటన్ రాజు చార్లెస్-3 సతీసమేతంగా కర్ణాటక రాజధాని బెంగళూరులో రహస్యంగా పర్యటించారు.
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు



సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి పండుగ సందర్భంగా డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకుంది. అధికారులు ఇచ్చిన నివేదికలోని సూచనలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు.
- వివరాలు 3లో▶

మెడికల్ పీజీ కోర్సులకు.. నేటి నుంచే దరఖాస్తులు



రాష్ట్రంలో ఎట్టకేలకు మెడికల్ పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2024-25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది.
- వివరాలు 12లో▶

ప్రేమమయి సత్యభామ



సత్యభామది పరిపూర్ణమైన, మూర్తీభవించిన స్త్రీతత్వం. భారతీయులంతా వారు ఏ ఖండంలో ఏ దేశంలో ఉన్నా ఆమెనూ ఆమె పాత్రను ఎవరికివారు తమదిగా భావిస్తారు. మా అమ్మాయే అనుకుంటారు.

'దీపావళి' సందర్భంగా 'సత్యభామ' పాత్ర మనోవిశ్లేషణ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాటల్లో...
- వివరాలు 13లో▶



అయోధ్య మెరిసె.. 'గిన్నిస్'కెక్కి మురిసె..

దివ్వెల కాంతుల్లో అయోధ్య రాముని దివ్య మందిరం కాంతులీనింది. చెంతనే ఉన్న సరయు మురిసి.. మెరిసె'నది'. అయోధ్య రామాలయం నిర్మాణానంతరం నిర్వహించిన తొలి దీపోత్సవం రికార్డులు సృష్టించింది. 1,121 మంది ఏకకాలంలో హారతినివ్వడం, 25 లక్షల ప్రమిదలు వెలిగించడం.. ఈ రెండూ గిన్నిస్ రికార్డులకు ఎక్కాయి. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ రామాలయంలో ప్రమిదను వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు.
- వివరాలు 6లో

జనగణనలోనే.. ఓబీసీ కులగణన

కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం

- కులగణనపై గాంధీ భవన్‌లో కీలక భేటీ.. హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ముఖ్య నేతలు
- నవంబర్ 2న అన్ని జిల్లాల్లో అభిప్రాయ సేకరణకు సమావేశాలు
- మేధావులు, సామాజికవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయం
- 5 లేదా 6వ తేదీన రాహుల్‌గాంధీని ఆహ్వానించి సభ నిర్వహణకు యోచన
- కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు.. మెగా హెల్త్ చెకప్ లాంటిది: సీఎం
- పార్టీ నాకు అన్నీ చేసింది.. నేను పార్టీకి, ప్రజలకు సేవ చేయడమే మిగిలింది
- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కులగణన పార్టీకి ఎలా ఉపయోగపడుతుందో వివరించిన కొప్పుల రాజు


గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది నిర్వహించనున్న జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం తీర్మానం చేసింది. రాష్ట్రంలో వచ్చే నెల ఆరోతేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన కులగణనపై చర్చించేందుకు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీనిని ఆమోదించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ నేత కొప్పుల రాజుతోపాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కులగణన కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి ఎలా ఉపయోగపడుతుందన్న అంశాన్ని ఏఐసీసీ నేత కొప్పుల రాజు వివరించారు. ఆ కార్యక్రమంలో పార్టీ శ్రేణులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఇక వచ్చే నెల 2న కులగణన
మిగతా 2వ పేజీలో ▶

ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయండి

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

- రిజర్వేషన్ల కల్పనకు సేకరించే వివరాల కోసం కమిషన్ ప్రత్యేకంగా ఉండాల్సిందేనని వెల్లడి
- ఉత్తర్వులపై పునరాలోచన చేయాలని కోరిన ఏజీ
- ససేమిరా అన్న ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్/ముషీరాబాద్: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కల్పనకు సేకరించే వివరాల కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రెండు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను నవంబర్ 21కి వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రిజర్వేషన్ల బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జీల బెంచ్ తీర్పునకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి, రెండు వారాల్లో స్థాయీ నివేదిక న్యాయస్థానం ముందు ఉంచాలని స్పష్టం చేశారు.

వాదనలు ఇలా..: పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ కమిషన్‌నే
మిగతా 2వ పేజీలో ▶

సొంత జాగా.. రేషన్‌కార్డూ ఉండాల్సిందే?

- ఇందిరమ్మ ఇంటికి ఈ రెండింటినీ ముడిపెట్టే యోచనలో ప్రభుత్వం
- అదే ఖరారైతే.. 30 లక్షల దరఖాస్తులు బుట్టదాఖలే
- ఇళ్ల కోసం అందిన దరఖాస్తులు 80 లక్షలు

3 లో



➡ సొంత జాగా లేని నిరుపేదలకు స్థలం ఇచ్చి మరీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఈ సంవత్సరానికి మాత్రం సొంత జాగా ఉన్నవారికే కేటాయించాలని నిర్ణయించింది. ఇప్పుడు దానితో పాటు రేషన్‌కార్డును కూడా ముడిపెట్టాలని భావిస్తోంది. అయితే, ఈ నిబంధన వల్ల రేషన్‌కార్డు లేనివారిలో వ్యతిరేకత వ్యక్తమయ్యే ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని కూడా గుర్తించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

మయోనైజ్‌పై నిషేధం

- వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు
- ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు మయోనైజ్ కారణమని గుర్తింపు
- ఆహార కల్తీపై ఫిర్యాదులకు కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్: మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న మయోనైజ్ వినియోగంపై ఏడాది పాటు నిషేధం విధిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 అక్టోబర్ చివరివరకూ ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా జరిగిన అనేక ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలకు పచ్చిగుడ్లతో చేసిన మయోనైజ్ కారణమని గుర్తించామని పేర్కొన్నారు. మయోనైజ్ సాధారణంగా శాండ్‌విచ్‌లు, సలాడ్‌లు, స్నాక్స్ వంటి వాటిల్లో రుచి కోసం వినియోగిస్తారు. గ్రిల్డ్, తందూరి చికెన్, కబాబ్‌లు వంటి
మిగతా 12వ పేజీలో ▶

సచివాలయం రక్షణ టీజీఎస్‌పీఎఫ్‌కు..

- అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనల నేపథ్యంలో టీజీఎస్పీపై వేటు
- పాత సచివాలయం రక్షణ చూసిన టీజీఎస్పీఎఫ్‌కే మళ్లీ బాధ్యత
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

16 లో



➡ అత్యంత కీలకమైన సచివాలయం రక్షణ బాధ్యతల నుంచి తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)ను రాష్ట్ర ప్రభుత్వం తప్పించింది. వారి నుంచి తక్షణమే బాధ్యతలను స్వీకరించాలని తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్)ను ఆదేశించింది. ఏక్ స్టేట్-ఏక్ పోలీస్ నినాదంతో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనలు నిర్వహించిన నేపథ్యంలో ఆ విభాగాన్ని సచివాలయం రక్షణ బాధ్యతల నుంచి తప్పించడం గమనార్హం.

జయమా.. పరాభవమా
- రేపటి నుంచి న్యూజిలాండ్‌తో భారత్ మూడో టెస్ట్
- ఒత్తిడిలో రోహిత్ బృందం

14 లో

సెలవు
దీపావళి పర్వదినం సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird	115 kg	Dressed with Skin	199 kg
₹ 74	Retail Live Bird	137 kg	Skin Less	226 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి


దీపావళికైనా హామీలు అమలు చేస్తారా అని అడిగితే! కనీసం టపాకాయలకే డబ్బుల్లేవని మనం కొన్నవే తను కాలుస్తున్నారు!



ప్రభుత్వ ఉద్యోగులకు 3.64% డీఏ
ప్రభుత్వం దీపావళి కానుక

- 2022, జూలై 1 నుంచి వర్తింపు.. బకాయిలు పీఎఫ్ ఖాతాకు జమ
- మార్చి 2025లోపు రిటైరయ్యే వారికి 17 వాయిదాల్లో చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్కారు దీపావళి కానుక ఇచ్చింది. మంత్రివర్గం ఆమోదం మేరకు 3.64% కరువు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ డీఏను డిసెంబర్ 1న చెల్లించే నవంబర్ నెల వేతనంతో కలిపి ఇవ్వనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది. దీంతో ప్రస్తుతం 22.75%గా ఉన్న డీఏ 26.39 శాతానికి పెరగనుంది. 2022, జూలై 1 నుంచి ఈ డీఏ వర్తిస్తుందని,
మిగతా 3వ పేజీలో ▶

మేడిగడ్డకు కొత్త టెయిల్‌పాండ్!
ఎనర్జీ డిస్సిపేషన్ ఏర్పాట్లు లేకనే నష్టం.. మోడల్ స్టడీలో నిర్ధారణ

- పరిష్కారంగా దిగువన టెయిల్‌పాండ్ నిర్మాణం
- ఐఐటీ రూర్కీతో డ్రాయింగ్స్, డిజైన్ల రూపకల్పన
- పనులకు ఎన్డీఎస్‌ఏ అనుమతి ఇప్పించాలని కోరిన రామగుండం సీఈ

2 లో

బీఆర్ నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి


- 23 మంది సభ్యులతో పాలకమండలి
- ముగ్గురు ఏపీ ఎమ్మెల్యేలకు అవకాశం
- జాబితాపై తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి!

12 లో

ముందు నీ కుర్చీ కాపాడుకో

నీ పక్కన ఉన్నవారు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో

- ఆ తర్వాత మమ్మల్ని డీల్ చేసే విషయం ఆలోచించు
- సీఎం రేవంత్‌కు బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు కౌంటర్
- ఐదేళ్ల తర్వాత నిన్నెలా డీల్ చేయాలో మాకు తెలుసు
- మూసీ పాదయాత్రకు నేనూ, కేటీఆర్ రెడీ..డేట్, టైం చెప్పు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాజీమంత్రి వ్యాఖ్యలు




సాక్షి, హైదరాబాద్: 'రేవంత్‌రెడ్డీ.. ముందు నీ కుర్చీకింద ఉన్న బాంబు గురించి చూసుకో.. నీ పక్కన ఉన్నవారు నిన్ను ఫినిష్ చేయకుండా చూసుకో.. నీ మంత్రులే నిన్ను ముంచుతారు. ఒకరేమో రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. మరొకరు ఢిల్లీలో అధిష్టానం వద్దకు రహస్యంగా వెళ్లివస్తున్నారు. మరొకరు హెలికాప్టర్ ఇవ్వలేదని అలిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను డీల్ చేయడం తర్వాత.. ముందు నీవు ఐదేళ్లు పదవిలో ఉండేలా చూసుకో.. ఐదేళ్ల తర్వాత నిన్ను ఎలా డీల్ చేయాలో మాకు తెలుసు. ఏడాది అవుతోంది.. మంత్రివర్గ విస్తరణ చేసుకోలేవు. కనీసం చీఫ్‌విప్, డిప్యూటీ స్పీకర్‌ను నియమించుకోలేకపోయావు..' అని బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్‌ను వాడుకొని కేసీఆర్‌ను ఫినిష్ చేశానని, బావను ఉపయోగించి బామ్మర్దిని ఫినిష్ చేయిస్తానంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు
మిగతా 2వ పేజీలో ▶

నువ్వు చెప్పులు మోసిననాడు.. ఆయన ఉద్యమానికి ఊపిరి పోశాడు!

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ కౌంటర్
- మూసీ ప్రక్షాళన, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ

2 లో





4 పేజీలు.. 100 ప్రశ్నలు

- రాజ్ పాకాలను ప్రశ్నించిన పోలీసులు... జన్వాడ పార్టీకి కేటీఆర్ ఎందుకు రాలేదని ఆరా
- జన్వాడలోని ఇంట్లో సీన్ రీకన్‌స్ట్రక్షన్.. లభించని ఆధారాలు
- ఫోన్ సీజ్ చేసి, 35(3) కింద నోటీసులు.. స్టేషన్ బెయిల్‌పై విడుదల

16 లో

దమ్ముంటే డ్రగ్స్ టెస్ట్ చేయించుకోండి
బీఆర్‌ఎస్ నేతలకు ఎంపీ అనిల్, ఎమ్మెల్సీ బల్మూరి సవాల్
- వివరాలు 2లో

క్లుప్తంగా...

పదేళ్లు దోచుకుని విమర్శలా?

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు పందికొక్కుల్లా దోచుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి ధ్వజమెత్తారు. వారు బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటనేది పగటి కలేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ ఒక్క వార్డు మెంబర్ పదవిని కూడా గెలిచే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దోచుకుని.. ఇప్పుడు ఆంబోతుల్లా ఊళ్లమీద పడి సీఎం రేవంత్‌రెడ్డి మీద విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశారని, అయినా దానిపై హరీశ్‌రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. రైతు భరోసాను సాగుభూమికి ఇస్తామని మంత్రి తుమ్మల చెప్పారని పేర్కొన్నారు. ధాన్యం సేకరించిన పది రోజుల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు రేవంత్ కుట్ర పన్నారు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి తనను కూడా డ్రగ్స్ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. కేటీఆర్ మీద కూడా ఇదే కుట్ర చేసి విఫలమయ్యారని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపీలతో డ్రగ్స్ టెస్టుకు రావాలని సవాలు విసిరారు. టెస్టుల కోసం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అందరూ వెయిట్ చేస్తున్నారని, కానీ తమనెవరూ పిలవలేదన్నారు. కేసీఆర్ పేరు లేకుండా చేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని, కేసీఆర్ పేరు తలచుకోకుండా నీ ఒక్క మీటింగ్ అయినా అయ్యిందా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల గుండెలకు అతుక్కుపోయిన పేరు కేసీఆర్ అని, తుడిచేస్తే చెరిగిపోయే పేరు కాదన్నారు. రేవంత్ పాలనలో ఒక్క వర్గమైనా సంతోషంగా ఉందా అని ప్రశ్నించారు.

గ్యాంగ్‌స్టర్ బిష్ణోయ్, దావూద్ ఇబ్రహీంలా రేవంత్‌రెడ్డి మాటలు


సీఎం తీరుపై దాసోజు శ్రవణ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: గ్యాంగ్‌స్టర్ బిష్ణోయ్, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం తరహాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. ఆయన భాషపై తెలంగాణ సమాజం లోతుగా ఆలోచించాలని, క్రిమినల్ సీఎంలా రేవంత్ పద్ధతి ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని నడుపుతున్న వ్యక్తి క్రిమినల్ అయితే ఇక సమాజం ఎట్లా మనుగడ సాధిస్తుందని ప్రశ్నించారు. కేసీఆర్‌ను ఒక ఏడాదిలో ఫినిష్ చేస్తా? కేటీఆర్‌ను హరీశ్‌రావుతో ఫినిష్ చేయిస్తా? అనే మాటలు సీఎం స్థాయిలో మాట్లాడేవేనా అని నిలదీశారు. ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబును ఫినిష్ చేసిందే రేవంత్ రెడ్డి అని ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీని ఫినిష్ చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రా నాయకుల బూట్లు మోస్తున్నప్పుడే కేసీఆర్ తెలంగాణ కోసం కొట్లాడుతున్నారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రదాతపై దుర్మార్గమైన భాష మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే కేసీఆర్‌తో రాజకీయంగా కొట్లాడాలని సవాల్ విసిరారు. దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ అయ్యిందంటే అది కేసీఆర్ కృషి అని పేర్కొన్నారు.

కేటీఆర్ దొంగ అకౌంట్లపై సైబర్ క్రైమ్‌ను ఆశ్రయిస్తా

కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామా రావు బావమరిది రాజ్‌పాకాల బాగోతం, కేటీఆర్ దొంగ అకౌంట్లపై సైబర్ క్రైమ్‌ను ఆశ్రయిస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తెలిపారు. రాజ్‌పాకాల గురించి చిన్న వీడియోను సామాజికమాధ్యమాల్లో పెట్టినందుకు కక్షపూరితంగా ఆ పేజీని హ్యాక్ చేసి డిలీట్ చేయించారని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దీన్ని బట్టి చూస్తే టెక్నాలజీని కేటీఆర్ ఏ స్థాయిలో ఉపయోగిస్తున్నారో అర్థమవుతుందని వెల్లడించారు. జన్వాడ ఫామ్ హౌస్‌లో జరిగింది రేవ్ పార్టీ కాకుంటే అక్కడ క్యాసినో కాయిన్స్ ఎలా దొరికాయో చెప్పాలని, డ్రగ్స్ తీసుకున్నట్లు ఆనవాళ్లు ఎలా లభించాయో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజాయితీ పరులైతే అక్కడి నుంచి ఎందుకు పారిపోయారో చెప్పాలని, ఏ తప్పూ చేయకపోతే ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టారో చెప్పాలని, రేవ్ పార్టీ కాకుంటే బీఆర్‌ఎస్ పార్టీ వాళ్ల బట్టలు ఎందుకు చింపుకుంటున్నారో చెప్పాలని నిలదీశారు.

మేడిగడ్డకు కొత్త టెయిల్‌పాండ్!

- ఎనర్జీ డిస్సిపేషన్ ఏర్పాట్లు లేకనే నష్టం.. మోడల్ స్టడీలో నిర్ధారణ
- పరిష్కారంగా దిగువన టెయిల్‌పాండ్ నిర్మాణం
- ఐఐటీ రూర్కీతో డ్రాయింగ్స్, డిజైన్ల రూపకల్పన
- పనులకు ఎన్డీఎస్‌ఏ అనుమతి ఇప్పించాలని కోరిన రామగుండం సీఈ

సాక్షి, హైదరాబాద్: పీడన శక్తి విడుదల(ఎనర్జీ డిస్సిపేషన్)కు సరైన ఏర్పాట్లు లేకపోవడంతోనే మేడిగడ్డ బరాజ్ కుంగిందని నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ' జరిపించిన ఓ మోడల్ స్టడీలో తేలింది. దీంతో తాత్కాలిక రక్షణ చర్యల్లో భాగంగా ఆ మేరకు ఏర్పాట్లు చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) నుంచి అనుమతులను ఇప్పించాలని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రామగుండం చీఫ్ ఇంజనీర్ కె.సుధాకర్‌రెడ్డి తాజాగా నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్)కు లేఖ రాశారు. మళ్లీ వర్షాకాలం రాకకు ముందు మిగిలి ఉండే సమయంలో ఈ పనులు చేయాల్సి ఉందని తెలియజేశారు. జలాశయాల గేట్లు ఎత్తినప్పుడు విడుదలయ్యే వరద దిగువన తాకే సమయంలో నేల కోతకు గురై గుంతలు ఏర్పడతాయి. ఎందుకంటే గేట్ల నుంచి నీళ్లతో నిండే ఉండే జలాశయాల నుంచి విడుదలయ్యే వరదలో తీవ్రమైన పీడన శక్తి ఉంటుంది. వరద నేలను తాకే చోట తగిన పరిమాణంలో నీటి నిల్వలతో టెయిల్ ఉండేలా



ఏర్పాట్లు చేయాలి. దీంతో టెయిల్‌పాండ్ నిల్వలో గేట్ల నుంచి వరద వచ్చి పడినా పీడన శక్తి నిర్వీర్యమై దిగువ ప్రాంతంలో ఎలాంటి నష్టాన్ని కలిగించదు. మేడిగడ్డ బరాజ్ దిగువన తగిన నీటినిల్వలతో టెయిల్‌పాండ్ నిర్మించకపోవడం తోనే అక్కడ నేల కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయని, క్రమానుగుణంగా గుంతలు పెద్దగా మారి బరాజ్ పునాదుల కింద ఇసుక జారిపోవడానికి కారణమైందని ఎల్‌అండ్‌టీ నిర్వహించిన మోడల్ స్టడీస్‌లో తేలింది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బరాజ్ దిగువన ఎనర్జీ డిస్సిపేషన్ కోసం టెయిల్‌పాండ్ సామర్థ్యం పెంపు చర్యలను తీసుకోవాలని భావిస్తున్నారు.

ఐఐటీ రూర్కీకి డిజైన్ల తయారీ అప్పగింత

టెయిల్‌పాండ్ పనులకు సంబంధించిన మోడల్ స్టడీస్‌ను ఐఐటీ రూర్కీతో నీటిపారుదల శాఖ చేయించింది. ఈ పనులకు సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను సైతం అదే సంస్థ ఇవ్వనుంది. నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) సీఈతో ఈ డిజైన్లకు ఆమోదం తీసుకొని పనులు ప్రారంభించేందుకు ఎన్డీఎస్‌ఏ నుంచి అనుమతి పొందాలని రామగుండం చీఫ్ ఇంజనీర్ ఈఎన్సీకి విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ బరాజ్‌కు శాశ్వత పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక సమర్పించే వరకు వేచిచూడకుండా ఈ మేరకు పనులు చేసేందుకు ఆయన అనుమతి కోరారు.

జనగణనలోనే.. ఓబీసీ కులగణన

▶ మొదటి పేజీ తరువాయి

అంశంపై జిల్లా స్థాయిలో డీసీసీల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని.. భాగస్వామ్య పక్షాలను ఆహ్వానించి విస్తృతస్థాయి చర్చ జరపాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే నెల 5న లేదా 6న రాష్ట్రస్థాయిలో మేధావులు, సామాజికవేత్తలు, ముఖ్యులతో భేటీ జరపాలని.. వారిచ్చే సలహాలు, సూచనలకు అనుగుణంగా కులగణన ప్రక్రియపై ముందుకెళ్లాలని ఆలోచనకు వచ్చారు. కులగణనపై రాష్ట్రంలో సభ నిర్వహించాలని, దీనికి రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని నిర్ణయించారు.

రాహుల్ గాంధీ మాట మేరకు..: రేవంత్‌రెడ్డి

సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ''తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటైన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన చేస్తామని గత ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. గాంధీ కుటుంబం ఒకమాట ఇస్తే ఎవరు అడ్డువచ్చినా నెరవేర్చి తీరుతుంది. అప్పుడు తెలంగాణ ఏర్పాటు ద్వారా, ఇప్పుడు కులగణన ద్వారా ఇది నిరూపితమైంది..'' అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ విధానాలను అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని.. ఈ క్రమంలో ప్రతిక్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులు, నాయకులపై ఉందని చెప్పారు. కులగణనలో భాగస్వాములను చేసేందుకు 33 జిల్లాలకు 33 మంది పరిశీలకులను నియమించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు రేవంత్ సూచించారు. కులగణన విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్ కావాలని, ఈ మోడల్ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను అమలు చేసే క్రమంలో ఎవరు అడ్డు వచ్చినా, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని.. మెగా హెల్త్ చెకప్ వంటిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమన్నారు. నవంబర్ 31లోగా రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి తెలంగాణ నుంచే నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జనగణనలో భాగంగా ఓబీసీల కులగణన చేపట్టడం కోసం.. రాష్ట్రంలో జరిగే కులగణన డాక్యుమెంట్‌ను పంపుతామన్నారు.

మీరు 52 శాతమే అడిగారు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కావాలన్నది కాంగ్రెస్ పార్టీలోని బీసీల నినాదమని.. అయితే గ్రూప్–1 మెయిన్స్‌కు 57 శాతం మంది బీసీలు ఎంపికయ్యారని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అగ్రవర్ణాలతోపాటు బీసీలు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కోటాల కింద ఎంత మంది గ్రూప్–1 మెయిన్స్‌కు ఎంపికయ్యారన్న విషయాన్ని వివరించారు. నవంబర్ ఆరో తేదీ నుంచి చేపట్టనున్న కులగణన కార్యక్రమాన్ని 30వ తేదీలోగా పూర్తి చేస్తామని.. తర్వాత ఈ వివరాలన్నింటినీ హైకోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఆ రోజుకల్లా స్థానిక రిజర్వేషన్లపై కోర్టు తీర్పు వస్తే, డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సంబురాలు జరుపుకోవాలని పేర్కొన్నారు.

నాకు పార్టీ అన్నీ చేసింది..

కాంగ్రెస్ పార్టీ తనకు అన్నీ చేసిందని, ముఖ్యమంత్రిని చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు మిగిలింది తాను పార్టీకి, ప్రజలకు సేవ చేయడమేనని చెప్పారు. ఈ క్రమంలోనే పార్టీ విధానాన్ని పాటించేందుకు కులగణన చేపడుతున్నామన్నారు. పార్టీ అధికారంలోకి రాకముందు అనుబంధ సంఘాల అధ్యక్ష పదవులు తీసుకోవాలని కోరితే కొందరు ముందుకు రాలేదని.. ఇప్పుడు వారే తాము పెద్ద నాయకులమని, పదవులు ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, తప్పకుండా ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఒక సీఎంగా రేవంత్‌రెడ్డి చట్టాలను అమలు చేస్తాడే తప్ప వ్యక్తిగత ఎజెండాతో కాదని.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను పార్టీ నాయకత్వం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పకడ్బందీగా కులగణన: మహేశ్‌గౌడ్



వచ్చేనెల ఆరో తేదీ నుంచి జరగనున్న కులగణనను పకడ్బందీగా నిర్వహిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. గాంధీభవన్‌లో సమావేశం అనంతరం ఆయన పార్టీ నేతలు షబ్బీర్‌అలీ, మధుయాష్కీ, ఆది శ్రీనివాస్, తీన్మార్ మల్లన్న, అనిల్‌కుమార్ యాదవ్, శంకర్‌నాయక్, మెట్టు సాయికుమార్‌లతో కలిసి మాట్లాడారు. కులగణనపై నవంబర్ 2న జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని, తర్వాత రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని మహేశ్‌గౌడ్ తెలిపారు. ప్రతిపక్షాల అపోహలను ప్రజలు నమ్మడం లేదని.. గత ప్రభుత్వ అరాచకాల మీద చర్యల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే..!

సమావేశంలో వి.హనుమంతరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆ సర్వే కాగితాలు కూడా లేకుండా చేశారని, దానిపై విచారణ జరిపించాలని సీఎంను కోరారు. ఈనెల 6 నుంచి చేపట్టే కులగణనలో కూడా కుటుంబ వివరాలతోపాటు కులం, ఉపకులం తెలుసుకుంటే సరిపోతుందని.. మిగతా వివరాలు అడగడం ద్వారా ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశం ఇచ్చిన వాళ్లమవుతామని సూచించారు. దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ.. కేవలం కులం వివరాలను సేకరిస్తే న్యాయపరంగా ఇబ్బంది వస్తుందని, అందుకే సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే చేపడుతున్నామని చెప్పినట్లు తెలిసింది.

ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక కమిషన్‌గా ప్రభుత్వం పేర్కొనడం డాక్టర్ కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావు గవాలి కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులకు విరుద్ధమని తెలిపారు. బీసీలకు కల్పించిన రిజర్వేషన్ల సమీక్ష నిమిత్తం బీసీ కమిషన్ ఏర్పాటవుతుందన్నారు. అయితే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పన నిమిత్తం వాస్తవ గణాంకాల సేకరణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మహారాష్ట్రలో బీసీ కమిషన్‌నే ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌గా నియమించగా, అది ఇచ్చిన మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం బాంథియా కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బీసీ కమిషన్ ఇచ్చే నివేదిక రిజర్వేషన్ల పునఃసమీక్షకు తప్ప రాజకీయ రిజర్వేషన్ల కల్పనకు గణాంకాలుగా పరిగణించరాదని చెప్పారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు కోసమే జీవో: ఏజీ

వాదనల అనంతరం న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేయగా, ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయంపై పునరాలోచన చేసి మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి మధ్యాహ్నం న్యాయమూర్తిని కోరారు. రెండున్నర నెలల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సిన దశలో ఈ ఉత్తర్వులు సరికాదన్నారు. 2021లో ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందని తెలిపారు. ఈ జీవో అమలు నిమిత్తం తిరిగి జీవో 47 జారీ చేస్తూ గణాంకాల సేకరణకు విధివిధానాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ జీవోలు జారీ చేసినందున సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని చెప్పడానికి వీల్లేదన్నారు. రాజకీయంగా వెనుకబడిన వర్గాల వాస్తవ గణాంకాల సేకరణకే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అనంతరం న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఏజీ అభ్యర్థనను తిరస్కరిస్తున్నామని చెప్పారు. ఒకవేళ అభ్యంతరాలుంటే కౌంటరుతోపాటు పిటిషన్ దాఖలు చేసుకోవాలని చెప్పారు. బీసీ కమిషన్‌నే ప్రత్యేక కమిషన్‌గా పరిగణించాలంటూ ఇచ్చిన జీవో 47 సరికాదని, ఇది సుప్రీంకోర్టు తీర్పులు, రాజ్యాంగంతో విభేదిస్తున్నట్లు స్పష్టంచేశారు. హైకోర్టు తీర్పుపై ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తీర్పును గౌరవించి నిపుణులతో కూడిన డెడికేటెడ్ కమిషన్‌ను నియమించాలని కోరారు.

పోస్టులో దుర్గమ్మ ప్రసాదం



ప్రసాదాలను సిద్ధం చేస్తున్న సేవా బృంద సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దసరా ఉత్సవాల్లో పది రోజులు ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మకు విశేష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాలు నిర్వహించారు. భక్తులు ఈ విశేష ఆర్జిత సేవలకు ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి డబ్బు చెల్లించారు. ప్రత్యక్ష పూజల ఉభయదాతలకు చీర, పంచె, అమ్మవారి చిత్రపటంతో పాటు డాలర్, కంకణాలను పోస్టు ద్వారా దేవస్థానం పంపిణీ చేస్తోంది. పరోక్షంగా పూజలు జరిపించుకున్న ఉభయదాతలకు శేషవస్త్రం, రవిక, అమ్మవారి ప్రసాదాలను పంపుతున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ముంబైల్లో ఉంటున్న 300 మందికి పోస్టు ద్వారా ప్రసాదాలను అందజేస్తున్నారు.

నువ్వు చెప్పులు మోసిననాడు.. ఆయన ఉద్యమానికి ఊపిరి పోశాడు!

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ కౌంటర్

- మూసీ ప్రక్షాళన, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ



సాక్షి, హైదరాబాద్: సంవత్సరంలో కేసీఆర్ పేరును మరిచిపోయేలా చేస్తానని మంగళవారం మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తీవ్ర స్థాయిలో స్పందించారు. తెలంగాణ చరిత్ర అంటేనే కేసీఆర్ అని వ్యాఖ్యానిస్తూ రేవంత్‌రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య ఉన్న తేడాలను పోలుస్తూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'నువ్వు చెప్పులు మోసిన నాడు ఆయన ఉద్యమానికి ఊపిరి పోశాడు.. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్న నాడు.. ఆయన ఉన్న పదవిని తృణప్రాయంగా వదిలేశాడు! నువ్వు ఉద్యమకారుల మీద గన్ను ఎక్కుపెట్టిన నాడు.. ఆయన ఉద్యమానికి తన ప్రాణాన్ని పణంగా పెట్టాడు! నువ్వు సాధించుకున్న తెలంగాణను సంపెటందుకు బ్యాగులు మోస్తున్ననాడు.. ఆయన తెలంగాణ భవిష్యత్‌కు ఊపిరి పోశాడు' అని పేర్కొన్నారు. చిట్టినాయుడూ... నువ్వా కేసీఆర్ పేరును తుడిచేది? అని ఎద్దేవా చేశారు.

ఎద్దేడ్చిన వ్యవసాయం బాగుపడదు..

ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోలుస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తూర్పారబట్టారు. మూసీ ప్రక్షాళన, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్వీట్ ఇలా సాగింది. 'మూసీపై ముందుకు– కొనుగోళ్లపై వెనక్కు, రామన్నపేటకు రైరై – కొనుగోలు సెంటర్లకు నైనై, దామగుండం ధనాధన్– ధాన్యం కొనుగోళ్ల ధాంధాం, కొనుగోళ్లకు దిక్కులేదు –కాంగ్రెస్ కోతలకు లెక్క లేదు, దళారులకు దండిగా – రైతన్నలకు దండగ' అని ప్రాసలతో కవితాత్మక ధోరణిలో విమర్శించారు. ఎద్దేడ్చిన ఎవుసం – రైతేడ్చిన రాజ్యం బాగుపడదు అని వ్యాఖ్యానించారు.

10 నెలల్లో ఎవరికోసం అంత రుణం?

నమ్మి నానబొస్తే... పుచ్చులు చేతికొచ్చినట్లు ఉంది రేవంత్ పాలన అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న అప్పులపై ధ్వజమెత్తారు. 60ఏళ్ల సమైక్య పాలకులకన్నా పది నెలల్లోనే అధిక రుణం ఎవరి కోసం? పదేళ్లలో సాధించిన ప్రగతికన్నా పది నెలల్లో ఏం సాధించారని ఈ అప్పులు? అని ప్రశ్నించారు.

సీఐ దాడి ఘటనపై సీరియస్

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై వాట్సాప్ ద్వారా ప్రశ్నించిన మహబూబ్ నగర్‌కు చెందిన భాస్కర్ ముదిరాజ్‌ను స్థానిక సీఐ అప్పయ్య బెల్ట్‌తో కొట్టిన ఘటనపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడు భాస్కర్‌కు ఫోన్ చేసి జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నించే వ్యక్తులను కొట్టే హక్కు పోలీసులకు ఎక్కడిదని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి లాంటి హౌలా వ్యక్తుల బెదిరింపులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. దాడికి పాల్పడిన సీఐపై న్యాయపరంగా పోరాటం చేయటంతో పాటు బీసీ కమిషన్, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు కూడా వెళ్తామన్నారు.

దీపావళి పండుగ వెలుగులు నింపాలి

గవర్నర్, సీఎం శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆధునిక కాలపు దురాచారాలను జయించి, శాంతి, సామరస్యం, మత సామరస్యంతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి ఈ పండుగ స్ఫూర్తి కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. గత పదేళ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలనలో వెలుగులు విరజిమ్ముతుందని సీఎం ధీమా వెలిబుచ్చారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్, కిషన్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు: రాష్ట్ర ప్రజలందరికీ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని పేర్కొన్నారు. జీవితమంటేనే చీకటి వెలుగుల సమాహారమని, దీపావళి నేర్పే పాఠం ఇదేనని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనందాల దీపాలు వెలగాలి: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలని.. వెలుగుల పండుగ దీపావళి తెలుగువారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా తెలుగువారందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే పార్టీ కాంగ్రెస్

మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాటకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని.. కులగణన చేపట్టడం ద్వారా మరోమారు రుజువైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేశంలోనే మొదటిసారి బీసీల కులగణన చేపడుతున్నామని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దళితవర్గానికి చెందిన భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి కావడం, బలహీన వర్గాలకు చెందిన మహేశ్‌గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు కావడం కాంగ్రెస్ పార్టీలోనే జరుగుతుందన్నారు. కానీ కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌లకు బీసీలంటే చిన్నచూపు అని వ్యాఖ్యానించారు. తాము ఏ కార్యక్రమం చేసినా పనిగట్టుకొని బురదజల్లుతున్నారన్నారు. ఫామ్‌హౌస్‌లో లిక్కర్, డ్రగ్స్‌తో అడ్డంగా దొరికిపోయి దీపావళి దావత్ అంటున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.18వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తే చేయలేదని బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం చేస్తోందన్నారు.

త్వరలో అఖిలపక్ష సమావేశం: పొన్నం

కులగణనపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కులగణనపై ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి చేపట్టనున్న కులగణనలో కాంగ్రెస్ నేతలు పాల్గొనాలని, పార్టీ నేతలను కూడా ఈ కార్యక్రమంలో బాధ్యులను చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కులగణన చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మిల్లర్లతో పౌరసరఫరాల శాఖ చీకటి ఒప్పందం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మిల్లర్లతో చేసుకున్న చీకటి ఒప్పందం ఏంటో బయటపెట్టాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సివిల్ సప్లై శాఖ అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య ఏం జరుగుతోందని ప్రశ్నించారు. పౌరసరఫరాల శాఖలో తీసుకొచ్చిన జీవో 27తో అవినీతికి ఆస్కారం ఏర్పడిందన్నారు. ఇందులో భాగంగా క్వింటాల్‌కి రూ.216 అదనంగా వసూలు చేస్తున్నారని, ఈ రకంగా రూ.800 కోట్లు లంచం రూపంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ లంచం సొమ్ముకు కూడా అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏలేటి మీడియాతో మాట్లాడారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసి అవినీతికి పాల్పడిన మిల్లర్లకే మళ్లీ ఇవ్వడానికి ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించారని ఆరోపించారు. దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ స్కాంలో సీఎం రేవంత్‌రెడ్డికి, ఈ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సంబంధం ఉందని తెలిపారు. రాజకీయంగా చూస్తే వీరిద్దరి మధ్య విభేదాలున్నా.. సివిల్ సప్లై శాఖలో అవినీతిపై ఇద్దరు ఒక్కటవుతున్నారని వ్యాఖ్యానించారు. ఒప్పందం మేరకు బియ్యం ఇవ్వని రైస్ మిల్లర్లకు మళ్లీ ధాన్యం కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలోనే సివిల్ సప్లై శాఖలో రూ.1,150 కోట్ల కుంభకోణాన్ని బీజేపీ బయట పెట్టిందని ఏలేటి గుర్తుచేశారు. స్టాక్ ఇవ్వని డీఫాల్టర్ రైస్ మిల్లర్ల జాబితా ఇవ్వాలని గతంలోనే డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైస్ మిల్లర్ల బకాయిల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టడం లేదని ఏలేటి ప్రశ్నించారు.

దమ్ముంటే వచ్చి డ్రగ్స్ టెస్ట్ చేయించుకోండి

బీఆర్‌ఎస్ నేతలకు ఎంపీ అనిల్, ఎమ్మెల్సీ బల్మూరి సవాల్



హైదర్‌గూడ అపోలో ఆసుపత్రిలో డ్రగ్స్ టెస్టుల కోసం శాంపిల్స్ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు అనిల్‌కుమార్ యాదవ్, బల్మూరి వెంకట్

కాచిగూడ (హైదరాబాద్): బీఆర్‌ఎస్ నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే వచ్చి డ్రగ్స్ టెస్ట్‌కు శాంపిల్స్ ఇవ్వాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ నాయకులు హైదర్‌గూడలోని అపోలో ఆసుపత్రిలో డ్రగ్స్ పరీక్షలకోసం తమ శాంపిల్స్‌ను ఇచ్చారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఘటన నేపథ్యంలో రెండు పార్టీల నాయకుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్న విషయం తెలిసిందే. కాగా, పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని వారు చెప్పారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఇతరులు డ్రగ్స్ టెస్ట్‌కోసం మంగళవారం ఏఐజీ హాస్పిటల్‌కి వస్తానని చెప్పి రాకుండా తోక ముడిచారని విమర్శించారు. ఏఐజీ ఆసుపత్రికి తాము రాత్రి 8:30 గంటలకు వచ్చి 10 గంటల వరకు ఉన్నా ఎవరూ రాలేదన్నారు. 'ఈ మధ్య కాలంలో కేటీఆర్, కౌశిక్‌రెడ్డిలు డ్రగ్స్ తీసుకున్నారేమో, అందుకే టెస్ట్ శాంపిల్స్ ఇవ్వడానికి రావడం లేదు' అని ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి తన స్థాయికి మించి సీఎం రేవంత్‌రెడ్డిపైన, మంత్రులపైన విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో భార్య, కూతురుతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసి గెలిచిన కౌశిక్ రెడ్డి ఓ ఆంబోతులా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హుజూరాబాద్‌లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి పలువురిని మోసగించిన కౌశిక్‌రెడ్డిపై త్వరలోనే బాధితులతో కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ముందు నీ కుర్చీ కాపాడుకో

▶ మొదటి పేజీ తరువాయి

ఘాటుగా స్పందించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

నీకు సీఎం పదవి కేసీఆర్ భిక్షే

'నీ సీఎం పదవి కేసీఆర్ పెట్టిన భిక్షే. నీకు, కేసీఆర్‌కు పోలికా? నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఆయన త్యాగశీలి, సాధనాపరుడు. ఆయన ఉద్యమం చేసి తెలంగాణ తేకుంటే నీవు సీఎం అయ్యేవాడివే కాదు. నోరు తెరిస్తే అబద్ధాలు. నిన్ను చూస్తే గోబెల్స్ కూడా సిగ్గుపడేవాడు. ఒక్క హామీని నిలబెట్టుకోలేదు. రుణమాఫీ పాక్షికంగానే చేశావు. 31 రకాల కోతలతో రుణమాఫీని గణనీయంగా తగ్గించావు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్‌కు 100 సీట్లు వస్తాయి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గోల్ చేసేది, వికెట్ తీసేది మేమే. కేసులకు భయపడం. హామీలు ఎగవేసిందుకు నేను సీఎంను ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటే నాపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. బుల్డోజర్లు నడిపించి చంపేస్తామని సీఎం అంటే ఆయనపై మాత్రం కేసు నమోదు చేయడం లేదు..' అని హరీశ్ అన్నారు.

కూల్చివేతలు, కమీషన్లకే వ్యతిరేకం

'మూసీ సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు. పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్ల కూల్చివేత, రియల్ ఎస్టేట్‌కు అప్పగించడం, కమీషన్లకు మాత్రమే వ్యతిరేకం. టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి వాడపల్లి వరకు పాదయాత్రకు నేను, కేటీఆర్ రెడీ.. తేదీ, సమయం చెప్పు. ఎవరూ లేకుండా వెళ్దాం. మల్లన్నసాగర్ కోసం 50 వేల ఎకరాలు ముంపునకు గురైందంటూ అన్నీ అసత్యాలే చెప్పావు. మేము సేకరించిందే 17 వేల ఎకరాలు. అందులో 3 వేలకు పైగా ప్రభుత్వ భూమి. మల్లన్నసాగర్ నిర్వాసితులకు మేం 2013 భూ సేకరణ చట్టం కంటే ఎక్కువ ఇచ్చాం. అయినా తక్కువ ఇచ్చామని ఆరోపించారు కదా.. అంతకంటే ఎక్కువ మీరు మూసీ నిర్వాసితులకు ఇవ్వండి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎందుకు? గచ్చిబౌలిలో 250 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వండి. వారి ఉపాధికి ఒక్కో కుటుంబానికి రూ.7.5 లక్షలు ఇవ్వండి. పెళ్లి కానివారికి రూ.5 లక్షలు, ఇంటి స్థలం ఇవ్వండి. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయలేవు. సందర్శకులు రాకుండా తాళం వేశావు. ఇప్పుడు మూసీలో మహాత్మాగాంధీ విగ్రహం పెడ్తానంటున్నావు. మూసీ సుందరీకరణకు కేసీఆర్ ముందే ప్రణాళికలు వేశారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ సాగర్ నుంచి మూసీలోకి తీసుకుని రావడానికి రూ.1100 కోట్లతో ప్రణాళిక చేస్తే.. నీవు మరింత దూరం వెళ్లి మల్లన్నసాగర్ అంటూ రూ.7,000 కోట్లకు పెంచావు. ఎందుకంటే నీ కమీషన్ల కోసం..' అని మాజీమంత్రి ఆరోపించారు.

రియల్ ఎస్టేట్ ఢమాల్

'సీఎం నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ ఢమాల్ అయ్యింది. అదే సమయంలో ఢిల్లీ, ముంబయి, బెంగుళూరులో పెరుగుతోంది. బీఆర్‌ఎస్ హయాంలో రూ.4.86 లక్షల కోట్లు అప్పు చేస్తే, రూ.7.50 లక్షల కోట్ల అప్పు అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లోనే రూ. 80 వేల కోట్ల అప్పు చేశారు..' అని హరీశ్‌రావు తెలిపారు. బెటాలియన్ పోలీసుల డిస్మిస్‌లు, సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏక్ పోలీస్ హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేస్తే పిలిచి చర్చించకుండా సస్పెండ్, డిస్మిస్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

సొంత జాగా.. రేషన్ కార్డూ ఉండాల్సిందే?



ఇందిరమ్మ ఇంటికి ముడిపెట్టే యోచనలో ప్రభుత్వం

అదే ఖరారైతే.. 30 లక్షల దరఖాస్తులు బుట్టదాఖలే

సాక్షి, హైదరాబాద్: సొంత జాగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. రేషన్‌కార్డు కూడా ఉన్నవారినే పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తోంది. గత మార్చిలో ఈ పథకాన్ని భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. కానీ, ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అధికారికంగా ఇందిరమ్మ పథకాన్ని లాంచ్ చేసే సమయంలో జారీ చేసిన ఉత్తర్వులో.. సొంత జాగా ఉండాలన్న అంశాన్ని స్పష్టంగా వెల్లడించింది. సొంత జాగా లేని నిరుపేదలకు స్థలం ఇచ్చి మరీ ఇల్లు నిర్మించి ఇస్తామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఈ సంవత్సరానికి మాత్రం సొంత జాగా ఉన్నవారికే కేటాయించాలని నిర్ణయించింది. ఇప్పుడు దానితోపాటు రేషన్‌కార్డుతో కూడా ముడిపెట్టాలని భావిస్తోంది. ఈ నిబంధన వల్ల.. రేషన్‌కార్డు లేనివారిలో వ్యతిరేకత వ్యక్తమయ్యే ప్రమాదం ఉంటుందన్న విషయాన్ని కూడా గుర్తించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దారిద్ర్య రేఖ(బీపీఎల్)కు దిగువ ఉన్న వారికే ఇళ్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటోంది. బీపీఎల్‌ను ధ్రువీకరించేది రేషన్‌కార్డే అయినందున, అది ఉన్నవారికే ఇళ్లు మంజూరు చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించే నాటికి దీనిపై నిర్ణయం తీసుకోనుంది.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 80 లక్షలు

గత డిసెంబరు, ఈ సంవత్సరం జనవరిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇళ్ల కోసం 80 లక్షల దరఖాస్తులు అందిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తులను ప్రాథమికంగా పరిశీలించగా, వాటిల్లో రేషన్‌కార్డు లేనివారికి సంబంధించినవి ఏకంగా 30 లక్షలు ఉన్నట్టు తేలింది. దీంతో వాటన్నింటిని పక్కన పెట్టేశారు. ప్రస్తుతానికి మిగతా దరఖాస్తులనే పరిశీలిస్తున్నట్టు తెలిసింది. దసరా ముందు రోజు ఇందిరమ్మ కమిటీ మార్గదర్శకాలను వెల్లడిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ఆధారంగా కమిటీ సభ్యులను నియమించింది. ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉందంటూ బీజేపీ ఎమ్మెల్యే హైకోర్టులో వేసిన పిటిషన్ ఆధారంగా కేసు నడుస్తోంది. ఇలాంటి గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో.. దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకు దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రారంభం కాలేదు. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరగనుంది. ఈ సందర్భంగానే, దరఖాస్తుదారులకు సొంత జాగా ఉందా లేదో పరిశీలించటంతోపాటు రేషన్‌కార్డు వివరాలు కూడా సేకరించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా రేషన్‌కార్డు అంశాన్ని వెల్లడించనప్పటికీ, మొదటి దఫా ఇళ్ల నిర్మాణంలో రేషన్‌కార్డు తప్పనిసరి అన్నవైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. రేషన్‌కార్డు వివరాలను జత చేయని పక్షంలో.. లబ్ధిదారులు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారేనని ఎలా ధ్రువీకరించారని కేంద్ర ప్రభుత్వం ప్రశ్నిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ పని మీతోనే సాధ్యం

కులగణనకు సహకరించండి

- టీచర్లను కోరిన డిప్యూటీ సీఎం భట్టి
- స్కూళ్ల పనివేళల్లో ఈ విధులు కష్టమన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు
- టీచర్ల సంఘాలతో డిప్యూటీ సీఎం భేటీ
- నవంబర్ 6–19 వరకూ గణన



ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపడుతున్న కులగణన కార్యక్రమానికి సహకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఉపాధ్యాయ సంఘాలను కోరారు. ఈ ప్రక్రియలో టీచర్లదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. నవంబర్ 6 నుంచి 19 వరకూ రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల చేత కులగణన చేపట్టాలని నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. కులగణన నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో బుధవారం భట్టి విక్రమార్క చర్చలు జరిపారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘాల నేతలు అనేక అంశాలను భట్టి ముందుంచారు. కాగా, ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని సంఘాలు అంగీకరించినట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళా టీచర్లను ఇబ్బంది పెట్టొద్దు

కులగణన చేపట్టేందుకు టీచర్లు సిద్ధంగానే ఉన్నారు. కచ్చితమైన నివేదిక ఇస్తారనడంలోనూ ఎలాంటి సందేహం లేదు. అయితే, టార్గెట్లు పెట్టి వేధించడం, మహిళా టీచర్లను ఇబ్బందులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త తీసుకోవాలి. సెలవుల్లో పనిచేసే టీచర్లకు వేరే రోజుల్లో వాటిని వాడుకునే అవకాశం ఇవ్వాలని కోరాం. దీనికి డిప్యూటీ సీఎం ఒప్పుకున్నారు.

– పింగిలి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

పాఠశాలల్లో బోధన దెబ్బతినకుండా చూడాలి

స్కూళ్లలో ఇప్పుడిప్పుడే బోధన గాడిలో పడుతోంది. ఇళ్లలో ప్రజలు ఉదయమే ఉంటారని, ఆ సమయంలో వెళ్లాలన్న నిబంధన పెట్టొద్దు. దీనివల్ల పాఠాలు చెప్పలేని పరిస్థితి వస్తుంది. సాయంత్రం కులగణనతో పాటు సెలవు రోజుల్లో చేపడితే బాగుంటుంది.

– చావా రవి (టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

ఇదో మంచి అవకాశం

కులగణన కోసం బీసీ సంఘాలు ఎన్నో పోరాటాలు చేశాయి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేపట్టడం, టీచర్లను ఈ విధుల్లోకి ఆహ్వానించడం మంచి పరిణామం. ఉదయం వెళ్తేనే ప్రతీ ఇంట్లో ప్రజలు కలుస్తారు. మెజారిటీ సంఘాలు కులగణన విధులను స్వాగతిస్తున్నాయి.

– కృష్ణుడు (బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు)

దేశానికి మోడల్‌గా నిలుస్తాం..

కులగణన పరిశోధన కేంద్రంగా తెలంగాణ రూపాంతరం చెందబోతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ గణనను తొలిసారి నిర్వహించడం ద్వారా దేశంలోనే మోడల్‌గా నిలవబోతున్నామని ఆయన పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన కులగణన భేటీకి హాజరైన ఆయన.. ఆ సమావేశంలోనూ, అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ భారత్‌జోడో యాత్రతో దేశవ్యాప్తంగా పర్యటించిన రాహుల్‌గాంధీ అన్ని వర్గాల అభిప్రాయాలు తెలుసుకున్నారని చెప్పారు. దేశ వనరులు, ఆస్తులు అందరికీ సమానంగా దక్కడం లేదని గుర్తించిన ఆయన, ఏ వర్గం ఏ మేరకు ఉందో లెక్కించాలనే అభిప్రాయానికి వచ్చారని అన్నారు. ఆయన నిర్ణయం మేరకు, తెలంగాణతో పాటు దేశ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపడుతున్నామన్నారు. కులగణన ద్వారా ఆయా వర్గాల సమస్యలు ఏంటో తెలుస్తుందని, తద్వారా ఆ సమస్యకు పరిష్కారం కనుక్కోవచ్చని చెప్పారు.

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు

సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్

- అధికారుల కమిటీ సూచించిన సిఫార్సులకు ఆమోదం
- అతి త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి పండుగ సందర్భంగా డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీల పెంపుదలపై నిర్ణయం తీసుకుంది. అధికారుల కమిటీ అధ్యయనం చేసిన తర్వాత ఇచ్చిన నివేదికలోని సూచనలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేసినట్టు ముఖ్యమంత్రి కార్యాలయవర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అతి త్వరలో జారీ చేయనున్నట్టు సమాచారం. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లోని విద్యార్థుల డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని కోరుతూ పలువురు ఇటీవల సీఎంకు విన్నవించారు. ఈ అంశంపై స్పందించిన సీఎం ఉన్నతాధికారులతో ఈనెల 17న కమిటీ ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అధ్యక్షతన కమిటీ ఏర్పాటైంది. ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీధర్, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్సీ అభివృద్ధిశాఖ కమిషనర్ శ్రీదేవి, గురుకుల సొసైటీ కార్యదర్శులు బి.సైదులు, తఫ్సీర్ ఇక్బాల్, వర్షిణి, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రత్యేకంగా సమావేశమై కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జవహర్ నవోదయ విద్యాలయలో అమలు చేస్తున్న చార్జీలు, పెంపుదల తీరును అధ్యయనం చేసింది. గత ప్రభుత్వం కాస్మెటిక్ చార్జీలపై వేసిన సబ్‌కమిటీ ఇచ్చిన నివేదికను కూడా అధికారులు పరిశీలించారు. ఈ మేరకు ప్రస్తుత ధరలు, 40 శాతం పెంచాల్సిన ధరలతో ప్రతిపాదనలు తయారు చేసిన అధికారులు గత సోమవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ఈ ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. దీనికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

ఉన్నతాధికారుల కమిటీ సమర్పించిన ప్రతిపాదనలివే...

డైట్ చార్జీలు(రూ.లలో)		
తరగతి	ప్రస్తుతం	ప్రతిపాదన
3 నుంచి 7 వరకు	950	1,330
8 నుంచి 10 వరకు	1,100	1,540
ఇంటర్, డిగ్రీ, పీజీ	1,500	2,100
కాస్మెటిక్ చార్జీలు		
విద్యార్థినులకు ఇలా...		
తరగతి	ప్రస్తుతం	ప్రతిపాదన
3 నుంచి 7 వరకు	55	175
8 నుంచి 10 వరకు	75	275
విద్యార్థులకు ఇలా...		
3 నుంచి 7 వరకు	62	150
8 నుంచి 10 వరకు	62	200

సంక్షేమ వసతిగృహాల్లో 3 నుంచి 7వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య : **2,77,877**

8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య : **2,59,328**

ఇంటర్ నుంచి పీజీ వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య : **2,28,500**

క్లుప్తంగా...

నేడు యాదాద్రి ఆలయ వేళల్లో మార్పులు

యాదగిరిగుట్ట: దీపావళి పండుగ సందర్భంగా గురువారం యాదాద్రి ఆలయ నిత్య కైంకర్యాల్లో మార్పులు చేశారు. వేకువజామునే ఆలయాన్ని తీసి, 3.30 గంటల నుంచి 4 గంటల వరకు సుప్రభాతం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 4.15 నుంచి 4.45 వరకు శ్రీస్వామి అమ్మవార్లకు మంగళ హారతులు, 4.45 నుంచి 6.30 వరకు తిరువారాధన, బాలబోగం ఆరగింపు, 6.30గంటల నుంచి 7.30 గంటల వరకు స్వామి వారికి నిజాభిషేకం పూజలను జరిపిస్తారు. ఉదయం 7.30 గంటల నుంచి సహస్ర నామార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం పూజలు చేస్తారు. ఉదయం 8.15 గంటల నుంచి సర్వ దర్శనాలు ఉంటాయి. గురువారం రోజున ఉదయం స్వామి వారి కైంకర్యాల సమయంలో మార్పులు చేసిన నేపథ్యంలో సుప్రభాతం దర్శనం టికెట్లు రద్దు చేసినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు ఇప్పటికే వెల్లడించారు.

గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ కమిటీలతో కాకుండా గ్రామసభలు పెట్టి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సొమ్ము కేంద్రానిది అయితే ఈ పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టారని, కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారినే ఈ ఇళ్లకు ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. తమ పార్టీ ప్రతినిధులు, నాయకుల భాగస్వామ్యం లేని ఈ కమిటీల ద్వారా చేసే ఇళ్ల పంపిణీని బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కమిటీలపై సర్వోన్నత న్యాయస్థానానికి వెళతామని హెచ్చరించారు. కాగా, మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి కూడా మూసీని అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేదలు నివసించే 15 కి.మీ మేర ప్రాంతాన్ని వదిలిపెట్టి మిగతా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఆరు నెలల కింద కేంద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 1200 కోట్లు విడుదల చేస్తే వాటిని పక్కదారి పట్టించారన్నారు. ఇందులో రూ.200 కోట్ల వరకు ఉపాధి హామీకి ఖర్చు చేసి, మిగతా వెయ్యి కోట్లను ఇతర కార్యక్రమాలకు మళ్లించారని ఆరోపించారు.

సచివాలయంలో కీలక అధికారులకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలోని కీలక స్థానాల్లో పనిచేస్తున్న పలువురు ఉన్నతాధికారులకు ఒక శాఖ నుంచి మరోశాఖకు రాష్ట్ర ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ఏడుగురు సహాయ కార్యదర్శులు, మరో ఏడుగురు సంయుక్త కార్యదర్శులు, 12 మంది ఉపకార్యదర్శులను బదిలీలపై సచివాలయంలోని కొత్త శాఖలకు పంపించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నవంబర్ 10 నుంచి గ్రూప్-3 హాల్ టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–3 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లు నవంబర్ 10 నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ తెలిపారు. మొదటి రోజు పేపర్ పరీక్ష సమయం వరకు అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. నవంబర్ 17, 18వ తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు జరగనున్నాయి. మొదటి రోజు రెండు సెషన్లు, రెండో రోజు ఉదయం సెషన్‌లో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష జరగనుంది. మరుసటి రోజు ఉదయం సెషన్ పేపర్–3 పరీక్ష జరుగుతుంది. పరీక్షా సమయానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్షకు అరగంట ముందే కేంద్రం గేట్లు మూసివేస్తారు. పేపర్–1 పరీక్షకు ఉపయోగించిన హాల్‌టికెట్‌నే ఇతర పరీక్షలకు ఉపయోగించాలని కమిషన్ స్పష్టం చేసింది.

బీసీలు, ఇతర వర్గాలతో పంచాయితీ పెట్టుకోవద్దు

- అన్ని కులాలు సహకరిస్తేనే సమాజంలో సద్భావన
- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వ్యాఖ్యలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'బీసీ కులాల వారు ఇతర వర్గాలతో పంచాయితీలు పెట్టుకోవద్దు. ఇతర వర్గాలు సహకరిస్తేనే సమాజంలో సద్భావన సాధ్యమవుతుంది. అన్ని వర్గాల వారి సహకారంతో సమగ్ర సర్వే జరగాలి.. ఈ సర్వేలో బీసీల సంఖ్య ఎంత ఉందో తేలుతుంది. ఆ సంఖ్యను బట్టి బీసీలకు అవకాశాలు కల్పించడంలో తప్పులేదనే భావన అన్ని కులాల వారిలో వచ్చేలా బీసీలు వ్యవహరించాలి. బీసీ సోదరులంతా ఈ సర్వేలో ఉత్సాహంగా పాల్గొనాలి'అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల దామాషా ఖరారు అంశంపై బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపట్టారు. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో కలసి ఆయన వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి మొత్తం 96 వినతి పత్రాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో నిరంజన్ మాట్లాడుతూ.. సర్వే పకడ్బందీగా జరిగేలా ఆయా కుల సంఘాల నేతలు చొరవ చూపాలన్నారు. ఈ సర్వే ఆధారంగా ఎవరు ఎంత మంది ఉన్నారనే సమాచారాన్ని డిసెంబర్ 9 వరకు రాష్ట్ర హైకోర్టు ముందు ఉంచుతామని అన్నారు. కాగా, బీసీ కమిషన్ బహిరంగ విచారణకు గైర్హాజరైన మెదక్, సిద్దిపేట కలెక్టర్ల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

కులం పేరు చెప్పుకోవాలంటే నామోషీ పడుతున్నారు.

'కొన్ని వర్గాల వారు తమ కులాల పేరు చెప్పుకునేందుకు ఇబ్బందిగా ఉన్నట్లు మా దృష్టికి తెచ్చారు. ఈ అంశాన్ని సరిచేయాల్సిన అవసరం గురించి చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలను ఎవరైనా అవమానిస్తే కేసు పెట్టేలా చట్టం తేవాలనే డిమాండ్ కూడా వచ్చింది. ఈ విషయాలన్నింటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం..'అని నిరంజన్ పేర్కొన్నారు.

ఓయూ దూరవిద్య ప్రవేశాల గడువు 15 వరకు పొడిగింపు



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యలో పలు కోర్సుల్లో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును నవంబర్ 15 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ జీబీ రెడ్డి బుధవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో పాటు వివిధ పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ఇంత వరకు 4,500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 3.64% డీఏ

▶ మొదటి పేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన బకాయిలను (జూలై 1, 2022 నుంచి అక్టోబర్ 31, 2024 వరకు) ఉద్యోగుల భవిష్యనిధి (పీఎఫ్) ఖాతాలో జమ చేయనున్నట్టు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, మార్చి 31, 2025లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులకు 17 వాయిదాల్లో ఈ మొత్తాన్ని చెల్లించనున్నట్టు తెలిపారు. 2004, సెప్టెంబర్ 1 తర్వాత నియమితులై కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు ఇచ్చే డీఏలో 10 శాతం వారి 'ప్రాన్' (పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్) అకౌంట్లలో జమ చేస్తామని, మిగిలిన మొత్తాన్ని జనవరి, 2025 వేతనం నుంచి మొదలుపెట్టి 17 వాయిదాల్లో చెల్లిస్తామన్నారు. పీఎఫ్ ఖాతాలు లేని కాంటిజెంట్ ఉద్యోగులకు కూడా 2025, జనవరి నెల వేతనంతో మొదలుపెట్టి 17 వాయిదాల్లో చెల్లిస్తామని తెలిపారు. ఒకవేళ ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఈ డీఏను ఒకేసారి చెల్లించనున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల డీఏలను ఆయా సంస్థలే భరించాల్సి ఉంటుందని వివరించారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా అన్ని శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సోమేశ్‌కుమార్, నవీన్ మిత్తల్‌పై ఈడీకి ఫిర్యాదు


సాక్షి, హైదరాబాద్ : ఖరీదైన భూములను అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టానుసారం మార్చేసిన ఐఏఎస్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు భూమి బాధితుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ ప్రస్తుతం పశు సంవర్ధక శాఖలో సంయుక్త కార్యదర్శిగా ఉన్న అమోయ్‌కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌పై బుధవారం ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కొండాపూర్ మజీద్‌బండాలోని సర్వే నంబర్ 104 నుంచి 108 వరకు ఉన్న 88 ఎకరాలు బాలసాయి ట్రస్ట్‌కు ఓ కుటుంబం భూమి దానం చేసింది. అయితే అందులోనుంచి భూపతి అసోసియేట్స్‌కు 42 ఎకరాల భూమిని రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేసి ధారాదత్తం చేశారని ఫిర్యాదు చేశారు. తమ భూమికి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు విలువైన భూమిని కొట్టేశారని ఈడీకి బాధితులు ఫిర్యాదు చేశారు.

అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలు

వచ్చే ఏడాది నుంచి ఇస్తామని వ్యవసాయ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జానయ్య వెల్లడి



ఏజీవర్సిటీ: వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఐదు నుంచి పది మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి నిర్ణయించింది. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన బుధవారం వర్సిటీ పరిపాలనా భవనంలో పాలకమండలి సమావేశం జరిగింది. అనేక కీలకాంశాలను పాలకమండలిలో చర్చించి పలు నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. వర్సిటీలో నూతనంగా విత్తన విభాగం ఏర్పాటు చేసి దానికి ఒక సంచాలకుడి స్థాయి అధికారిని నియమిస్తామని వర్సిటీ వెల్లడించింది. అలా రాష్ట్రంలో ఒక విత్తన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని, తద్వారా తెలంగాణలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో కనీసం ఐదు నుంచి పది మంది అభ్యుదయ రైతులకు వర్సిటీ రూపొందించిన నాణ్యమైన విత్తనాలను ప్రతి ఏటా సరఫరా చేయాలని నిర్ణయించినట్లు వీసీ తెలిపారు. ఇందుకు ఇటీవల కేంద్రం ప్రకటించిన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం నుంచి ప్రత్యేక నిధుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. వర్సిటీలోని వివిధ విభాగాధిపతుల పదవీ కాలాన్ని మూడేళ్లుగా నిర్ణయిస్తూ.. ప్రతి మూడేళ్లకోసారి సీనియారిటీ ఆధారంగా విభాగాధిపతులను నియమిస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయ అనుభవమున్న వ్యవసాయ శాస్త్ర నిపుణులను ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా ఏడాది కాల పరిమితితో మూడేళ్ల వరకు నియమించుకోవడానికి వెసులుబాటు కల్పించామన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లుల చెల్లింపులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు నాలుగు దఫాలుగా విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ డిసెంబర్‌లో వజ్రోత్సవాలను నిర్వహిస్తామన్నారు.





ప్రతి కొత్త ఆరంభమూ ఇంకొందాని చివరి నుంచే మొదలవుతుంది.
– సెనెకా

సాక్షి
గురువారం, 31 అక్టోబర్ 2024

ఎట్టకేలకు కదలిక?!

నాలుగేళ్ళ జాప్యం తరువాత ఎట్టకేలకు రథం కదులుతున్నట్టుంది. దేశంలో పదేళ్ళకు ఒకసారి చేయాల్సిన జనగణన ఎలాగైతేనేం వచ్చే 2025లో ముందడుగేసే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర సర్కార్ అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్టు వినిపిస్తోంది. 2026 మార్చి నాటికి ఆ గణాంకాలు అందుబాటులోకి వస్తాయట. 2011 తర్వాత మళ్ళీ ఇన్నేళ్ళకు జరగనున్న ఈ జనగణన, అది అందించే సమాచారం విధానపరమైన నిర్ణయాలు తీసుకొనేందుకు కీలకం. అందుకే, ఇప్పటికైనా ఈ బృహత్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టాలనుకోవడం ఆహ్వానించదగిన విషయం. ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనతో పాటు పలు రాజకీయ నిర్ణయాలకూ ఈ జనగణన భూమిక కానుంది. జనగణనతో పాటు పనిలో పనిగా కులగణన కూడా జరపాలనే డిమాండ్ ఊపందుకుంది. అలాగే, ఇకపై 2025ను ప్రాతిపదికగా తీసుకొని ప్రతి దశాబ్దం మొదట్లో జరపాల్సిన జనగణన తాలూకు కాలరేఖను 2035, '45... అలా మారుస్తారనే మాటా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. అవసరమైతే అఖిలపక్ష భేటీ జరపాలనే వాదన వస్తున్నది అందుకే.

1881 నుంచి నిర్వహిస్తున్న ఈ జనాభా లెక్కల ప్రక్రియ అసలు 2021లోనే జరగాల్సింది. అయితే, రాజ్యాంగ రీత్యా కేంద్రం పరిధిలోని ఈ ప్రక్రియను కోవిడ్–19 కారణంగా సర్కారు వాయిదా వేసింది. ఆ పైన కరోనా పోయినా ఈ బృహత్తర బాధ్యత నెరవేర్చడానికి మోదీ సర్కార్ ఎందుకో ఉత్సాహం చూపలేదు. పాత కాలపు జనాభా లెక్కలతో ప్రస్తుత ప్రజా అవసరాలను ఎలా తెలుసుకుంటారన్న విమర్శలకూ గురైంది. ఎందుకంటే, కేవలం తలల లెక్కగా కాక జనాభా హెచ్చు తగ్గుల ధోరణులతో పాటు, సామాజిక, ఆర్థిక పరిస్థితులను సైతం అర్థం చేసుకోవడానికి జనగణన కీలకసూచిక. ప్రభుత్వ ప్రాధాన్యాల నిర్ణయం, వనరుల కేటాయింపు, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఉపకరించే సమగ్ర సమాచార సమాహారం. దేశంలోని సంక్లిష్టమైన సామాజిక సమస్యల పరిష్కారానికి ఓ కరదీపిక. కచ్చితమైన సమాచారం ద్వారానే విద్య, వైద్యం, గృహనిర్మాణం, ప్రాథమిక వసతుల్లో అన్ని ప్రాంతాల్లో సమానాభివృద్ధికి సర్కారు జోక్యం చేసుకొనే వీలుంటుంది.

అదే సమయంలో రాజకీయ పర్యవసానాలూ అనేకం. నియోజకవర్గాల పునర్విభజనకూ, జనాభా లెక్కలకూ లింకుంది. "2026 తరువాత జరిగే తొలి జనగణన" ఆధారంగా చట్టసభలలో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని 2002లోనే అప్పటి వాజ్‌పేయి సర్కార్ నిర్ణయించింది. అందువల్ల రాజకీయాల రూపురేఖలను మార్చే జనగణన చర్చోపచర్చలకు కారణమవుతోంది. బీజేపీకి ఆది నుంచి దక్షిణాది కన్నా ఉత్తరాదిలోనే బలం, బలగం ఎక్కువ. జనగణన అనంతరం జనసంఖ్య ఆధారంగా పునర్విభజన జరిగితే... కట్టుదిట్టంగా జనాభా నియంత్రణ చర్యలు చేపట్టిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. పార్లమెంట్ స్థానాల సంఖ్య దక్షిణాదిలో తగ్గి, ఉత్తరాదిలో పెరుగుతుంది. అది కాషాయపార్టీకి అనుకూలంగా మారుతుందనే అనుమానం ఉంది. ప్రజాస్వామ్యమంటే ప్రజాసంఖ్యకు సిసలైన రీతిలో ప్రాతినిధ్యం వహించాలన్నది నిజమే. అంత మాత్రాన కుటుంబ నియంత్రణ పాటించనందుకు గాను అధికారం ఉత్తరాది వైపు మొగ్గడమూ సమర్థనీయం కాదు.

1951 నుంచి మన జనగణనలో ఎస్సీ, ఎస్టీలు మినహా మిగతా కులాల లెక్కలు వేయడం లేదు. కానీ, కులాల వారీ జనాభా ఆధారంగా మెరుగైన ప్రాతినిధ్యం, వనరుల కేటాయింపు జరగాలన్నది దీర్ఘకాలిక డిమాండ్. ఈ న్యాయమైన ప్రజాకాంక్షను కేంద్రం ఇప్పటికైనా పట్టించుకొని తీరాలి. అలాగే, లెక్కల్లో ఆడవాళ్ళ సంఖ్య తేలడంతో చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలుకు మెరుగైన ప్రాతిపదిక సిద్ధమవుతుంది. వీటి వల్ల సామాజిక న్యాయం, సమ్మిళిత ఆర్థిక పురోగతి, స్త్రీ – పురుష సమానత్వ స్పృహతో విధాన నిర్ణయానికీ వీలు చిక్కుతుంది. పైగా, ఈ పర్యాయం జనాభా లెక్కలు తొలిసారిగా డిజిటల్ విధానంలో జరగనున్నందున వివరాలు, విశేషాలు మరింత నిక్కచ్చిగా, వేగంగా అందవచ్చు. సాధారణంగా ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య ముందస్తు పరీక్షగా జనాభా లెక్కల సన్నాహక ప్రక్రియ జరుపుతారు. మరుసటేడు ఫిబ్రవరిలో అసలు లెక్కలు జరుపుతారు. 2021 జనాభా లెక్కల కోసం 2019లోనే ఆ ప్రీ–టెస్ట్ జరిపినా, జాప్యమైనందున మళ్ళీ ప్రీ–టెస్ట్ జరపవచ్చు. అధికారిక ప్రకటనతోనే ఈ సందేహాలకు సమాధానాలు దొరుకుతాయి.

అత్యవసరం, అనివార్యమైనప్పటికీ, జనగణన అంశంలో దేశంలో చేపట్టాల్సిన చర్యలూ కొన్ని ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనలో ఒకరికి మోదం, వేరొకరికి ఖేదం కలగరాదంటే... అమెరికా ఫక్కీలో మన వద్దా వివిధ రాష్ట్రాల మధ్య విద్య, ఉపాధి నిమిత్తం అంతర్గత వలసలను ప్రోత్సహించడం జనసంఖ్య సమతుల్య పంపిణీకి ఒక మార్గమని నిపుణుల మాట. అదే సమయంలో స్థానిక భాష, సంస్కృతుల్లో వలసదారులు కలగలసిపోయేలా ఇంగ్లీషు, హిందీ, స్థానిక భాష – అనే త్రిభాషా సూత్రాన్ని దేశవ్యాప్తంగా అనుసరించాలని మరో సూచన. హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాల వారు సైతం కచ్చితంగా మరో భారతీయ భాష నేర్చుకోవాలనే నియమం ద్వారా భాష, ప్రాంతాలకు అతీతంగా అందరినీ దగ్గర చేయవచ్చు. వెరసి, సమతుల్య జనాభా పంపిణీ, సాంస్కృతిక స్నేహవారధి సాయంతో ఆర్థికంగా, సామాజికంగా సంతులిత ప్రాంతీయాభివృద్ధికి బాటలు వేయవచ్చు. ఈసారికి 2025లో చేసినా, ఇకపై మునుపటిలానే ప్రతి దశాబ్ది ఆరంభంలోనే ఈ ప్రక్రియ చేపట్టడం మేలు. ఏమైనా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రాంతీయ ప్రయోజనాల్లో సమతూకం పాటించాలి. పరస్పర విశ్వాసంతో పాటు పూర్తి చిత్తశుద్ధి అందుకు అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.2.47 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** చిత్త రా.12.41 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.6.58 నుండి 8.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.39 వరకు తదుపరి ప.2.27 నుండి 3.15 వరకు, **అమృతఘడియలు:** సా.5.31 నుండి 7.16 వరకు, నరకచతుర్దశి, దీపావళి.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

అమెరికా ఎన్నికల్లో భారతీయత

విశ్లేషణ



సందీప్ రాయ్

అమెరికా తపాలా శాఖ వారి నుంచి దీపావళి స్టాంపు విడుదలను కోరుతూ భారతీయ అమెరికన్లు కొన్ని సంవత్సరాలు వరుసగా పిటిషన్ల మీద పిటిషన్లు వేశారు. 2009లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా మొదటిసారి వైట్‌హౌస్‌లో దీపావళి దివ్వెను వెలిగించినప్పుడు భారతీయ అమెరికన్ల ఛాతీ గర్వంతో ఉప్పొంగింది. అమెరికన్ల గుర్తింపు కోసం ఈ తహతహ అంతా! ఓట్ల శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, భారీ విరాళాలు ఇస్తున్నప్పటికీ భారతీయ అమెరికన్లు ఇప్పటికీ ఒక నిర్ణాయక శక్తిగా అవతరించలేదని ఒక అధ్యయనం చెబుతోంది. కమలా హ్యారిస్ తల్లి, జేడీ వాన్స్ భార్య... ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్నవారు కావడం వల్ల 2024 ఎన్నికలను భారతీయ అమెరికన్లకు దీపావళి కానుక అనుకోవచ్చు.

అమెరికా ప్రభుత్వం తమను గుర్తించాలని తహతహలాడని భారతీయులు ఉండరంటే అతిశయోక్తి కాదు. దీపావళి స్టాంపు కోసం పిటిషన్ల మీద పిటిషన్లు వేయడం ఇందుకు ఒక ఉదాహరణ. హనుక్కా(యూదుల పండుగ), ఈద్‌లకు స్టాంపులు ఉండగా... తమకెందుకు లేదని ఏటా భారతీయ అమెరికన్లు అక్కడి పోస్ట్ మాస్టర్ జనరల్‌కు మెయిళ్లు పెట్టేవారు. సంతకాల సేకరణ జరిగేది. కానీ ప్రతిసారీ నిరాశే ఎదురయ్యేది. 2013లో భారతీయ అమెరికన్ పార్లమెంటు సభ్యుడు అమి బేరా స్టాంపు ఎప్పుడో విడుదల కావాల్సిందని అన్నారు. మూడేళ్ల తరువాత 2016లో 'ఫరెవర్' స్టాంపు విడుదలైంది. అంటే ఎప్పటికీ తొలగించనిది. కొద్ది రోజుల్లోనే లక్ష స్టాంపులు అమ్ముడయ్యాయి. స్టాంపులు అమ్ముడు కాకపోతే పంపిణీలోంచి తొలగిస్తారేమోనని విపరీతంగా కొనాలన్న ప్రచారం జరిగింది. పోస్ట్‌మాస్టర్ జనరల్ రంగంలోకి దిగి దీపావళి స్టాంపును తొలగించే ఉద్దేశమేమీ లేదని స్పష్టం చేయాల్సి వచ్చింది. స్టాంపు ద్వారా అక్కడి సమాజంలో గుర్తింపు పొందేందుకు పడ్డ శ్రమ, ఆందోళన ఇదంతా.

2009లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా మొదటిసారి వైట్ హౌస్‌లో దీపావళి దివ్వెను వెలిగించినప్పుడు భారతీయ అమెరికన్ల ఛాతీ గర్వంతో పొంగిపోయింది. దీపావళి రోజును సెలవుగా ప్రకటించాలన్న డిమాండ్ బయలుదేరింది. స్పెల్లింగ్–బీ పోటీల్లో గెలవడం ఒకటైతే, అమెరికన్ కులీనుల నుంచి గుర్తింపు పొందడం మరొకటి. ఆ రకంగా 2024 ఎన్నికలు భారతీయ అమెరికన్లకు దీపావళి కానుక అనుకోవచ్చు. డెమోక్రాట్ల తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న కమలా హ్యారిస్ తల్లి, రిపబ్లికన్ల తరఫున ఉపాధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న జేడీ వాన్స్ భార్య... ఇద్దరూ భారతీయ మూలాలు ఉన్నవారే. అమెరికా ఎన్నికల్లో ఈసారి భారతీయత భావన రకరకాలుగా వ్యక్తమవుతోంది.

ఉదాహరణకు డోనాల్డ్ ట్రంప్ ఓ ఆఫ్రికన్–అమెరికన్ జర్నలిస్టుతో మాట్లాడుతూ... కమల సగం ఆఫ్రికన్ అన్న విషయం తనకు నిన్నమొన్నటి వరకూ తెలియదనీ... ఆమె ఎల్లప్పుడూ తన భారతీయ మూలాలను మాత్రమే ప్రస్తావిస్తూంటుందని అన్నారు. అదొక విచిత్రమైన వ్యాఖ్య. కమల ఎప్పుడూ తన ఆఫ్రికన్ మూలాలనే ప్రస్తావిస్తుంటుందని భారతీయ అమెరికన్లు చాలామంది వాదిస్తూంటారు. కేవలం దీపావళి వేడుకల్లో, లేదంటే ఇండియన్ అమెరికన్లతో నిధుల సేకరణ కార్యక్రమాల్లో మాత్రమే భారతీయ మహిళగా ఉంటుందని చెబుతుంటారు. భారతీయ అమెరికన్ల కంటే ఆఫ్రికన్ అమెరికన్ల ఓటు బ్యాంకు పెద్దదన్న అంచనాతో కమల హ్యారిస్‌ను ఒక అవకాశవాదిగా చిత్రీకరించేందుకు ట్రంప్ ప్రయత్నించారు. ఇది దీర్ఘకాలంలోనూ ట్రంప్‌కు పనికొచ్చే ఎత్తుగడ.

ఒక రకంగా చూస్తే అమెరికా రాజకీయాల్లో భారతీయ అమెరికన్లు అంతగా అక్కరకొచ్చే అంశంగా కనపడటం లేదు. స్టాంపుల్లాంటి చిన్న విషయాలను పక్కనబెడితే... మిషిగన్ యూనివర్సిటీకి చెందిన జోయ్‌జీత్ పాల్ 'న్యూస్‌లాండ్రీ' కోసం నిర్వహించిన ఒక అధ్యయనం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఓట్ల శాతం (2020లో 74 శాతం) ఎక్కువగా ఉన్నప్పటికీ, భారీ విరాళాలు ఇస్తున్నప్పటికీ భారతీయ అమెరికన్లు ఒక నిర్ణాయక శక్తిగా అవతరించలేదని ఈ అధ్యయనం చెబుతోంది.



వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్

అయితే గతంలో ఒకసారి ఫ్లోరిడా కేంద్రంగా ఉన్న భారతీయ వైద్యులు కొందరు ఇండియన్ రిపబ్లికన్ కౌన్సిల్ ఒకటి ఏర్పాటయ్యేందుకు సహకరించడం... జార్జి బుష్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడినప్పుడు అక్కడి 2,000 ఓట్లే కీలకం కావడం గమనార్హం. అయితే 2005లో భారతీయ హోటలియర్లు తమ వార్షిక కార్యక్రమానికి నరేంద్ర మోదీని ఆహ్వానించడం... అది కాస్తా ఆయన వీసా రద్దుకు కారణమవడం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. తమ జనాభా కంటే ఎక్కువ పలుకుబడి కలిగివున్న ఇజ్రాయెలీల మాదిరిగానే భారతీయ అమెరికన్లు కూడా 'యూఎస్ ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ' ఏర్పాటు చేశారు. 1956లో దలీప్ సింగ్ సాండ్ తరువాత బాబీ జిందాల్ కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గా రికార్డు సృష్టించిన అనంతరం, కాలిఫోర్నియా నుంచి అమి బేరా కూడా కాంగ్రెస్‌కు ఎన్నికైన తరువాత మాత్రమే భారతీయ అమెరికన్ల భాగస్వామ్యం పెరిగిందని జోయ్‌జీత్ పాల్ అధ్యయనం ద్వారా తెలుస్తోంది. ఇప్పుడు ఇండియన్ అమెరికన్ ఇంప్యాక్ట్ ఫండ్ భారతీయ అమెరికన్ల ఎన్నికలకు ప్రాయోజకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే.

అయినా కూడా ఇప్పటికీ భారతీయ అమెరికన్లను విదేశీయుల్లాగే భావించడం ఎక్కువ. భారతీయులకు తాను దగ్గరివాడినని చెప్పుకునే డోనాల్డ్ ట్రంప్ కూడా తన ప్రత్యర్థి నిక్కీ హేలీని 'నిమ్రదా' హేలీ అని సంబోధిస్తూండటం గుర్తు చేసుకోవాలి. భారతీయ మూలాలను గుర్తు చేసే ప్రయత్నం అన్నమాట! దీనికి తగ్గట్టుగానే నిక్కీ హేలీ తన వెబ్‌సైట్‌లో అసలు పేరు నమ్రతా రణ్‌ధవాను అసలు ప్రస్తావించనే లేదు. 2010 అధ్యక్ష ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల పోటీని నేను దగ్గరుండి గమనించాను. ఎక్కువమంది దక్షిణాసియా ప్రాంతవాసులు పెద్దగా లేని చోట్లే పోటీ చేశారు. కాన్సస్‌లో రాజ్ గోయెల్ పోటీ చేసినప్పుడు, పరిసర ప్రాంతాల్లో ఎంతమంది భారతీయులున్నారని వచ్చిన ప్రశ్నకు, "పది" అని సమాధానం చెప్పారు; పది శాతమంటే మేలే అని వచ్చిన స్పందనకు, "శాతం కాదు, అక్షరాలా పది మంది మాత్రమే" అని ఈయన జవాబిచ్చిన ఘట్టాన్ని నాతో పంచుకున్నారు. ఇండో అమెరికన్ కౌన్సిల్‌కు చెందిన డెమోక్రటిక్ నేషనల్ కమిటీ అధ్యక్షుడు శేఖర్ నరసింహన్ మాటల్లో చెప్పాలంటే... భారతీయులు అటు నలుపు కాదు, ఇటు తెలుపు కాదు; కాబట్టి వెంటనే ఎందులోనూ చేర్చలేరు.

ఈ ఎన్నికల్లో అమెరికన్ కలల కోసం కష్టపడ్డ తల్లిదండ్రులకు మొక్కుబడిగా ఓ దండం పెట్టేసిన తరువాత అభ్యర్థులంతా తాము అమెరికాలో సాధించిన ఘనతలకే పెద్దపీట వేశారు. కమల హ్యారిస్ తాను ఒకప్పుడు 'మెక్ డొనాల్డ్స్'లో పని చేశానని చెప్పుకున్నట్లు. అమి బేరా తన ప్రచారంలో భారతీయ సంప్రదాయ విలువలను, అమెరికా వృత్తిగత శైలి... రెండింటిని కలగలిపి 'బోత్ ఆఫ్ టూ వరల్డ్స్' అని చెప్పుకొన్నారు. అప్పటికి ఓటమి పాలైనా తరువాతి ఎన్నికల్లో గెలుపొందారు. మార్పునకు కొంత సమయం పడుతుందనేందుకు ఇదో నిదర్శనం.

అయినా సరే... పాత అలవాట్లు అంత తొందరగా పోవు అంటారు. శేఖర్ నరసింహన్‌కు ఇది 2006లోనే అనుభవమైంది. అప్పట్లో రిపబ్లికన్ సెనేటర్ పోటీదారు జార్జ్ అలెన్ ఓ యువ భారతీయుడిని ఉద్దేశించి 'మకాకా'(కోతి) అని గేలి చేస్తూ మాట్లాడారు. ఆ యువకుడు శేఖర్ కుమారుడు. ఈ ఘటనతో శేఖర్‌కు తత్వం బోధపడింది. నువ్వు ఎంత తాపత్రాయ పడినా, వీళ్లకు (అమెరికన్లు) మనం (భారతీయులు) భిన్నంగానే కనిపిస్తూంటామని అర్థమైంది. ఈ ఎన్నికల్లో కూడా ట్రంప్ మద్దతుదారు లారా బూమర్ చేసిన "హ్యారిస్ గెలుపొందితే వైట్‌హౌజ్‌లో కర్రీ వాసనొస్తుంది" అన్న వ్యాఖ్య రభసకు దారితీసింది. అయినప్పటికీ అమెరికా మారడం లేదని చెప్పలేం. ఈ ఎన్నికల్లో కమల... క్యాథీ పేరుతో పోటీ చేయడం లేదు. పైగా తాను దోశ వేస్తూండగా వీడియో తీయడానికి ఓకే అంటున్నారు. హ్యారిస్ గెలుపు ఓటములను పక్కనబెట్టినా... అమెరికాలో వచ్చిన సాంస్కృతిక మార్పు మాత్రం మళ్లీ వెనక్కు మళ్లలేనిది.

వ్యాసకర్త రచయిత, రేడియో హోస్ట్
('మింట్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉత్తర దక్షిణాలు



ఉత్తర భారతదేశంలో దివాళిని అయోధ్యకు రాముడు తిరిగి వచ్చిన సందర్భంగా జరుపుకొంటారు. దివాళి, చెప్పాలంటే దీపావళిని దక్షిణ భారతదేశంలో నరకాసురుడిని కృష్ణుడు సంహరించినందుకు చేసుకుంటారు.

– దేవ్‌దత్ పట్నాయక్, కాలమిస్ట్

గోల గోల



యూఎస్ అధ్యక్ష ఎన్నికల ప్రచారాన్ని కుదించడంలో ఇతర ప్రయోజనాలతో పాటు ఇంకో మేలు కూడా ఉంది. అమెరికన్ల మానసిక ఆరోగ్యాన్ని ఇది చాలా మెరుగుపరుస్తుంది.

– స్టీఫెన్ వాల్ట్, ప్రొఫెసర్

చేయాలంటే చేస్తారు!



ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో పోయిన ఫ్రెంచ్ రాయబారి ఫోన్‌ను రోజుల్లోనే పోలీసులు దొరికించుకున్నారు. నలుగురిని అరెస్ట్ కూడా చేశారు. భారత పోలీసులు చర్య తీసుకోవాలనుకుంటే తీసుకోగలరని ఇది తెలియజేస్తోంది.

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

పట్టించుకోరా?



ఇవాళ గాలి పీల్చలేనంత ఘోరంగా ఉంది. ప్రపంచ పెద్ద నగరాల్లో ఒకటైన ముంబయి లాంటి చోట నాయకత్వ లేమి, ప్రణాళికా లేమి, ముందుచూపు లేమి ఉండటం క్షమించలేని నేరం. రోడ్లు పిండిపిండవుతున్నాయి. పార్కులు, చెట్లు మాయమవుతున్నాయి. ప్రజారోగ్య సూచనలేవీ? ఎవరు బాధ్యులు?

– రాహుల్ భాటియా, రచయిత

వైద్యుడు ఒంటరి...



ఈమధ్య ఒక యూట్యూబర్ తన చిన్నారి బొడ్డుతాడును కత్తిరించడాన్ని వీడియో తీశాడు. ఫలితంగా వైద్యుడు సస్పెండయ్యాడు. ఆసుపత్రిలో పది రోజులు పనులు ఆగిపోయాయి; యూట్యూబర్ మాత్రం ఫుడ్ వీడియోలు తీసుకుంటున్నాడు. ఇందులో వైద్యులకు పాఠం ఏమిటంటే– రోగి, మేనేజ్‌మెంట్ ఎవరికోసమైనా నియమాలను మార్చొద్దు, ఉల్లంఘించొద్దు. మనకు ఉన్నది మనమే. స్వీయసంరక్షణే అతి గొప్ప ధర్మం.

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఈ రెండింటికే...



విదేశాల్లో ఉన్న ప్రియ దేశీయుల్లారా, దీపావళిని ఉత్సవం చేసుకోవడానికి ఉన్నవి రెండే కారణాలు. 1. శ్రీరాముడు అయోధ్యకు తిరిగిరావడం. 2. శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించడం. వాటిని కప్పిపెట్టి, నూరేళ్లుగా చీకటి మీద వెలుగు, నీడ మీద ఇంకేదో లాంటి కథలన్నీ చెబుతున్నది వాళ్లు మనల్ని ఎగతాళి చేయకుండా ఉండటానికి. వాటిని ఇంక ఆపేయొచ్చు. మనం ఆ దశను కచ్చితంగా దాటేశాం.

– అరుణ్ కృష్ణన్, రచయిత

బంగారం అంటే లక్ష్మి



బెంగాలీల్లో గొలుసులు, మట్టెలు లాంటి కాలి ఆభరణాలను ఎప్పుడూ వెండివే ధరిస్తాం. ఎందుకంటే, బంగారాన్ని లక్ష్మితో సమానంగా చూస్తాం కాబట్టి, దాన్ని పాదాల దగ్గర ధరించం.

– మణిదీపా బోస్–డే, పరిశోధకురాలు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ప్రతీకార రాజకీయాలు ప్రమాదకరం

అభిప్రాయం



బాల్క సుమన్

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అనేది ఏ నాయకుడికైనా చాలా గొప్ప అవకాశం. అది కూడా ఆరు దశాబ్దాల పాటు దగాపడ్డ నేలకు! అలాంటి అరుదైన అవకాశం పదేళ్ల క్రితం ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌కు వచ్చింది. ఇప్పుడు అదృష్టవశాత్తు రేవంత్ రెడ్డికి దక్కింది. తెలంగాణ తొలి ప్రభుత్వం కొలువు దీరిన రోజుల్లో... గతంలో సమైక్య రాష్ట్రంలో మంత్రులుగా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబుతోపాటు అనేకమందిపై వివిధ కుంభకోణాల ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందిరమ్మ ఇళ్ల నుంచి మొదలుకుని ఇసుక కాంట్రాక్టుల దాకా ఎన్నో అవినీతి మరకలు చుట్టుముట్టాయి. కానీ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ తన తొలి ప్రాధాన్యత... ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకార రాజకీయాలు కాదనీ, తెలంగాణ తలరాతను మార్చడమే తన ఏకైక లక్ష్యమనీ చెప్పి, ఆచరించి చూపించారు.

సాగు, తాగునీటి తండ్లాటను తీర్చే రోడ్ మ్యాప్‌కు శ్రీకారం చుట్టారు తప్ప... రాజకీయ ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టాలని ఏ రోజూ కంకణం కట్టుకోలేదు. ఫలితంగా అటు అన్నదాతలకు సాగునీటి కష్టాలు తీరాయి. ఇటు ఆడబిడ్డల తాగునీటి తండ్లాట శాశ్వతంగా పరిష్కారమైంది. రైతులకు 24 గంటలు ఉచిత నాణ్యమైన కరెంట్ అందించే రాష్ట్రంగా తెలంగాణ కీర్తి సంపాదించింది. సంక్షేమ పథకాల్లోనూ సమున్నత నమూనాను దేశానికి అందించారు కేసీఆర్. అంతేకానీ ఎప్పుడూ ప్రతీకార రాజకీయం చేయలేదు.

ఇక తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో తెరపైకి వచ్చిన 'నోటుకు ఓటు' కేసును ప్రత్యర్థులపై ప్రతీకార కేసుగానో... రాజకీయ ప్రేరేపిత కేసుగానో ఏ మాత్రం



చూడలేం. ఎందుకంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టెక్కే ఎత్తుగడతో మొదలై, ప్రజాస్వామికంగా ఏర్పడిన తొలి ప్రభుత్వాన్ని కూల్చే కుట్రను అమలుచేసేందుకు అక్షరాలా 50 లక్షల రూపాయల నోట్ల కట్టలతో కెమెరాల సాక్షిగా దొరికిన కేసు అది. ఇందులో రేవంత్ రెడ్డిని ఎవరూ ఇరికించలేదు. స్వయంగా కథ, స్క్రీన్ ప్లే రాసి; దర్శకత్వం వహించడమే కాక సీన్‌లో పాత్ర కూడా తానే పోషించడం వల్ల ఆనాడు అడ్డంగా దొరికిపోయారు. కాబట్టే ఆ కేసు అరెస్టు వరకూ వెళ్లింది. ఈనాటికీ న్యాయస్థానాల్లో విచారణ జరుగుతోంది.

అయితే, ఊహించని విధంగా మారిన రాజకీయ పరిణామాల్లో అదృష్టవశాత్తూ పాలనా పగ్గాలు రేవంత్ రెడ్డికి దక్కాయి. అబద్ధాలు, అభూతకల్పనలతో అధికారం చేజిక్కించుకున్న రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రిగా తన తొలి ప్రాధాన్యత రాష్ట్ర ప్రయోజనాలు కాదు, కేవలం వికృత రాజకీయ క్రీడ మాత్రమేనని తొలిరోజు నుంచే సంకేతాలిచ్చారు. తనను జైలుపాలు చేసిన వారిని కూడా కటకటాలు లెక్కబెట్టేలా చేస్తానని పదే పదే చెప్పడంలో ప్రతీకారేచ్ఛ తప్ప పాలనా దక్షత ఏమాత్రం కనిపించదు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షకోట్ల అవినీతి అంటూ కమిషన్ వేసినా, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణకు ఆదేశించినా... అవన్నీ గత ప్రభుత్వ పెద్దలను ఏదో రకంగా ఇరికించాలనే. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిపైనే కాదు... ఆనాటి మంత్రులపై రేవంత్ రెడ్డికి అదే కక్ష. ప్రతినిత్యం రేవంత్ రెడ్డి అనుభవ రాహిత్యాన్ని, పరిపాలనా వైఫల్యాన్ని కేటీఆర్ ప్రజా క్షేత్రంలో ఎండగట్టడంతో ముఖ్యమంత్రి జీర్ణించుకోలేకపోతున్నారు. అసహనంతో ఊగిపోతున్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా ఈ డిసెంబర్‌తో రేవంత్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది కావస్తుండటంతో ఆ గండం కూడా వెంటాడుతోంది. ఈ క్రమంలోనే ఏదోరకంగా వచ్చే నెల రోజుల పాటు అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్లే చేసేందుకు రంగం సిద్ధం చేసి నయా నాటకానికి తెర తీశారు.

తాజాగా కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన గృహప్రవేశ ఫంక్షన్‌పై ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో సృష్టించిన హైడ్రామా ఈ రాజకీయ క్రీడలో భాగమే. డ్రగ్స్ కేసు అనీ, రేవ్ పార్టీ అనీ చేసిన హంగామా చివరికి ఏమీ లేదని తేలిపోవడంతో తుస్సుమంది.

ఈ పదినెలల విలువైన కాలంలో రేవంత్ రెడ్డి తెలంగాణకు చేసిన నష్టం పూడ్చలేనిది. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు కష్టపడి నిర్మించిన పునాదులను తిరోగమన విధానాలతో బలహీనపరిచిన తీరు క్షమించరానిది. రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి ఆయన బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారు. 'దీపావళి బాంబులు' అనే బెదిరింపులు, 'జైలుకెళ్లడం ఖాయ'మనే ప్రకటనలు ముఖ్యమంత్రి మానసిక స్థితిని తెలియజేస్తున్నాయి.

పాలకుడికి కక్షసాధింపే ఏకైక లక్ష్యమైనప్పుడు... ప్రజలను పట్టించుకునేదెవరు? అందుకే నేడు యావత్ తెలంగాణ ఓ ధర్నాచౌక్‌లా మారింది. 'మొహబ్బత్ కి దుకాన్' నినాదాన్ని నాలుకకే పరిమితం చేసి, తెలంగాణ రాజకీయాల్లో 'నఫ్రత్ కి దుకాన్' నడిపించే రేవంత్ రెడ్డికి నాలుగు కోట్ల ప్రజల చేతిలో గుణపాఠం తప్పదు.

వ్యాసకర్త బీఆర్ఎస్ మాజీ ఎంపీ

పలు కారణాల పండగ

ఎంతో విస్తృతీ, వైవిధ్యం గల భారతదేశంలో, భిన్నత్వంలో అంతర్లీనంగా ఉండే ఏకత్వానికి దీపావళి పండగ ఒక ప్రతీక. దేశంలో దాదాపు అన్ని ప్రాంతాలలోనూ ఈ పండగ జరుపుకుంటారు. కానీ ఈ పండగ ప్రాశస్త్యానికీ, ప్రాముఖ్యతకూ వెనక కథ ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది.

దక్షిణ భారతంలో నరకాసుర వధ కథ ప్రసిద్ధం. సత్యభామా సహితుడై, శ్రీకృష్ణుడు ఆశ్వయుజ బహుళ చతుర్దశినాడు నరకుడిని సంహరించాడు. కనుక అది నరక చతుర్దశి. ఆ మరునాటి విజయోత్సవ దినం దీపావళి. కానీ ఉత్తర భారతంలో ఈ కథ తెలిసిన వారే అరుదు. ఉత్తర భారతంలో, రావణ సంహారం జరిపి రామచంద్రుడు అయోధ్యకు తిరిగి వచ్చిన శుభ దినంగా దీపావళి అమావాస్యకు గుర్తింపు. అందుకే ఆరోజు మహోత్సవం. అంతటి మహోత్సవం గనక చిన్న దీపావళి (చతుర్దశి), పెద్ద దీపావళి అని రెండు రోజులు జరుగుతుంది.



జ్యోతిర్మయం

తూర్పున వంగ దేశంలో దీపావళి అమావాస్య... కాళీ పూజ పర్వదినం. పశ్చిమాన గుజరాత్ వాసులకు దీపావళి అమావాస్య సంవత్సరాంతం. అమావాస్య ముగుస్తూనే నూతన సంవత్సరాది. రాజస్థాన్‌లో చాలా ప్రాంతాలలో దీపావళి అమావాస్య నాడే ఉగాది. ఆరోజు వైభవంగా లక్ష్మీ పూజ చేసి, కొత్త పద్దు పుస్తకాలకు శ్రీకారం చుట్టడం భాగ్యప్రదమని అక్కడి వ్యాపారస్థులు భావిస్తారు.

జైనులకు దీపావళి అయిదు రోజుల పండగ. జైన ప్రవక్త మహావీరుడు, నేటికి సరిగ్గా 2,550 సంవత్సరాల క్రితం, దీపావళి అమావాస్యనాడు మోక్ష ప్రాప్తి (నిర్వాణం) పొందాడు. అమావాస్య ముందు త్రయోదశి నాడు ఆయన తన శిష్యులకు ఆఖరి బోధనలు ఆరంభించాడు. ఆ త్రయోదశి 'ధన్య త్రయోదశి' (ధన్–తేరస్). ఆ రోజు వాళ్ళు ధ్యానాది సాధనలలో గడిపే పవిత్ర దినం. కాలగతిలో 'ధన్–తేరస్'ను ధన త్రయోదశిగా జరుపుకొనే ఆనవాయితీ అనేక ప్రాంతాలలో ఆరంభమైంది. అమావాస్య నాడు మహావీరుడనే మహత్తరమైన 'జ్ఞాన జ్యోతి' అంతర్ధానమవటం వల్ల కలిగిన అంధకారాన్ని ఆయన శిష్యగణం దివ్వెల వరసలు (దీప–ఆవళులు) వెలిగించి తొలగించటానికి చేసే ప్రయత్నంగా ఈ దీపావళులకు చాలా ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉంది. వర్ధమానుడు దూరమవడంతో, దుఃఖ సాగరంలో మునిగి, చేష్టలుడిగిన నంది వర్ధనుడనే రాజును, శుక్ల విదియనాడు, ఆయన సోదరి సుదర్శన తన ఇంటికి ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చి, వైరాగ్య బోధన చేసి ఊరడించిన సందర్భం 'భాయి–దూజ్'. దీపావళి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

సవరణ: అక్టోబర్ 30 నాటి సంచికలోని 'వెలుగు ప్రదాత' కథనంలో పొరపాటు దొర్లింది. 'లూథరన్ చర్చిలో సువార్త దినం' జూలై 31 అని గమనించగలరు. – ఎడిటర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

Ministry of Home Affairs
Government of India

STATUE OF UNITY
एक भारत, श्रेष्ठ भारत



भारत की एकता के शिल्पी
सरदार वल्लभभाई पटेल की जन्मजयंती पर

राष्ट्रीय एकता दिवस 2024

प्रधानमंत्री श्री नरेंद्र मोदी द्वारा सरदार पटेल को पुष्पांजलि और राष्ट्र को संबोधन

विभिन्न कार्यक्रम:

- राष्ट्रीय एकता दिवस परेड
- भारतीय वायुसेना द्वारा फ्लायपास्ट (सूर्यकिरण)
- डेर डेविल राइडर्स शो
- ट्रेडिशनल मार्शल आर्ट
- 'अतुल्य भारत' थीम पर गुजरात महिला पुलिस द्वारा नारीशक्ति को प्रस्तुत करता कार्यक्रम
- एन.सी.सी. द्वारा विशेष प्रदर्शन
- स्कूल बैंड डिस्प्ले
- सांस्कृतिक कार्यक्रम



"सरदार पटेल की जन्मजयंती और राष्ट्रीय एकता दिवस हमारे लिए केवल एक तारीख नहीं हैं।
बल्कि भारत के सामर्थ्य को दर्शा रहा एक पर्व हैं"
– प्रधानमंत्री श्री नरेंद्र मोदी

दिनांक: 31 अक्टूबर, 2024 | **समय:** प्रातः 07:15 बजे से | **स्थल:** एकतानगर, गुजरात

कार्यक्रम का जीवंत प्रसारण डीडी न्यूज चेनल पर DD NEWS



కొత్త చెత్త

అమెరికా అధ్యక్ష ప్రచారంలో ఆగని రగడ

- ట్రంప్ మద్దతుదారులే 'చెత్త' అన్న బైడెన్
- కోట్లాది అమెరికన్లను అవమానించారు
- ట్రంప్‌తో పాటు రిపబ్లికన్ శిబిరం ధ్వజం

హోరాహోరీగా సాగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల సమరం చివరి ఘట్టంలో 'చెత్త' చుట్టూ తిరుగుతోంది. గత ఆదివారం రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ భారీ బహిరంగ సభలో స్టాండప్ కమేడియన్ టోనీ హించ్‌క్లిఫ్ మాట్లాడుతూ ప్యూర్టోరీకోను నీటిపై తేలుతున్న చెత్తకుప్పగా అభివర్ణించడం తెలిసిందే. దానిపై అమెరికావ్యాప్తంగా ఇప్పటికీ నిరసనలు పెల్లుబుకుతున్నాయి. దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా ఉన్న ప్యూర్టోరీకో ఓటర్లలో ఆ వ్యాఖ్యలు ఆగ్రహం రగిల్చాయి. వారంతా నవంబర్ 5 నాటి పోలింగ్‌లో ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓటేయవచ్చని, ఫలితంగా డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ విజయాన్ని నల్లేరుపై నడకగా మారనుందని విశ్లేషణలు వెలువడ్డాయి. అయితే ట్రంప్ అభిమానులనే 'అసలైన చెత్త'గా అభివర్ణిస్తూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దాంతో పరిస్థితి తారుమారైందన్న అభిప్రాయం వినిపిస్తోంది. తన ఉద్దేశం అది కాదంటూ సోషల్ మీడియా సాక్షిగా బైడెన్ వివరణ ఇచ్చినా అప్పటికే హారిస్‌కు భారీ నష్టం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అనుకోని అవకాశాన్ని గట్టి ఆయుధంగా వాడుకునేందుకు ట్రంప్‌తో పాటు ఆయన ప్రచార శిబిరం కూడా శాయశక్తులా ప్రయత్నిస్తోంది. అమెరికన్లను అవమానించడం డెమొక్రాట్లకు కొత్తేమీ కాదంటూ ఊరూవాడా హోరెత్తిస్తోంది...!

ఎన్నికల ఘట్టం చివరి అంకంలో సొంత పార్టీ అభ్యర్థి హారిస్‌ను అమెరికా అధ్యక్షుడు బైడెన్ గట్టి చిక్కుల్లోనే పడేశారు. ప్యూర్టోరీకోపై టోనీ వ్యాఖ్యలను తిప్పికొట్టే క్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిస్పానిక్ గ్రూప్ వోటో లాటినో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బైడెన్ పాల్గొన్నారు. ప్యూర్టోరీకాపై ట్రంప్ సమక్షంలోనే టోనీ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్యూర్టోరీకన్ల పట్ల పూర్తి సంఘీభావం ప్రకటించారు. "వారు చాలా మంచివాళ్లు. ఆత్మగౌరవమున్న వ్యక్తులు. అమెరికా అభివృద్ధిలో వారికి కీలక పాత్ర" అంటూ కొనియాడారు. "లాటిన్ అమెరికన్లను రాక్షసులుగా చిత్రించేందుకు ట్రంప్, ఆయన శిబిరం చేస్తున్న ప్రయత్నాలు దారుణం. ఇతర దేశాలను కించపరచడం అమరికా విధానమే కాదు. అమెరికా పాటించే విలువలకు అవి పూర్తిగా విరుద్ధం" అంటూ విమర్శించారు. అక్కడిదాకా బాగానే ఉన్నా, "నాకు తెలిసిన అసలైన చెత్త ఆయన (ట్రంప్) మద్దతుదారులు మాత్రమే. వారి రూపంలోనే అసలైన చెత్తాచెదారం కనిపిస్తోంది" అంటూ నోరుజారారు. వాటిపై అమెరికా అంతటా విమర్శలు చెలరేగుతున్నాయి. బైడెన్ అంగీకారయోగ్యం కాని వ్యాఖ్యలు చేశారని విమర్శకులు కూడా భావిస్తున్నారు. ప్యూర్టోరీకాపై టోనీ తలతిక్క వ్యాఖ్యలతో తలపట్టుకున్న రిపబ్లికన్ పార్టీ నెత్తిన బైడెన్ పాలు పోశారంటున్నారు. ఆయన వ్యాఖ్యలను రిపబ్లికన్లు రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ల అభ్యర్థి హిల్లరీ క్లింటన్ చేసిన వ్యాఖ్యలతో ముడిపెట్టి మరీ, 'అమెరికన్లను దారుణంగా అవమానించడం డెమొక్రాట్లకు అలవాటే'నంటూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. ట్రంప్ మద్దతుదారులైన కోట్లాది మంది అమెరికన్లను బైడెన్, హారిస్ దారుణంగా అవమానించారంటూ ట్రంప్ ప్రచార బృందం జాతీయ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ దుయ్యబట్టారు.

వివరణ ఇచ్చినా...

వ్యవహారం చేయి దాటుతోందని గ్రహించిన బైడెన్ వెంటనే నష్ట నివారణ చర్యలకు దిగారు. తాను చెత్త అన్నది ప్యూర్టోరీకోపై అసహ్యకర వ్యాఖ్యలు చేసిన ట్రంప్ మద్దతుదారును ఉద్దేశించి మాత్రమేనంటూ వివరణ ఇచ్చుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. అలాంటి వారిని దిగజారుడుతనాన్ని వర్ణించేందుకు అదే సరైన పదమని చెప్పుకొచ్చారు. కానీ బైడెన్ వ్యాఖ్యలపై దుమారం చల్లారడం లేదు. వాటిపై డెమొక్రాట్ నేతలను అమెరికా అంతటా ప్రజలు నిలదీస్తున్నారు. హారిస మద్దతుదారైన పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరోకు కూడా మంగళవారం సాయంత్రం ఒక ఇంటర్వ్యూలో దీనిపై వరుసబెట్టి ప్రశ్నలు ఎదురయ్యాయి. దాంతో, 'ప్రత్యర్థి నేతలకు మద్దతిచ్చినా నేనైతే అమెరికన్లెవరినీ ఎప్పటికీ అవమానించబోను" అంటూ ఆయన వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

నాడు హిల్లరీ ఏమన్నారంటే...

2016 అధ్యక్ష ఎన్నికల సందర్భంగా కూడా ట్రంప్ మద్దతుదారులపై ఆయన ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. "ట్రంప్ మద్దతుదారుల్లో సగానికి సగం మంది ఎందుకూ పనికిమాలినవాళ్లే. వాళ్లంతా జాత్యహంకారులు. స్త్రీలు, ముస్లింలు, విదేశీయులతో పాటు స్వలింగ సంపర్కుల పట్ల విద్వేషం వెలిగక్కేవాళ్లు" అంటూ దుయ్యబట్టారు. ఆ వ్యాఖ్యల ద్వారా అమెరికన్లందరినీ హిల్లరీ తీవ్రంగా అవమానించారంటూ రిపబ్లికన్లు అప్పట్లో జోరుగా ప్రచారం చేశారు.

డెమొక్రాట్లకు అలవాటే

బైడెన్ తాజా వ్యాఖ్యలపై ట్రంప్ కూడా స్పందించారు. పెన్సిల్వేనియాలో ర్యాలీలో ఉండగా బైడెన్ వ్యాఖ్యలను ట్రంప్ ప్రచార బృందం ఆయన చెవిన వేసింది. దాంతో, "వావ్! ఇది దారుణం. కానీ వాళ్లకు (డెమొక్రాట్లకు) ఇది అలవాటే" అంటూ ట్రంప్ స్పందించారు. "2016లో నాతో తలపడ్డ హిల్లరీ కూడా నా మద్దతుదారులపై ఇలాంటి అవమానకర వ్యాఖ్యలే చేశారు. కానీ అవి ఫలించలేదు. 'చెత్త' వ్యాఖ్యలు వాటికంటే దారుణమైనవి. కాదంటారా?" అంటూ వివాదాన్ని మరింత పెద్దది చేసే ప్రయత్నం చేశారు. అమెరికన్లపై ఎవరూ క్రూర పరిహాసం చేయొద్దన్నదే తన అభిప్రాయమని చెప్పుకొచ్చారు. అమెరికన్లపై ప్రేమాభిమానాలు లేని డెమొక్రాట్లకు దేశానికి నాయకత్వం వహించే హక్కే లేదన్నారు. పనిలో పనిగా అంతేగాక టోనీ 'ప్యూర్టోరీకో' వ్యాఖ్యలకు దూరం జరిగేందుకు కూడా ట్రంప్ ప్రయత్నించారు. వాటితో తనకు ఏ సంబంధమూ లేదని చెప్పుకొచ్చారు. "ఎవరో కమేడియన్ ప్యూర్టోరీకోపై ఏదో అభ్యంతరకరమైన జోకు పేల్చినట్టు నాకెవరో చెప్పారు. అతనెవరో నాకస్సలు తెలియదు. అతన్ని నేనెన్నడూ కనీసం చూడను కూడా లేదు" అని చెప్పుకొచ్చారు. అలాంటి వ్యక్తి ట్రంప్ ర్యాలీ వేదికపై ఎందుకున్నట్టన్న ప్రశ్నకు మాత్రం బదులివ్వ లేదు!



దీపావళి సందర్భంగా అయోధ్యలో సరయూ తీరాన దీపాల వెలుగులు

గిన్నిస్ రికార్డుల్లోకి అయోధ్య దీపోత్సవం

అయోధ్య: రామాలయం నిర్మాణం తర్వాత అమోధ్యలో జరిగిన తొలి దీపోత్సవం రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. అత్యధికంగా 25 లక్షల ప్రమిధలు వెలిగించడంతో అయోధ్య దీపకాంతుల్లో మిలమిలలాండింది. అలాగే 1,121 వేదాచార్యులు ఏకకాలంలో హారతి ఇవ్వడం కూడా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులకు ఎక్కింది. 'మొత్తం 1,121 మంది ఏకకాలంలో హారతి ఇవ్వడం రికార్డుయే. ఉత్తరప్రదేశ్ టూరిజం, అయోధ్య జిల్లా యంత్రాంగం, సరయూ ఆరతి సమితి.. అత్యధిక మంది ఏకకాలంలో హారతులిచ్చిన రికార్డు మీ సొంతం' అని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అడ్జ్యుకేటర్ ప్రవీణ్ పాటిల్ బుధవారం ప్రకటించారు. 25 లక్షల పైచిలుకు ప్రమిధలను వెలిగించి.. అయోధ్యను దేదీప్యమానంగా వెలుగొందేలా చేసిన యూపీ టూరిజం, యూపీ ప్రభుత్వం, డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా అవధ్ యూనివర్శిటీలకు శుభాబినందనలు. ఇది గిన్నిస్ రికార్డు' అని ప్రవీణ్ పేర్కొన్నారు. అత్యధిక దీపాలు వెలిగించడంలో గత రికార్డు 22,23,676గా ఉంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రామాలయంలో ప్రమిధను వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు.

విపక్ష నేత పదవికి సునాక్ గుడ్‌బై



లండన్: బ్రిటన్ విపక్ష నేత పదవి నుంచి రిషి సునాక్ (44) బుధవారం తప్పుకున్నారు. భారత మూలాలున్న తొలి బ్రిటన్ ప్రధానిగా రెండేళ్ల క్రితం ఆయన చరిత్ర సృష్టించడం తెలిసిందే. ఆయన సారథ్యంలో కన్జర్వేటివ్ పార్టీ గత జూలైలో జరిగిన ఎన్నికల్లో లేబర్ పార్టీ చేతుల్లో ఘోర పరాజయం పాలైంది. నాటినుంచి సునాక్ తాత్కాలికంగా విపక్ష నేతగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు బుధవారం పార్లమెంటులో ప్రకటించారు. 'రెండేళ్ల నాడు దీపావళి సంబరాల సందర్భంగానే నా పార్టీ నాయకునిగా ఎన్నికయ్యా. మళ్లీ అవే సంబరాల వేళ తప్పుకుంటున్నా' అంటూ హాస్యం చిలికించారు. "ఈ గొప్ప దేశానికి తొలి బ్రిటిష్ ఏషియన్ ప్రధాని కావడాన్ని గర్వకారణంగా భావిస్తున్నా. బ్రిటన్ అనుసరించే గొప్ప విలువలకు ఇది తార్కాణంగా నిలిచింది" అన్నారు. తన చివరి ప్రైమ్‌మినిస్టర్స్ క్వశ్చన్స్ (పీఎంక్యూస్)లో భాగంగా ప్రధాని కియర్ స్టార్మర్‌కు సునాక్ పలు సరదా ప్రశ్నలు వేసి అందరినీ నవ్వించారు.

వెనక బెంచీల్లో కూచుంటా

అమెరికాలో స్థిరపడాలని తాను భావిస్తున్నట్టు మీడియాలో వస్తున్న వార్తలను ఈ సందర్భంగా సునాక్ తోసిపుచ్చారు. రిచ్‌మండ్-నార్త్ అలెర్టన్ ఎంపీగా పార్లమెంటులో వెనక బెంచీల్లో కూర్చుని కనిపిస్తూనే ఉంటానని చెప్పుకొచ్చారు. దాంతో సహచర ఎంపీలంతా నవ్వుల్లో మునిగిపోయారు.

బెంగళూరులో కింగ్ చార్లెస్-3

బెంగళూరు: బ్రిటన్ రాజు చార్లెస్-3 సతీసమేతంగా కర్ణాటక రాజధాని బెంగళూరులో రహస్యంగా పర్యటించారు. రాజదంపతులు సమోవా దేశంలో కామన్వెల్త్ సమావేశంలో పాల్గొన్న తర్వాత యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు వెళ్తూ మధ్యలో బెంగళూరులో ఆగినట్లు బకింగ్‌హమ్ ప్యాలెస్ వర్గాలు ధ్రువీకరించాయి. వారిద్దరూ నగరంలోని ప్రముఖ వెల్‌నెస్ కేంద్రంలో చికిత్స పొందినట్లు తెలిసింది. వైట్‌ఫీల్డ్ సమీపంలోని సౌఖ్య ఇంటర్నేషనల్ హోలిస్టిక్ హెల్త్ సెంటర్‌లో రాజు చార్లెస్-3, రాణి కెమిల్లా మూడు రోజులపాటు బస చేశారు. యోగా, ధ్యానంతోపాటు ఇతర థెరపీలకు ఈ హెల్త్ సెంటర్ పేరుగాంచింది. శరీరం, మనసు అలసిపోయినప్పుడు పునరుత్తేజం పొందడానికి ఇక్కడ నిపుణులు ప్రకృతి సిద్ధమైన చికిత్స అందిస్తుంటారు. డాక్టర్ ఐజాక్ మథాయ్ నిర్వహిస్తున్న ఈ హెల్త్ సెంటర్‌కు చార్లెస్-3 రావడం ఇదే మొదటిసారి కాదు. 2019లో ఆయన ఇక్కడే 71వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. 'మనసుకు స్వాంతన లభించే యోగా క్రియల్లో బ్రిటన్ రాజ దంపతులు పాల్గొన్నారు. కోడిగుడ్లతో పాటు కేవలం శాకాహారం తీసుకున్నారు. ధ్యానం చేశారు. చార్లెస్-3 ఆయుర్వేద, హోమియోపతి, నేచురోపతితో కూడిన వెల్‌నెట్ ట్రీట్‌మెంట్ తీసుకున్నారు" అని సౌఖ్య హెల్త్ సెంటర్ ప్రతినిధులు చెప్పారు. రాజదంపతులకు ప్రత్యేక మర్యాదలేవీ చేయలేదని, ఇతర అతిథుల తరహాలోనే వారికి చికిత్స అందించామని వెల్లడించారు. హెల్త్ సెంటర్‌లో మూడు రోజులపాటు ఉన్న చార్లెస్-3 దంపతులు ఇక్కడ సాగవుతున్న ఆర్గానిక్ పంటలను పరిశీలించారు. ఔషధాల గార్డెన్‌ను సందర్శించారు. గోవుల మధ్య కలియతిరిగారు. ప్రకృతికి దగ్గరగా జీవించారు. పర్యావరణ హిత పద్ధతులు పాటించారు. రాజదంపతులు బుధవారం ఉదయమే హెల్త్‌సెంటర్ నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.



బెంగళూరు ఆయుర్వేద కేంద్రంలో చార్లెస్ దంపతులు

ఉచిత బస్సును సమీక్షిస్తాం: శివకుమార్



బెంగళూరు: కర్నాటక మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని సమీక్షిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. టికెట్లు కొనుక్కొని ప్రయాణించేందుకు పలువురు మహిళలు ముందుకు వస్తున్నందున ఈ పథకాన్ని సమీక్షిస్తామని తెలిపారు. కర్నాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఐరావత క్లబ్ క్లాస్ 2.0 బస్సులను బుధవారం ప్రవేశపెట్టాక శివకుమార్ మాట్లాడారు. 'సోషల్ మీడియా ద్వారా, ఈ-మెయిళ్ల ద్వారా చాలామంది మహిళలు టికెట్లకు డబ్బులు చెల్లించి ప్రయాణిస్తామని మమ్మల్ని సంప్రదిస్తున్నారు. దీనిపై చర్చిస్తాం' అని శివకుమార్ తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించే శక్తి పథకం కాంగ్రెస్ కన్నడనాట ఇచ్చిన ఐదు ప్రధాన హామీల్లో ఒకటనే విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కిందటేడాది జూన్ 11న శక్తి పథకాన్ని ప్రారంభించింది. ఈనెల 18 నాటికి 311 కోట్ల ఉచిత ప్రయాణాలు జరగ్గా.. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 7,507 కోట్లను దీనిపై వెచ్చించింది. " 5 నుంచి 10 శాతం మంది మహిళలు టికెట్లకు డబ్బు చెల్లించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నా.. కండక్టర్లు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. రవాణా మంత్రి రామలింగారెడ్డితో దీనిపై చర్చిస్తాను" అని శివకుమార్ వివరించారు.

హారిస్‌కు మొగ్గు

- ట్రంప్‌పై ఒక శాతం ఆధిక్యం
- కీలకాంశాల్లో మాత్రం ట్రంప్‌కే జై
- రాయిటర్స్ తాజా పోల్ వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సర్వేల్లో డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ మరోసారి స్వల్ప ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే ఆమెకు ఒక శాతం మొగ్గున్నట్టు మంగళవారం వెలువడ్డ రాయిటర్స్/ఇప్సోస్ తాజా సర్వేలో తేలింది. శుక్రవారం నుంచి ఆదివారం దాకా జరిపిన ఈ మూడు రోజులు హారిస్‌కు 44 శాతం, ట్రంప్‌కు 43 శాతం మంది మద్దతిచ్చారు. 975 మంది నమోదైన ఓటర్లతో కలిపి మొత్తం 1,150 మంది అమెరికా పౌరులు ఈ సర్వేలో పాల్గొన్నారు. అయితే ఎకానమీ, నిరుద్యోగం, ఉపాధి వంటి అతి కీలకమైన అంశాల్లో ఏకంగా 47 శాతం మంది ట్రంప్‌కే ఓటేశారు. హారిస్‌కు మద్దతిచ్చిన వారు కేవలం 37 శాతం మాత్రమే. మరో కీలకాంశమైన వలసల విషయంలో కూడా ట్రంప్ 48 శాతం మంది వైఖరిని సమర్థిస్తే హారిస్‌ను 33 శాతం మందే సమర్థించారు. కచ్చితంగా ఓటేస్తామన్న వారిలో 47 శాతం హారిస్‌ను, 46 శాతం ట్రంప్‌ను బలపరిచారు. హారిస్ అధ్యక్ష రేసులోకి వచ్చినప్పటి నుంచి సర్వేలన్నీ ఆమెకే మొగ్గున్నట్టు తేల్చడం విశేషం.

స్థిరత్వం లేని ట్రంప్‌ను ఓడించండి

- అమెరికా ఓటర్లకు కమలా హారిస్ పిలుపు
- ప్రజలను శత్రువులుగా భావిస్తున్న ట్రంప్
- అధ్యక్షుడిగా పనికిరారని ధ్వజం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రచారం వేడెక్కుతోంది. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ తన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. ట్రంప్ ఏమాత్రం స్థిరత్వం లేని మనిషి, ప్రతీకారమే అతడి విధానమని మండిపడ్డారు. విభజనవాది, గందరగోళానికి మారుపేరైన ట్రంప్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తాజాగా డెమొక్రటిక్ ఎన్నికల ప్రచార సభలో కమలా హారిస్ మాట్లాడారు. అమెరికా పౌరులపైకి అమెరికా సైన్యాన్ని ప్రయోగించాలనుకుంటున్న ట్రంప్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు. వ్యతిరేకులను బల ప్రయోగంతో అణచివేయాలన్నదే ఆయన ఆలోచన అని ఆరోపించారు. ప్రజలను శత్రువులుగా భావిస్తున్న ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎంతమాత్రం పనికిరారని తేల్చిచెప్పారు. ప్రజలు కోరుకుంటున్న కొత్త తరం నాయకత్వాన్ని పరిచయం చేస్తానని, అధ్యక్ష ఎన్నికల్లో తనను గెలిపించాలని ఓటర్లకు కమలా హారిస్ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మేలు చేయడమే తన లక్ష్యమని, అందుకోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. దుష్ట స్వభావం కలిగిన వ్యక్తులపై, స్వప్రయోజనాల కోసం పాకులాడే శక్తులపై కఠినమైన పోరాటానికి భయపడబోనని చెప్పారు. తన తల్లి తనకు ధైర్యసాహసాలు నూరిపోశారని వ్యాఖ్యానించారు. కష్టపడి పనిచేసే నిజాయతీపరులైన ప్రజలను స్వార్థ శక్తుల నుంచి కాపాడుతానని హామీ ఇచ్చారు.



నాకు ఓటేయని వారికీ ప్రతినిధినే: హారిస్

బైడెన్ వివాదం నేపథ్యంలో వ్యాఖ్యలు

వాషింగ్టన్: "నేను అమెరికన్లందరికీ ప్రాతినిధ్యం వహిస్తా. అధ్యక్ష ఎన్నికల్లో నాకు ఓటేయని వారు కూడా అందులో భాగమే" అని హారిస్ స్పష్టం చేశారు. ట్రంప్ మద్దతుదారులను 'చెత్త'గా అభివర్ణిస్తూ అధ్యక్షుడు జో బైడెన్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీయడం తెలిసిందే. వాటిపై హారిస్ ఇలా స్పందించారు. ఎవరికి ఓటేస్తారన్న దాని ఆధారంగా వ్యక్తులపై విమర్శలు చేయడాన్ని తాను అంగీకరించబోనని స్పష్టం చేశారు.

అధికారికంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా అందరి బాగు కోసం కృషి చేస్తానని ప్రకటించారు. అన్ని పార్టీలతో కలిసి పని చేస్తానన్నారు. అమెరికా అధ్యక్షురాలిగా తాను భిన్నమైన సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని కమలా హారిస్ ఉద్ఘాటించారు. ఆకాశాన్నంటుతున్న ధరలే తన ముందున్న అతిపెద్ద సవాలు అని చెప్పారు. ధరలు తగ్గించడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

రూ.295 కోట్లతో ఇల్లు కొన్న మస్క్

టెక్సాస్: ప్రపంచ కుబేరుడు, టెస్లా సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్ భారీ ఇంటి సముదాయాన్ని కొనేశారు. అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలో రూ.295 కోట్ల (35 మిలియన్ డాలర్లు)తో ఆయన ఈ కాంపౌండ్ కొన్నారు. దీని విస్తీర్ణం 14,400 చదరపు అడుగులు. ఇందులో ఇటాలియన్ టస్కన్ విల్లాను పోలిన గృహం, ఆరు పడక గదుల ఇల్లు ఉన్నాయి. తన 11 మంది పిల్లలు, వారి తల్లులు ఉండేందుకు ఈ కాంపౌండ్‌ను మస్క్ కొనుగోలు చేశారు. తన పిల్లలతో తగినంత సమయం గడపడానికి ఈ భవన సముదాయం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించానని, అందుకే కొనేశాని మస్క్ చెప్పారు. ఎలాన్ మస్క్‌కు మొదటి భార్య జస్టిన్ విల్సన్‌తో ఐదుగురు సంతానం ఉన్నారు. అనంతరం గాయకురాలు గ్రిమ్స్‌ను మస్క్ పెళ్లి చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అలాగే శివోన్ జిలీస్‌తో మస్క్‌కు మరో ముగ్గురు పిల్లలు జన్మించారు. తన స్థిరాస్తులన్నీ అమ్మేశానని, తనకు సొంత ఇల్లు లేదని 2020లో మస్క్ ప్రకటించారు. మరోవైపు 11 మంది పిల్లలకు జన్మనివ్వడాన్ని ఆయన పలు సందర్భాల్లో సమర్థించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోందని, అందుకే జననాల సంఖ్య పెంచాలని చెప్పారు.

సల్మాన్‌కు మళ్లీ బెదిరింపు

ముంబై: బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ మళ్లీ చంపుతామని బెదిరింపులు వచ్చాయి. రూ. 2 కోట్లు ఇవ్వాలని, లేదంటే సల్మాన్‌ను చంపేస్తామని మంగళవారం ముంబై ట్రాఫిక్ పోలీసులకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి హెచ్చరిక వచ్చింది. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం బాంద్రాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. హెచ్చరిక మెసేజ్‌ను పంపింది అజమ్ మొహమ్మద్ ముస్తఫాగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అలాగే నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జీషాన్ సిద్దిఖీని కూడా చంపుతామని ముస్తఫా బెదిరించాడు. జీషాన్ తండ్రి, మాజీ మంత్రి బాబా సిద్దిఖీకి పట్టిన గతే పడుతుందన్నాడు. తన హెచ్చరికలను తేలికగా తీసుకోవద్దని పేర్కొన్నాడు.



స్టార్మర్‌కు తిలకం దిద్దుతున్న అరుణిమా కుమార్ కూచిపూడి బృంద సభ్యులు

దీపావళి సందర్భంగా తన అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ ముందు ప్రమిదలు వెలిగిస్తున్న బ్రిటన్ ప్రధాని స్టార్మర్

స్టార్మర్ దీపావళి వేడుకలు

అధికార నివాసం ముందు దీపాలు వెలిగించిన బ్రిటన్ ప్రధాని

లండన్: బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి తన అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్ ముందు ఆయన స్వంగా దీపాలు వెలిగించారు. అనంతరం నుదుట కుంకుమ దిద్దుకుని హిందూ సంప్రదాయ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అరుణిమా కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాన్ని ఆస్వాదించారు. ప్రస్తుతం ప్రపంచాన్ని చాలారకాల చీకట్లు కమ్ముకున్నాయని ఈ సందర్భంగా స్టార్మర్ ఆవేదన వెలిబుచ్చారు. వాటన్నింటినీ పారదోలేలా ఈ వెలుగుల పండుగ మనందరికీ స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. దీపావళి భిన్న వర్గాల వారిని ఒక్కటి చేసే పండుగ అన్నారు.

భారతీయులపై ప్రశంసల జల్లు

బ్రిటిష్ ఇండియన్ సమాజం కష్టించి పని చేస్తుందని, తమ విలువలు, సేవా భావంతో సమాజంలో ఎనలేని గౌరవం సంపాదించుకుందని స్టార్మర్ కొనియాడారు. వారి భాగస్వామ్యం బ్రిటిష్ సమాజాన్ని సుసంపన్నం చేసిందన్నారు. "ప్రభుత్వ పనితీరులో వారెంతో కీలకం. నా అధికార నివాసం తలుపులు వారికోసం ఎప్పటికీ తెరిచే ఉంటాయి" అన్నారు. ఉప ప్రదాని ఏంజెలా రేయ్‌నర్, మంత్రులు సీమా మల్హోత్రా తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

స్పెయిన్‌లో వర్ష బీభత్సం

- 95 మందికి పైగా మృతి, భారీగా పెరిగే ఆస్కారం
- కొట్టుకుపోయిన కార్లు, నదులైన రోడ్లు

బార్సెలోనా: కుండపోత వర్షాలు, వడగళ్ల వానలతో స్పెయిన్ అతలాకుతలమవుతోంది. ఆకస్మిక వరదలు మంగళవారం దేశ దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించాయి. కనీసం 95 మందికి పైగా బలైనట్టు సమాచారం. ఒక్క వాలెన్సియా ప్రాంతంలోనే బుధవారం ఒక్క రోజే మృతుల సంఖ్య 62కు చేరినట్టు అధికారులు ధ్రువీకరించారు. ఇప్పటికే పలువురి మృతదేహాలు దొరికినట్టు తెలిపారు. ఎంతోమంది గల్లంతైనట్టు చెప్పారు. పలు ప్రాంతాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అక్కడ మరెంతో మంది మృత్యువాత పడ్డట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మృతుల భారీగా పెరిగేలా కనిపిస్తోంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 320 మి.మీ. వర్షం పడింది! దాంతో మలగా నుంచి వాలెన్సియా దాకా ఎక్కడ చూసినా నదులుగా మారిన రోడ్లు, కూలిన గోడలు, కొట్టుకుపోతున్న కార్లతో ఎక్కడ చూసినా పరిస్థితి భీతావహంగా కనిపిస్తోంది. అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్లన్నీ నీట మునిగిపోయాయి. ఇళ్లలోని సామాన్లన్నీ వరద పాలై కొట్టుకుపోతున్నాయి. స్పెయిన్ ఇంతటి వరదల బారిన పడటం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. వరదలో చిక్కిన వారిని హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా కాపాడుతున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అత్యవసర సైనిక బృందం నుంచి వెయ్యి మంది సిబ్బందిని నియోగించారు. ఎడతెరిపి లేని వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. గురువారం తీవ్ర వర్షసూచనలున్నాయి.

రవాణా కుదేలు

ఆకస్మిక వరదల దెబ్బకు ఏకంగా పలు నదులపై బ్రిడ్జిలే కొట్టుకుపోయాయి. దాంతో స్పెయిన్ అంతటా రవాణా వ్యవస్థ కుదేలైంది. రైలు, విమాన సేవలు ప్రభావితమయ్యాయి. మలగా సమీపంలో 300 మంది పై చిలుకు ప్రయాణికులతో వెళ్తున్న హైస్పీడ్ ట్రెయిన్ పట్టాలు తప్పింది. దాంతో వాలెన్సియా అంతటా రెడ్ అలర్ట్ ప్రకటించారు. స్కూళ్లు, పార్కులను మూసేస్తున్నట్లు, క్రీడా కార్యక్రమాలను నిలిపేస్తున్నట్లు వాలెన్సియా సిటీ హాల్ తెలిపింది. అండలూసియాలో కొన్ని ప్రాంతాల్లో రెండో అతి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. వరదల్లో చాలా మంది గల్లంతయ్యారని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ అన్నారు. బాధితులను ఉద్దేశించి ఆయన టీవీలో మాట్లాడారు.



వరదల ధాటికి కొట్టుకొచ్చి కుప్పగా పడ్డ కార్లు, సామాన్లు

నిన్నటిదాకా కరువు...

స్పెయిన్ కొన్నేళ్లుగా తీవ్ర కరువు పరిస్థితుల బారిన పడింది. తాజాగా గత సీజన్‌లో కొనసాగిన కరువు దెబ్బ నుంచి ఇంకా తేరుకోనే లేదు. ఇంతలోనే ఇలా వరదలు వచ్చిపడ్డాయి. వెచ్చని మధ్యధరా జలాలపై చల్లని గాలి కారణంగా 'కోల్డ్ డ్రాప్'తో ఏర్పడ్డ క్యుములోనింబస్ మేఘాలు ఈ ఆకస్మిక వర్షాలకు కారణమని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణ మార్పుల వల్ల ఇలాంటి విపరీత సంఘటనలు తరచుగా, తీవ్రస్థాయిలో జరుగుతున్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 31 । అక్టోబర్ । 2024



నిండు ప్రాణం తీసిన నిద్రమత్తు

ట్రావెల్స్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ రిటైర్డ్ జవాను ప్రాణాన్ని బలి తీసుకుంది. నిద్ర మత్తులో డ్రైవ్ చేస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

-8లో



బీ కేర్‌ఫుల్

టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. తగిన జాగ్రత్తలతో టపాసులు కాలిస్తే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

-సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/21.0

నగరంలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది . గరిష్టంగా 33, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ట్రాఫిక్ విధుల్లోకి హైడ్రా వలంటీర్లు



సాక్షి, సిటీబ్యూరో: వాహనాల నియంత్రణపై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీలోని (హైడ్రా) డీఆర్ఎఫ్ సిబ్బంది బుధవారం నుంచి విధుల్లోకి వచ్చారు. నగరంలోని వివిధ జంక్షన్లలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించారు. తొలి దశలో 50 మందికి గోషామహల్‌లో ఉన్న ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో (టీటీఐ) శిక్షణ ఇచ్చిన విషయం విదితమే. హైడ్రా ట్రాఫిక్ వలంటీర్లు ట్రాఫిక్ రద్దీ వేళలతో పాటు ఇతర కీలక సమయాల్లో సేవలు అందించనున్నారు.



చిక్కడపల్లిలో ప్రమిదల కొనుగోళ్లు



దిల్‌సుఖ్‌నగర్‌లో పూల విక్రయాలు



హిమాయత్ నగర్‌లో మిఠాయిల విక్రయాలు

మార్కెట్లకు దీపావళి కళ

నగర మార్కెట్లలో దీపావళి సందడి నెలకొంది. పూలు, పండ్లు, గుమ్మడి కాయలతో మార్కెట్లు, ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లు నిండిపోయాయి. షాపింగ్ మాల్స్, బంగారం, మిఠాయి దుకాణాల్లో జనం రద్దీ కనిపించింది. బుధవారం గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌కు పండగ సందర్భంగా సుమారు లక్ష క్వింటాళ్ల పూలు వచ్చి ఉంటాయని అంచనా. రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

– సాక్షి, సిటీబ్యూరో



ఎన్టీఆర్ నగర్‌లో..

తాటోనికుంట పునరుద్ధరణపై హైడ్రా దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుకు (ఓఆర్ఆర్) సమీపంలోని ఖాజాగూడలో ఉన్న తాటోని కుంట పునరుద్ధరణపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. బుధవారం చెరువును కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి తాటోని కుంటలోకి నీరు చేరేందుకు ఉన్న మార్గాల పరిశీలించారు. 'మనూ'కు చెందిన ఖాళీ స్థలంలో నిలుస్తున్న వర్షపు నీరు సమీపంలోని అపార్టుమెంట్ల సెల్లార్లలోకి వస్తోందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఆ నీరు నేరుగా తాటోనికుంటకు చేరితే ఈ ఇబ్బంది ఉండదన్నారు. దీంతో పాటు ఈ చెరువు నిండితే అలుగు పారే నీరు నేరుగా భగీరథమ్మ చెరువుకు చేరేలా కాల్వలు ఏర్పాటు చేయాలని అధికారులకు రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. జనావాసాల మధ్య ఉన్న చెరువుల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందని, తొలుత ఎఫ్‌టీఎల్ నిర్ధారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

నేడు మ్యూజియానికి సెలవు



చార్మినార్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని సాలార్‌జంగ్ మ్యూజియం మూసి ఉంటుందని బుధవారం సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఈ విషయాన్ని గమనించి గురువారం మ్యూజియం సందర్శనకు రావద్దని ఆయన సూచించారు.

మైనర్.. డ్రైవింగ్ డేంజర్



పిల్లలు బండి నడిపితే పెద్దలకు శిక్ష తప్పదు

తల్లిదండ్రులకు గరిష్టంగా 3 ఏళ్ల జైలు

- రూ.25,000 వరకు జరిమానా, వాహనం ఆర్సీ రద్దు
- మోటారు వాహన చట్టానికి రవాణా శాఖ పదును

సాక్షి, సిటీబ్యూరో: మైనర్ల డ్రైవింగ్‌పై ఆర్టీఏ కొరడా ఝుళిపించింది. పద్దెనిమిదేళ్లలోపు పిల్లలు కార్లు, బైక్‌లు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానులు మూల్యం చెల్లించుకోవాల్సిందే. గ్రేటర్ పరిధిలో తరచుగా ఎక్కడో ఒకచోట మైనర్ల డ్రైవింగ్ బెంబేలెత్తిస్తున్నాయి. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల ఎలాంటి అవగాహన లేకుండా వాహనాలు నడిపే మైనర్లు వాహనాలు ఢీకొట్టి ఇతరుల ప్రాణాలను బలిగొంటున్నారు. ఇటీవల కాలంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్న ఈ విపత్కర పరిణామంపై రవాణాశాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టింది. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 199ఏ ప్రకారం మైనర్ల తల్లిదండ్రులు లేదా వాహన యజమానులకు గరిష్టంగా 3 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అలాగే రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ దిశగా కార్యాచరణ చేపట్టినట్లు హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ సి.రమేష్ తెలిపారు. తల్లిదండ్రులు తమ మైనారిటీ పిల్లలకు వాహనాలను అప్పగించి చిక్కులు కొని తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు.

హడలెత్తిస్తున్న మైనర్లు..

- స్కూల్‌పిల్లలు, మైనారిటీ తీరని ఇంటర్మీడియట్ స్థాయి పిల్లలు సైతం ఎస్‌యూవీ వంటి అత్యంత వేగవంతమైన బైక్‌లు, కార్లు నడుపుతున్నారు. పిల్లలకు వాహనాలను ఇవ్వకుండా అడ్డుకోవాల్సిన తల్లిదండ్రులే వారి డ్రైవింగ్ చూసి గర్వంగా భావిస్తున్నారు. కానీ.. ముంచుకొచ్చే ప్రమాదాన్ని గుర్తించడం లేదు. ఇలాంటి వాహనాలను నడుపుతూ పరిమితికి మించిన వేగంతో పరుగులు తీస్తున్నారు.
- ఈ ఏడాది జూన్ నెలలో మణికొండ వద్ద ఓ మైనర్ బాలుడు ఎస్‌యూవీ వాహనం నడుపుతూ పార్క్ చేసిన వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. గతంలోనూ నలుగురు పిల్లలు వారిలోఒకరి పుట్టిన రోజు సందర్భంగా కారు తీసుకొని లాంగ్‌డ్రైవ్‌కు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. ఈప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.


రహదారి భద్రత ప్రధానం..

రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల ఎలాంటి అవగాహన లేని పిల్లలు వాహనాలను తీసుకొని రోడ్డెక్కితే చాలా నష్టం జరుగుతుంది. ఆ పిల్లల కుటుంబాలే కాకుండా సమాజం కూడా ఆ నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. తల్లిదండ్రులు, పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదు.

– సి.రమేష్, ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్, హైదరాబాద్

ఇప్పటివరకు సాధారణ శిక్షలతో సరి..

- ప్రతి ఏటా పోలీసులు, ఆర్టీఏ సిబ్బంది తనిఖీల్లో సుమారు 2,500 నుంచి 3,000 మంది పిల్లలు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నట్లు అంచనా. ఇలాంటి సంఘటనల్లో ఇప్పటి వరకు సాధారణ శిక్షలే అమలవుతున్నాయి. తల్లిదండ్రులను పిలిపించి హెచ్చరించి వదిలేస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. కానీ ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సివస్తోంది.
- రెండేళ్ల క్రితం మైనర్ల డ్రైవింగ్ వల్ల 25 ప్రమాదాలు జరిగినట్లు గుర్తించారు. 2023లో 35 ప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 10 ప్రమాదాలు జరిగినట్లు గుర్తించారు. ఇలాంటి ప్రమాదాలు వాహనాలు నడిపే డ్రైవర్లు, వారితో కలిసి ప్రయాణం చేసేవారు. ఇతర రోడ్డు వినియోగదారులు కూడా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. మైనర్ల డ్రైవింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు ఎంవీ యాక్ట్‌లోని సెక్షన్ 199ఏను సమర్థంగా అమలు కానుంది.
- మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు పాల్పడటంతో పాటు బండి నడుపుతూ పట్టుబడినా సరే ఆర్సీ రద్దవుతుంది. ఏడాది పాటు సదరు వాహనం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయనున్నారు. దీంతో ఆ వాహనాన్ని వినియోగించేందుకు అవకాశం ఉండదు. పట్టుబడే మైనర్లకు 25 ఏళ్ల వయసు వరకు లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయకుండా ఆంక్షలు విధిస్తారు. మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 199ఏను సమర్థంగా అమలు చేయాలని కోరుతూ రవాణా కమిషనర్ ఇలంబర్తి ఇటీవల అన్ని జిల్లా, ప్రాంతీయ రవాణా కార్యాలయాల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మైనర్ల డ్రైవింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని తెలిపారు.



'ఫైన్' సిటీ!

పారిశుద్ధ్య నగరానికి చర్యలు

- వ్యర్థాలు వేస్తే పెనాల్టీ వేయాలి
- రోజువారీగా ఆ వివరాలివ్వాలి
- అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి
- బల్దియా కమిషనర్ ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో పలు నిబంధనలున్నప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రజలకు అందించాల్సిన సేవల నుంచి, అధికారులు నిర్వర్తించాల్సిన విధులూ నిర్వహించడం లేదు. ఆయా పనులను పర్యవేక్షించాల్సిన వారు పట్టించుకోకపోవడంతో నిబంధనలు రూపొందించుకొని ప్రయోజనం లేకుండాపోతోంది. ఇలాంటి అంశాలు ఇటీవల కమిషనర్ ఇలంబర్తి దృష్టికి రావడంతో వాటిని అమలు చేయాల్సిందేనని ఆదేశించారు. ఉదాహరణకు రోడ్లపై చెత్త వేయకుండా పెనాల్టీలు వేయాలి. కాంట్రాక్టు పనులు పొందిన ఏజెన్సీలు చేయాల్సిన పనులు చేయకున్నా పెనాల్టీలు విధించాలి. కానీ.. కాంట్రాక్టు ఏజెన్సీలకు మొక్కుబడి పెనాల్టీలుండటాన్ని చూసి విస్తుపోయిన కమిషనర్.. సర్కిళ్ల వారీగా ప్రతిరోజూ తనిఖీల్లో ఎన్ని ఉల్లంఘనలు గుర్తిస్తున్నారో, వాటికి ఎన్ని పెనాల్టీలు విధిస్తున్నారో తనకు నివేదిక పంపించాల్సిందిగా ఆదేశించారు. ఇటీవల సమీక్ష సందర్భంగా సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణపై స్పందిస్తూ ఈ ఆదేశాలు జారీ చేశారు.

పర్యవేక్షణ కొరవడి..

నిబంధనల ప్రకారం.. సీఆర్ఎంపీ మార్గాల్లో రోడ్లపై చెత్త ఉండరాదు. పాట్‌హోల్స్ ఉండకూడదు. సెంట్రల్ మీడియన్లలో గ్రీనరీ వంటివి ఉండాలి. ఇలా పలు నిబంధనలున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు వాటిని పట్టించుకోవడం లేదు. బిల్లుల చెల్లింపులు మాత్రం చేస్తున్నారు. ఇలా ఒక్క పని అని కాదు.. పలు అంశాల్లో ఇలాగే వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టు నిబంధనల్లో పకడ్బందీగా ఉన్నప్పటికీ, అమలు చేయడం లేదు. వీటిని గుర్తించిన కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలకు ఎన్ని పెనాల్టీలు విధించారో వివరాలతో సహా తనకు ప్రతిరోజూ నివేదిక పంపించాలనడంతో అధికారులు దాని అమలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, తక్కువ పెనాల్టీలుంటే అసలే పని చేయడం లేదని భావిస్తారనే తలంపుతో సర్కిళ్ల అధికారులు ఎన్నో కొన్ని పెనాల్టీలు వేస్తున్నట్లు సమాచారం. తద్వారా రోడ్లపై చెత్తకుప్పలు వంటివి కూడా తగ్గే అవకాశాలున్నాయి.

వ్యర్థాల సమస్యలు తగ్గుముఖం పడతాయని..

నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు సైతం రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తుండటంతో సంబంధిత బిల్డర్లే వాటిని తరలించాలని, అలాంటి వారిని గుర్తించి తగిన పెనాల్టీలు వేయాల్సిందిగా ఆదేశించారు. జీహెచ్ఎంసీ నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాల ప్లాంట్లకు వాటిని తరలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమేరకు తగిన ప్రచారం కూడా చేయాలని ఆదేశించారు. ఇలా ఫైన్లు వేయడం ద్వారానైనా నగరంలో వ్యర్థాల సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. కుక్కల తరలింపు వాహనాలు సైతం ఏ వాహనం రోజూ ఎన్ని కుక్కలను తరలిస్తోంది వంటి వివరాలు అందజేయాలన్నారు. ఈ చర్యలతో ఆయా విభాగాల్లోని లొసుగులు తగ్గుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



టపాసుల దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం

- ఆర్థిక లావాదేవీలే కారణం..
- అప్రమత్తమైన నిర్వాహకులు
- తప్పిన పెను ప్రమాదం

అడ్డగుట్ట: ఆర్థిక లావాదేవీల కారణంగా టపాసుల దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీప ప్రాంతానికి చెందిన సతీష్‌రెడ్డి పాల వ్యాపారి. ఇదే ప్రాంతానికి చెందిన నిఖిల్ రాజ్ తన క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించేందుకు సతీష్‌రెడ్డి వద్ద రూ.93 వేలు అప్పుగా తీసుకున్నాడు. కార్డు బిల్లు చెల్లించిన అనంతరం, తిరిగి ఇస్తానని చెప్పిన నిఖిల్ రాజ్ నాలుగు రోజులుగా సతీష్ రెడ్డికి డబ్బులు ఇవ్వడంలేదు. రెండ్రోజుల క్రితం తన అప్పు డబ్బులు ఇవ్వాలని సతీష్‌రెడ్డి నిఖిల్‌రాజ్‌ను గట్టిగా నిలదీసినా అతడు ఇవ్వనని తెగేసి చెప్పాడు. ఇదిలా ఉండగా.. దీపావళి సందర్భంగా నిఖిల్ రాజ్ లాలాపేటలో టపాసుల దుకాణం పెట్టాడు. తనకు ఇచ్చే డబ్బులు ఇవ్వకుండా టపాసుల దుకాణం పెట్టుకున్న నిఖిల్‌పై సతీష్‌రెడ్డి కోపం పెంచుకున్నాడు. అదే ఆవేశంతో ఉన్న అతను బుధవారం తెల్లవారుజామున టపాసుల దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో దుకాణంలో నిద్రిస్తున్న నిఖిల్ రాజ్, శ్రీకాంత్ అనే మరో వ్యక్తికి పెట్రోల్ వాసన రావడంతో వెంటనే బయటకు వచ్చి చూడగా సతీష్‌రెడ్డి నిప్పంటించి పారిపోయాడు. దుకాణానికి అమర్చిన కవర్లకు నిప్పంటుకుంటుండగా వెంటనే నిర్వాహకులు మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో నిఖిల్ కాలికి స్వల్ప గాయమైంది. అనంతరం, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నింధితుడు సతీష్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా ముకుందరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ రెవెన్యూ డివిజినల్ అధికారిగా రామకృష్ణ, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా పి. సాయిరాం విధుల్లో చేరారు. అనంతరం ముగ్గురు వేర్వేరుగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై డివైడర్‌ను ఢీకొట్టిన కారు



రాజేంద్రనగర్: పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అతి వేగంగా అపోజిట్ రోడ్డుపైకి వచ్చి నిలిచిపోయింది. ఈ ఘటనతో ఎక్స్‌ప్రెస్ వేపై దాదాపు గంట పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆరాంఘర్ వైపు నుంచి ఓ స్విఫ్ట్ కారు మెహిదీపట్నం వైపు వెళ్లేందుకు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపైకి ఎక్కింది. 300 నంబర్ పిల్లర్ వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అక్కడి నుంచి అపోజిట్ రోడ్డులోకి వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఈ సమయంలో అటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

దీపావళి సందర్భంగా బల్దియా ఉద్యోగులకు..

ఒకటో తేదీకి ముందే జీతాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఉద్యోగులకు ఇది నిజంగా దీపావళే. ఖజానాలో నిధుల కటకటతో ప్రతినెలా జీతాల చెల్లింపులకు ఆలస్యం జరుగుతుండగా, ఈసారి మాత్రం దీపావళి పండగను పురస్కరించుకొని ఒకటో తేదీకి ముందే బుధవారం నుంచే జీతాల చెల్లింపులు ప్రారంభించారు.

ప్రధాన కార్యాలయంలోని ట్రెజరీలో నిర్వహించిన లక్ష్మీ పూజలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, అడిషనల్ కమిషనర్లు గీతారాధిక, నళిని పద్మావతి, శివకుమార్‌నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి కటాక్షలతో జీహెచ్ఎంసీ అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. దీపావళిని పురస్కరించుకొని మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ఇలంబర్తి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లోని గార్బేజ్ వల్నరబుల్ ప్రాంతాల్లో చెత్తను తొలగించి దీపావళి శుభాకాంక్షలతో బ్యానర్లు ఏర్పాటు చేశారు. రంగులతో ముగ్గులు వేశారు.



లక్ష్మీపూజలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

మహిళ ఇంట్లో డ్రగ్స్ పట్టివేత

- అక్రమంగా నిల్వ చేసి నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా
- డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఎక్సైజ్ విభాగం ఆపరేషన్
- సికింద్రాబాద్‌లోని సలూజా ఆస్పత్రిలో తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: ఓ మహిళ తన ఇంట్లో డ్రగ్స్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా దాచిపెట్టి నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్న వ్యవహారాన్ని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, ఎక్సైజ్ విభాగం బట్టబయలు చేశాయి. బుధవారం సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజార్‌లో ఉన్న జీవీ సలూజా హాస్పిటల్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల సందర్భంగా భారీ స్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన నార్కోటిక్స్ డ్రగ్స్‌తో పాటు మత్తు కలిగించే మందులను గుర్తించారు. ఫెంటనైల్, కిటమైన్ హైడ్రోక్లోరైడ్, పెంటజోసైన్ యాసిడ్, మిడజోలం, సక్సినైల్ క్లోరైడ్ ఇంజెక్షన్లను భారీగా పట్టుకున్నారు. నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారించగా.. మౌలాలిలోని ఎంజే కాలనీకి చెందిన నేహా భగవత్ అనే మహిళ తమకు సరఫరా చేస్తుందని వివరాలు అందించారు. దీంతో వెంటనే నేహా ఇంటికి వెళ్లిన అధికారులు అక్కడ భారీ స్థాయిలో నిల్వ ఉంచిన నార్కోటిక్ డ్రగ్స్, మందులను గుర్తించారు. మార్ఫిన్ ఇంజెక్షన్లు, ట్యాబ్లెట్లు, ఫెంటనైల్ సిట్రేట్ ఇంజెక్షన్లు, ఫెంటనైల్ సిట్రేట్ ప్యాకెట్లు, పెంటజోకైన్ ఇంజెక్షన్లను వేరే రాష్ట్రాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి, నగరంలో లైసెన్స్ లేకుండా అక్రమంగా నడుపుతున్న మందుల దుకాణాలకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటికే నేహాపై ఎన్డీపీఎస్ చట్టం కింద రెండు కేసులు ఉన్నాయని, గత నెలలోనే బెయిల్ పొంది బయటికి వచ్చినట్టు అధికారులు వివరించారు. అధికారులు డ్రగ్స్‌ను సీజ్ చేశారు. నేహా భగవత్, పట్వారి గోపీనాథ్, సురేందర్‌సింగ్ గుసియాలు పట్టుబడ్డారు. కాగా, నిందితులైన రాజేందర్ సింగ్ సలూజా, అమృత సింగ్ సలూజా, దినేశ్ పరారీలో ఉన్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు

కంటోన్మెంట్: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి..గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళితే 2020లో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన బొగ్గుల సాయిలు (54), సికింద్రాబాద్‌లోని సింధి కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఫంక్షన్ హాలులో పనిచేస్తూ అక్కడే నివాసముంటున్నాడు. ఇదే ఫంక్షన్ హాలులో హౌజ్ కీపింగ్‌లో పనిచేస్తూ, బోయిన్‌పల్లిలో నివసించే వ్యక్తి (బాధిత బాలిక తండ్రి) కుటుంబంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలో 2019 మార్చిలో స్నేహితుడి మైనర్ కుమార్తెపై సాయిలు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత బాధిత బాలికను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2020 ఏప్రిల్‌లో బాధిత బాలిక తీవ్రమైన కడుపునొప్పితో బాధపడగా, ఆసుపత్రిలో చేర్పించి పరీక్షలు నిర్వహించడంతో ఆమె గర్భవతి అని తేలింది. బాధిత బాలిక, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడిపై పాక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ అంజయ్య హయాంలో కేసు నమోదు కాగా, ఇన్‌స్పెక్టర్ కె.రవి కుమార్ విచారణ సాగించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రామ్‌రెడ్డి, లీగల్ సపోర్ట్ ఆఫీసర్ టి.కల్పన, కానిస్టేబుళ్లు జే.సాయికుమార్, ఎస్.రాజేశ్‌లు కేసు విచారణలో కీలకంగా పనిచేశారు. నిందితుడిపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో నాంపల్లిలోని 12వ మెట్రో పాలిటన్ సెషన్స్ జడ్జి టి.అనిత నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.7 లక్షల పరిహారాన్ని ప్రకటించారు.



నగరంలో బుధవారం రాత్రి జరిగిన కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి 75వ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఆయన సోదరులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు అనిల్‌రెడ్డి, నర్సిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు. -సాక్షి, సిటీబ్యూరో

ఇక అడుగడుగునా నిఘా!

రాచకొండలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్

- లక్షకు పైగా సీసీ కెమెరాలతో అనుసంధానం
- కేంద్ర హోం సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు ప్రతిపాదనలు
- ఔటర్ ఎంట్రీ, ఎగ్జిట్‌లలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు
- బాడీవార్న్ కెమెరాలతో పోలీసుల ప్రవర్తనపై నిఘా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్ద పోలీసు కమిషనరేట్ రాచకొండలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రానుంది. నిర్భయ, ఐటీఎంఎస్, నేను సైతం కార్యక్రమాల కింద ఏర్పాటైన సుమారు లక్షకు పైగా సీసీటీవీ కెమెరాలు కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటాయి. దీంతో రాచకొండలో అడుగడుగునా నిఘా ఉండనుంది. ఇప్పటికే కేంద్రం హోం శాఖకు చెందిన సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు ప్రతిపాదనలను పంపించామని కమిషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. సుమారు 50 మంది సిబ్బంది 24/7 కంట్రోల్ సెంటర్‌లో విధుల్లో ఉంటారని, జోన్ల వారీగా ప్రత్యేక నిఘా ఉంటుందని 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఔటర్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లు..

పోలీసులు, అధికారులు రోడ్ల మీద ఉంటేనే ట్రాఫిక్ నియంత్రణలో ఉంటుంది. ప్రమాదాల విశ్లేషణ, నివారణ చర్యల కోసం యాక్సిడెంట్ అనాలసిస్ ప్రివెన్షన్ టీం (ఆప్ట్)ను ఏర్పాటు చేశాం. ప్రమాదం జరిగిన వెంటనే కేసు నమోదు, దర్యాప్తులతో పాటు సమాంతరంగా ప్రమాదం జరిగిన తీరు, కారణాలను క్షేత్ర స్థాయిలో విశ్లేషించడం, పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచించడం దీని బాధ్యత. ఓఆర్‌ఆర్‌పై ప్రమాదాలను, వాహనాల వేగాన్ని తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) నిర్వహిస్తున్నాం.

3 షిఫ్టులలో సిబ్బందికి విధులు..

సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పటివరకు రెండు షిఫ్టులలో విధులు నిర్వహించే పెట్రోలింగ్ సిబ్బందికి మూడు షిఫ్టులను కేటాయించాం. దీంతో 74 పెట్రోలింగ్ వాహనాల సిబ్బందిపై ఒత్తిడి తగ్గడంతో పాటు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారు. తగినంత స్థాయిలో నియామకాలు జరిగిన తర్వాత పోలీసు స్టేషన్లలో కూడా మూడు షిఫ్టుల విధానాన్ని అమలు చేస్తాం.

సైబర్ బాధితులకు ఊరట..

క్విక్ రెస్పాన్స్, విజుబుల్ పోలీసింగ్, సాంకేతికత..ఈ మూడే రాచకొండ పోలీసుల ప్రాధాన్యం. దీంతోనే నేరాలు తగ్గడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. సైబర్ నేరాలలో నిందితులను పట్టుకోవడంతో పాటు బాధితులకు ఊరట కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. గత 7 నెలల్లో రూ.15 కోట్ల సొమ్మును బాధితులకు రీఫండ్ చేశాం. పోగొట్టుకున్న సొమ్ము తిరిగి వస్తే బాధితులకు ఊరట కలగడంతో పాటు పోలీసులపై నమ్మకం పెరుగుతుంది.

పోలీసు ప్రవర్తనపై నిఘా..

ప్రజలతో ట్రాఫిక్ పోలీసులు ఎలా ప్రవర్తిస్తున్నారనేది తెలుసుకునేందుకు వంద బాడీవార్న్ కెమెరాలను కొనుగోలు చేశాం. కమిషనరేట్‌లోని 12 ఠాణాల్లోని ఎస్‌ఐ ర్యాంకు అధికారికి వీటిని ధరించి విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశాం. ఈ బాడీవార్న్ కెమెరాలు కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. దీంతో వారి ప్రవర్తన ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలిసిపోతుంటుంది.

మహిళల భద్రత కోసం..

మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 2 నెలల్లో ఎల్బీనగర్, భువనగిరిలో భరోసా సెంటర్లు అందుబాటులోకి వస్తాయి. వీటిల్లో తగినంత మహిళా సిబ్బందితో పాటు శాశ్వత కౌన్సిలర్లను ఏర్పాటు చేస్తున్నాం. మానవ అక్రమ రవాణా, వ్యభిచారం వంటి వాటిపై నిఘా పెట్టేందుకు ఆయా విభాగాల్లో మహిళా సిబ్బందిని పెంచుతున్నాం. మహిళలను వేధింపులు పునరావృతమైతే ఆయా నిందితులపై రౌడీ షీట్లు తెరుస్తున్నాం. ఇందుకోసం ప్రతీ పోలీసు స్టేషన్‌లో రిజిస్ట్రీ ఉంటుంది.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం...

ఆమె కుమార్తెతో అసభ్య ప్రవర్తన -వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. శారీరక సంబంధం పెట్టుకోవడమే కాకుండా ఆమె కుమార్తె అయిన మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఖమ్మంకు చెందిన ఓ మహిళ భర్త, కుమార్తెతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చింది. అస్లాం అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. మహిళ, ఆమె భర్త మధ్య చిచ్చు పెట్టి మనస్పర్థలు వచ్చేలా చేసి దూరం ఉండేలా చేశాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మహిళతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. పెళ్లి చేసుకోకపోగా మహిళ కష్టపడి తెచ్చే డబ్బును తన విలాసాలకు వాడేవాడు. అంతే కాకుండా ఆమె కుమార్తె మైనర్‌పై పలుమార్లు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇటీవలె ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి తీసుకొని తనఖా పెట్టి వచ్చిన డబ్బుతో జల్సా చేస్తున్నాడు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ముఖం చాటేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొండను తవ్వుతున్న వాహనం సీజ్



బోడ గుట్టను తవ్వుతున్న హిటాచీ

తుర్కయంజాల్: అనుమతులు లేకుండా గుట్టను బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తిపైన అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌ఐ నిజాం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన బుధవారం రాగన్నగూడలో చోటుచేసుకుంది. తుర్కయంజాల్ రెవెన్యూ ప్రభుత్వ సర్వే నంబర్ 279లో నుంచి రోడ్డును వేసేందుకు కొందరు వ్యాపారులు, కొన్ని రోజులుగా బ్లాస్టింగ్ చేస్తూ బోడ గుట్టను తవ్వుతున్నారు. తాజాగా తిరిగి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం పనులను అడ్డుకుని వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం వాహనం యజమాని అంజిబాబుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మాట్లాడుతూ.. ఏ అనుమతులు లేకుండా నిబంధనలు పాటించకుండా బ్లాస్టింగ్ చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

నిండు ప్రాణం తీసిన 'నిద్రమత్తు'

- ట్రావెల్స్ బస్సు ఢీకొని 'రాంకీ' ఉద్యోగి దుర్మరణం
- 300 మీటర్లు ఈడ్చుకెళ్లిన బస్సు
- నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ఘటన..



రోడ్డుపై బైఠాయించిన రాంకీ సంస్థ సిబ్బంది



మృతుడు హరికృష్ణ (ఫైల్)

జీడిమెట్ల: ఆర్కే ట్రావెల్స్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ రిటైర్డు జవాను ప్రాణాలు కోల్పోయాడు. నిద్రమత్తులో డ్రైవ్ చేస్తూ ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఏకంగా 300 మీటర్ల దూరం బస్సుతో పాటు ఈడ్చుకెళ్లాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో బుధవారం ఉదయం కలకలం రేపడంతో పాటు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. యాప్రాల్‌కు చెందిన హరికృష్ణ(44) ఇండియన్ ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యారు. నాలుగు సంవత్సరాలుగా జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులోని రాంకీ డంపింగ్ యార్డులో సర్కిల్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం డ్యూటీ చేసేందుకు తన ద్విచక్ర వాహనంపై షాపూర్‌నగర్ చేరుకున్నాడు. అదే సమయంలో షాపూర్ నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జివద్ద వెనకనుండి వచ్చిన ఆర్కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు (టీఎస్08 యూడీ 9777) అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. బస్సు కిందపడిన హరికృష్ణను డ్రైవర్ ఆపకుండా వెళ్లడంతో సుమారు 300 మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. గమనించిన ఇతర వాహనదారులు కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును రోడ్డుపై నిలిపి పరారయ్యాడు. ఈఘటనలో తీవ్ర గాయాలైన హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాంకీ సంస్థలో పనిచేసే సిబ్బంది రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో బస్సు నడపడంతోనే ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. వారికి మద్దతుగా కార్మిక సంఘం నాయకులు కలుగజేసుకుని ఆర్కే సంస్థ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై సుమారు గంట పాటు సిబ్బంది బైఠాయించడంతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ, జీడిమెట్ల పోలీసులు కలుగజేసుకుని వారికి నచ్చజెప్పి పంపించారు. ఈఘటనపై మృతుని భార్య నాగూరి లక్ష్మి మునీశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'రీయింబర్స్‌మెంట్' విడుదల చేయాలి


ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ




ఇబ్రహీంపట్నం: స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల బతుకులు మారడంలేదని మండిపడ్డారు. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోందని దుయ్యబట్టారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువులకు సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. మూడేళ్లుగా రూ.7,500 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 15 లక్షల మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌పై ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారని గుర్తు చేశారు. అలాంటి విద్యార్థులను ఆదుకునేందుకు సకాలంలో నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కందాడి శ్రీరామ్, కళ్లెం సూర్యప్రకాశ్, డి.శివకృష్ణ, పయ్యాంశెట్టి జగదీశ్, రుద్రపాల మహేందర్, నవీన్, పవన్, చరణ్, ఆదర్శ్, శివ, కార్తీక్, రాజేశ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఉస్మాన్‌గంజ్‌లో..




మాసాబ్‌ట్యాంక్ రోడ్డులో వాహనాల బారులు



మెహిదీపట్నంలో కిక్కిరిసిన వాహనాలు

పండగ రద్దీ..ట్రాఫిక్‌తో కుస్తీ



లక్డీకాపూల్‌లో..



ఎంజే మార్కెట్ రోడ్డులో..



ఎంజే మార్కెట్‌లో రోడ్డుపక్కనే దుకాణాలు..



దీపావళి పండగ కొనుగోళ్లతో నగరం సందడిగా మారింది. బుధవారం జనం భారీ సంఖ్యలో బయటకు వచ్చారు. పూజలు, నోములకు కావాల్సిన పూలు, పండ్లు, గుమ్మడికాయలు, అలంకరణ వస్తువులు, బాణసంచా కొనుగోళ్ల కోసం జనం పోటీ పడ్డారు. ఈ రద్దీ కాస్త నగరవాసులకు చుక్కలు చూపించింది. మరీ ముఖ్యంగా సాయంత్రం వేళ విపరీతమైన రద్దీ కారణంగా అబిడ్స్, ఎంజే మార్కెట్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, కొత్తపేట, అమీర్‌పేట, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గంటల తరబడి వాహనాలు రోడ్లపై ఉండాల్సి వచ్చింది. ఫుట్‌పాత్‌లన్నీ ఆక్రమించడం, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడం, ఇష్టారీతిగా వాహనాలు పార్కు చేసినా పట్టించుకునే వారు లేక నగరం మొత్తం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. పండగ రద్దీ ఉంటుందని తెలిసినా ట్రాఫిక్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని నగరవాసులు విమర్శించారు.

– సాక్షి, సిటీబ్యూరో

సాక్షి క్లాసిఫైడ్స్

Education

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B -ఫార్మసీ, D.Ed (ఉర్దూ), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. *చివరి అవకాశం 8866977112 [HA-16426]

Real Estate

PLOT FOR SALE

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ హైవే బీబీనగర్ టౌన్, AIMS అతి సమీపంలో HMDA & RERA అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్లు కలవు. గే।।క।।, ఆల్ డె।।, స్పాట్ రిజి।।, బ్యాంక్ లోన్, ఫ్రీ సైట్ విజిట్. ఫోన్: 9989032598 [HA-44293]

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ।।గ।। 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 99085 66079 [B-107]

TO-LET

Luxury 2,040 Sft Duplex Villas for Rent. Cherlapally, near Railway Station. Enjoy Modern Amenities. Affordable Rent. Just 10-min drive from ECIL. 8555816048 [HA-841]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800515]

CHITS & DEPOSITS

కపిల్ చిట్స్‌లో ఒక లక్ష నుండి కోటి రూపాయల వరకు చిట్స్ కలవు మరియు పెండింగ్ చిట్స్ ఇప్పించబడును. సంప్ర: ఉపేందర్ రెడ్డి ఫోన్: 9705713305 [HA-2953]

PERSONAL CARE

OLD AGE HOME

వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783357]

TOURS & TRAVELS

కాశీ మహాక్షేత్రంలో కార్తీకమాసం నెల రోజులు ప్రతిరోజు మీ గోత్రనామాలతో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయబడును. ఫీజు.5116/-, Ph: 8341741748, 9394089225 [HA-33201]

సాయిటూర్స్ Nov-2 అష్టగణపతులు, భీమశంకర్, పరలి వైద్యనాథ్ త్రయంబకేశ్వర్, షిరిడీ. Nov-10 కాశీ 9 నిద్రలు అయోధ్య. Nov-26 కర్ణాటక టూర్. Dec-9 గుజరాత్ టూర్. 9848664831 [HA-1155]

Wanted

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్, జీ: 20K, Ph:8977639662, 8977639663 [SCA24000512]

లేడీ టెలికాలర్స్, టైపింగ్, కలెక్షన్స్, ఆ-బాయ్స్, న్యూస్ యాంకర్స్, డ్రైవర్లు, సూ।।వైజర్స్, హెల్పర్స్. జీ: 10K-18K ఫ్రీ హాస్టల్ Ph: 9505261777 [SCA24000516]

HYD చేవెళ్లలోని కాలేజ్‌లో ఉంటూ పనిచేయడానికి భార్యాభర్తలు కావలెను. జీ: 15000+ వసతి. ఫోన్ : 8919737607, 8328443702 [SCA24000529]

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253903]

అబ్దుల్లాపూర్‌మెట్, హట్టిగూడ, తట్టి అన్నారం, ప్రతాపసింగారం, రాంపల్లి, జవహర్ నగర్, అహ్మద్ గూడ, మురహరిపల్లి, తూంకుంట ఏరియాలలో సెక్యూరిటీ గార్డులు 8 గంటలు జీ: 13500/- మరియు 12 గంటలు జీ: 16500/-. డ్యూటీ చేయుటకు కావలెను. సంప్ర : 9246355129 [H-804879]

Required ARC/ TIG Welders for a Manufacturing Company at Autonagar, Guntur. Attractive Salary Package Available for Experienced Welders. Contact: 9063183834 [G-3252]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జాబ్‌పై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

స్వీట్ ప్రమిదలు..బాహుబలి డ్రైఫ్రూట్స్




బంజారాహిల్స్: భాగ్యనగరంలో దీపావళి పండగ శోభ కనిపిస్తోంది. టపాసులు, ప్రమిదలు, స్వీట్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రకరకాల వెరైటీల్లో స్వీట్స్ తయారు చేసి షాపుల్లో విక్రయిస్తున్నారు. అచ్చం ప్రమిదలను, క్రాకర్స్‌ను పోలిన స్వీట్లు ఈసారి ఆకట్టుకుంటున్నాయి. పలు దుకాణాల్లో దీపాలను తలపిస్తున్న స్వీట్లు విక్రయిస్తున్నారు. ఇక డ్రై ఫ్రూట్స్ గిఫ్టింగ్ కల్చర్ కూడా బాగా పెరిగింది. ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు స్వీట్లకు బదులు బాదం, కాజు, కిస్‌మిస్, పిస్తా తదితర డ్రై ఫ్రూట్స్‌తో కూడిన బాక్సులను కొనుగోలు చేసిన స్నేహితులు, బంధువులకు అందిస్తున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం కూడా ప్రత్యేకంగా స్వీట్లను అందుబాటులో ఉంచారు. సోమాజిగూడలోని బందన్ స్వీట్ షాప్ నిర్వాహకుడు సురేష్ డ్రై ఫ్రూట్, స్వీట్స్‌తో కూడిన బాహుబలి జంబో ప్యాక్‌ను తయారు చేశారు. ఇది కస్టమర్లను ఆకర్షిస్తోంది.



మార్కెట్లలో దీపావళి సందడి

బంజారాహిల్స్: దీపావళి సందర్భంగా మార్కెట్లలో కొనుగోళ్ల జోష్ కనిపించింది. మరో వైపు వాణిజ్య సముదాయాలు, జ్యువెల్లరీ షాప్‌లు విద్యుత్ కాంతులతో ధగధగలాడాయి. బంజారాహిల్స్, ఫిలింనగర్, అమీర్‌పేట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపుల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేశారు. నోములు, ప్రత్యేక పూజల సందర్భంగా మహిళలు పూజా సామగ్రి దుకాణాల వద్ద బారులు తీరారు.





సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సిద్ధం

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 6 నుంచి ప్రారంభం

- ఇప్పటికే సిబ్బందికి పూర్తయిన శిక్షణ
- 440 మంది సిబ్బంది, 20 మంది సూపర్‌వైజర్లు
- మొదటి మూడు రోజులు ఇంటి నెంబర్లు


శిక్షణకు హాజరైన సిబ్బంది


శిక్షణ ఇస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ఈనెల 6 నుంచి ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని రెండు కేంద్రాల్లో సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా సర్వే దరఖాస్తులను కూడా ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 440 మంది బీఎల్ఓలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు సర్వేలో పాల్గొననున్నారు. వీరిపై 20 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నారు. ఒక్కో సిబ్బంది 150 నుంచి 175 నివాసాలను సర్వే చేస్తారు. మొదటి దశలో మూడు రోజుల పాటు ప్రతీ ఇంటికి వెళ్లి ఇంటి నెంబర్ నమోదు చేసి స్టిక్కర్ అతికిస్తారు. రెండోదశలో నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభం కానున్నది. నియోజకవర్గంలో మొత్తం 1.20 లక్షల నివాసాల వివరాలు సేకరించనున్నారు.

ప్రశ్నావళితో సిబ్బంది..

సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నలను ప్రభుత్వం విడుదల చేసిన ఫారంలో పొందుపర్చారు. రెండు దశలుగా కుటుంబాల నుంచి వివరాలు సేకరించన్నట్లు ఈ ఫారాల ద్వారా తెలుస్తోంది. పార్ట్–1లో కుటుంబ యజమాని వివరాలతో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయనున్నారు. కుటుంబ సభ్యుల పేర్లతో పాటు యజమానితో ఉన్న సంబంధం, మతం, కులం, సామాజిక వర్గం, మాతృ భాష, ఆధార్ కార్డు వివరాలు సేకరించనున్నారు. వీటితో పాటుగా దివ్యాంగులు ఉంటే వారి సమాచారం, వైవాహిక స్థితి కూడా నమోదు చేసుకోనున్నారు. విద్యాభ్యాసానికి సంబంధించిన వివరాలను కూడా సేకరించడమే కాకుండా ఏ పాఠశాలలో విద్యనభ్యసించారు.. విద్యార్హతలు, ఏ మాధ్యమంలో చదివారు..వంటి వివరాలను కూడా నమోదు చేస్తారు. వార్షిక ఆదాయ వివరాలు, పన్నులు కడితే వాటి సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకుంటారు. అలాగే కుటుంబానికి ఉన్న భూముల వివరాలు, అప్పులు, ఎక్కడి నుంచి తీసుకున్నారు, పశువులు, రేషన్‌కార్డు నంబర్, ఇంటి వివరాలు కూడా తీసుకోనున్నారు. సర్వేను ఎలా చేపట్టాలో అధికారులు సంబంధిత సిబ్బందికి సూచించి సంబంధిత ప్రశ్నలను కూడా అందజేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 245 మంది బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ), ఆశ వర్కర్లు కూడా సర్వేలో పాల్గొననున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని 18 బస్తీల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరుతూ జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మాలయ అంబేద్కర్‌నగర్, రోడ్డునెంబర్–9 అంబేద్కర్‌నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డులో నూతనంగా సీసీ రోడ్లు వేయాలని కోరానన్నారు. స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీనిచ్చారు.

శ్మశానవాటికల్లో చెత్తాచెదారం తొలగింపు



వెంకటేశ్వరకాలనీ: దీపావళి సందర్భంగా శ్మశాన వాటికల్లో చెత్తాచెదారం పనులు పూర్తయ్యాయని వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి తెలిపారు. పంజగుట్ట హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యేటా స్థానికులు పెద్ద ఎత్తున వారి పూర్వీకుల సమాధుల వద్ద దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నాదని తెలిపారు. శ్మశాన వాటిక మొత్తం వీధి దీపాలు వెలిగేలా ఇప్పటికే లైట్లు మార్చామని తెలిపారు.

రిటైర్డు సిబ్బంది, అధికారులకు సన్మానం



బంజారాహిల్స్: హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందుతున్న 15 మంది అధికారులు, సిబ్బంది జూనియర్ ఏడీఓ ఉర్మిళ, జయప్రద, ఆఫీసు సూపరింటెంట్లను నగర సీపీ సీవీ ఆనంద్ బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు మీరు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్ : డివిజన్‌లోని ఆరోగ్యనగర్‌కు చెందిన ముదావత్ ఝూంప్లకు రూ 2 లక్షల 10 వేల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా సంబంధిత ఎల్‌ఓసీని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి బాధితుడికి బుధవారం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మన్సూర్, రవి, మన్సూర్, వేముల యాదగిరి, శంకర్, రవీందర్‌రెడ్డి, సింగారి శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే దానంకు వినతిపత్రం ఇస్తున్న మహిళా ప్రతినిధులు

ఫిలింనగర్: బీజేఆర్‌నగర్ బస్తీలో సమస్యలు, వసతులు కల్పించాలని కోరుతూ బస్తీ మహిళా సంఘాల సభ్యులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాల భవనం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాల పునః నిర్మాణం, బీజేఆర్‌నగర్‌లో ఫంక్షన్‌హాల్, మహిళా భవన్ నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి త్వరలోనే ఆయా వసతులను కల్పిస్తామని హామీనిచ్చారు.



సదర్ ఉత్సవాలకు రండి


మంత్రిని ఆహ్వానిస్తున్న నవయుగ యాదవ సంఘం సభ్యులు, కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి ప్రాంగణంలో నవంబర్ 1న నవయుగ యాదవ సంఘం, చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 7 గంటల నుంచి సదర్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎం.రాజుయాదవ్, మహేశ్‌యాదవ్, మల్లికార్జున్ యాదవ్, మధుకర్ యాదవ్, ప్రసాద్ యాదవ్, మనోజ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పెద్ద ఎత్తున సందర్శకులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

నేడు ఎల్లారెడ్డిగూడలో..


మాట్లాడుతున్న కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్, శ్రీనివాసయాదవ్

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలో శుక్రవారం సాయంత్రం సదర్ వేడుకలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత వనం శ్రీనివాసయాదవ్, నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రకటించడం హర్షణీయమన్నారు. నేతలు బోడ రాంచందర్, ముక్క వేణు, శరత్‌గౌడ్, ప్రసాద్ యాదవ్, అశోక్‌సింగ్, కృష్ణమోహన్, నితీశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: మహిళలను వేధిస్తున్న కేసులో జైలుకు వెళ్లివచ్చినా బుద్ధిమార్చుకోని వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లో నివాసం ఉండే తల్లీ కుమార్తెపై గతంలో ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి దాడి చేశాడు. తనతో శారీరకంగా ఉండాలంటూ బెదిరించాడు. ఈ ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు అతనిని అరెస్టు చేసి జైలుకు పంపారు. మంగళవారం జైలు నుంచి తిరిగొచ్చిన ఉమామహేశ్వరరావు రాత్రి సమయంలో ఇంట్లోకి వచ్చి మరోసారి అసభ్యంగా ప్రవర్తించాడు. తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోకపోతే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు తీసుకుని మహిళపై దాడి

వెంగళరావునగర్: హాస్టల్‌ను సబ్‌లీజుకు ఇప్పిస్తానని మహిళ నుంచి నగదు తీసుకుని అనంతరం ఆమెపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకృష్ణానగర్‌లో హాస్టల్ నిర్వహించే ఉమామహేశ్వరికి ఇటీవల మల్లేశ్ పరిచమయ్యాడు. ఎల్లారెడ్డిగూడలో బాయ్స్ హాస్టల్ ఉందని, రూ.50 వేలు ఇస్తే సబ్‌లీజుకు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ఉమామహేశ్వరి నగదు ఇచ్చి అగ్రిమెంట్ రాయించుకుంది. అయితే దానిని ఆమెకు ఇప్పించలేదు. హాస్టల్ వద్దకు వెళ్లగా దాని మెయింటనెన్స్ చూస్తున్న మల్లేశ్, రాము మద్యం సేవిస్తూ, పేకాడుతూ ఆమెను అసభ్య పదజాలంతో దూషించారు. హాస్టల్ ఇవ్వకపోతే నగదు తిరిగి ఇవ్వాలని కోరగా ఆమెపై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతుల్లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న వారిపై కేసు

వెంగళరావునగర్: అనుమల్లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న 10 మందిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. రహమత్‌నగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్నట్టుగా పీఎస్‌కు సమాచారం అందింది. దాంతో పోలీసులు వెళ్లి పరిశీలించగా పలు షాపుల ఎదుట, గదుల్లో టపాసులు విక్రయిస్తున్నారు. లైసెన్స్ లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న అఖిల్ అహ్మద్, నరేశ్, శివకుమార్, నవీన్‌కుమార్, అతిఖ్ అహ్మద్, శకుంతలరాణి, సలీం, అమర్‌దీప్, బల్జీత్‌సింగ్, మణెమ్మపై కేసు నమోదు చేసి ఆయా షాపుల్లోని 972 వివిధ రకాల క్రాకర్స్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణాసంచా కాల్చేసమయంలో జాగ్రత్తలు పాటించాలి



వెంగళరావునగర్ : పేలకుండా ఉన్న బాణాసంచాను తిరిగి తాగవద్దని, వాటికి మరోసారి నిప్పంటించడం చేయవద్దని ఫిల్మ్‌నగర్ ఫైర్ ఆఫీసర్ రమేశ్‌గౌడ్ సూచించారు. యూసుఫ్‌గూడ, జానకమ్మతోట తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించి స్థానికులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాసంచా కాల్చేసమయంలో తప్పనిసరిగా కాటన్ దుస్తులనే ధరించాలని, క్రాకర్స్‌తో ప్రయోగాలు చేయరాదని తెలిపారు. చేతితో పట్టుకుని కాల్చడం అత్యంత ప్రమాదకరమన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్ : భార్యతో పాటుగా పిల్లలను కులం పేరుతో దూషించి దాడిచేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం ప్రాంతానికి చెందిన మహిళకు అదే జిల్లాకు చెందిన వెంకటరావుతో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. అయితే మూడేళ్ల తర్వాత అతను భార్యపిల్లలను వదిలి వెళ్లిపోయాడు. ఇటీవల సురేశ్ అనే బ్రోకర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ మధురానగర్‌లో ఉంటున్న చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరరావును ఆర్యసమాజ్‌లో గత జులై 25న పెళ్లి చేసుకుంది. నెల తర్వాత వారానికోసారి ఇంటికి వస్తున్నాడు. ఇదేమని అడిగితే కోటేశ్వర్‌రావు కులం పేరుతో భార్యతో పాటు పిల్లలను దూషిస్తూ, దాడి చేస్తున్నాడు. అలాగే ఆమెతో తనకు సంబంధంలేదని ఇంటిని ఖాళీ చేయించాలని ఇంటి ఓనర్‌కు చెప్పాడు. దీంతో ఓనర్ ఇంటిని ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నాడు. అకారణంగా తనను, పిల్లలను దూషిస్తూ, దాడి చేస్తున్న కోటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ సమస్యలను పరిష్కరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు బుధవారం వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. రెగ్యులర్‌గా తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పీజీ విద్యార్థులకు పూర్తిగా ఇంగ్లిషలో మాట్లాడటం, రాయడంలో ప్రత్యేక శిక్షణ ఉచితంగా ఇవ్వాలని, నాన్‌నెట్ ఫెలోషిప్‌ల పునరుద్ధరణ, మెస్ బకాయిల రద్దు, విద్యార్థుల బీమాను తిరిగి ప్రారంభించాలని, 24 గంటలు లైబ్రరీని తెరిచి ఉంచి సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన విద్యార్థి వలిగొండ నరసింహతో పాటు శివశంకర్‌గౌడ్, వేదాంత మౌర్య, రవితేజ, అర్జున్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ విద్య కళాశాల (బీఈడీ కాలేజీ) ఆధ్వర్యంలో మూడు రోజులు దూరవిద్య కేంద్రంలో జరిగిన జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ప్రొ.మృణాళిని ఉద్యోగ విరమణ సందర్భంగా భారతీయ విజ్ఞాన వ్యవస్థ మూలాలు వాటి పునరుద్ధరణ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. అనంతరం బీఈడీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ.మృణాళిని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉర్దు వర్సిటీ వీసీ ప్రొ.సయ్యద్ అయినుల్ హసన్, ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలు

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో గల శ్రీసాయిసరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శిరీష భవానీశంకర్ పండుగ విశిష్టతను చిన్నారులకు వివరించారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. కాలుష్య రహితంగా దీపావళిని జరుపుకోవాలని, పటాకులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులు సందేశాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి హైస్కూల్లో..

రహమత్‌నగర్: యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ అమరావతి హైస్కూల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించి,


శ్రీసాయిసరస్వతీ విద్యానికేతన్‌లో చిన్నారులు

స్వీట్లు అందజే శారు. కార్యక్రమంలో లయన్ డా.ఆర్ సురేశ్, లయన్ వేణుగోపాల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్ టీం సెక్రటరీ లయన్ డా. ప్రఫుల్లారెడ్డి, హెచ్ఎం ప్రమోద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కార్ ది లైఫ్ స్కూల్లో..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నూతన దుస్తులు ధరించి, ఆటపాటలతో సందడి చేశారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను తెలియజేశారు.

ఆత్మకూరి రామారావు స్కూల్లో..

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో దీపావళి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు అదనపు కళను తీసుకువచ్చారు. అలాగే లక్ష్మీపూజ చేసిన అనంతరం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ పాల్గొన్నారు.


వేడుకల్లో లయన్ క్లబ్ ప్రతినిధులు


సంస్కార్ స్కూల్ చిన్నారులు..


బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో..

విద్యార్థుల డైసీ డేల్ ఫామ్ సందర్శన



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 1, 2 తరగతుల విద్యార్థులు 'డైసీ డేల్ ఫామ్'కి ఫీల్డ్ ట్రిప్‌కు వెళ్లారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను స్వయంగా చూసి తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. పిల్లలు ఉత్సాహంగా అక్కడి పచ్చికను జంతువులకు ఆహారంగా వేశారు. అలాగే ప్రత్యేకంగా రూపొందించిన ఇండోర్ ప్లే ఏరియాలో ఉత్సాహంగా ఆడుకున్నారు.

5న టీఆర్ఎఫ్ మొదటి వార్షికోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాస్

పంజగుట్ట: తెలంగాణ రియల్టర్స్ ఫోరం (టీఆర్ఎఫ్) మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 5న శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగామాగంలో నిర్వహించనున్నట్లు టీఆర్ఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానకార్యదర్శి ఎ.అరుణ్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు చట్టబద్ధత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఫోరం ఆధ్వర్యంలో ఏజెంట్లు కస్టమర్లతో ఎలా మాట్లాడాలి, అబద్దాలు చెపితే ఎలాంటి సమస్యలు వస్తాయి, ఎలా అమ్మకాలు చేయాలి అనే అంశాలపై వారికి అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో పెండ్యాల వెంకట రంగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు



శ్రీనగర్‌కాలనీ: సోమాజిగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. ఎల్లారెడ్డిగూడ, వడ్డెరబస్తీలో వాటర్‌వర్క్స్ డీజీఎం వాహిద్‌తో కలిసి పగిలిన పైప్‌లైన్ మరమ్మతులతో పాటు పలు పనులను బుధవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ నేత వనం శ్రీనివాసయాదవ్, వాటర్‌వర్క్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

'ఉర్దూ సాహిత్యం-మహిళలు' అంశంపై చర్చ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో బుధవారం '21 శతాబ్దపు సామాజిక, సాంస్కృతిక స్థితిగతులు-మహిళల ఉర్దూ సాహిత్యం' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'మనూ' మహిళా విద్యా విభాగం పర్యవేక్షణలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో 'మనూ' వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, మీరట్‌లోని చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీ ఉర్దూ విభాగం హెడ్ ప్రొఫెసర్ అస్లమ్ జెంషెడ్‌పూరి, న్యూఢిల్లీ బానత్ అధ్యక్షుడు డాక్టర్ నిగర్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు. ఉర్దూ సాహిత్యం కారణంగా మహిళల్లో వచ్చిన చైతన్యం, మార్పుల గురించి చర్చించారు.

సీబీఐటీలో 'యువ ఆరవ్ క్లబ్' ప్రారంభం


సీబీఐటీలో ఆరవ్ క్లబ్‌ను ప్రారంభించిన దృశ్యం

మణికొండ: గండిపేటలోని చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో సివిల్ సర్వీసెస్ ఔత్సాహికులకు యువ ఆరవ్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ సర్వీసెస్ మెంటర్ బాలలత మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో కూడిన అధ్యయనం ఉంటేనే దేశంలోని అత్యంత సవాల్‌తో కూడిన పరీక్షల్లో ఒకదానిలో విజయం సాధించగలుగుతారని అన్నారు. అలాంటి విద్యార్థులను ఈ క్లబ్ ప్రోత్సహించి సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. స్టూడెంట్ ఎఫైర్స్, ప్రోగ్రెషన్ డైరెక్టర్ బి.లింగారెడ్డి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్‌లో తమ కెరీర్‌ను మల్చుకునేందుకు విద్యార్థులు మరింత అంకితభావంతో చదవాల్సి ఉంటుందన్నారు. క్లబ్ ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ జీఎస్ఆర్.ప్రసాద్ యువ ఆరవ్ క్లబ్ లక్ష్యాలను వివరించారు. అధ్యాపకుడు రాధాకృష్ణ ప్రసాద్, క్లబ్ స్టూడెంట్ కో ఆర్డినేటర్ ఎల్.వైష్ణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్-2024ను విజయవంతం చేద్దాం


వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: త్వరలో జరిగే 'సీఎం కప్ 2024' క్రీడలపోటీలను విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని క్రీడాసంఘాలు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బుధవారం ఎల్‌బీ స్టేడియంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ పోటీల వల్ల గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తుందని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ బాలాదేవి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

4న మూసీ నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్ష సమావేశం

– ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



కవాడిగూడ: మూసీ నిర్వాసితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి నవంబర్ 4న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో అనేకమంది బడుగు, బలహీన వర్గాలవారు చాలా ఏళ్లుగా గుడిసెలు వేసుకొని, చిన్న, చిన్న ఇళ్లు కట్టుకొని కూలీనాలీ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చితే వారు రోడ్డున పడే ప్రమాదం ఉందని, శాశ్వత పునరావాసం కల్పించిన తర్వాతే మూసీ బాధితుల ఇండ్లు కూల్చాలని సూచించారు.

కేన్సర్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి

- అమెరికన్ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కత్తుల
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ


అమెరికన్ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ కత్తులను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి...

బంజారాహిల్స్: రాష్ట్రాన్ని కేన్సర్ రహిత రాష్ట్రంగా మార్చే ప్రక్రియలో మాతృభూమికి తన వంతు కృషి చేస్తానని అమెరికాలోని ప్రఖ్యాత కేన్సర్ వైద్య నిపుణులు, ఆపి అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల వెల్లడించారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రధానంగా కేన్సర్ వ్యాప్తికి గల కారణాలు, ప్రజల జీవన శైలిలో తీసుకురావాల్సిన మార్పులు, కేన్సర్, గుండెజబ్బుల నివారణకు ప్రభుత్వం అమలు చేయాల్సిన విధానాల గురించి అనేక సూచనలు చేశారు. ఆపి(అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్) రాష్ట్రంలో కొన్ని మెడికల్ కాలేజీలను దత్తత తీసుకుని కేన్సర్, గుండెపోట్ల గురించిన అవగాహన కల్పించేలా కార్యక్రమాలను రూపొందించడం గురించి కూడా చర్చించారు. ప్రాథమిక దశలోనే కేన్సర్లను, గుండెపోట్లను గుర్తించేలా స్క్రీనింగ్స్ నిరంతరం చేయడం, వాటిని బట్టి చికిత్సలు అందించడం ద్వారా ఈ వ్యాధులను అరికట్టడం సులభం అవుతుందని, ఆరోగ్యం కోసం చేస్తున్న ఖర్చులను కూడా ప్రజలు తగ్గించుకోవచ్చని డాక్టర్ సతీష్ వివరించినట్లు తెలిసింది.

పీజీ లాసెట్-2024 సీట్ల కేటాయింపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ పీజీ లాసెట్-2024 రెండవ, చివరి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను అధికారులు బుధవారం ప్రకటించారు. కౌన్సెలింగ్‌కు 1,406 మంది హాజరై వెబ్‌ఆప్షన్లు ఇవ్వగా 272 మందికి సీట్లు లభించినట్లు తెలిపారు. సీటు లభించిన విద్యార్థులు నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.


ఆపరేషన్ @ డ్రైనేజీ..!

జెట్టింగ్, ఎయిర్‌టెక్ యంత్రాలతో వ్యర్థాల తొలగింపు

మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్

- డీప్ పైప్‌లైన్ల డీసిల్ట్ కోసం బకెట్ క్లీనింగ్
- దారుషిఫాలో బ్యాక్ సీవరేజీ సమస్యకు పరిష్కారం
- సమస్య పరిష్కారానికి దిశను నిర్దేశిస్తున్న సీవరేజీ స్పెషల్ డ్రైవ్







వందశాతం మురుగు రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు జలమండలి చేపట్టిన 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌తో మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో సమస్యకు పరిష్కారం లభిస్తోంది. దీర్ఘకాలిక సమస్యలు కూడా ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా తక్షణమే పరిష్కారమవుతున్నాయి. మరికొన్ని కాలం చెల్లిన పైప్‌లైన్ల స్థానంలో కొత్త లైన్లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ వరకు జెట్టింగ్, ఎయిర్‌టెక్ మెషీన్లతో డీసిల్టింగ్ చేస్తూ సీవరేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతోంది. డీప్ మ్యాన్‌హోల్స్ పైప్‌లైన్ల డీసిల్టింగ్ బకెట్ క్లీనింగ్ ద్వారా సాగుతోంది. బయటికి తీసిన సిల్ట్‌ను సైతం 24 గంటలలోపు తరలించే విధంగా చర్యలు చేపడుతోంది. –సాక్షి, సిటీబ్యూరో

పైప్‌లైన్ రీమోడలింగ్ లేకుండానే....

పాతబస్తీ దారుషిఫా సెక్షన్‌లో ఏళ్ల తరబడి పురానా హవేలీ ఎక్స్ రోడ్ నుంచి దారుషిఫా గ్రౌండ్ వరకు గల సీవరేజీ ప్రధాన పైప్‌లైన్ సమస్యాత్మకంగా తయారైంది. పైప్‌లైన్‌లో మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట పడి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లడంతోపాటు సబ్‌లైన్ పూల్‌కు మసీదు, చెత్తబజార్ మార్గంలో మురుగునీరు బ్యాక్‌కు కొడుతుండటంతో ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రతరమైంది. దీంతో సీవరేజీ పైప్‌లైన్ రీమోడలింగ్‌కు స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సుమారు రూ.31 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు తయారు చేశారు. వరసగా ఎన్నికల కోడ్ అమలుతో ప్రతిపాదనలు పెండింగ్‌లో మగ్గుతూ వచ్చాయి. తాజాగా చార్మినార్ జీఎం కృష్ణ, డీజీఎం కిశోర్ దారుషిఫా గ్రౌండ్ నుంచి పురానాహవేలీ వరకు గల సీవరేజీ పైప్‌లైన్ ప్రధాన మార్గంలో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ చేపట్టారు. తవ్వకాలు జరపగా పురాతన 600 డయా మీటర్ల ప్రధాన పైప్‌లైన్‌లోని 14 ఫీట్ల డీప్ మ్యాన్‌హోల్ బయట పడింది. లోపలి భాగంలో ఇటుకలు పడిపోవడంతో ప్రధాన చానల్ బ్లాక్ అయింది. కింది నుంచి మురుగు ప్రవాహం ఆగిపోయింది. అధికారులు వాటిని తొలగించడంతో ఇరువైపుల నుంచి మురుగు పారుదల సాఫీగా సాగింది. ఎలాంటి ఖర్చు లేకుండానే దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైంది.



బ్రాంచ్‌లైన్ రంధ్రంతో..

డబీర్‌పురా కోమటివాడలో సైతం ప్రధానపైప్‌లైన్‌కు కలిసే బ్రాంచ్ పైప్‌లైన్ రంధ్రం పెద్దగా చేయడంతో దీర్ఘకాలిక సమస్యకు చెక్ పడింది. నిజాం కాలం నాటి 600 డయామీటర్ల ప్రధాన సీవరేజీ పైప్‌లైన్, 300 డయామీటర్ల బ్రాంచ్ పైప్‌లైన్లు ఉన్నాయి. అయితే మురుగు సాఫీగా సాగకుండా నిరంతరం వెనక్కి వెళ్తుండటంతో ఓవర్ ఫ్లో సమస్య సర్వసాధారణమైంది. తాజాగా సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్‌లో అధికారులు సమస్యను గుర్తించారు. ప్రధాన లైన్‌కు బ్రాంచ్ లైన్ కలిసే చోట రంధ్రాన్ని నాలుగు ఇంచుల నుంచి 14 ఇంచులకు పెంచడంతో మురుగు ప్రవాహం పెరిగింది. ఓవర్ ఫ్లో సమస్యకు తెరపడింది.

మెయిన్ రోడ్‌పై నాలుగేళ్ల సీవరేజీ సమస్యకు చెక్..

నిరంతరం రద్దీగా ఉంటే మాసబ్‌ట్యాంక్ రోడ్‌లోని ఏసీ గార్డ్స్ నుంచి పీటీఐ బిల్డింగ్-మెహిదీ ఫంక్షన్ హాల్, లక్డీకాపూల్ మెయిన్ రోడ్ వరకు నాలుగేళ్లుగా మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లో సమస్య వెంటాడుతోంది. ఈ నెల 5న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఏసీగార్డ్స్ టు లక్డీకాపూల్ ప్రాంతాన్ని పర్యటించి సీవరేజీ సమస్యను పరిశీలించారు. తాత్కాలికంగా రహదారిపై ఉన్న రెయిన్ వాటర్ డ్రైయిన్‌ను డీసిల్టింగ్ చేసి రోడ్డు మీద పారుతున్న మురుగును డ్రెయిన్‌కు మళ్లించాలని రెడ్‌హిల్స్ డీజీఎం సరితకు సూచించారు. శాశ్వత పరిష్కారంగా పైపులైన్ నిర్మాణం కోసం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా టన్నెలింగ్ ద్వారా విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఈ మేరకు మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ పైప్‌లైన్ల డీసిల్టింగ్ చేస్తుండగా మైనారిటీ గురుకుల పాఠశాల వద్ద జెట్టింగ్ మెషీన్ ముందుకు సాగలేదు. అక్కడ పరిశీలించగా పైప్‌లైన్‌లో డ్యామేజ్ అయినట్లు గుర్తించారు. తక్షణమే ఇతర శాఖల సమన్వయంతో రాత్రిపూట 15 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో నాలుగేళ్ల సీవరేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

మురుగు రహిత నగరమే ధ్యేయం



సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో సీవరేజీ సమస్యాత్మకమైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ పైప్‌లైన్ డీసిల్టింగ్ చేపడుతున్నాం. సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యకు గల ప్రధాన అడ్డంకులను గుర్తించగలుగుతున్నాం. కొన్ని ప్రాంతాల్లో ఎలాంటి అదనపు భారం లేకుండా సమస్యను పరిష్కరించగలుగుతున్నాం. మరికొన్ని కొత్త పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించాం. సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షల మేరకు వంద శాతం మురుగురహిత నగరంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి.
–అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

కులగణనపై బీఆర్ఎస్, బీజేపీ స్పందించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్


ప్రదీప్‌కుమార్‌కు నియామకపత్రం ఇస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

పంజగుట్ట: కులగణనలో తామూ భాగస్వాములమవుతామని ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు అనడం హర్షించదగ్గ విషయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కానీ, కులగణనపై ఇప్పటివరకు బీఆర్ఎస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంటనే అన్ని పార్టీలు కులగణనలో సంపూర్ణంగా భాగస్వాములమవుతామని ప్రకటించాలని, లేనిపక్షంలో బీసీల ద్రోహులుగా నిలిచిపోతారని అన్నారు. ఈ నెల 3వ తేదీన అన్ని బీసీ కుల సంఘాల నాయకులు, అఖిలపక్ష నేతలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్ 6వ తేదీ నుంచి 'ఓ బీసీ మేలుకో.. నీలెక్కలు తెలుసుకో' పేరుతో కులగణన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 రోజులపాటు ఆలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతీ నియోజకవర్గంలో యాత్ర సాగుతుందన్నారు. తీగల ప్రదీప్‌కుమార్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధికార ప్రతినిధిగా, బుర్ర సోమేశ్వర్‌గౌడ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా నియమించి, వారికి నియామక పత్రాలు అందించారు.

రేపట్నుంచి చిన జీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవాలు

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రం ఆవరణలో నవంబర్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు శ్రీ అహోబిల జీయర్‌స్వామి తెలిపారు. బుధవారం ఇక్కడ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జీయర్ పురస్కార ప్రదానం, సహస్ర కలశాభిషేకం ఉంటాయన్నారు. మొదటి రోజు జీయర్ పురస్కార సభ, సాయంత్రం ఆలయ మర్యాదలు ఉంటాయని తెలిపారు. రెండో తేదీన తీర్థగోష్టి, చిన్నారుల నృత్య ప్రదర్శన, 3న వేద సభ, గానహేల, 4న సహస్ర కలశాభిషేక మహోత్సవానికి అంకురార్పణ, 5న శ్రీ కోదండ రామచంద్రస్వామికి సహస్ర కలశాభిషేక మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.



'విశ్వబ్రాహ్మణులం కాదు, విశ్వకర్మలం'


అభివాదం చేస్తున్న సంఘం ప్రతినిధులు

కులగణనలో మార్పు చేయించాలన్న విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు సుంకోజు

పంజగుట్ట: రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతున్న నేపథ్యంలో సర్వే ఫారాల్లో విశ్వబ్రాహ్మణ అని కాకుండా విశ్వకర్మ అని నమోదు చేయించాలని రాష్ట్ర విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి పిలుపునిచ్చారు. దేశంలోని 27 రాష్ట్రాల్లో విశ్వకర్మలుగానే ఉన్నామని, కేవలం తెలుగు రాష్ట్రాల్లో విశ్వబ్రాహ్మణులని పిలుస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సంఘం గౌరవాధ్యక్షుడు కుందారం గణేష్‌చారి, ప్రధానకార్యదర్శి తాటికొండ శ్రీరాములుచారి, కోశాధికారి మెడోజు శంకరాచారితో కలిసి మాట్లాడారు. కులం దగ్గర విశ్వకర్మ అని రాయించి ఉపకులం దగ్గర ఎవరికి వారు కమ్మరి, వడ్రంగి, కంచర, శిల్పకారులు, స్వర్ణకారులని నమోదు చేయించాలని సూచించారు. విశ్వకర్మ సమాజానికి సరైన గుర్తింపు కోసం ఈ మార్పు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వడ్రంగి కర్రకోత మిషన్‌లు సీజ్ చేసి గుజరాతీయుల మిషన్లకు అనుమతించి తమకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తిరిగి వడ్రంగి కర్రకోత మిషన్‌లకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కమ్మరి, వడ్రంగి షాపులకు వంద శాతం ఉచిత విద్యుత్ ఇవ్వాలని, విధి నిర్వహణలో ప్రమాదాలకు గురయ్యే కమ్మరి, వడ్రంగి వృత్తిదారులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలని, ప్రమాదానికి గురై వైకల్యంతో పనిచేయలేనివారికి నెలకు 20 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతుబీమా తరహాలో విశ్వకర్మ బీమా పథకం అమలు చేయాలని కోరారు. సమావేశంలో యెర్రవల్లి బాలచారి, శ్రీనివాస్ చారి, గంధం రాములు పాల్గొన్నారు.

'డీఐజీ టీవీ ట్విట్టర్ పేజీ'పై చర్యలు తీసుకోవాలి



కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌లకు ఎయిడ్స్ ఉందని అబద్ధపు వార్తలు పోస్టు చేసిన డీఐజీ టీవీ ట్విట్టర్ పేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలు బుధవారం సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్‌ల ఇమేజ్‌కి డ్యామేజ్ చేయడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

భూ కేటాయింపు వద్దు..


నిరసనకు దిగిన అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి చెందిన పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్, ఉద్యోగ సంఘం మాజీ నాయకుడు కృష్ణ, జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డానం శ్రీనివాస్, చైర్‌పర్సన్ పల్లవీకాబ్డే, అవినాష్, కిశోర్, ప్రమీల కేతావత్, పరాంకుశం వెంకటరమణ, రవీంద్రనాథ్ సోలమన్, దయాకర్, ఎస్సీ వేణుగోపాల్, జేఏసీ నేతలు, అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని ఈఎమ్మార్సీ అండ్ పాటిరాజం లైబ్రరీ భవనం ముందు బైఠాయించారు.

జనం ఖుషీగా.. జర్నీ సాఫీగా..!

- రైల్వేస్టేషన్లలో రద్దీ నియంత్రణకు ఏర్పాట్లు
- కిక్కిరిసిపోతున్న రైళ్లు.. జనరల్ బోగీల వద్ద క్యూలైన్లు
- సికింద్రాబాద్, నాంపల్లి కాచిగూడ స్టేషన్లలో ఆర్‌పీఎఫ్ పటిష్ట భద్రత



సాక్షి, సిటీబ్యూరో: వెలుగుల పండుగను సొంతూళ్లలో సంతోషంగా జరుపుకునేందుకు జనం భారీగా తరలుతున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే రైళ్లన్నీ బుధవారం కిటకిటలాడాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో ప్రయాణికుల సందడి నెలకొంది. రిజర్వేషన్లు లభించని వేలాదిమంది జనరల్ బోగీల్లో కిక్కిరిసి బయలుదేరారు. మహిళలు, పిల్లలు, వయోధికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు చాలామంది ప్రయాణికులు మంగళవారం మధ్యాహ్నమే సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకొని రైళ్లలో సీట్లు దొరక్క బుధవారం బయలుదేరి వెళ్లారు. దీపావళి, ఛత్ పండుగలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. దీంతో నగరంలో నివసిస్తున్న బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, తదితర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఈసారి 850 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. కానీ, రద్దీ మేరకు రైళ్లు లేవని, రిజర్వేషన్ బోగీలు నెల రోజులు ముందే బుక్ అయిపోయాయని, డిమాండ్‌కు అనుగుణంగా జనరల్ బోగీలు లేవని, ఇబ్బంది పడాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. మరోవైపు రద్దీ నియంత్రణకు,


ప్రయాణం సాఫీగా సాగేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

జనరల్ బోగీల వద్ద క్యూలైన్లు

సాధారణ బోగీల వద్ద రద్దీ, తొక్కిసలాట చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. 60 మంది ఆర్‌పీఎఫ్ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రత్యేక ఏర్పాట్లపై సికింద్రాబాద్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బాలాజీకిరణ్, సికింద్రాబాద్ ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ చీఫ్ దేబస్మిత ఛటోపాధ్యాయలతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రయాణికులు స్టేషన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి రైలు ఎక్కే వరకు అవసరమైన సలహాలు, సూచనలను అందజేసేందుకు ప్రత్యేకంగా గైడ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు జనరల్ టికెట్ల విక్రయాల కోసం ప్రస్తుతం ఉన్న 14 కౌంటర్‌లతోపాటు మరో ఆరింటిని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. ఏటీవీఎంల ద్వారా కూడా ప్రయాణికులు టికెట్లు బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

భద్రత కట్టుదిట్టం

ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న దృష్ట్యా సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘాను బలోపేతం చేసినట్లు ఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారి దేబస్మిత తెలిపారు. గత 15 రోజుల్లో అపహరణకు గురైన 60 లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 54 మంది చిన్నారులను ట్రాఫికింగ్ బారి నుంచి కాపాడినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రయాణం చేయాలని, తాము అన్ని విధాలుగా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

బాణసంచా తరలిస్తే కఠిన చర్యలు

రైళ్లలో పేలుడు పదార్థాలు, టపాసులు, బాణసంచా వంటివి తరలిస్తే కఠినచర్యలు తీసుకోనున్నట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. రైల్వే చట్టంలోని సెక్షన్ 164, 165 ప్రకారం రూ.వెయ్యి జరిమానా విధించడంతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉన్నట్లు ఆయన హెచ్చరించారు.



పాసింగ్ అవుట్ పరేడ్‌కు రండి..

- సీఎం రేవంత్‌రెడ్డికి జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా విజ్ఞప్తి



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే నెలలో జరగనున్న జైళ్ల శాఖ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా హాజరుకావాలంటూ ఆ శాఖ ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, ఐజీలు వై.రాజేశ్, మురళి బాబు, డీఐజీ శ్రీనివాస్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఇటీవల జరిగిన నియామకాల్లో భాగంగా ఎంపికైన వంద మంది జైలు వార్డెన్లు వచ్చే నెలలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో వారి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు సీఎం రేవంత్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, చంచల్‌గూడ పాత పెట్రోల్ పంప్ పక్కన నూతనంగా నిర్మించిన మరో పెట్రోల్‌బంక్ ప్రారంభోత్సవానికి కూడా హాజరుకావాలని కోరినట్లు సమాచారం.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 31, అక్టోబర్, 2024



ట్రీట్‌మెంట్ జరూరీహై..

- ఎంఎస్ ధోని

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ వైద్య పరికరాల తయారీ కంపెనీ మెరిల్ పలు రకాల వ్యాధులతో పోరాడుతున్న వారికి సహకరించేందుకు వైవిధ్యభరిత ప్రచారాన్ని చేపట్టింది. ఈ వివరాలను సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ట్రీట్‌మెంట్ జరూరీ హై అనే పేరుతో సాగే ఈ ప్రచారంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అనుసంధానం అవుతుందని, రోగులు, వ్యాధిగ్రస్తులకు ఉన్న భయాలను పారదోలడంతో పాటు సమయోచితంగా చికిత్స తీసుకోవడంపై వ్యక్తిగతంగా వీడియో సందేశాలను పంపడం ద్వారా అవగాహన కలిగిస్తుందని, ఈ ప్రచారంలో ప్రముఖ క్రికెటర్ ఎంఎస్ ధోని పాలుపంచుకుంటున్నారని వివరించారు.





ఆల్ టైమ్ ఫేవరెట్.. హైదరాబాద్

- నగరంతో అనుభూతులు పంచుకున్న ప్రో కబడ్డీ లీగ్ గుజరాత్ జెయింట్స్ టీమ్
- నాలెడ్జ్ సిటీ రోడ్‌లోని డిస్ట్రిక్ట్ 150 వేదికగా దీపావళి సందడి
- పాయింట్లు పెంచుకుని కప్ గెలవడమే లక్ష్యం: ఆల్ రౌండర్ జితేందర్ యాదవ్

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి పండుగ సమయంలో హైదరాబాద్‌లో ఉండటం సంతోషంగా ఉందని, ఇక్కడికి ఎవరు వచ్చినా సొంత ప్రాంతానికి వచ్చిన అనుభూతి కలుగుతుందని ప్రో కబడ్డీ లీగ్‌కు చెందిన గుజరాత్ జెయింట్స్ కబడ్డీ ప్లేయర్ జితేందర్ యాదవ్ తెలిపారు. దీపావళి నేపథ్యంలో నాలెడ్జ్ సిటీ రోడ్‌లోని డిస్ట్రిక్ట్ 150 వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుజరాత్ జెయింట్స్ క్రీడాకారులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఆల్ రౌండర్ జితేందర్ యాదవ్ మాట్లాడుతూ.. నగరంలో మరో మూడు మ్యాచ్‌లు ఉన్నాయి. వాటిలో మంచి ప్రదర్శనతో టాప్‌లోకి వెళ్లడానికి ప్రాక్టీస్ పెంచామని అన్నారు. అదానీ స్పోర్ట్స్ లైన్ యాజమాన్యంలోని తమ జట్టు సిటీలో నవంబర్ 4న పుణెరి పల్టాన్, నవంబర్ 7న హర్యానా స్టీలర్స్‌తో జరిగే పీకేఎల్ పోటీల్లో పాయింట్ల సంఖ్య పెంచుకుని 2వ దశ ప్రో కబడ్డీ లీగ్ కోసం నోయిడా వెళ్లనున్నామని తెలిపారు. ఈ దశలో అత్యధిక పాయింట్లతో పీకేఎల్ కప్ గెలవడమే లక్ష్యమని పేర్కొన్నారు. మ్యాచ్‌లకు మధ్య కాస్త సమయంలో హైదరాబాద్ మంచి అనుభూతులను అందించిందని, ముఖ్యంగా ఇక్కడి చాయ్ టేస్ట్ మరెక్కడా లభించదని కితాబిచ్చారు. కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ 150 వేదికగా జట్టు క్రీడాకారులంతా దీపావళి వేడుకల్లో పాల్గొని, నగరవాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐకేర్ @ 31



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టొయోటా కిర్లోస్కర్ మోటార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమం ఐకేర్ (ఐ కమ్యూనిటీ యాక్షన్ టూ రీచ్ ఎవ్రీవన్) 31కి చేరుకుందని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. పలువురు స్వచ్ఛంద సేవకులు, ఉద్యోగులు, విద్యార్థులను భాగస్వాముల్ని చేసి నిర్వహిస్తున్న ఈ ఐకేర్‌లో భాగంగా వరల్డ్ స్టూడెంట్స్ మంత్‌ను పురస్కరించుకుని, ఇటీవల ఒక ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను మెరుగుపరచడం, అక్కడ పాఠశాల బెంచీలను రిపేర్ చేయడం క్లాస్ రూమ్ ఫర్నిచర్‌ను శుభ్రపరచడం వంటి సేవలు నిర్వహించామని వివరించారు.

దీపావళి వేళ టపాసులకు ఫుల్ డిమాండ్

ఇప్పటికే భారీగా వెలిసిన టపాసుల షాపులు



బీ కేర్‌ఫుల్!

జాగ్రత్తలు పాటిస్తే సంతోషంగా దీపావళి

నగరంలో దీపావళి సందడి మొదలైంది. అన్ని ప్రాంతాలు పండుగ కళను సంతరించుకున్నాయి. దీపావళి పండుగ అంటేనే దీపాలు, మిఠాయిలు, టపాసులు.. ముఖ్యంగా దీపావళికి టపాసులు కాల్చకపోతే ఏదో వెలితిగా ఫీల్ అవుతుంటారు. అందుకే చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు దీపావళి వేళ టపాసులు పేలుస్తుంటారు. అయితే టపాసులు కాల్చేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకుని టపాసులు కాలిస్తే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. నిప్పు రవ్వలు కంట్లో పడితే దృష్టి లోపం వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి ప్రాథమిక చికిత్స తీసుకోవాలి.. తదితర అంశాలపై ప్రత్యేక కథనం..

- సాక్షి, సిటీబ్యూరో





చేయాల్సినవి..

- కచ్చితంగా లైసెన్స్ ఉన్న టపాసులు మాత్రమే కొనుగోలు చేయాలి. వాటిని రెండు రోజులు ఎండబెట్టాలి.
- టపాసులు పిల్లలకు అందకుండా అట్ట డబ్బాల్లో భద్రపరచాలి. గ్యాస్ సిలిండర్ లేదా నూనె డబ్బాల వంటి మండే స్వభావం ఉండే వస్తువులకు దూరంగా ఉంచాలి.
- పిల్లలు టపాసులతో ఆడుకునేటప్పుడు పెద్దలు ఎప్పుడూ ఓ కన్నేసి ఉండాలి.
- ఒక వ్యక్తి ఒక్కసారి ఒకే టపాకాయ వెలిగించేలా చూడాలి. మిగిలిన వారు దూరంగా ఉండి చూస్తుండాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే టపాకాయలను పేల్చాలి.
- పేల్చడానికి పొడవైన కొవ్వొత్తి లేదా కాకర పువ్వొత్తిని ఉపయోగించండి.
- ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి వీలుగా రెండు బకెట్ల నీటిని దగ్గరలో ఉంచుకోవాలి.
- వ్యక్తికి తీవ్రమైన కాలిన గాయాలైతే వెంటనే శుభ్రమైన దుప్పటితో చుట్టి ఆస్పత్రికి వెంటనే తీసుకెళ్లాలి.
- టపాకాయలు కాల్చేటప్పుడు ఎప్పుడూ నల్ల కళ్లద్దాలు పెట్టుకోవడం మంచిది.

చేయకూడనివి..

- చేతిలో పట్టుకుని ఉన్నప్పుడు టపాసులు వెలిగించకండి.
- వంగి టపాసులు వెలిగించొద్దు..
- టపాసులను సీసాలు, రేకు డబ్బాలు లేదా బోర్లించిన కుండ వంటి పాత్రల్లో పెట్టి వెలిగించకండి. ఇది చాలా ప్రమాదకరం కావచ్చు.
- వెలగని వాటి దగ్గరకు వెళ్లేముందు కొంతసేపు ఆగండి.
- మిగిలిపోయిన వాటిని సేకరించి, మీ సొంతంగా టపాసులు తయారు చేసేందుకు ప్రయత్నించవద్దు.
- వెలుగుతున్న కొవ్వొత్తులు, దీపాలు లేదా అగరబత్తుల నుంచి టపాసులను దూరంగా ఉంచండి.
- టపాకాయలు వెలిగించే సమయంలో సింథటిక్ బట్టలు వేసుకోకండి.. మందంగా ఉన్న నూలు దుస్తులు ధరించండి.
- దుస్తులను కాస్త బిగుతుగా ఉండేలా వేసుకోవాలి. వదులుగా ఉన్న దుస్తులు ప్రమాదకరం కావొచ్చు. కచ్చితంగా షూస్ వేసుకుంటే మంచిది. మెడలో వేలాడే వాటిని వేసుకోవద్దు.
- భారీ గాలి వీస్తే బాణసంచా కాల్చవద్దు. కాలినచోట క్రీమ్ లేదా ఆయింట్‌మెంట్ లేదా నూనె పూయకూడదు.





పెద్దల పర్యవేక్షణలోనే..

టపాసులు కాల్చే సమయంలో వచ్చే శబ్దం కారణంగా చిన్న పిల్లలకు తీవ్ర ఇబ్బందులు వస్తుంటాయి. పిల్లలు శబ్దాలకు చాలా సెన్సిటివ్‌గా ఉంటారు. వారికి వినికిడి సమస్యలు రాకుండా ఉండేందుకు చెవుల్లో ఏదైనా ప్లగ్స్ వంటివి పెట్టాలి. దీంతో చెవులకు హాని కలగకుండా ఉంటుంది. - డాక్టర్ గౌతమి, పీడియాట్రీషియన్



జాగ్రత్తలు తీసుకోవాలి

టపాసులు కాల్చే సమయంలో కంటికి ఏమీ జరగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కంటికి ఎలాంటి హాని జరగకుండా ఉండేందుకు నల్లటి కళ్లద్దాలు ధరించాలి. కంటికి గాయమైతే చల్లటి నీటితో కడగాలి. గాయం తీవ్రమైతే వైద్యుడిని సంప్రదించాలి. - డాక్టర్ శాలినీ సింగ్, అప్తల్మాలజిస్టు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి



పొగతో సమస్యలు

బాణాసంచా పేల్చే సమయంలో వెలువడే పొగతో శ్వాసకోశ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. శ్వాస సంబంధ వ్యాధులు ఉన్న వారు బాణసంచా కాల్చకపోతే మంచిది. అలాంటివారు కాల్చే ప్రదేశానికి వెళ్లకపోవడం ఉత్తమం. శ్వాస వేగంగా వస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. - డాక్టర్ విక్రమ్ కొదురుపాక, జనరల్ ఫిజీషియన్

కంటికి గాయమైతే చేయాల్సినవి..

- గాయపడిన వ్యక్తిని వీలైనంత త్వరగా కంటి వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.
- కంటిలో ఏదైనా నలుసు ఉన్నట్టు అనిపిస్తే శుభ్రమైన నీరు లేదా సెలైన్ ద్రావణంతో సుతారంగా కడగాలి. వేరే ఏ ఇతర పదార్థాలను వాడకూడదు.
- గాయం తీవ్రం కాకుండా ఉండేందుకు శుభ్రమైన పొడి బట్టతో మెత్తగా పట్టుకోవాలి.
- గాయమైన తర్వాత కంటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకుండా మూసి ఉంచాలి.

కంటికి గాయమైతే చేయకూడనివి..

- గాయమైన కంటిపై ఎలాంటి ఒత్తిడి ఉంచకూడదు. దానివల్ల గాయం మరింత తీవ్రం కావొచ్చు.
- గాయమైన కంటిని ఎట్టిపరిస్థితుల్లోనూ ముట్టుకోవద్దు. అసలు నలపొద్దు.
- డాక్టర్ల సలహా లేకుండా ఇంట్లోనే ఏదో సొంత వైద్యం చేయకూడదు.
- కంట్లో ఏదైనా పదార్థాలు పడినట్లు అనిపిస్తే మీ సొంతంగా వాటిని తీసే ప్రయత్నం చేయవద్దు.
- గాయం చిన్నదైనా.. పెద్దదైనా వైద్యుడి దగ్గరికి వెళ్లే విషయంలో అలసత్వం వహించొద్దు.
- కంటికి గాయమైన వ్యక్తి ఎంత అత్యవసరమైనా సరే సొంతంగా వాహనం నడపకూడదు.
- కంట్లో తీవ్రమైన నొప్పి, చూపులో మార్పులు, రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



దశాబ్దం క్రితం వినాయక చవితికి మట్టి గణపతులను వినియోగించడం అంటే విచిత్రంగా చూసేవారు.. ఆ తర్వాత మట్టి గణపతులు నగరంలో ఎంతగా ఆదరణకు నోచుకున్నాయో తెలిసిందే. అదేవిధంగా పర్యావరణ హిత దీపావళి కూడా నగరంలో అనేక మందికి అనుసరణీయంగా మారుతోంది. శబ్ద, వాయు కాలుష్యాలతో అనేక రకాలుగా తమ ఆరోగ్యానికి కలిగించే హానిపై పెరిగిన అవగాహన ఎకో ఫ్రెండ్లీ ఫెస్టివల్‌ని ఎంచుకునేలా చేస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

పండుగ సంబరం పర్యావరణ హితం



నగరంలో ఎకో ఫ్రెండ్లీ దీపావళికి జై

- పర్యావరణ హిత ఉత్పత్తులకు ప్రాధాన్యం
- గ్రీన్‌క్రాకర్స్, దియాస్, ఆర్గానిక్ గిఫ్ట్‌లకు గిరాకీ
- ఫలిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రచారం

ఇళ్లను విద్యుత్ లైట్లతో వెలగించడం తగ్గిపోతోంది. చాలామంది ఇప్పుడు తమ ఇళ్లను మట్టితో తయారైన దియాలతో వెలిగిస్తున్నారు. ఇవి సేంద్రీయమైనవి మాత్రమే కాకుండా సంప్రదాయంగా నిజమైన దీపావళికి అర్థాన్ని చెబుతాయి. అంతేకాదు వీటి వినియోగం వల్ల ఈ మట్టి దియాలను తయారు చేయడంపై ఆధారపడి జీవిస్తున్న వారికి కూడా ప్రయోజనం చేకూరుతుందనే భావన దియాల పట్ల ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ పండుగ సందర్భంగా వెలిగించే లైట్ల విషయంలోనూ.. ఫ్లోరోసెంట్ లైటింగ్ కంటే ఎల్ఇడి బల్బులు ఎక్కువ సామర్థ్యం కలిగినవి మాత్రమే కాకుండా పర్యావరణ అనుకూలమైనవనే అవగాహన వచ్చింది. అవి తక్కువ విద్యుత్‌ను ఖర్చు చేయడంతో పాటు అవుట్‌డోర్, ఇండోర్ ప్రదేశాలకు మెరుపును ఇస్తాయని, ఎటువంటి ఉద్గారాలను ఉత్పత్తి చేయవని బంజారాహిల్స్ నివాసి ఉపేంద అన్నారు.

గిఫ్ట్ ఫర్ నేచర్..

ప్రియమైన వారి కోసం అందించే ప్రత్యేక బహుమతులు ఎప్పటికీ అమూల్యమే. అయితే వాటికి చెల్లించే మూల్యం భావితరాల భవిష్యత్తు కాకూడదు. ఈ ఆలోచన ప్లాస్టిక్‌తో తయారైన ఎలక్ట్రానిక్స్ ఇతర బహుమతుల వినియోగాన్ని నియంత్రిస్తోంది. ఇప్పుడు.. దీపావళి బహుమతులుగా చాలా మంది సహజ పదార్థాలైన వస్త్రం లేదా జనపనారతో తయారు చేసిన వాటిని ఎంచుకుంటున్నారు. రీసైకిల్ చేసిన పదార్థాలు, సేంద్రీయ ఉత్పత్తులు ఆర్గానిక్ గిఫ్ట్ ఐటమ్స్ బహుమతులుగా ఇస్తున్నారు. పలువురు మొక్కలు కూడా దీపావళికి గొప్ప కానుకలుగా ఇచ్చి పుచ్చుకుంటున్నారు.

క్రాకర్స్.. నో ప్రాబ్లమ్స్..

నగరంలో ఇప్పుడు చాలా మంది పర్యావరణ అనుకూల క్రాకర్లను కొనుగోలు చేస్తున్నారు. అవి రీసైకిల్ కాగితంతో తయారు చేస్తున్నారు. తక్కువ పొగ కాలుష్యాన్ని కలిగిస్తాయి. చాలాచోట్ల ఇలాంటివి ప్రత్యేకంగా అడిగి మరీ సిటిజనులు కొనుగోలు చేస్తుండటం కనిపిస్తోంది.



చెడును నిర్మూలించడమే..

మా తాతల కాలంలో ఈ సీజన్‌లో దోమలను పారదోలడానికి సహజమైన ఉత్పత్తులు వాడి పొగ వచ్చేలా చేసి వీధుల్లో తిరుగుతుండేవారట.. అంతే తప్ప ఇలా క్రాకర్స్ కాల్చడం అవీ లేవట. చిన్నతనంలో నేనూ క్రాకర్స్ కాల్చినా.. తర్వాత ఆ అలవాటును తగ్గించేసుకున్నాను. దీపావళి పండుగ పరమార్థమే మనలోని రాక్షస గుణాన్ని అంటే చెడును చంపడం.. భావితరాలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్న కాలుష్య కారకాల్ని పెంచే అలవాటును చంపడం కూడా అలాంటిదే. అందుకే నేను దీపావళికి పూజ చేస్తాను.. స్వీట్స్ తయారు చేస్తా.. తప్ప క్రాకర్స్ కాల్చను. ఇంట్లో లైట్స్ మొత్తం ఆఫ్ చేసేసి మట్టి దీపాలను వెలిగిస్తాను. పువ్వులతో ఇల్లంతా అలంకరిస్తాను. నేను ఈ పండుగకు అందించే బహుమతులు కూడా ఎకో ఫ్రెండ్లీగానే ఉంటాయి.

- మేఘనా మనునూరి, చైర్‌పర్సన్ ఫౌంటైన్‌హెడ్ గ్లోబల్ స్కూల్

సహజమైన రంగులతో..

దీపావళికి ఇంటి ముంగిట, ఇంట్లోనూ కొలువుదీరే రంగోలిలో రసాయనాల కృత్రిమ రంగులకు బదులుగా సహజ రంగులను వాడుతున్నారు. కుంకుడు, పసుపు కాఫీ పొడిని రంగుగా ఉపయోగిస్తున్నారు. ఇవి కేవలం రంగుగా మాత్రమే కాదు తర్వాత వాటిని కంపోస్ట్ చేయడం ద్వారా కూడా సులభంగా పారవేయవచ్చు. అలాగే అందులో ఉంచేందుకు ప్రకృతి ప్రసాదిత బంతి పువ్వులు, గులాబీలు, ఆకులు పువ్వులను ఎంచుకుంటున్నారు.

సిటిజనులేమంటున్నారంటే..

'దీపావళికి స్నేహితులు కుటుంబ సభ్యులు కలుస్తాం.. ఇంటిని డీప్ క్లీనింగ్ చేయిస్తాం.. రంగోలీ తయారు చేస్తాం. సంపూర్ణమైన సంప్రదాయ దీపావళిని చేసుకుంటాం' అని చెబుతున్నారు నగరానికి చెందిన ప్రసిద్ధ శాస్త్రీయ నృత్య కళాకారిణి పద్మశ్రీ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఆనంద శంకర్ జయంత్, 'ఇంట్లోనే స్వీట్లను తయారు చేస్తాం. దియాలను వెలిగించడం, పిల్లలు, తల్లిదండ్రులు, స్నేహితులు కొన్ని గ్రీన్ క్రాకర్లు పేల్చడం ఈ రోజు స్పెషల్' అని రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ కావా డిజైన్ స్టూడియో వ్యవస్థాపకులు కల్పనా రమేష్ అంటున్నారు. 'అలంకరణ కోసం బంతిపూలు, మామిడి ఆకులతో సాత్వికమైన రీతిలో జరుపుకుంటాం. మట్టి దీపాలను సైతం చాలా తక్కువ వెలిగిస్తాం. పాలు పంచదారతో కూడిన ఫేనీ తప్పనిసరిగా ఉండాలి. ఇక క్రాకర్స్‌కు మాత్రం పూర్తిగా మేం నో చెప్పేశాం' అని ఒరాకిల్ ఇండియా ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ మేనేజర్ మనోజ్ఞరెడ్డి అంటున్నారు. 'కొన్ని సాధారణ దియాలు సోలార్ లైట్లు, స్వీట్లకు బదులుగా పొరుగువారికి మొక్కల పంపిణీ, అదే మా సింపుల్ ఫెస్టివల్ అంటున్న ఈ నగరవాసి మాటలు అందరికీ అనుసరణీయమే..


నల్లగొండలో జలమయమైన ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రం

వర్షపు నీటిలో ధాన్యపు రాశులు

రామన్నపేట/నల్లగొండ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా, నల్లగొండ జిల్లా బుధవారం కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం తడిసిపోయింది. భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసిపోయింది. రామన్నపేట వ్యవసాయమార్కెట్‌లో సీసీ ప్లాట్‌ఫారంపై పోసిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. ఇక నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలో కురిసిన భారీ వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఆర్జాలబావిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం జలమయమైంది. ఖాజీరామారం, కొత్తపల్లి సెంటర్లలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పినప్పటికి గాలి, ధాన్యం బస్తాల కిందకు వర్షపు నీరు చేరి తడిశాయి. ధాన్యపు రాసుల మధ్య చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు రైతులు రాత్రి సమయంలో తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

మెడికల్ పీజీ కోర్సులకు నేటి నుంచే దరఖాస్తులు

- అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ
- దరఖాస్తులు ముగిశాక దశలవారీగా కౌన్సెలింగ్
- అల్లోపతి, ఆయుర్వేద, హోమియో కోర్సులకు అడ్మిషన్లు
- జాతీయ కోటా పోగా మిగతా సీట్లన్నీ తెలంగాణ వాసులకే..
- నిబంధనలు, అర్హత వివరాలను వెల్లడించిన విశ్వవిద్యాలయం
- ఆయుర్వేద, హోమియో, యునాని ఎండీ కోర్సుల్లో ప్రవేశాలకూ నోటిఫికేషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎట్టకేలకు మెడికల్ పీజీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2024–25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. కాళోజీ వర్సిటీకి, నిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో దీనిద్వారా సీట్లను భర్తీ చేస్తారు. నీట్ పీజీ–2024లో అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గురువారం (31–10–2024) ఉదయం 6 గంటల నుంచి వచ్చే నెల ఏడో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు. స్కాన్‌చేసిన సర్టిఫికెట్లను https://tspgmed.tsche.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. రాష్ట్ర స్థాయి మెరిట్‌ను నిర్ణయించి కన్వీనర్ కోటా అడ్మిషన్లను చేపడతారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన అన్ని సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాత.. తాత్కాలిక తుది మెరిట్ జాబితా ప్రదర్శిస్తారు. పీజీ మెడికల్ కోర్సుల కోసం నీట్ పీజీ–2024 పరీక్షలో కటాఫ్ స్కోర్‌గా.. ఓపెన్ కేటగిరీకి 50 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 పర్సంటైల్, ఓసీల్లో వైకల్యం ఉన్నవారికి 45 పర్సంటైల్‌ను ఖరారు చేశారు. కాగా.. ఎండీ ఆయుర్వేద, హోమియో, యునానీ కోర్సుల్లో ప్రవేశాలకు కూడా నోటిఫికేషన్లు జారీచేశారు. వాటికి బుధవారం సాయంత్రం 4 గంటల నుంచే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఏపీజీఈటీ–2024 పరీక్షలో అర్హత సాధించినవారు ఈ మూడు కోర్సుల్లో చేరేందుకు అర్హులు.

నోటిఫికేషన్‌లోని ముఖ్యాంశాలివీ..

- అభ్యర్థులు స్థానికులై ఉండాలి. అంటే ఇప్పటివరకు వరుసగా నాలుగు సంవత్సరాలకు తక్కువ కాకుండా తెలంగాణలో చదివి ఉండాలి. అలాగే విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివిన తెలంగాణ విద్యార్థులను కూడా ఇక్కడి స్థానికులుగానే భావిస్తారు.
- తెలంగాణలో ఇప్పటివరకు అంచనా వేసిన ప్రకారం.. 26 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2,800 పీజీ మెడికల్ సీట్లున్నాయి. అందులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లలో 50శాతం జాతీయ కోటా కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. మిగతా సీట్లను తెలంగాణ స్థానికులకు కేటాయిస్తారు.
- తెలంగాణలో స్థానికేతర కోటా కింద ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు స్థానికత వర్తించదు.
- ఎంబీబీఎస్ పూర్తి చేసినవారు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి, లేదా అంతకుముందే ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి.
- ఇన్–సర్వీస్ కోటా అభ్యర్థుల విషయంలో.. ప్రభుత్వంలో వారు చేసిన ఉద్యోగాన్ని గత నెల 30వ తేదీ వరకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఇతర రాష్ట్రాల అభ్యర్థులు కన్వీనర్ కోటా సీట్లకు అర్హులు కారు.
- పీజీ, డిప్లొమా కోర్సులకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు కలిపి ఓసీ, బీసీలు రూ.5,500, ఎస్సీలు రూ.5 వేలు చెల్లించాలి.
- ఆయా కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన వెబ్ ఆప్షన్ల తేదీలను త్వరలో వెబ్‌సైట్లో వెల్లడిస్తారు.
- నీట్ పీజీ పరీక్షలో కటాఫ్ స్కోర్ కంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
- దరఖాస్తుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే.. 9392685856, 7842136688, 9059672216 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా knrpgadmissions@gmail.com కు ఈ–మెయిల్ చేయవచ్చు.

TELANGANA TECHNOLOGY SERVICES LTD.

Tender call notice for "Procurement of Servers and Renewal of VM Ware Licenses for Telangana State Data Center, ITE&C Department"
Time schedule of various tender related events:-

Bid Calling date	30-10-2024
Due date and time for Pre Bid clarifications if any, by Email	01-11-2024, @ 04:00 PM
Bid Closing date/time	08-11-2024, 3:00 PM
Bid Document Fee	Rs.25,000/- in favour of MD, TGTSL
Email id's	mngdirector-tgts@telangana.gov.in srinivasrao.t@gov.in bvrao-tgts-ts@telangana.gov.in avrnreddy-tgts@telangana.gov.in
Tender Reference No.	TGTS/IP/3467/SDC/VMWARE/2024

For further details regarding detailed Tender Notification and specifications please visit http://www.tgts.telangana.gov.in/www.tender.telangana.gov.in
Sd/- Managing Director, Telangana Technology Services Ltd.
DIPR RO No.6059-PP/CL/Advt/1/2024-25, Dt. 30.10.2024

సబ్ రిజిస్ట్రార్‌కు 'అసైన్డ్' రిజిస్ట్రేషన్ హక్కు లేదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే హక్కు సబ్ రిజిస్ట్రార్‌కు లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ అంశంపై పూర్తి విచారణ చేపట్టి.. నాలుగు వారాల్లో నివేదిక అందజేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, మంచిర్యాల కలెక్టర్, ఆర్డీవో, కాసిపేట్ తహసీల్దార్, మంచిర్యాల, లక్సెట్టిపేట్ సబ్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాల ని పేర్కొంది. అలాగే అనధికారిక ప్రతివాదులు బ్రహ్మరావు, సత్యనారాయణరావుకు వ్యక్తిగత నోటీసు లిచ్చింది. తదుపరి విచారణ నవంబర్ 22కు వాయిదా వేసింది. మంచిర్యాల జిల్లా కాసిపేట్ మండలం పెద్దనపల్లి సర్వే నంబర్ 5/33లోని 8 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారంటూ హైకోర్టులో ఎస్.పద్మ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు తన తాత ముత్యాలుకు అసైన్డ్ చేసిన భూమి తనకు బదలాయించాలని, అయితే అధికారులు మరొకరి పేరుపై సేల్ డీడ్ ఇచ్చారని తెలిపారు. జూన్ 18న తాను ఇచ్చిన వినతిపత్రంపై విచారణ చేపట్టేలా కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఈ 8 ఎకరాలపై ఎలాంటి రిజిస్ట్రేషన్‌ను అనుమతించవద్దని మంచిర్యాల, లక్సెట్టిపేట్ సబ్‌రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశారు.


పులివెందులలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్న వీరపునాయునిపల్లె మండలానికి చెందిన ఉల్లి రైతులు

అధైర్యపడొద్దు.. మంచి రోజులొస్తాయి

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్ జగన్ భరోసా

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్‌సీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం పులివెందులలో పార్టీ శ్రేణులు, అభిమానులతో మమేకమయ్యారు. ఉదయం 9.15 గంటల నుంచి ఆయన పులివెందుల క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు, అభిమానులకు అందుబాటులో ఉన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు తెలుసుకుని, వారి సమస్యలు ఓపిగ్గా విని, వారికి భరోసా కల్పించారు. ఈ ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోందని, అరాచక పాలన సాగిస్తోందని, అకారణంగా దౌర్జన్యాలకు పాల్పడి, దాడులు చేస్తున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్ జగన్ వద్ద వాపోయారు. దీనికి వైఎస్ జగన్ స్పందిస్తూ.. ఎవరూ అధైర్యపడొద్దని, మంచి రోజులు వస్తాయని, సమస్యలు శాశ్వతం కాదంటూ భరోసా కల్పించారు. త్వరలోనే మన ప్రభుత్వం మళ్లీ వస్తుందని, అప్పుడు అందరికీ మంచి జరుగుతుందని చెప్పారు. విపక్షంలో పార్టీ ఉన్నతి కోసం కష్టపడాలని, భవిష్యత్‌లో తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు

తిరుమల తిరుపతి దేవస్థానములు :: తిరుపతి
శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం, ఎస్.వి.ప్రాణదాన ట్రస్ట్
ప్రకటన నం. 03/2024
Roc.No.TTD-117021(31)/11/2021-SPCHC తేది: 05.10.2024
దిగువ ఉద్యోగాల కొరకు అవశ్యక విద్యార్హత మరియు అనుభవం కలిగిన అర్హత గల హిందూ మతానికి చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి : క్ర.సం., నియమిత ఉద్యోగం పేరు, అవసరమైన సంఖ్య వరుసగా : 1) పిడియాట్రిక్ కార్డియాక్ అనస్థటిస్ట్–01, 2) పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్–01, మొత్తం–02. మరిన్ని వివరాలు మరియు దరఖాస్తు ఫారం కొరకు దర్శించండి : http://www.tirumala.org, దరఖాస్తు స్వీకరణకు చివరి తేది : 15–11–2024.
TTD-40021(31)/1/2024-PRO SEC (Adv. No.203), Dt.: 30.10.2024 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ నాగార్జున్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ని యంత్రణ మండలి (ఈఆర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవ రాజు నాగార్జున్ బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ నియంత్రణ్ భవన్‌లోని ఈ ఆర్సీ కార్యాలయంలో ఆయనతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవరాజు నాగార్జున్ మాట్లాడుతూ వినియోగ దారులు, విద్యుత్ సంస్థల ప్రయోజనాలను కాపాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తదితరులు పాల్గొన్నారు.

GOVERNMENT OF INDIA
DEPARTMENT OF ATOMIC ENERGY
HEAVY WATER PLANT (MANUGURU)
TENDER NOTICE

For and on behalf of President of India, General Manager, HWPM invites online item rate bids on two bid system for following work.

NIT No: **HWPM/E-P/NIT/EBP/AC/2024/R1**, Name of work : **Package AC system for EBP**, Estimated cost: ₹ **23,62,800/-**, Earnest Money: ₹ **47,256/-**, Period of completion: **2** months, Date of online availability of E-tender for view and download : **From 26.10.2024 (10:00 hrs) to 07.11.2024 (14:00 hrs)**, Last date & time for online submission of bid : **16:00 Hrs of 07.11.2024.**

The bid forms and other details can be obtained from the website **https://eprocure.gov.in**

Detailed NIT can be viewed at **https://www.hwb.gov.in.**

Sd/-
HWP(M)/Admn(G)/NIT/19/2024/848. Dt. 30/10/2024. (Signature of tender inviting authority)

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003
PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	GADIRAJU MIRARAJU	MUPPALA AISHWARYA RAJU D/O MUPPALA GUNA SEKHARAM	PNO 175/GF, RAVI COLONY, MAHENDRA HILLS	SETTLEMENT DEED NO 1765/2024 DT 08/10/2024
2	SHRI M J MUNNAIAH	1.J K ARTHI W/O JAGAPATI K RAVIKANTH ALIAS K N RAVIKANTH 2. JAGAPATI K RAVIKANTH ALIAS K N RAVIKANTH S/O K NARSING RAO	PNO 47/GF, BALAMRAI CHS, BOLLARAM	DEATH CERTIFICATE OF M J MUNNAIAH/ SETTLEMENT DEED NO 374/2024 DT 26/02/2024 COURT DECREE IN O.S NO 119/2024 AND NOTARIZED MOU OF LEGAL HEIRS
3	1. M SANJAY KUMAR JAIN 2. M KAMAL KUMAR JAIN	KRISHNA KUMAR KABRA S/O LATE H P KABRA	PNO 80/CF/GF/FF/SF, SANJEEVIAH NAGAR CHS, SIKH VILLAGE	SALE DEED NO 561/2021 DT 30/04/2021
4	SMT DEVALLA SHYAMALA	MADHURIMA ARORA W/O RAJEEV ARORA	PNO 10/FNO 6, JYOTHI CHS, KAKAGUDA	SETTLEMENT DEED NO 1770/2024 DT 09/10/2024
5	G KALYAN NARENDRA SHYAM	SRI C M PRAKASH RAO S/O LATE C MALLAIAH	PNO 4/R-2/GF/FF, ROYAL CHS COLONY, HASMATHPET	SALE DEED NO 1687/2022 DT 21/09/2022
6	K KISHORE KUMAR	SRI CIRIGIRI MALLAIAH PRAKASH RAO S/O CIRIGIRI MALLAIAH	PNO 4/R-1/GF/FF, ROYAL CHS COLONY, HASMATHPET	SALE DEED NO 182/2022 DT 28/01/2022
7	1. G VIJAYA BHASKAR REDDY 2. G ARUNA	RAJAGOPAL REDDY BEZAWADA S/O LATE. RAMANA REDDY BEZAWADA	PNO 10/FNO 4, JYOTHI CHS, KAKAGUDA	SALE DEED NO 37/2021 DT 05/01/2021
8	SRI B MURALI	1. KARNABATHULA SRIDHAR RAO S/O KARNABATHULA JEVAN RAO 2. BASA HARIKA W/O KARNABATHULA SRIDHAR RAO	PNO 17/GF/FF, SRI MALANI CHS, BOWENPALLY	SALE DEED NO 874/2022 DT 11/05/2022
9	S VIJAYKUMAR	HARINATH PULI S/O MAHESH PULI	FNO 402/TF, PANCHAVATHI APRTS(SONALI COLONY), BOWENPALLY	SALE DEED NO 144/2024 DT 24/01/2024
10	VARANASI SIVA KAMAIAH	JAYA VENKATRAMAN W/O NARAYANA SWAMY VENKATARAMAN	PNO 16/GF/FF, GOYAL CHS, TRIMULGHERRY	MORTGAGE DEED NO 856/2023 DT 10/05/2023, SALE DEED 474/2019 DT 02/03/2019
11	M GURUVAIAH S/O LATE P MALLAIAH	1. MITTAPALLY SURENDER S/O LATE MITTAPALLY GURUVAIAH 2. MITTAPALLI SRINIVAS S/O LATE MITTAPALLI GURUVAIAH	PNO 20/GF/FF/SF/TF, PAIGAH PALACE PLOTS, BALAMRAI	DEATH CERIFICATE OF MITTAPALLY GURUVAIAH/ REGISTERED WILL DEED NO 258/2022 DT 24/11/2022
12	M SREENIVAS	MYSARI MANIK PRABHU ALIAS M MANIK PRABHU S/O LATE M PENTAIAH	PNO 15/GF, BHAVANA COLONY, BOWENPALLY	PARTITION DEED NO 1252/2024 DT 19/07/2024
13	GANGU VIJAYA BHASKER REDDY	VINAY KUMAR BEZAWADA S/O RAJAGOPAL REDDY BEZAWADA	PNO 10/ FNO 3, JYOTHI CHS, KAKAGUDA	RELEASE DEED 1775/2024 DT 09/10/2024, SALE DEED NO 38/2021 DT 05/01/2021
14	KALIMIKONDA KARUNAKAR	1. V VIJAYA LAXMI W/O SHYAM KUMAR 2.SHYAM KUMAR S/O V ANJAIAH	PNO 25/201/FF, SAI SUNDER APARTS(LIC B GUDA), BOOSAREDDYGUDA	SALE DEED 1709/2024 DT 28/09/2024

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.
Sd/-
D. Madhukar Naik
No. SCB/Tax branch/2128, Office of the Cantonment Board, Court House Compound, S.P. Road, Secunderabad - 500 003. Date : 30-10-2024
Chief Executive Officer, Secunderabad Cantonment Board.

HEAVY WATER PLANT (MANUGURU)
निविदा सूचना Tender Notice

भारत के राष्ट्रपती की ओर से एवं के लिए, मुख्य महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), निम्नलिखित कार्य के लिए मुहरबंद निविदाएं आमंत्रित की जाती हैं।

For and on behalf of President of India, General Manager, HWPM invites online item rate bids on two bid system for following work :

निविदा सूचना संख्या : भापासंम/एम-पी/पेंट/13/2024

कार्य का नाम : डी.एम.संयंत्र में वेजलों पाइपलाइनों और संरचनाओं की पेंटिंग, भापासंम के मुख्य संयंत्र में सी.ए.पी. क्षेत्र तक ऑफसाइट पाइप रैक पेंटिंग सहित सीलेंट सिस्टम क्षेत्र।

आनुमानित : रु. 25,03,000/- अनुबंध की अवधि : 12 महीने बयाना : रु. 50,060/-

निविदा दस्तावेजों को देखने और डाऊनलोड करने की निर्धारित दिनांक : 01-11-2024 10-00 बजे से 12-11-2024 को 14-00 बजे तक

ऑन लाइन निविदाओं को जमा करने की अंतिम तिथि एवं समय: दिनांक : 12-11-2024 के 16-00 बजे या उससे पहले।

निविदा अधिसूचना एवं दस्तावेज वेबसाइट https://eprocure.gov.in पर उपलब्ध हैं।

NIT No. : HWPM/M-P/PAINT/13/2024

Name of the Work : **Painting of vessels, pipelines and structures in DM plant. Sealant system area including offsite pipe rack painting up to CAP area at Main Plant of HWPM.**

Estimated Cost : ₹. 25,03,000/- Earnest Money : ₹. 50,060/- Period of completion : 12 months

Date of online availability of E-Tender for view and download : From 01-11-2024 (10-00 hrs.) To 12-11-2024 (14-00 hrs.)

Last Date and Time for online Submission of bid : 16-00 Hrs. of 12-11-2024

The bid forms and other details can be obtained from the website https://eprocure.gov.in

Sd/-
(निविदा आमंत्रित प्राधिकारी के हस्ताक्षर)
(Signature of tender inviting authority)
सं.No. भापासं (म) HWP(M)/ प्रशा (सा) Admn(G)/एनआईटी NIT/19/2024/843 Dt. 30 10 2024.

బీఆర్ నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి

- 23 మంది సభ్యులతో పాలకమండలి
- ముగ్గురు ఎమ్మెల్యేలకు అవకాశం


బీఆర్ నాయుడు

సాక్షి, అమరావతి/ హైదరాబాద్: టీవీ–5 అధినేత బీఆర్ నాయుడికి చంద్రబాబు టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం) చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆయనతోపాటు మరో 23 మందిని సభ్యులుగా నియమిస్తున్నట్లు బుధవారం టీడీపీ ప్రకటించింది. సభ్యులుగా జగ్గంపేట, కోవూరు, మడకశిర ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, టీడీపీ నేత పనబాక లక్ష్మి, సాంబశివరావు (జాస్తి శివ), నన్నపనేని సదాశివరావు, కోటేశ్వరరావు, మల్లెల రాజశేఖర్ గౌడ్, జంగా కృష్ణమూర్తి, శాంతారాం, పి.రామ్మూర్తి, తమ్మిశెట్టి జానకీదేవి, నరేశ్ కుమార్ నియమితులయ్యారు. తెలంగాణ నుంచి నల్లగొండకు చెందిన టీడీపీ నేత నన్నూరి నర్సిరెడ్డి, జనసేన పార్టీ నేత బుంగునూరు మహేందర్‌రెడ్డి, సినీ ఆర్ట్ డైరెక్టర్, యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణంలో ఆర్కిటెక్ట్‌గా వ్యవహరించిన బురగపు ఆనంద్‌సాయి, భారత్ బయోటెక్ కో చైర్మన్ సుచిత్ర ఎల్లా, అనుగోలు రంగశ్రీకి అవకాశం ఇచ్చారు. కర్ణాటక నుంచి జస్టిస్ హెచ్‌ఎల్ దత్, దర్శన్ ఆర్ఎన్, గుజరాత్ నుంచి డాక్టర్ అదిత్ దేశాయ్, మహారాష్ట్ర నుంచి సౌరబ్ హెచ్ బోరా, తమిళనాడు నుంచి కృష్ణమూర్తిని నియమించారు. కాగా ఈ జాబితాపై టీడీపీలో చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమకు కచ్చితంగా బోర్డులో అవకాశం దక్కుతుందని భావించిన చాలామందికి నిరాశే ఎదురవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక వడపోతలు, సమీకరణలు పరిశీలించి చంద్రబాబు ఈ జాబితా రూపొందించినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల తర్వాత టీటీడీ బోర్డును నియమిస్తుండడం విశేషం.

సుచిత్ర ఎల్లా



భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కోవిడ్ టీకా కోవాగ్జిన్ రూపొందించినందుకు గాను అమెకు, ఆమె భర్త, ఆ సంస్థ సీఎండీ కృష్ణా ఎల్లాకు భారత ప్రభుత్వం 2022లో పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసింది. సుచిత్ర స్వస్థలం తమిళనాడులోని తిరుత్తణి. కానీ తెలంగాణ కోటాలో ఆమెను టీటీడీ బోర్డు మెంబర్ పదవి వరించింది.

ఆనంద్ సాయి



తెలుగు చలనచిత్ర రంగంలో కళాదర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదించిన ఆనంద్‌సాయి జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడు. పవన్‌కళ్యాణ్ నటించిన పలు చిత్రాలకు ఆయన కళాదర్శకుడిగా వ్యవహరించారు. రంగారెడ్డి జిల్లాలో చిన జీయర్‌స్వామి ఆశ్రమ రూపకల్పనలో పాల్గొన్నారు. అనంతరం యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణం కోసం ఆర్కిటెక్ట్‌గా నియమితులయ్యారు. పవన్‌కళ్యాణ్ సూచనతో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.

బొంగునూరి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్ శివారులోని కొంపల్లికి చెందిన బొంగునూరి మహేందర్‌రెడ్డి కూడా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడు. ఆ పార్టీ ఆవిర్భావానికి ముందు నుంచే ఆయన పవన్‌తో కలిసి నడుస్తున్నారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో కొనసాగి, జనసేన ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. 2019 పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు. ఇప్పుడు పవన్ సూచన మేరకు ఆయనకు టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అవకాశం దక్కింది.

నన్నూరి నర్సిరెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన నర్సిరెడ్డి ముందునుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉంటూ చంద్రబాబుకు సన్నిహితుడిగా ముద్రపడ్డారు. టీఎన్ఎస్ఎఫ్‌తో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

టీటీడీ చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు, ఇతర పాలకమండలి సభ్యులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రతను, ఔన్నత్యాన్ని పెంపొందించేలా నూతన పాలకమండలి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వివాదాలకు కేంద్రబిందువు..!

ఎల్లో మీడియా సిండికేట్‌లో భాగమైన టీవీ–5 అధినేత బీఆర్ నాయుడుకు టీటీడీ చైర్మన్ పదవి ఇస్తారని ముందు నుంచి అనుకుంటున్నదే. అయితే, బీఆర్ నాయుడు కనుసన్నల్లోనే ఆయన కుమారుడు అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారాడు. ఆయన కుమారుడు ప్రాతినిధ్యం వహిస్తున్న హౌసింగ్ సొసైటీలో అవకతవకలు.. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో అక్రమాలు.. డ్రగ్స్ వినియోగదారులతో చెట్టాపట్టాలు.. హౌసింగ్, 'రియల్' వ్యాపారంపై తెలంగాణ హైకోర్టు ఆక్షేపణ.. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నా టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు నియామకం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి బీఆర్ నాయుడు నియామకంపై ఎన్నికల కంటే చాలా ముందే టీడీపీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. దానిలో భాగంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలపై కావాలనే బురదజల్లే కార్యక్రమాలు ప్రసారం చేశారని సమాచారం.

క్లుప్తంగా...

'సాక్షి' ఫొటో జర్నలిస్టులకు అవార్డులు

విజయవాడ: నవంబర్ 1వతేదీ ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫి అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రెండు తెలుగురాష్ట్రాల ఫొటోగ్రాఫర్లకు నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో 'సాక్షి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు లభించాయి. రెండో బహుమతి కేథారి మోహనకృష్ణ (తిరుపతి), మూడో బహుమతి మహ్మద్ నవాజ్ (వైజాగ్)కు దక్కగా, వి.రూబెన్ బెసాలియల్ (విజయవాడ), నవకా లక్ష్మీపవన్ (విజయవాడ), డిఎం బాషా (అనంతపురం), జి. మురళి మోహన్ (తెలంగాణ)కు మెమోరియల్ అవార్డులు, కందుల చక్రపాణి (విజయవాడ), కె.జయశంకర్ (శ్రీకాకుళం), వడ్డి శ్రీనివాసులు(కర్నూలు) ప్రశంసా బహుమతులు గెలుచుకున్నారు. 'ప్రకృతి విపత్తులు, పండుగ సంబరాలు' అనే అంశాలపై పోటీ జరిగింది.

చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు బెదిరింపు కాల్

కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశామని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే సత్యంకు ఈ నెల 28న మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గుర్తు తెలియని నంబరు +447886696497 నుంచి వాట్సాప్ కాల్ వచ్చిందని వెల్లడించారు. ఫోన్‌లో సదరు వ్యక్తి మాట్లాడుతూ తనకు రూ.20 లక్షలు చెల్లించాలని, లేదంటే రాజకీయంగా అప్రతిష్టపాలు చేసి తన ఇద్దరు పిల్లలు అనాథలయ్యేలా చేస్తానని బెదిరింపులకు గురిచేసినట్లు తెలిపారు. దీంతో సత్యం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈమేరకు 339/2024, భారతీయ న్యాయ సంహిత 308, 351 (3), (4) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. నిందితుడు రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌లోని భవానీనగర్‌కి చెందిన యాస అఖిలేశ్‌రెడ్డి (33) అని, ఇతడు ప్రస్తుతం లండన్‌లో ఉన్నాడని, అక్కడి నుంచి బెదిరింపులకు పాల్పడ్డట్లు తేలిందని వివరించారు. సదరు నిందితుడిపై బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీచేశామని ఏసీపీ వెల్లడించారు.

మయోనైజ్‌పై నిషేధం

▶ మొదటి పేజీ తరువాయి

వాటితో కూడా కలిపి తీసుకుంటుంటారు.

మంత్రి సమీక్ష నేపథ్యంలో..

ఆహార భద్రతపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం సమీక్ష నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్‌స్టాల్స్, గోడౌన్లలో తనిఖీలు చేశామని, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు వివరించారు. దీంతో జిల్లాల్లోనూ విరివిగా తనిఖీలు చేయాలని, ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు గురైన ఘటనపై మంత్రి ఆరా తీశారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయోనైజ్‌ను కల్తీ గుడ్లు, ఉడకబెట్టని గుడ్లతో తయారు చేస్తున్నారని, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు. మయోనైజ్ క్వాలిటీ, అది తిన్న తర్వాత కలిగిన దుష్పరిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కేరళలో ఈ తరహా మయోనైజ్ తయారీని అక్కడి ప్రభుత్వం నిషేధించిందని, రాష్ట్రంలో కూడా నిషేధం విధించాలని సూచించారు. దీంతో పలువురు డాక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి.. మయోనైజ్‌పై నిషేధం విధించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఆహార భద్రతపై అధ్యయనం చేయండి

రాష్ట్రంలో గత పదేళ్లలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, హాస్టళ్ల సంఖ్య భారీగా పెరిగిందని, ఇందుకు అనుగుణంగా ఆహార భద్రతా విభాగం బలోపేతం కాలేదని, కొత్త పోస్టులు మంజూరు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో ఫుడ్ సేఫ్టీలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో అవలంబిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా మంత్రి అధికారులను ఆదేశించారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయబోతున్నామని, 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టరేట్లలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్, డైరెక్టర్ శివలీల, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్లు మూర్తి రాజు, అమృత, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.


లైఫ్ అండ్ లైట్

జీవితం వెలుగుతుంది. జీవితం వెలుతురు సందర్భాలను తీసుకొస్తుంది. జీవితం ఎప్పుడూ నిరాశ, నిస్పృహలనే చీకట్ల మీదకు ఆశ, ఆవేశం అనే వెలుతురు కిరణాలు పంపుతూనే ఉంటుంది. చీకటి వెలుగుల ఈ రంగేళిని సరి సమంగా స్వీకరించి ముందుకు సాగమని చెబుతుంది దీపావళి. వెలుతురును వరస కట్టుకోమని పెద్ద పెద్ద చప్పళ్లతో అరిచి చెప్పే పండుగ ఇది. ఈ సందర్భంగా సెలబ్రిటీల వెలుతురు ముచ్చట్లు...

ప్రేమమయి సత్యభామ


సాయిమాధవ్ బుర్రా

'దీపావళి' సందర్భంగా 'సత్యభామ' పాత్ర మనోవిశ్లేషణ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ మాటల్లో... సాక్షికి ప్రత్యేకం.


చిత్రం: బాపు

సత్యభామది పరిపూర్ణమైన, మూర్తీభవించిన స్త్రీతత్వం. భారతీయులంతా వారు ఏ ఖండంలో ఏ దేశంలో ఉన్నా ఆమెనూ ఆమె పాత్రను ఎవరికివారు తమదిగా భావిస్తారు. మా అమ్మాయే అనుకుంటారు. తెలుగువారు మరో అడుగు ముందుకేసి సత్యభామది తెనాలో ఓరుగల్లో అని భావిస్తారు. సత్యభామ పాత్ర నృత్యరూపాల వల్ల, పౌరాణిక నాటకాల వల్ల, సినిమాల వల్ల మనకు అంత దగ్గర.

సత్యభామ మహాతల్లి

అసలు స్త్రీ ఎలా ఉండాలి? నా ప్రపంచానికి నేను అధినేతని అన్నట్లు ఉండాలి. గడప దాటి బయటికి వెళ్లిన భర్తకో ప్రపంచం ఉండొచ్చు... ఎంత పెద్ద సామ్రాజ్యం అయినా ఉండొచ్చు... కానీ ఒక్కసారి ఇంటి లోపలికి వచ్చాక అతన్ని పరిపాలించడానికి ఒక మనిషి కావాలి... ఆ మనిషిని నేను. మా ఆయన్ని నేను తప్ప ఇంకెవరు పరిపాలిస్తారు అనే భావన సత్యభామది. ఆమె భర్తని కొంగున కట్టేసుకుంది... భర్తని తనకు బానిసలా చేద్దామనుకుందని చాలామంది అనుకుంటారు. అయితే ఇవన్నీ ఆవిడకు తెలియదు. ఆమెకి తెలిసింది ఒక్కటే–అతను నా భర్త... నా సొంతం... నేనేమైనా చేస్తా... అంటే బిడ్డని తల్లి ఎలా చూసుకుంటుంది? తన మాట వినాలనుకుంటుంది కదా... భర్తను అలా చూసుకున్న ఇల్లాలు ఆమె... సత్యభామ మహాతల్లి.

అది అహం కాదు... ప్రేమ

సత్యభామది అహం అని చాలామంది అనుకుంటారు. అసలు ఆవిడ అహం ఎక్కడ చూపించింది? పరిచారిక చెప్పిన మాట కూడా విందామె. తన ఇంట్లో పని చేసే అందరితో స్నేహంగా ఉంది. భర్త మీద ఉన్న అదుపులేని ప్రేమలో అహం, కోపం, కామం, క్రోధం, లోభం... ఇలా అరిషడ్వర్గాలు ఉంటాయి. రామాయణంలో కైక పాత్ర సత్యభామకు దగ్గరగా ఉంటుంది. ఆమె కూడా తన భర్తను గుప్పెట్లో పెట్టుకోవాలనుకుంటుంది. అలాగే సత్యభామలా భర్త కోసం యుద్ధం చేసింది... భర్తను గెలిపించింది. అయితే సత్యభామ నుంచి కైకని విడదీసే అంశం ఏంటంటే స్వార్థం. తన కొడుకు రాజు కావాలనే స్వార్థం కైకలో కనిపిస్తుంది. నా కొడుకుని రాజుని చేయాలంటే పెద్ద భార్య కొడుకు రాముడిని అడవులకు పంపాలనుకున్న స్వార్థం ఆమెది. కానీ సత్యభామలో ఆ కోణం కనిపించదు. రాముణ్ణి అడవులకు పంపితే రేపట్నుంచి తన భర్త దశరథుడు ఎప్పటిలా తనతో ఉంటాడా... ఉండడా... ఇవన్నీ కైక ఆలోచించలేదు. ఇదే సత్యభామ అయితే రేపట్నుంచి నా భర్త నాతో మాట్లాడడనే ఆలోచన వచ్చిందంటే దానికి కారణమయ్యే ఏ పనీ ఆ మహాతల్లి చెయ్యదు. సత్యభామది అంత గొప్ప క్యారెక్టర్. ఆమెకు భర్తే సర్వస్వం. అయినా భర్త తప్పు చేస్తే ఒప్పుకోదు. బెత్తం పట్టుకుని కింద కూర్చోబెడుతుంది. సత్యభామ ప్రతి ఇంట్లో ఉన్న తల్లిలో కనిపిస్తుంది. ఎందుకంటే కృష్ణుడిలాంటి భర్త కావాలని ఏ భార్యా కోరుకోకపోవచ్చు... కానీ కృష్ణుడులాంటి కొడుకు కావాలనుకుంటుంది. సో... అలా కృష్ణుణ్ణి తన కొడుకులా చూసుకుంది సత్యభామ. బిడ్డని కొట్టినట్లే కొట్టింది... బిడ్డ దగ్గర అలిగినట్లే అలిగింది.

సత్యభామ బయటకు వచ్చి ఉంటే...

సత్యభామ నాలుగు గోడల మధ్యనే ఉండిపోయింది. అదే బయటకు వస్తే ప్రపంచాన్ని పరిపాలించి ఉండేది. కృష్ణుణ్ణి నరకాసురుడు పడేస్తే... నా భర్తను కొడతావా అంటూ ఆ నరకాసురుణ్ణి చంపేసింది. అంటే... అక్కడ ఆవిడ కృష్ణుడి కన్నా బలవంతురాలనే కదా అర్థం. కృష్ణుడు ఇంటికి రాకపోతే బాధ.. వస్తే ఆనందం... కృష్ణుడు పక్కన లేకపోతే ఆమెకు నరకమే! ఆవిడ సంతోషం, బాధ ఏ ఎమోషన్ అయినా కృష్ణుడే. అంత గొప్ప ఇల్లాలు. డెబ్బై అయిదు శాతం మంది భార్యలు సత్యభామలానే ఉంటారు. అలా ఉన్నారు కాబట్టే ప్రపంచం నడుస్తోంది.



కిరీటం వద్దు... నువ్వు చాలంది

కృష్ణుడు తన కిరీటాన్ని సత్యభామకు పెడతానన్నా ఒప్పుకోదు... నాకు నీ కిరీటం ఎందుకు? నాక్కావాల్సింది నువ్వు అంటుంది. సత్యభామలా స్వచ్ఛంగా ప్రేమించే భార్య దక్కినందుకు కృష్ణుడు ఎంతో అదృష్టవంతుడు. కృష్ణుడు ఎలా అయితే ప్రేమకు ప్రతి రూపమో... అలా సత్యభామ కూడా కృష్ణుడి ప్రేమకు ప్రతిరూపమే.

నచ్చినట్లుగా బతకాలి

ఈ తరం అమ్మాయిలు సత్యభామ నుంచి నేర్చుకోవాల్సిన విషయం స్త్రీ సాధికారత. ఆమెలా ధైర్యంగా, స్వేచ్ఛగా బతకాలి. కట్టుబాటు అనేది స్త్రీకి ఎలా ఉందో మగవాడికి కూడా అలానే ఉండాలి. స్వేచ్ఛ అంటే ఎవరిని పడితే వాళ్లని రేప్ చేయమనా? ఇష్టం వచ్చినట్లు రోడ్ల మీద తిరగమనా? కాదు. స్వేచ్ఛ వేరు... విచ్చలవిడితనం వేరు. సత్యభామది స్వేచ్ఛ. ఆమెలా హద్దుల్లో ఉండు. ఆ హద్దులను అనుభవించు. నీకంటూ ఓ గీత ఉంది. ఆ గీత లోపల నీ ఇష్టం.

– ఇంటర్వ్యూ: డి.జి. భవాని



కుటుంబం కలిసే పండుగ

– మీనాక్షి చౌదరి

నా జీవితంలో వెలుగులు నింపిన సంఘటన నేను మిస్ ఇండియా కిరీటం గెలవడం. మా నాన్నగారు మాకు దూరమైన తర్వాత ఇది జరిగింది. నా కంటే ఎక్కువగా మా కుటుంబ సభ్యులు ఉద్వేగానికి గురైన క్షణాలు అవి. ఇలా మా జీవితాల్లో వెలుగులు నిండిన ఈ సమయాన్ని నేను మర్చిపోలేను. నాన్నగారు ఆర్మీలో పని చేసేవారు. దీపావళి పండక్కి ఆయన ఇంటికి వచ్చేవారు. అందువల్ల ఇంట్లో పండగ సందడి భలేగా ఉండేది. ఫ్రెండ్స్, బంధువులు అందరూ వచ్చేవారు. ఆయన లేకపోయినా ఆ ఆనవాయితీని కొనసాగేలా చూస్తున్నాను. మా హర్యాణలో దీపావళికి గాలిపటాలు ఎగరేస్తాం. వీధుల్లో పిల్లల ఆటపాటలు ఉంటాయి. కుటుంబ సభ్యులు అందరూ కలుస్తారు నియమంగా. ఇక షాపింగ్ చేయడం, నచ్చిన ఫుడ్ తినడం, దీపావళి వెలుగుల్లో సరదాగా గడపడం... ప్రతిసారి లాగే ఈసారి కూడా దీపావళికి ప్లాన్ చేశాను.

ఇప్పుడే కాదు.. నా చిన్నప్పటి నుంచీ నేను క్రాకర్స్ కాల్చను. కానీ ఎవరైనా క్రాకర్స్ కాల్చుతుంటే దూరంగా నిల్చుని చూస్తూ ఆనందిస్తుంటాను. చీకటి, వెలుగులు ఉన్నట్లే... మన జీవితాల్లో కూడా ఎత్తుపల్లాలు, మంచి చెడులు ఉంటూనే ఉంటాయి. అయితే మనం కంట్రోల్ చేయలేని పరిస్థితులు మనం ఎదుర్కోవాల్సినప్పుడు మనం ఎలా రియాక్ట్ అవుతున్నాం అన్నది ముఖ్యం. మన బౌండరీస్‌పై మనకు ఓ అవగాహన ఉండాలి. ప్రతి విషయంలోనూ సానుకూలంగానే ఆలోచించాలి. ఇలా ఉండటం సులభమని నేను చెప్పడం లేదు. కానీ ఉండగలగాలి. అందరికీ దీపావళి శుభాకాంక్షలు.



భయం లేకపోవడమే వెలుగు

– నభా నటేష్

నా బాల్యంలో ప్రతి ఏడాది దీపావళికి మా అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. దాదాపు ఇరవైమంది కుటుంబ సభ్యులం కలిసి ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకునేవాళ్లం. అందుకే దీపావళి అంటే నాకు ఎంతో ఇష్టం. చిన్నతనంలో క్రాకర్స్ కాల్చడాన్ని చాలా ఎంజాయ్ చేశాను. మా తాతగారు దీపావళికి పెద్దస్థాయిలో లక్ష్మీపూజ ఘనంగా జరిపేవారు. అప్పట్లో క్రాకర్స్ కొనిచ్చేవారు. పిల్లలు క్రాకర్స్ బాక్స్‌లను కలిసి కాల్చేవారు. ఎక్స్ఛేంజ్ చేసుకునేవాళ్ళు. బాగుండేది. కానీ పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని ఇప్పుడు కాల్చడం లేదు. అయితే ఒకసారి పండక్కు వెళ్లి కాలని లక్ష్మీబాంబులను ఏరుకుని, వాటిని విప్పి అందులోని పొడిని ఓ పేపర్లో ఉంచి, ఆ పేపర్ చివరన వెలిగించాను. నా అంతట నేనే ఓ లక్ష్మీబాంబును తయారు చేసుకుంటున్నానని ఫీలైపోయాను. కానీ దురదృష్టవశాత్తు నా రెండు వేళ్లు కాలిపోయాయి. మా అమ్మకు తెలిస్తే కోప్పడుతుందని తెలియకుండా దాచాను. కానీ అమ్మ గమనించి మందలించింది. ఈ ఘటనను నేను ఎప్పటికీ మర్చిపోలేను. అందుకే పిల్లలందరికీ చెబుతున్నా... క్రాకర్స్ కాల్చేప్పుడు జాగ్రత్తలు తీసుకోండి. మీరు కాల్చే క్రాకర్స్‌పై మీకు అవగాహన లేకపోతే దూరంగా ఉండండి. అత్యుత్సాహం చూపకండి. నేను సరదాగా చేసిన పిచ్చి పనిలాంటివి చేయకండి.

కొన్ని కారణాల వల్ల గడిచిన రెండు సంవత్సరాలు నేను దీపావళిని మా అమ్మమ్మ ఇంట్లో సెలబ్రేట్ చేసుకోలేకపోయాను. అందుకే ఈ ఏడాది నేను మా అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్తున్నాను. ఆ జ్ఞాపకాలను మళ్లీ గుర్తుకు తెచ్చుకుంటూ సంతోషంగా సెలబ్రేట్ చేసుకుంటాను.

ఇంటి వాతావరణంలో నేను పెరిగింది తక్కువ. బోర్డింగ్ స్కూల్లో చదువుకున్నాను. కాలేజీ కూడా అంతే. ఒంటరిగా ట్రావెల్ చేస్తుంటాను. సమాజంలో ఎలా మెలగాలో నాకు నేను కొన్ని పాఠాలు నేర్చుకున్నాను. మీపై మీరు భరోసా ఉంచండి. ధైర్యంగా ఉండండి. నైతిక బాధ్యతతో ఉండండి. అప్పుడు క్లిష్టపరిస్థితులను నెగ్గుకు రావొచ్చు మీరు.

నమ్మిన దానిపట్ల ధైర్యంగా నిలబడుతూ తలెత్తుకు జీవించండి. నా అనుభవాల నుంచి నేను నేర్చుకున్న సంగతులు ఇవి. భయం లేకపోవడమే వెలుగని నేను భావిస్తుంటాను.

స్వీట్‌గా లైట్లు..

ప్రతి దీపకాంతి పసిడి వర్ణంలో వెలుగులు విరజిమ్ముతుంది. అయితే, కొన్ని దీపాల నుంచి వచ్చే పరిమళాలు మాత్రం విభిన్నంగా మదిని కట్టిపడేస్తున్నాయి. మట్టి ప్రమిదల్లో నూనెతో దీపాలను వెలిగించడంతోనే సంతృప్తి పడటం లేదు నేటితరం అందుకే, భిన్న ఆస్వాదనల వెలుగులను పరిచయం చేస్తున్నారు క్రియేటర్స్. ఈ దీపావళిని సుగంధ భరితం చేస్తున్న వెలుగులు ఇవి..













స్వీట్ ట్రీట్‌లను పోలి ఉండేలా నోరూరించే దియా డిజైన్ల శ్రేణి ఆన్‌లైన్ మార్కెట్‌లో సందడి చేస్తోంది. తియ్యని కప్ కేక్‌ల నుంచి ఐస్‌క్రీమ్‌ల వరకు ప్రతి కొవ్వొత్తి డిజైన్ అబ్బుర పరుస్తోంది. క్రీముతో కూడిన పంచదార పాకం సువాసనలను ఈ కొవ్వొత్తుల ద్వారా ఆస్వాదించవచ్చు. వీటి ధరలు కూడా వందల రూపాయల నుంచి వేలలో ఉన్నాయి.

వీగన్ కాంతి..

జంతు ఆధారిత ఉత్పత్తులు ఏవీ ఉపయోగించకుండా వీగన్ కొవ్వొత్తుల డిజైన్స్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. స్వీట్ డిజర్ట్ క్యాండిల్స్‌లో కుకీస్, బ్లాక్‌బెర్రీ, డార్క్ చాకొలెట్, లెమన్ డిజర్ట్, స్ట్రాబెర్రీ డిజర్ట్ క్యాండిల్స్ చూపులకు, సువాసనలకు నోరూరిస్తున్నాయి కూడా.

ఆకారానికో అందం..

మనుషులు, జంతు ఆకారాలను పోలిన క్యాండిల్స్‌తో పాటు సెంటెడ్ మట్కీ దియా సెట్, టెర్రకోట క్యాండిల్ దియాస్, ఫీ బ్లెండెడ్ ఫిల్డ్ క్లే దియా, మిర్రర్ డెకొరేషన్ దియాస్, షాడో దియాస్, వాటర్ లైట్ దియాస్ లభిస్తున్నాయి.

భిన్న ఆకృతిలో డిజైన్లలో కనిపిస్తున్న వెలుగులు ఈ దీపావళికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



మన ముంగిళ్లలో వెలుగు పూలు



సాధారణంగా అమావాస్యనాడు చిక్కటి చీకట్లు అలముకుని ఉంటాయి. అయితే దీపావళి అమావాస్యనాడు మాత్రం అంతటా వెలుగుపూలు విరగపూస్తాయి. చిన్న, పెద్ద, ధనిక, పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరి ఇంట ఉల్లాసం, ఉత్సాహం వెల్లివిరుస్తాయి. ముంగిళ్లన్నీ దీపకాంతులతో కళకళలాడే ఈ పర్వదినం ప్రాముఖ్యత, ఆచార సంప్రదాయాలను తెలుసుకుని ఆచరిద్దాం...

దీపావళికి సంబంధించి కథలెన్నో ఉన్నప్పటికీ శ్రీ కృష్ణుడు సత్యభామ సమేతుడై... లోక కంటకుడైన నరకాసురుని వధించిన సందర్భంగా మాత్రమే దీపావళి జరుపుకుంటున్నామన్న కథే బహుళ ప్రాచుర్యంలో ఉంది.

నరకాసుర వధ

భూదేవి కుమారుడైన నరకుడు ప్రాగ్జ్యోతిషపురమనే రాజ్యాన్ని పాలించేవాడు. నరకుడు అంటే హింసించేవాడు అని అర్థం. పేరుకు తగ్గట్టే ఉండాలని కాబోలు.. రాజై ఉండి కూడా దేవతల తల్లి అదితి కర్ణకుండలాలను, వరుణుడి ఛత్రాన్ని అపహరించాడు. దేవతలను, మానవులను, మునులను హింసల పాల్జేసేవాడు. దేవతల మీదికి పదేపదే దండెత్తేవాడు. వాడు పెట్టే హింసలు భరించలేక అందరూ కలసి శ్రీ కృష్ణుని దగ్గర మొరపెట్టుకోగా, కృష్ణుడు వాడిని సంహరిస్తానని మాట ఇచ్చి, యుద్ధానికి బయలుదేరాడు. ప్రియసఖి సత్యభామ తాను కూడా వస్తానంటే వెంటబెట్టుకెళ్లాడు. యుద్ధంలో అలసిన కృష్ణుడు ఆదమరచి, అలసట తీర్చుకుంటుండగా అదను చూసి సంహరించబోతాడు నరకుడు. అది గమనించిన సత్యభామ తానే స్వయంగా విల్లందుకుని వాడితో యుద్ధం చేస్తుంది. ఈలోగా తేరుకున్న కృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించి, వాడిని సంహరిస్తాడు.

లోక కంటకుడైన నరకాసురుని వధ జరిగిన వెంటనే ఆ దుష్టరాక్షసుడి పీడ వదిలిందన్న సంతోషంతో దేవతలు, మానవులు దీపాలను వెలిగించి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అప్పటినుంచి ప్రతి ఏటా దీపావళి పండగ జరుపుకోవడం ఆచారంగా మారింది.

లక్ష్మీపూజ ఇలా చేయాలి...

ఇంటిగుమ్మాలను మామిడి లేదా అశోకచెట్టు ఆకుల తోరణాలతోనూ, ముంగిళ్లను రంగవల్లులతోనూ తీర్చిదిద్దాలి. అనంతరం... ఒక పీటను శుభ్రంగా కడిగి, పసుపు కుంకుమలతో అలంకరించి దానిమీద కొత్త కండువా పరిచి, బియ్యం పోసి లక్ష్మీదేవి, గణపతి ప్రతిమలను ఉంచాలి. కలశం పెట్టే అలవాటున్న వారు ఆనవాయితీ తప్పకూడదు. ఆ ఆచారం లేనివారు అమ్మవారిని ధ్యానావాహనాది షోడశోపచారాలతో పూజించాలి. వ్యాపారస్తులైతే పూజలో కొత్త పద్దుపుస్తకాలను ఉంచాలి. మిగిలినవారు నాణాలను, నూతన వస్త్రాభరణాలను, గంధ పుష్పాక్షతలు, మంగళకరమైన వస్తువులను ఉంచి యథాశక్తి పూజించాలి. దీపావళి నాడు లక్ష్మీ అమ్మవారిని అష్టోత్తర శతనామాలతోనూ, ఇంద్రకృత మహాలక్ష్మీ అష్టకంతోనూ పూజించడం సత్ఫలితాలను ఇస్తుంది. లక్ష్మీపూజలో చెరకు, దానిమ్మ, గులాబీలు, తామర పువ్వులు, వెండి వస్తువులు ఉంచి, ఆవునేతితో చేసిన తీపి వంటకాలను నివేదిస్తే అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని శాస్త్రోక్తి. సాయంత్రం వేళ నూత్న వస్త్రాలు ధరించి పెద్దల ఆశీస్సులు అందుకోవాలి. అనంతరం బాణసంచా కాల్చి, నోరు తీపి చేసుకోవాలి.

ఈ పర్వదినాన ఇలా చేయాలి...

ఈ రోజున తెల్లవారు జామునే తలకి నువ్వుల నూనె పెట్టుకుని, తలంటుస్నానం చేయాలి. స్నానం చేసే నీటిలో మర్రి, మామిడి, అత్తి, జువ్వి, నేరేడు ఆకులను వేసి, ఆ నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం, మంగళప్రదం. ఈ రోజు చేసే అభ్యంగన స్నానం సర్వపాపాలను హరింపజేయడమే గాక గంగాస్నానంతో సమానమైన ఫలితాన్ని ఇస్తుందని శాస్త్రవచనం.

దీపావళి నాడు విధివిధానంగా లక్ష్మీపూజ చేయాలి. ఎందుకంటే, దీపావళి రోజున లక్ష్మీదేవి భూలోకానికి దిగివచ్చి, ప్రతి ఇల్లు తిరుగుతూ శుభ్రంగా, మంగళకరంగా వున్న ఇళ్లలో తన కళను ఉంచి వెళుతుందని శాస్త్రవచనం. అందుకే దీపావళి నాడు ఇంటిని వీలైనంత అందంగా అలంకరించాలి.

దీపాలు ఎక్కడెక్కడ పెట్టాలి?

దీపావళి నాడు 5 ప్రదేశాల్లో దీపాలు తప్పక వెలిగించాలని శాస్త్రం చెప్పింది. వంట గదిలో, ఇంటి గడపకు ఇరువైపులా, ధాన్యాగారంలో (బియ్యం, పప్పులు మొదలైనవి నిలువ ఉంచే ప్రదేశంలో), తులసి కోటలో లేదా తులసిమొక్క దగ్గర, రావి చెట్టు కిందా దీపారాధన చేయాలి. అంతేకాదు, పెద్ద వయసు వారు నివసిస్తున్న ఇళ్ళ దగ్గర, దేవాలయాలు, మఠాలు, గోశాలల్లో, పురాతన వృక్షాల వద్ద, ప్రతి గదిలోనూ, ప్రతి మూలలోనూ దీపం వెలిగించాలి. అలాగే నాలుగు వీధుల కూడలిలో దీపం వెలిగించాలి. నువ్వులనూనె దీపాలనే వెలిగించడం, మట్టి ప్రమిదలనే వాడడం శ్రేష్ఠం. దీపావళి పితృదేవతలకు సంబంధించిన పండుగ కాబట్టి ఈనాటి సాయంత్రం గోగు కాడల మీద దివిటీలు వెలిగించి తిప్పుతారు. ఇవి పితృదేవతలకు దారిని చూపిస్తాయని, తద్వారా పితృదేవతలు సంతోషిస్తారని, వారి దీవెనలు ఉంటే వంశం నిలబడుతుందనీ విశ్వాసం.

దీపావళి నాటి అర్ధరాత్రి చీపురుతో ఇల్లు చిమ్మి, చేటలపై కర్రలతో కొడుతూ, తప్పెట్ల చప్పుళ్లతోనూ, డిండిమం అనే వాద్యాన్ని వాయిస్తూ జ్యేష్ఠలక్ష్మిని (దరిద్ర దేవతను) సాగనంపాలని, లక్ష్మీదేవికి పచ్చకర్పూరంతో హారతినివ్వాలనీ శాస్త్రవచనం.

– డి.వి.ఆర్. భాస్కర్

ఆశల దీపాలు వెలగనీ!

వెలుతురు లేకపోవడమే చీకటి. చీకటికి విడిగా ఉనికి లేదు. ప్రపంచంలో ఏ వస్తువు మీద అయినా వెలుగు పడితే అది మన కంట్లో పడుతుంది. లేకపోతే వస్తువు అక్కడే ఉంటుంది కానీ... చీకటి వల్ల మనకు కనబడదు. కంట్లో పడడం అన్న మాటే కనపడ్డం అయ్యింది.

పగలు – రాత్రి కాలరూపానికి బొమ్మాబొరుసు. పగటికి సూర్యుడు ఆధారం. రాత్రికి చంద్రుడు ఆధారం. విరాట్ పురుషుడి రెండు కళ్లు సూర్యచంద్రులు అంటుంది విష్ణు సహస్రనామం.

చీకటి– భయం, సుషుప్తి, నిద్ర, అజాగ్రత్త.

వెలుగు– చైతన్యం, అభయం, జాగరూకత, వెలుగుకు దీపం ఆధారం. దీపం పరంజ్యోతి . దీపం సాక్షాత్తు లక్ష్మి . అందుకే ఒక దీపం కాదు... కోటి దీపాలు పెట్టి లోకం వెలుగుల దైవాన్ని కొలుస్తోంది.

'బలి చక్రవర్తిని బంధించి పాతాళానికి వామనుడు పంపింది నేడే;
రావణుడిని రాముడు సంహరించింది నేడే;
కృష్ణుడి వెంటవెళ్లి నరకాసురుడిని సత్యభామ సంహరించింది నేడే;
శత్రువులను జయించి విక్రమార్కుడు తన పేరుతో నవశకానికి నాంది పలికింది నేడే
అలాంటి దీపావళి వేళ వెలుగుల లక్ష్మీ! రావమ్మా!' అని స్వాగతం పలికారు 'విజయ దీపావళి'లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి.

'చీకటి దయ్యం వొకటే లోకానికి రాజైతే
ఆకాశం నిలువ బోదు
అర్ధరాత్రి విలువలేదు!
కోటి కోటి దీపాలను
బాటలలో కోటలలో
నాటండి ప్రజలారా!
వేటాడండి తమస్సును

చల్లని చమురుంటేనే
జ్వాలావళి కీలావళి
నిరుపేదా! జరుపుకోర
మరో దివ్య దీపావళి'
అని తమస్సును వేటాడడానికి బాటలలో కోటలలో కోటి కోటి దీపాలను వెలిగించాలని పిలుపునిచ్చారు దాశరథి 'అగ్నిధార'లో.

"మన జీవితమే
ఒక దీపావళి
అందాల ప్రమిదల ఆనంద జ్యోతుల ఆశల
వెలిగించు దీపాల వెల్లి
చీకటి వెలుగుల రంగేళి జీవితమే ఒక దీపావళి
మన జీవితమే ఒక దీపావళి"
అని అందాల ప్రమిదల్లో ఆనందాల జ్యోతుల వత్తులు వేసి... ఆశల చమురు పోసి దీపావళిని వెలిగించాడు ఆత్రేయ.

'అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ
ఓం శాంతిః శాంతిః శాంతిః'
అన్న బృహదారణ్యకోపనిషత్ శాంతి వాక్యం యుగయుగాలుగా వినిపిస్తూనే ఉంది. చీకట్లను చీల్చుకుని వెలుగులోకి రావడమే శాంతి, సుఖం.

– పమిడికాల్వ మధుసూదన్





రిషభ్ పంత్‌ను వదులుకున్న ఢిల్లీ క్యాపిటల్స్

ఐపీఎల్ రిటెన్షన్‌కు సంబంధించి సంచలన మార్పు ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ నుంచి వచ్చింది. భారత వికెట్ కీపర్, హిట్టర్ రిషభ్ పంత్‌ను క్యాపిటల్స్ వదిలేసుకుంది. క్యాపిటల్స్ యాజమాన్య ఒప్పందం ప్రకారం వచ్చే రెండు సీజన్ల పాటు జీఎంఆర్ గ్రూప్ టీమ్ నిర్వహణా బాధ్యతలు చూస్తుంది. జీఎంఆర్ ప్రతినిధులతో పలు అంశాల్లో పంత్ విభేదించడమే అందుకు కారణమని తెలిసింది. కోచ్ ఎంపికతో పాటు ఇతర సహాయక సిబ్బంది ఎంపిక విషయంలో కూడా పంత్ పట్టుబట్టినట్లు... గత నెల రోజులుగా దీనిపై తీవ్ర చర్చలు జరిగిన తర్వాత పంత్ డిమాండ్లకు యాజమాన్యం అంగీకరించలేదని సమాచారం. దాంతో తమ స్టార్ ఆటగాడినే వదులుకునేందుకు క్యాపిటల్స్ యాజమాన్యం సిద్ధమైంది. 2016 నుంచి 2024 సీజన్ వరకు ఢిల్లీ జట్టుతో ఉన్న పంత్... 111 మ్యాచ్‌లలో 148.93 స్ట్రయిక్ రేట్‌తో 3,284 పరుగులు సాధించాడు. నలుగురు ఆటగాళ్లు అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అభిషేక్ పొరెల్, ట్రిస్టన్ స్టబ్స్‌లను ఢిల్లీ అట్టి పెట్టుకుంది. వేలంలో పంత్‌కు భారీ డిమాండ్ ఉండటం మాత్రం ఖాయం.

జయమా... పరాభవమా!

రేపటి నుంచి న్యూజిలాండ్‌తో భారత్ మూడో టెస్టు

- ఓడితే స్వదేశంలో తొలిసారి క్లీన్‌స్వీప్ కానున్న టీమిండియా
- తీవ్ర ఒత్తిడిలో రోహిత్ శర్మ బృందం
- అందరి దృష్టి కోహ్లిపైనే
- సమరోత్సాహంలో న్యూజిలాండ్
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం


అశ్విన్, రోహిత్, కోహ్లి

పుష్కర కాలం తర్వాత సొంతగడ్డపై టెస్టు సిరీస్ కోల్పోయిన టీమిండియా... ఇప్పుడు క్లీన్‌స్వీప్ ప్రమాదం ముంగిట నిలిచింది. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో స్వదేశంలో ఇప్పటి వరకు ఒక్క సిరీస్‌లోనూ క్లీన్‌స్వీప్ కాని భారత జట్టు... ఇప్పుడు న్యూజిలాండ్‌తో అలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటోంది. మరోవైపు భారత్‌లో భారత్‌పై ఇప్పటి వరకు టెస్టు సిరీస్ నెగ్గని న్యూజిలాండ్... ఆ పని పూర్తి చేసి క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ బెర్త్ దక్కాలంటే ఈ మ్యాచ్‌లో విజయం అనివార్యం అయిన పరిస్థితుల్లో రోహిత్ బృందం ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందనేది ఆసక్తికరం! తొలి రెండు టెస్టుల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కలిసికట్టుగా కదంతొక్కాలని, భారత్‌ను గెలుపు బాట పట్టించాలని అభిమానులు ఆశిస్తున్నారు.

ముంబై: అనూహ్య తడబాటుతో న్యూజిలాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన భారత జట్టు శుక్రవారం నుంచి వాంఖెడే మైదానం వేదికగా నామమాత్రమైన మూడో టెస్టు ఆడనుంది. ఇప్పటికే 0–2తో సిరీస్ కోల్పోయిన టీమిండియా... కనీసం ఆఖరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని చూస్తుంటే... తొలిసారి భారత్‌లో సిరీస్ నెగ్గిన న్యూజిలాండ్ దాన్ని క్లీన్‌స్వీప్‌గా మలచాలని భావిస్తోంది. ఈ సిరీస్‌కు ముందు స్వదేశంలో గత 12 సంవత్సరాలుగా భారత జట్టు టెస్టు సిరీస్ ఓడిపోలేదు. అంతేకాకుండా 1984 నుంచి స్వదేశంలో భారత జట్టు ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ మూడు టెస్టుల్లో ఓడిపోలేదు. బెంగళూరు వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో పేస్ పిచ్‌ను సిద్ధం చేసి... వాతావరణ మార్పుల మధ్య తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలడంతో ఘోర పరాజయం మూటగట్టుకున్న రోహిత్ జట్టు... పుణేలో జరిగిన రెండో టెస్టులో స్పిన్ పిచ్‌పై కూడా తడబడింది. స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగలరనే పేరున్న మన ఆటగాళ్లు పుణే టెస్టులో పార్ట్ టైమ్ స్పిన్నర్ లాంటి సాంట్నర్‌ను ఎదుర్కోలేక చేతులెత్తేయడం అభిమానులను కలవర పరిచింది. ఈ నేపథ్యంలో వాంఖెడే పిచ్‌ను సహజసిద్ధంగా ఉంచామని... జట్టు కోసం పిచ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదని భారత సహాయక కోచ్ అభిషేక్ నాయర్ అన్నాడు. ఈ సిరీస్‌లో ఆకట్టుకోలేకపోయిన స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆఖరి మ్యాచ్‌లోనైనా రాణిస్తారా చూడాలి. వరుసగా రెండుసార్లు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడిన టీమిండియా... ముచ్చటగా మూడోసారి కూడా తుదిపోరుకు అర్హత సాధించాలంటే మిగిలిన ఆరు టెస్టుల్లో సత్తా చాటాల్సిన అవసరముంది.

బ్యాటర్లపైనే భారం!

కొట్టిన పిండి లాంటి స్వదేశీ పిచ్‌లపై పరుగులు రాబట్టేందుకు భారత ఆటగాళ్లు ఇబ్బంది పడుతుంటే... న్యూజిలాండ్ బ్యాటర్లు మాత్రం సులువుగా పరుగులు చేస్తున్నారు. 2, 52, 0, 8... ఈ సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్కోర్లివి. టాపార్డర్‌లో ముందుండి ఇన్నింగ్స్‌ను నడిపించాల్సిన రోహిత్ ఇలాంటి ప్రదర్శన చేస్తుండగా... స్టార్ బ్యాటర్ కోహ్లి గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 0, 70, 1, 17 పరుగులు చేశాడు. చాన్నాళ్లుగా జట్టు బాధ్యతలు మోస్తున్న ఈ జంట స్థాయికి ఈ ప్రదర్శన తగినది కాకపోగా... మిగిలిన వాళ్లు కూడా నిలకడలేమితో ఇబ్బంది పడుతున్నారు. యశస్వి జైస్వాల్ మంచి టచ్‌లో ఉండగా... శుబ్‌మన్ గిల్, సర్ఫరాజ్, పంత్ కలిసి కట్టుగా కదం తొక్కితేనే భారీ స్కోరు సాధ్యం. ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అశ్విన్, వాషింగ్టన్ సుందర్ కేవలం బౌలింగ్‌పైనే కాకుండా బ్యాటింగ్‌లోనూ తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరముంది. ప్రధానంగా గత టెస్టులో టీమిండియా స్టార్ ఆటగాళ్లను న్యూజిలాండ్ స్పిన్నర్ సాంట్నర్ వణికించిన చోట... అశ్విన్-జడేజా జోడీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఈ లోపాలను అధిగమించకపోతే టీమిండియా మూడో టెస్టులోనూ పరాభవం మూటగట్టుకోవాల్సి ఉంటుంది.

మరోవైపు కేన్ విలియమ్సన్ వంటి కీలక ఆటగాడు లేకుండానే భారత్‌పై సిరీస్ గెలిచిన న్యూజిలాండ్ ఇదే జోరు చివరి మ్యాచ్‌లోనూ కొనసాగించాలని చూస్తోంది. కాన్వే, రచిన్ రవీంద్ర, కెప్టెన్ లాథమ్ నిలకడగా రాణిస్తుండగా... ఫిలిప్స్, మిచెల్ కూడా మెరుగైన ప్రదర్శన చేస్తే న్యూజిలాండ్‌కు ఈ టెస్టులోనూ తిరుగుండదు. బౌలింగ్ విభాగంలో సౌతీ, ఒరూర్కీ, హెన్రీ, సాంట్నర్ విజృంభిస్తే భారత జట్టుకు ఇబ్బందులు తప్పవు.

జోరుగా సాధన

తొలి రెండు టెస్టుల్లో ప్రభావం చూపలేకపోయిన టీమిండియా... కివీస్‌తో మూడో టెస్టుకు ముందు జోరుగా ప్రాక్టీస్ చేస్తోంది. వాంఖెడే పిచ్ స్పిన్‌కు సహకరించే అవకాశం ఉండటంతో స్పిన్నర్లను ఎదుర్కోవడంపై మన ప్లేయర్లు దృష్టి సారించారు. రోహిత్ శర్మ, కోహ్లితో పాటు ప్లేయర్లందరూ సాధనలో పాల్గొన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

బుమ్రా చేజారిన 'టాప్' ర్యాంక్

ఐదేళ్ల తర్వాత నంబర్‌వన్‌గా రబడ ● ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్


రబడ
బుమ్రా

దుబాయ్: భారత స్పీడ్‌స్టర్ జస్‌ప్రీత్ బుమ్రా టాప్ ర్యాంక్‌కు న్యూజిలాండ్‌తో సిరీస్ ఎసరు తెచ్చిపెట్టింది. ఇదే అదనుగా దక్షిణాఫ్రికా స్టార్ సీమర్ కగిసో రబడ బంగ్లాదేశ్‌పై చెలరేగడంతో... బుమ్రాను వెనక్కినెట్టి మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రబడ అగ్రస్థానానికి చేరుకున్నాడు. 2019 జనవరిలో చివరిసారి రబడ టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. సొంతగడ్డపై పుణేలో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో బుమ్రా ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోవడంతో రెండు స్థానాలు కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు రబడ మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 7 వికెట్లు తీశాడు. తద్వారా టెస్టుల్లో 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. టెస్టు బ్యాటర్లలో మాత్రం కాస్త ఊరట లభించింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఒక స్థానం మెరుగు పర్చుకొని మూడో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఘోరంగా విఫలమైన కోహ్లి ఆరు స్థానాలు పడిపోయి 14వ ర్యాంక్‌లో, రిషభ్ పంత్ ఐదు స్థానాలు కోల్పోయి 11వ ర్యాంక్‌లో నిలిచారు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో మాత్రం జడేజా, అశ్విన్ టాప్-2లో కొనసాగుతున్నారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ ఓటమి

సాక్షి, హైదరాబాద్: సొంత మైదానంలో తాము ఆడిన రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్‌ఎఫ్‌సీ) ఓటమిని మూటగట్టుకుంది. గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం జరిగిన ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) పోరులో హైదరాబాద్ 0–2 గోల్స్ తేడాతో మోహన్ బగాన్ సూపర్ జెయింట్స్ చేతిలో ఓడింది. మోహన్ బగాన్ తరఫున 37వ నిమిషంలో మాన్‌వీర్ సింగ్, 55వ నిమిషంలో సుభాశీష్ బోస్ గోల్ నమోదు చేశారు.

బోపన్న జోడీ గెలుపు



పారిస్: సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత పొందిన ఉత్సాహంలో... పారిస్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 7-6 (7/5)తో జ్వెరెవ్ (జర్మనీ)-మార్సెలో మెలో (బ్రెజిల్) జంటపై నెగ్గింది. 76 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించారు. తొలి సెట్‌లో ఒక సారి జ్వెరెవ్ జంట సర్వీస్‌ను బ్రేక్ చేశారు. రెండో సెట్‌లో టైబ్రేక్‌లో పైచేయి సాధించి గెలిచారు.

భారత్ X మలేసియా

హైదరాబాద్‌లో నవంబర్ 18న అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చిన హైదరాబాద్ మరోసారి రెండు జాతీయ జట్ల మధ్య మ్యాచ్‌కు వేదిక కానుంది. నవంబర్ 18న గచ్చిబౌలి స్టేడియంలో భారత్, మలేసియా మధ్య అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్ జరుగుతుందని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్‌ఎఫ్) ప్రకటించింది. ఈ మ్యాచ్ నవంబర్ 19న జరుగుతుందని ఏఐఎఫ్‌ఎఫ్ గతంలోనే ప్రకటించినా వేదికను ఖరారు చేయలేదు. ఇప్పుడు హైదరాబాద్‌ను వేదికగా ఎంపిక చేయడంతో పాటు మ్యాచ్‌ను ఒక రోజు ముందుకు జరిపి నవంబర్ 18న నిర్వహించనున్నారు. ఈ ఏడాదిలో చివరిసారిగా నవంబర్ 11–19 మధ్య ఆటగాళ్లంతా తమ జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించేందుకు అందుబాటులో ఉండాలని, అందు కోసం వివిధ క్లబ్‌లు ఆటగాళ్లను విడుదల చేయాలని అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) నిబంధనలు విధించింది. మనోలో మార్కెజ్ హెడ్ కోచ్‌గా వచ్చిన తర్వాత మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్...ఒక మ్యాచ్‌లో ఓడి రెండు 'డ్రా' చేసుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం భారత్ 125వ స్థానంలో, మలేసియా 133వ స్థానంలో ఉన్నాయి. ఇరు జట్లు చివరిసారి అక్టోబర్, 2023లో జరిగిన మెర్డెకా కప్ సెమీ ఫైనల్లో తలపడగా...భారత్ 2-4తో ఓడింది.

సినిమా




హనుమాన్‌గా రిషబ్

'కాంతార'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడంతో పాటు జాతీయ అవార్డు కూడా సాధించిన హీరో రిషబ్ శెట్టి, 2024 సంక్రాంతి పోటీలో 'హను-మాన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ కాంబినేషన్ కుదిరింది. 'హను-మాన్' తర్వాత 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' (పీసీయు)లో భాగంగా ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కాగా ఈ చిత్రంలో హనుమాన్ పాత్ర చేయనున్నది రిషబ్ శెట్టి అని ప్రకటించి, పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ''ఈ పాన్ ఇండియా చిత్రాన్ని అద్భుతమైన కథతో, అత్యంత భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

మాస్ జాతర

రవితేజ హీరోగా నటిస్తున్న 75వ చిత్రానికి 'మాస్ జాతర' అనే టైటిల్‌ని ఖరారు చేశారు మేకర్స్. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. భాను భోగవరపు దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ చిత్రానికి 'మాస్ జాతర' (మనదే ఇదంతా అనేది ట్యాగ్‌లైన్) అనే టైటిల్‌ను ఖరారు చేయడంతో పాటు 2025 మే 9న సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు నిర్మాతలు. ''టైటిల్‌కి తగ్గట్టుగానే మా సినిమా థియేటర్లలో మాస్ జాతరను తలపిస్తుంది. ఈ చిత్రం అసలు సిసలైన మాస్ మహారాజా (రవితేజను ఉద్దేశించి) సినిమాలా ఉంటుంది. 'ధమాకా' విజయంలో కీలక పాత్ర పోషించిన భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, ఎడిటింగ్: నవీన్ నూలి.


● రవితేజ

కిరణ్‌లాంటి హీరోలు విజయం సాధించాలి

- హీరో నాగచైతన్య


● నాగచైతన్య, కిరణ్ అబ్బవరం

''ఇటీవల కిరణ్ అబ్బవరం చెన్నైలో కలిశాడు. అతనితో మాట్లాడిన కొద్ది సేపటికే దగ్గరి ఫ్రెండ్‌లా అనిపించాడు. నేను ఇండస్ట్రీకి మా కుటుంబ నేపథ్యంతో వచ్చాను. కానీ, కిరణ్ స్వతహాగా ఎదిగాడు. తన ప్రయాణానికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఇండస్ట్రీకి వచ్చే కొత్తవారికి తను స్ఫూర్తిగా నిలుస్తాడు. ఇలాంటి హీరోలు విజయం సాధించాలి'' అని హీరో నాగచైతన్య అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వంలో చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నాగచైతన్య మాట్లాడుతూ– ''కిరణ్... నీలో ఎంతో శక్తి ఉంది.. భయపడాల్సిన అవసరం లేదు. ట్రోల్స్‌కి భయపడే స్థాయి ఎప్పుడో దాటేశావు. ఇండస్ట్రీలో హిట్స్, ఫ్లాప్స్ ఎవరికైనా సాధారణమే. 'క' టీమ్‌ను కలిసినప్పుడు ఈ సినిమా కోసం వారు ఎంత నిజాయతీగా కష్టపడ్డారో తెలిసింది. అందుకే ఈ సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అని చెప్పారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''నా కెరీర్‌లో 8 సినిమాలు చేస్తే 4 సినిమాలు బాగా ఆడాయి. నేను నటుడిగా ఫెయిల్ కాలేదు. ప్రతి హీరోకు ఫెయిల్యూర్స్ ఉంటాయి. ఒకరు వారి సినిమాలో నాపై ట్రోలింగ్ డైలాగ్స్ పెట్టడం బాధగా అనిపించింది'' అన్నారు.

తారక రామారావు పరిచయ చిత్రం ఆరంభం

''నందమూరి తారక రామారావుగారి జీవితంలో కొత్త అధ్యాయానికి తెరలేపిన చిత్రం 'సర్దార్ పాపారాయుడు'. ఆ సినిమా 1980 అక్టోబర్ 30న రిలీజ్ అయింది. ఆ చిత్రం రిలీజ్ అయిన రోజునే ఇంకో ఎన్టీఆర్‌ని హీరోగా పరిచయం చేస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాను'' అని డైరెక్టర్ వైవీఎస్ చౌదరి చెప్పారు. దివంగత హరికృష్ణ మనవడు, దివంగత జానకి రామ్ తనయుడు తారక రామారావుని హీరోగా, తెలుగమ్మాయి వీణా రావ్‌ని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ వైవీఎస్ చౌదరి దర్శకత్వంలో న్యూ టాలెంట్ రోర్స్ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మిస్తున్న చిత్రం బుధవారం ఆరంభమైంది. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ని లాంచ్ చేశారు. వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ– ''నేను రాసుకున్న కథని మోయగలిగి, ఈ పాత్రని పోషించగల సత్తా ఉన్న తారక రామారావును ఈ వేడుక ద్వారా పరిచయం చేయడం హ్యాపీగా ఉంది. నేనిప్పటివరకు పరిచయం చేసిన హీరోలను ఫ్యాన్స్ ఆదరించారు. అలానే ఎన్టీఆర్‌ని కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ అత్తిలి.


● నందమూరి తారక రామారావు



కొత్త ప్రపంచంలోకి వెళతారు

- సూర్యదేవర నాగవంశీ

''డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఓ మనిషి ఎంత దూరమైనా వెళ్తాడు అనే కథాంశంతో 'లక్కీ భాస్కర్' రూపొందింది. బ్యాంకింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. తర్వాత ఏం జరుగుతుందో అనే ఆసక్తిని రేకెత్తిస్తూ నడుస్తుంది. ప్రేక్షకులు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్టు ఉంటుంది. భాస్కర్ అనే వ్యక్తి జీవితం చుట్టూనే ఈ మూవీ ఉంటుంది. సినిమా ప్రారంభమైన పది పదిహేను నిమిషాలకు భాస్కర్ పాత్రతో కలిసి ఆడియన్స్ ప్రయాణిస్తారు'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా నేడు పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''దర్శకుడు వెంకీ అట్లూరిని మేం నమ్మాం. అందుకే ఆయనతో వరుస సినిమాలు చేస్తున్నాం. 'లక్కీ భాస్కర్' చూస్తున్న ప్రతి ప్రేక్షకుడు భాస్కర్ గెలవాలని కోరుకుంటాడు. సాధారణ ప్రేక్షకులు భాస్కర్ పాత్రలో తమని తాము చూసుకుంటారు. సినిమా చూసిన ప్రేక్షకులు మంచి అనుభూతితో థియేటర్ నుంచి బయటకు వస్తారు'' అన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం 'సత్యం సుందరం' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

నాటి తీపి గుర్తుల నేటి సినిమా

మనల్ని కొన్ని సినిమాలు ఆలోచింపజేస్తాయి. మరి కొన్ని సినిమాలు ఆవేశాన్నిస్తాయి. ఇంకొన్ని సినిమాలు ఆనందాన్నిస్తాయి. చాలా కొన్ని సినిమాలు మన మనసులో పదిలంగా నిలిచిపోతాయి. ఎందుకంటే పరోక్షంగానో, ప్రత్యక్షంగానో అవి మన గడిచిన జీవితపు గతాల తెరలను తొలగిస్తాయి కాబట్టి. అటువంటి వాటి కోవలో ముందుండే సినిమా 'మెయ్యళగన్'. ఈ సినిమా తెలుగు వెర్షన్ 'సత్యం సుందరం' నెట్‌ఫ్లిక్స్ వేదికగా లభ్యమవుతోంది. దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ ఈ సినిమాని సినిమాలా తీయలేదు, మన గత జీవితాలను మళ్లీ మనకు పరిచయం చేశారంతే.



ఒకరిద్దరు భారీ తారాగణం తప్ప పెద్ద కథ, పెద్ద సెట్లు, పెద్ద లొకేషన్లు ఇలాంటి ఆకర్షణలేవీ లేవు ఈ సినిమాలో. కానీ మనసున్న ప్రతి ఒక్కరినీ ఈ సినిమా మెప్పిస్తుందనడంలో సందేహమే లేదు. ప్రతి ఇంట్లో జరిగే ఓ సున్నితమైన అంశాన్ని కథగా తీసుకుని చాలా నేచురల్‌గా తెరకెక్కించారు దర్శకుడు. కథాపరంగా సత్యం ఉంటున్న ఇల్లు దాయాదుల గొడవల్లో పోతుంది. ఆ బాధతోనే సత్యం కుటుంబం ఉన్న ఊరిని ఉన్న పళంగా విడిచి వెళ్లిపోతుంది. ఇక్కడ నుండే సినిమా ప్రారంభమవుతుంది. పద్దెనిమిదేళ్ల తర్వాత సత్యం తన బాబాయి కూతురు పెళ్లి కోసం మళ్లీ ఆ ఊరులోకి బాధతోనే అడుగుపెట్టవలసివస్తుంది. పెళ్లిలో సత్యాన్ని అతని చుట్టం సుందరం కలుస్తాడు. కానీ సుందరాన్ని సత్యం గుర్తు పట్టడు. సుందరం మాత్రం సత్యం మీద వల్లమాలిన అభిమానాన్ని, ప్రేమను చూపిస్తాడు. అసలే ఆ ఊరితో ఉన్న చికాకుతో పాటు సుందరం ఎవరో గుర్తు రాకపోయినా అతను చూపించే ప్రేమ సత్యాన్ని మరింత మథన పెడుతుంది. మరి... ఆఖరికి సుందరం ఎవరో సత్యం గుర్తు పట్టాడా లేదా? అన్నది మాత్రం సినిమాలోనే చూడాలి. సత్యం పాత్రలో అరవిందస్వామి, సుందరం పాత్రలో కార్తీ తమ పాత్రలలో జీవించేశారు. సినిమా మొత్తం ఈ రెండు పాత్రల మీదే ఉంటుంది. పైన చెప్పుకున్నట్టు ఇది సినిమా కాదు... మన గతం. నాటి తీపి గుర్తుల నేటి సినిమా ఈ 'సత్యం సుందరం'. వర్త్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ

ఎమోషనల్ రైడ్


● 'రోటి కపడా రొమాన్స్' పోస్టర్

''రోటి కపడా రొమాన్స్' ట్రైలర్ బాగుంది. యూత్‌కి ఏదో కొత్తగా చెప్పాలనే ప్రయత్నం చేసినట్లు కనిపించింది. ప్రతి సంవత్సరం యంగ్ జనరేషన్ చేసిన సినిమా సెన్సేషన్ హిట్ అవుతుంది. ఈ సినిమా కూడా ఆ కోవలో చేరాలని కోరుకుంటున్నాను. న్యూ టాలెంట్‌ని ప్రోత్సహిస్తూ సినిమాలు నిర్మిస్తున్న బెక్కెం వేణుగోపాల్‌లాంటి నిర్మాతలు సక్సెస్ అవ్వాలి'' అని హీరో నాని అన్నారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ చిత్రం నవంబరు 22న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో నానీతో ట్రైలర్ రిలీజ్ చేయించారు. ''యువతరానికి నచ్చే అంశాలకు కుటుంబ భావోద్వేగాలను మేళవించి ఎమోషనల్ రైడ్ మూవీలా రూపొందించాం'' అని నిర్మాతలు తెలిపారు.

కంగువ ఎడిటర్ నిషాద్ హఠాన్మరణం



సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'కంగువ'కి ఎడిటర్‌గా చేసిన నిషాద్ యూసుఫ్ (43) ఆకస్మిక మృతి చెందారు. నిషాద్ స్వస్థలం కేరళలోని చంగనస్సేరి. తన భార్య, పిల్లలతో కలిసి కొచ్చిలోని పనంపిల్లి నగర్‌లో నివాసం ఉంటున్నారు. స్వగృహంలో బుధవారం తెల్లవారుజామున ఆయన విగత జీవిగా కనిపించారు. ఇక నిషాద్ ఆత్మహత్యకు పాల్పడ్డారా? ఆర్థిక సమస్యలా? కుటుంబ కలహాలా? ఎవరైనా గిట్టని వారు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. 'చావెర్, ఉండా, తల్లుమాలా, సౌదీ వెళ్లక, వన్, ఆపరేషన్ జావా' వంటి పలు సినిమాలకు ఎడిటర్‌గా చేశారు నిషాద్. ఆయన పని చేసిన చివరి చిత్రాలు మమ్ముట్టి నటించిన 'బజూక', సూర్య నటించిన 'కంగువ' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

సాక్షి బిజినెస్
గురువారం
31-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
427	126
79,942	24,341

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,706	▽ 7
డోజోన్స్	42,337	△ 104
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,159	▽ 60
డాక్స్	19,257	▽ 221
షాంఘై	3,266	▽ 20
నికాయ్	39,277	▽ 374

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
79,581	△	836
బంగారం (99.5 స్వచ్ఛత)		
79,262	△	832
వెండి (కిలో)		
98,040	△	167

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.67	84.69
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.02	110.87
€	యూరో	ఎస్‌బీఐ	89.70	92.36
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.20	55.58
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.99	56.17
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.26	65.91
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.00	23.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.63	12.75

కాంపాక్ట్ ఎస్‌యూవీలు.. కేక!



టాప్‌గేర్‌లో అమ్మకాలు..
- తొలిసారి హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్‌లను మించి సేల్స్
- కారు ప్రియుల ఫస్ట్ ఛాయిస్ ఎస్‌యూవీలే

ఒకపక్క కార్ల కంపెనీలు బంపీ రైడ్‌తో సతమతమవుతున్నప్పటికీ... స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీలు) తగ్గేదేలే అంటున్నాయి. భారతీయులకు తొలి చాయిస్‌గా మారుతున్నాయి. నిన్నమొన్నటిదాకా అమ్మకాల్లో పైచేయి సాధించిన హ్యాచ్ బ్యాక్స్, సెడాన్స్ ఆధిపత్యానికి తెరపడింది. ఇప్పుడు దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న కార్ల విభాగంగా కాంపాక్ట్ ఎస్‌యూవీలు కేక పుట్టిస్తున్నాయి!! – సాక్షి, బిజినెస్ డెస్క్

దేశంలో కారు ప్రియుల కొనుగోలు ట్రెండ్ శరవేగంగా మారిపోతోంది. 4 మీటర్ల లోపు పొడవైన హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్‌ల (కాంపాక్ట్ ప్యాసింజర్ కార్లు) హవాకు బ్రేక్‌లు పడుతున్నాయి. ఎస్‌యూవీలు రాజ్యమేలుతున్న కాలంలో కూడా అమ్మకాల్లో టాప్‌లేపిన ఈ సెగ్మెంట్‌ను తొలిసారిగా కాంపాక్ట్ ఎస్‌యూవీలు ఓవర్‌టేక్ చేశాయి. భారతీయ ఆటోమొబైల్ తయారీ సంస్థల సొసైటీ (సియామ్) తాజా లెక్కల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (2024–25, ఏప్రిల్–సెప్టెంబర్)లో 4 మీటర్ల లోపు కాంపాక్ట్ ఎస్‌యూవీలు దుమ్ము రేపాయి. ఈ సెగ్మెంట్లో 6,71,674 వాహనాలు అమ్ముడయ్యాయి. ఇదే తరుణంలో కాంపాక్ట్ ప్యాసింజర్ కార్ల సేల్స్ 5,58,173 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంతో పోలిస్తే ఈ రెండు విభాగాల అమ్మకాలు రివర్స్ కావడం విశేషం.


రివర్స్ గేర్...

గతేడాది వరకు దేశంలో కాంపాక్ట్ ప్యాసింజర్ కార్ల జోరుకు తిరుగేలేదు. అమ్మకాల్లో ఈ విభాగానికిదే టాప్ ర్యాంక్. నాలుగేళ్ల క్రితమైతే కాంపాక్ట్ ఎస్‌యూవీలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో సేల్స్ నమోదయ్యాయి. ఐదేళ్లకు ముందు చూస్తే, కాంపాక్ట్ ఎస్‌యూవీ 1 అమ్ముడైతే కాంపాక్ట్ ప్యాసింజర్ కార్లు 3 హాట్ కేకుల్లా రోడ్డెక్కేవి. ఇదంతా గతం. దేశంలో నవతరం దూకుడు... ఆటోమొబైల్ రంగం ముఖచిత్రాన్ని మలుపుతిప్పుతోంది. మరోపక్క, ఎంట్రీ లెవెల్ మైక్రో ఎస్‌యూవీలు అందుబాటుల ధరల్లో లభిస్తుండటంతో గ్రామీణ కార్ లవర్స్ సైతం వీటికే సై అంటున్నారు. దీంతో చిన్న ఎస్‌యూవీలకు డిమాండ్ ఓ రేంజ్‌లో ఉంటోందనేది నిపుణుల మాట. టాటా పంచ్, నెక్సాన్, మారుతీ ఫ్రాంక్స్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ, హ్యుందాయ్ వెన్యూ, ఎక్స్‌టర్, కియా సోనెట్, మారుతీ బ్రెజా, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, సిట్రాన్ సీ3, ఎయిర్‌క్రాస్ వంటివి కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో బాగా అమ్ముడవుతున్న మోడల్స్. వీటిలో కొన్ని కార్లు నెలకు 10,000 అమ్మకాల మార్కును కూడా అధిగమిస్తుండటం విశేషం! ఇక కాంపాక్ట్ ప్యాసింజర్ కార్ల విషయానికొస్తే, మారుతీదే పూర్తి ఆధిపత్యం. స్విఫ్ట్, వ్యాగన్ ఆర్, బాలెనో, డిజైర్ మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఇతర కార్లలో టాటా టిగోర్, ఆల్ట్రోజ్, టియాగో, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, ఐ20 వంటివి అంతంతమాత్రంగానే అమ్ముడవుతుండటం గమనార్హం.

ఆకట్టుకుంటున్న ఫీచర్లు...

కాస్త ధరెక్కువున్నప్పటికీ, మరిన్ని ఫీచర్లు లభిస్తుండటంతో చాలా మంది కస్టమర్లు కాంపాక్ట్ ఎస్‌యూవీలకు అప్‌గ్రేడ్ అవుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. హ్యాచ్‌బ్యాక్స్, సెడాన్ కార్లతో పోలిస్తే విశాలమైన స్పేస్, బలిష్టమైన రూపంతో పాటు మెరుగైన డ్రైవింగ్ అనుభవం వల్ల కూడా కస్టమర్లు వీటికి జై కొడుతున్నారని మారుతీ మాజీ సేల్స్, మార్కెటింగ్ హెడ్ అభిప్రాయపడ్డారు. 'ఎస్‌యూవీల సీటింగ్ పొజిషన్ ఎత్తుగా ఉండటం వల్ల కేబిన్ నుండి రోడ్డు వ్యూ బాగుంటుంది. అంతేకాకుండా, అధిక గ్రౌండ్‌క్లియరెన్స్ వల్ల మన దగ్గరున్న గతుకుల రోడ్లపై డ్రైవింగ్‌కు చాలా అనుకూలంగా ఉంటుంది. అందుకే వీటికి మంచి ఆదరణ లభిస్తోంది' అని చెప్పారు.

విక్రయాల తీరిదీ...



హ్యాచ్‌బ్యాక్, సెడాన్ మోడల్స్ డౌన్...

కారణాలేవైనప్పటికీ గత కొంతకాలంగా కాంపాక్ట్ పాసింజర్ కారు మోడల్స్ కనుమరుగవుతున్నాయి. ఫోర్డ్ మోటార్స్ 2022లో ఇండియా నుండి దుకాణం సర్దేయడంతో ఫిగో, ఫిగో యాస్పైర్, ఫ్రీస్టయిల్, ఫియస్టా వంటి బాగా పాపులర్ మోడల్స్ అందుబాటులో లేకుండా పోయాయి. ఫోర్డ్ నిర్ణయంతో హాట్ ఫేవరెట్ ఎకోస్పోర్ట్ కాంపాక్ట్ ఎస్‌యూవీ సైతం మార్కెట్‌కు దూరం కావడం గమనార్హం. హోండా సైతం జాజ్, బ్రియో వంటి హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాలను ఆపేసింది. హోండా సిటీ సేల్స్ కూడా నేలచూపులు చూస్తున్నాయి. మరోపక్క, డాట్సన్ కూడా 2022లో గుడ్‌బై చెప్పడంతో గో, రెడీగో వెళ్లిపోయాయి. టయోటా లివా, ఫోక్స్ వ్యాగన్ అమియో, పోలో సైతం సెలవు తీసుకున్నాయి. ఐదేళ్ల క్రితం దాదాపు 30 వరకు ప్యాసింజర్ కారు మోడల్స్ కస్టమర్లకు విభిన్న ఆప్షన్లతో కనువిందు చేయగా.. ఇప్పుడీ సంఖ్య 15కు పడిపోవడం విశేషం. ఒకపక్క మోడల్స్ తగ్గిపోవడంతో పాటు కస్టమర్ల కొనుగోలు ధోరణి మారుతుండం కూడా కాంపాక్ట్ ప్యాసింజర్ కార్లకు గండికొడుతోంది!!



82,000పైకి బంగారం

- న్యూఢిల్లీలో రూ.82,400కు జంప్
- అంతర్జాతీయంగా రికార్డు పరుగు
- ఔన్స్ రేటు 2,800 డాలర్ల పైకి...



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పటిష్ట ధోరణికి తోడు దేశంలో పండుగల సీజన్ బంగారం ధరకు ఊతం ఇస్తోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 10 గ్రాములు 99.9 స్వచ్ఛత ధర మొదటిసారి రూ.82 వేల మైలురాయిని దాటి రూ.82,400ను తాకింది. మంగళవారం ముగింపుతో పోల్చితే ఏకంగా రూ.1,000 పెరిగింది. 99.5 స్వచ్ఛత ధర సైతం రూ.1,000 పెరిగి రూ.82,000కు ఎగసింది. గత ఏడాది అక్టోబర్ 29వ తేదీ (రూ.61,200) నుంచి పసిడి ధర ఏకంగా 35 శాతం పెరిగింది. ఇక వెండి విషయానికి వస్తే కేజీ రూ.1,300 పెరిగి రూ.1,01,000కు ఎగసింది. గడచిన ఏడాది కాలంలో రూ.74,000 నుంచి ఈ మెటల్ విలువ 36 శాతం పెరిగింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ ఫ్యూచర్స్ ఔన్స్ (31.1 గ్రాములు) 20 డాలర్లు పెరిగి ఆల్‌టైమ్ రికార్డు 2,801.65 డాలర్లను చేరింది. ఈ వార్త రాస్తున్న 10 గంటల సమయంలో కూడా దాదాపు అదే స్థాయిలో ట్రేడవుతుండడం గమనార్హం. ఇందుకు అనుగుణంగానే దేశీయ ఫ్యూచర్స్‌లో గరిష్ట స్థాయి ధరల్లో పసిడి ట్రేడవుతోంది.

బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ 427 పాయింట్లు డౌన్
- నిఫ్టీకి 126 పాయింట్ల నష్టం



ముంబై: బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు బుధవారం నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన ధోరణి ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 427 పాయింట్లు నష్టపోయి 80వేల దిగువన 79,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126 పాయింట్లు పతనమై 24,341 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 79,822 – 80,436 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 24,307 వద్ద కనిష్టాన్ని, 24,498 వద్ద గరిష్టాన్ని తాకింది. సర్వీసెస్, ఇండస్ట్రియల్, ఎఫ్ఎంసీజీ, కమోడిటీస్, టెలికం షేర్లకు డిమాండ్ నెలకొంది. ముఖ్యంగా చిన్న కంపెనీల షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ ఒకటిన్నర శాతం పెరిగింది.

■ గోదావరి బయోరిఫైనరీస్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.352తో) పోలిస్తే 12% డిస్కౌంట్‌తో రూ.310 వద్ద లిస్టయ్యింది. చివర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో కొంత కోలుకొని 3% నష్టంతో రూ.343 వద్ద ముగిసింది.

మౌలిక రంగం.. మందగమనం

సెప్టెంబర్‌లో వృద్ధి 2 శాతమే



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక గ్రూప్ సెప్టెంబర్‌లో పేలవ పనితీరును ప్రదర్శించింది. వృద్ధి రేటు (2023 ఇదే నెలతో పోల్చి) కేవలం 2 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఇదే నెలలో ఈ గ్రూప్ వృద్ధి 9.5 శాతం. 2024 ఆగస్టుతో(1.6 శాతం క్షీణత) పోల్చితే మెరుగ్గా నమోదవడం ఊరటనిచ్చే అంశం. క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, విద్యుత్ రంగాలు క్షీణ రేటును నమోదుచేసుకున్నాయి. బొగ్గు, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువులు, స్టీల్, సిమెంట్ వృద్ధి రేటు స్వల్పంగా ఉంది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య, ఈ గ్రూప్ వృద్ధి రేటు 4.2 శాతంగా నమోదైంది.

ఎల్‌అండ్‌టీ లాభం అప్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్‌అండ్‌టీ) కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (2024–25, క్యూ2)లో 5 శాతం వృద్ధితో రూ. 3,395 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది ఇదే కాలంలో రూ. 3,223 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 52,157 కోట్ల నుంచి రూ. 62,656 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 47,166 కోట్ల నుంచి రూ. 57,101 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో రూ. 80,045 కోట్ల విలువైన ఆర్డర్లు పొందింది. కాగా.. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల్లోనూ పటిష్ట పనితీరును నమోదు చేసినట్లు ఎల్‌అండ్‌టీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. రూ. 5 లక్షల కోట్లకుపైగా విలువతో రికార్డు ఆర్డర్‌బుక్‌ను సాధించినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు 0.8 శాతం లాభంతో రూ. 3,407 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
దీపావళి మెరుపుల్ ..
సంవత్ 2081కు బ్రోకరేజీల స్టాక్ సిఫార్సులు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ హైకోర్టులో 33 లా క్లర్క్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు ఒప్పంద ప్రాతిపదికన లా క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ హైకోర్టు తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ, సికింద్రాబాద్‌లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33.
» **పోస్టుల వివరాలు:** తెలంగాణ హైకోర్టు–31, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమి, సికింద్రాబాద్‌లో–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా) ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్ జనరల్, తెలంగాణ హైకోర్టు, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 23.11.2024.
» **వెబ్‌సైట్:** https://tshc.gov.in

బెల్, ఘజియాబాద్‌లో 77 ఇంజనీర్ పోస్టులు

బెల్ ఘజియాబాద్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 77.
» **పోస్టుల వివరాలు:** ట్రైనీ ఇంజనీర్ 1–49, ప్రాజెక్ట్ ఇంజనీర్ 1–28.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ట్రైనీ ఇంజనీర్–1 పోస్టులకు 28 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్–1 పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు ట్రైనీ ఇంజనీర్–1 పోస్టులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.35,000, మూడో ఏడాది రూ.40,000, ప్రాజెక్ట్ ఇంజనీర్–1 పోస్టులకు మొదటి ఏడాది రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.55,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.11.2024
» **రాతపరీక్ష తేది:** 2024 డిసెంబర్ మొదటి వారం
» **వెబ్‌సైట్:** https://bel-india.in

మంచి మార్కులకు మార్గాలివే!

పదో తరగతి.. విద్యార్థి కెరీర్‌కు పునాది! పదో తరగతిలో పొందే మార్కులు భవిష్యత్తు గమనాన్ని నిర్దేశిస్తాయి! ఆయా సబ్జెక్ట్‌లలో పొందిన మార్కుల ఆధారంగానే ఉన్నత విద్య కోర్సు ఎంచుకోవడం జరుగుతోంది. ఇంతటి కీలకమైన పదో తరగతి వార్షిక పరీక్షలకు రంగం సిద్ధమవుతోంది! ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మార్చిలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. రెండు తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు, సబ్జెక్టుల వారీగా.. ఉత్తమ స్కోర్ సాధించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

» ఏపీ, తెలంగాణలో 2025 మార్చిలో పరీక్షలకు అవకాశం
» సిలబస్‌పై పట్టు, ప్రాక్టీస్‌తో బెస్ట్ స్కోరు
» సమయ పాలన ఎంతో కీలకం



పదో తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు అందుకోవడానికి వీలుగా టెన్త్ బోర్డు పరీక్షల్లో టాప్ స్కోర్ సాధించేలా కృషి చేయాలి. పరీక్షల తేదీలను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని విద్యార్థులు తరగతి బోధనతోపాటు పరీక్షల ప్రిపరేషన్‌కు సమాంతరంగా వినియోగించుకుంటే ఉత్తమ స్కోర్ సాధించొచ్చు.

మార్చిలో బోర్డు పరీక్షలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో గతేడాది(2024) మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సారి కూడా దాదాపు అదే సమయంలో పరీక్షలు జరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. మార్చి(2025) రెండు/మూడో వారంలో పరీక్షలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పటి నుంచి సబ్జెక్టుల వారీగా విద్యార్థులు తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలని నిపుణులు, సబ్జెక్ట్ టీచర్స్ సూచిస్తున్నారు.

తెలుగు

తెలుగు మాతృ భాష అనే ఆలోచనతో విద్యార్థులు ఈ సబ్జెక్ట్‌ను కొంత తేలిగ్గా తీసుకుంటారు. కానీ ఇందులో మంచి మార్కులు, తద్వారా మంచి గ్రేడ్ పాయింట్లు పొందాలంటే మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందే. అందుకోసం పద్యభాగం, గద్య భాగంలోని అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరి పెట్టకుండా..సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతంగా ఆలోచిస్తూ చదవాలి. ఉప వాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. తెలుగు సబ్జెక్ట్‌లో వ్యాకరణం కూడా ముఖ్యమే. ఈ వ్యాకరణంలో మెరుగ్గా రాణించాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి. ఇప్పటి నుంచి ప్రతి రోజు క్లాస్ రూంలో బోధించే అంశాలను, అదే రోజు ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థులు జనవరి మొదటి వారం నుంచి పునశ్చరణకు సమయం కేటాయించే విధంగా తమ అభ్యసన సమయాన్ని రూపొందించుకోవాలి.

ఇంగ్లిష్

గ్రామీణ ప్రాంత విద్యార్థులు కొంత ఆందోళన చెందే సబ్జెక్ట్ ఇంగ్లిష్. కానీ.. ఇందులోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంది. ఇందుకోసం ముందుగా ఇంగ్లిష్ పదజాలం, వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. వెర్బల్, నాన్–వెర్బల్ అంశాలు బాగా చదవాలి. ఉదాహరణకు టేబుల్స్, బార్ డయాగ్రమ్స్, పై చార్ట్స్‌ను లోతుగా అధ్యయనం చేయాలి. అదే విధంగా వాటిని తాము సొంతంగా విశ్లేషించేలా నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాల సమాధానాలను పరిశీలించడం మేలు చేస్తుంది. విద్యార్థులు ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతంగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. చదవడంతోపాటు ప్రాక్టీస్ చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. అదే విధంగా..రీడింగ్ కాంప్రహెన్షన్ పెరిగే విధంగా ప్రిపరేషన్ సాగించాలి. అన్ సోన్ ప్యాసేజ్ కింద ఇచ్చే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ఆ ప్యాసేజ్ సారాంశాన్ని గుర్తించే విధంగా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

మ్యాథమెటిక్స్

భవిష్యత్తులో ఉన్నత విద్య, ప్రవేశ పరీక్షలకు ఎంతో కీలకంగా నిలుస్తున్న సబ్జెక్ట్‌గా మ్యాథమెటిక్స్‌ను పేర్కొనొచ్చు. ఈ సబ్జెక్టుకు సంబంధించి ప్రతి చాప్టర్‌ను పూర్తిగా అధ్యయనం చేయడంతోపాటు వాటికి సంబంధించిన ప్రశ్నల(ప్రాబ్లమ్స్)ను ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం,పేపర్–2లో రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించాలి. విద్యార్థులు ప్రిపరేషన్ సమయంలోనే సమస్య సాధనతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్‌లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేస్తే సులభంగా 60 శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు.

ఫిజికల్ సైన్స్ (పీఎస్)

రెండు భాగాలుగా ఉండే సైన్స్‌లో.. ఫిజికల్ సైన్స్ ఎంతో ముఖ్యమని గుర్తించాలి. ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అనువర్తిత ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. ఫిజిక్స్ నుంచి ఏడు, కెమిస్ట్రీ నుంచి ఏడు మొత్తం 14 చాప్టర్లు చదవాల్సి ఉంటుంది. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చు. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం–పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం,రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై ఎక్కువ శ్రద్ధతో చదవాలి. అదే విధంగా..మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే సన్నద్ధత లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సామర్థ్యం పెరిగి మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

నేచురల్ సైన్సెస్ (ఎన్ఎస్)

సైన్స్‌లో రెండో పేపర్‌గా ఉన్న జీవశాస్త్రం సబ్జెక్ట్‌లోనూ అవగాహన, సొంత విశ్లేషణ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక అంశాన్ని నేర్చుకున్న తర్వాత దాన్ని వాస్తవ పరిస్థితులతో అన్వయించే నేర్పు సొంతం చేసుకోవాలి. ప్రయోగాలకు సంబంధించి ప్రయోగం ఫలితంతోపాటు.. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

సోషల్ స్టడీస్

ఇటీవల కాలంలో ముఖ్యంగా సీసీఈ, సమ్మేటివ్, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నేపథ్యంలో.. సోషల్ స్టడీస్‌లో అడిగే ప్రశ్నల తీరులో మార్పు వచ్చింది. సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. పాఠ్యపుస్తకంలో ఒక అంశం గురించి ఉంటే.. దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవడం ఎంతో లాభిస్తుంది. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయాలి. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం–భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భా రత జాతీయోద్యమ చరిత్రపై ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి సంగ్రహించారో తెలుసుకోవాలి. డయాగ్రమ్/రేఖాచిత్ర, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను కూడా ప్రాక్టీస్ చేయాలి.

సమయ పాలన

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు.. బెస్ట్ స్కోర్ కోసం ఇప్పటి నుంచే నిర్దిష్ట సమయ పాలనతో అడుగులు వేయాలి. దీనికి అనుగుణంగా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి. జనవరి నుంచి అధిక సమయం పునశ్చరణకు కేటాయించాలి. జనవరి చివరి నాటికి ప్రిపరేషన్, రివిజన్ రెండింటినీ పూర్తి చేసుకోవాలి. ఫిబ్రవరి నుంచి మార్చి మొదటి వారం వరకు ప్రీ–ఫైనల్స్‌కు హాజరవ్వాలి.

ఈ నైపుణ్యాలు తప్పనిసరి

పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్ట్‌లకు సంబంధించి అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి. ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి. మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి. ప్రతి అంశాన్ని సొంతగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రతి అంశంపై కచ్చితమైన అభిప్రాయం ఏర్పరచుకునేలా వ్యవహరించాలి. ఫలితంగా ప్రశంస/ విమర్శలకు సంబంధించి ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు సులువుగా రాయొచ్చు.

పదో తరగతి పరీక్షలు.. ముఖ్య సూచనలు

- సబ్జెక్ట్‌ల వారీగా అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- మ్యాథమెటిక్స్,సైన్స్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

క్లుప్తంగా...

గోండు కళాకారుడికి అవార్డు



జైనూర్ (ఆసిఫాబాద్): ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను తెలిపేలా దండారీ ఉత్సవాల చిత్రాన్ని గీసిన ఆదివాసీ కళాకారుడు మడావి ఆనంద్‌రావు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం రాసిమెట్ట గ్రామానికి చెందిన మడావి ఆనంద్‌రావు చిత్రకళలో రాణిస్తున్నాడు. ఈ క్రమంలో 13 రోజులుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సంప్రదాయ చిత్రకళా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ఆనంద్‌రావు గుస్సాడీ నృత్యాలకు సంబంధించిన చిత్రం గీసి అవార్డు అందుకున్నారు.

తిరునక్షత్ర మహోత్సవానికి రండి

సీఎం, డిప్యూటీ సీఎంలకు ఆహ్వానం

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో సమతాస్ఫూర్తి కేంద్రంలో నవంబర్ 1 నుంచి జరగనున్న శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నిర్వాహకులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని శ్రీ అహోబిల జీయర్ స్వామి బుధవారం వీరిద్దరిని కలిసి ఈ మేరకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

కమలాహారిస్ గెలుపు కోరుతూ 'శ్యామల' యజ్ఞం



పాల్వంచ: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ విజయాన్ని కాంక్షిస్తూ శ్రీరాజ శ్యామలాంబ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించారు. ఆమె తల్లి శ్యామలా గోపాలన్ పేరుతో ఏర్పాటు చేసిన ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ మహాయజ్ఞం నిర్వహించారు. 11 రోజుల కిందట ప్రారంభమైన ఈ యజ్ఞం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఎలాగైనా కమలా హారిస్ గెలవాలనే ఆకాంక్షతో ఈ యజ్ఞం నిర్వహించినట్లు సొసైటీ చైర్మన్ నల్లా సురేశ్‌రెడ్డి తెలిపారు. తాను కొంతకాలం అమెరికాలో పని చేశానని, ఆ సమయంలో సెనేటర్‌గా ఉన్న కమలా హారిస్‌ను కలిశానని చెప్పారు. భారతీయ మూలాలు కలిగిన ఆమె తల్లి శ్యామలా గోపాలన్ గురించి తెలుసుకుని ఆమె పేరుతో పాల్వంచలో ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించామని ఆయన వెల్లడించారు. కాగా, యజ్ఞం ముగింపు సందర్భంగా 40 మంది వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణాహుతి వేడుకను ఘనంగా నిర్వహించామని, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. త్వరలో కమలాహారిస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని, ఈ కార్యక్రమానికి అమెరికా నుంచి ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

విమానాలకు మళ్లీ బాంబు బెదిరింపులు

శంషాబాద్: విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతూనే ఉంది. మంగళవారం రాత్రి కూడా శంషాబాద్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే నాలుగు విమానాల్లో బాంబులున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో భద్రతాధికారులు చెన్నై నుంచి రాకపోకలు సాగించే రెండు విమానాలు, హైదరాబాద్ నుంచి ఢిల్లీ, అయోధ్యకు వెళ్లే మరో రెండు విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. బాంబుల్లేవని నిర్ధారించుకున్న అనంతరం విమానాలు ఇక్కడి నుంచి బయలుదేరాయి.

నిరసనలకు అనుమతి ఇవ్వండి

డీజీపీకి సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారానికి నవంబర్ 4న శాంతియుతంగా చేపట్టనున్న నిరసనలకు అనుమతివ్వాలని డీజీపీకి తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. రాజ్యాంగం ప్రకారం నిరసన తెలిపే హక్కు ఉన్నా హైదరాబాద్‌లో నెల రోజుల పాటు 144 సెక్షన్ విధించడం సరికాదని పేర్కొంది. గతంలో చేసిన పనులకు సర్పంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులు రావాల్సి ఉండగా, ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా వాటిని విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదు రవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి ఎలాంటి నష్టం కలిగించకుండా శాంతియుత మార్గంలో నిరసన తెలిపేందుకు అనుమతివ్వాలని కోరింది. బుధవారం ఈ మేరకు డీజీపీకి జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు రాంపాక నాగయ్య, మేడబోయిన గణేశ్, వెంకటాపూర్ రాజేందర్, సముద్రాల రమేశ్ వినతిపత్రం అందించారు.

స్క్రీన్‌టైమ్ పెరిగిన కొద్దీ.. మెదడు 'చిన్న'బోతోంది

ఇప్పుడంతా డిజిటల్ మయమే. ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వంటివి నిత్యావసరాల్లో భాగంగా మారిపోయాయి. పిల్లలు డిజిటల్, ఆన్‌లైన్ పాఠాలు నేర్చుకోవడం నుంచి పెద్దవాళ్లు ఉద్యోగంలో భాగంగా పనిచేయడం దాకా.. స్క్రీన్లకు అతుక్కుపోవడం సాధారణమైపోయింది.సరదాకో, వినోదం కోసమో చూడటం దీనికి అదనం. ఇలా 'స్క్రీన్ టైమ్ (ఎక్కువ సేపు స్క్రీన్ చూస్తూ గడపడం)' పెరగడం రానురాను ప్రమాదకరంగా మారుతోందని.. పిల్లల నుంచి పెద్దల దాకా జ్ఞాపకశక్తి, సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం తగ్గిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) హెచ్చరించింది.



మెదడు కుచించుకుపోయే ప్రమాదం..

డబ్ల్యూహెచ్‌ఓ అధ్యయనం ప్రకారం.. మనుషులలో ఆరేళ్ల వయసులోనే మెదడు కణాల అభివృద్ధి ఆగిపోతుంది. కానీ తర్వాత.. నాడీ కణాల నెట్‌వర్క్ (న్యూరల్ నెట్‌వర్క్) అభివృద్ధి, పరిస్థితులకు తగినట్టుగా నాడీ కణాల్లో మార్పులు (న్యూరో ప్లాస్టిసిటీ) జరుగుతూ ఉంటాయి. విపరీతమైన 'స్క్రీన్‌టైమ్'వల్ల వీటిపై ప్రభావం పడుతుంది. సాధారణంగా వృద్ధాప్యం వచ్చేసరికి మెదడులో న్యూరల్ నెట్‌వర్క్, ప్లాస్టిసిటీ తగ్గిపోతాయి. ఆపై వయసు మీదపడిన కొద్దీ మెదడు కుచించుకుపోతుంటుంది. అందుకే వృద్ధుల్లో మతిమరపు, ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. ఇప్పుడు పరిమితికి మించిన 'స్క్రీన్‌టైమ్'వల్ల అలాంటి సమస్యలు చిన్న వయసులోనే వస్తున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వివిధ వయసుల వారిలో స్క్రీన్‌తో ఎక్కువ, తక్కువ గడిపేవారి మెదళ్లను సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ ద్వారా పరిశీలించినప్పుడు ఈ అంశాలు వెల్లడైనట్టు స్పష్టం చేస్తున్నారు.

రెండేళ్లలోపు అసలే ఇవ్వొద్దు..

డబ్ల్యూహెచ్‌ఓ అధ్యయనం ప్రకారం.. రెండేళ్లలోపు చిన్నారుల మెదడు ఎదిగే క్రమంలో, అత్యంత సున్నితంగా ఉంటుంది. వారికి ఎట్టిపరిస్థితుల్లో ఫోన్ ఇవ్వొద్దు, వీడియోలేవీ చూపించవద్దు. అలా చేస్తే వారి మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

- మూడు నుంచి ఐదేళ్ల వరకు చిన్నారులకు గరిష్టంగా రోజుకు అరగంట వరకు స్క్రీన్‌టైమ్ ఉండొచ్చు.
- ఆరు నుంచి 14 ఏళ్లవరకు పిల్లలకు వారి డిజిటల్ పాఠాలు సహా మొత్తంగా రోజుకు రెండు గంటలకు మించి వాడొద్దు.
- యువకులు, పెద్ద వయసువారు కూడా రోజులో ఐదారు గంటలకు మించి 'స్క్రీన్'తో గడపకపోవడం మంచిది. కంప్యూటర్లపైనే పనిచేసే ఉద్యోగులకు ఇలా టైం తగ్గించడం సాధ్యంకాకపోవచ్చు. అలాంటివారు తగిన జాగ్రత్తలు, మధ్యలో విరామాలు తీసుకుంటూ ఉండటం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పిల్లలకు 'స్క్రీన్' అలవాటు తగ్గేదిలా..

- ✔ పిల్లలు స్క్రీన్‌కు అతుక్కుపోయే సమయం తగ్గించడం మొదటి స్టెప్. ఇందుకోసం ఫోన్లు/ట్యాబ్లెట్లలో మానిటరింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేయాలి. టైమ్ రిమైండర్లు సెట్ చేయాలి.
- ✔ ఇంట్లో బెడ్రూం, డైనింగ్ ఏరియా వంటి చోట్ల 'నో–స్క్రీన్'జోన్‌గా పెట్టుకోవాలి. పెద్దవారు దీన్ని పాటిస్తే.. పిల్లలూ అనుసరిస్తారు.
- ✔ స్క్రీన్లకు దూరంగా ఉండేలా చిత్రలేఖనం, ఏవైనా పజిల్స్, ఆరు బయట ఆటలు వంటివి అలవాటు చేయాలి.



పెద్దలు 'స్క్రీన్' కు దూరంగా ఉండేలా..

- ✔ ఎక్కువ సేపు కంప్యూటర్లు/ ల్యాప్‌టాప్‌లపై పనిచేసేవారు మధ్యలో తరచూ కాసేపు బ్రేక్ తీసుకుంటూ ఉండాలి.
- ✔ ఇల్లు/ఆఫీసు ఆవరణలో కాసేపు నడవడం, నీళ్లు తాగడం, తోటివారితో మాట్లాడటం వంటివి చేయాలి.
- ✔ ఫోన్లను విపరీతంగా వినియోగించడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోవడాన్ని గుర్తుంచుకోవాలి.

'స్క్రీన్ టైమ్' పరిమితికి మించితే వచ్చే సమస్యలెన్నో..

మతిమరుపు, ఏకాగ్రత లేకపోవడం, సృజనాత్మకత, ఆలోచనాశక్తి వంటివి తగ్గిపోతాయి.. పనిలో, చదువుపై శ్రద్ధ తగ్గిపోయి వెనుకబడతారు.

అతిగా ఫోన్, ఇతర స్క్రీన్లను చూడటం వల్ల నిద్రలేమి సమస్య వస్తుంది. ఇది ఊబకాయం, ఈటింగ్ డిజార్డర్ల వంటి సమస్యలకు.. మధుమేహం, హైబీపీ వంటి వ్యాధులకూ దారితీస్తుంది.

కొన్నిసార్లు డిప్రెషన్, ఇతర మానసిక ఆందోళనలకూ అతి స్క్రీన్‌టైమ్ కారణమయ్యే ప్రమాదం ఉంటుంది.

సాక్షి సెంట్రల్‌డెస్క్

4 పేజీలు.. 100 ప్రశ్నలు

సుదీర్ఘంగా రాజ్ పాకాలను ప్రశ్నించిన పోలీసులు

శంకర్‌పల్లి: అనుమతి లేకుండా ఇంట్లో మద్యం పార్టీ నిర్వహించారనే కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను పోలీసులు బుధవారం ప్రశ్నించారు. సుమారు ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. రాజ్ పాకాల బుధవారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో తన న్యాయవాదులతో కలసి మోకిల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సుమారు 25 నిమిషాల అనంతరం నార్సింగి ఏసీపీ రమణగౌడ్ అక్కడికి చేరుకున్నారు. ఆయన, సీఐ వీరబాబు కలసి రాజ్ పాకాల న్యాయవాది అరవింద్‌కుమార్ సమక్షంలో వీడియో రికార్డింగ్ మధ్య రాజ్ పాకాలను ప్రశ్నించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ విచారణ కొనసాగింది.

జన్వాడ ఇంట్లో సీన్ రికన్‌స్ట్రక్షన్!

అనంతరం రాజ్ పాకాలను సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం, విజయ్ మద్దూరి ఫోన్ కోసం జన్వాడలోని ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ పార్టీ జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం పార్టీ జరిగిన ప్రదేశాలను రాజ్ పాకాలతో కలిసి ఏసీపీ రమణ గౌడ్, సీఐ వీరబాబు పునఃపరిశీలించారు. పార్టీ ఏ ప్రాంతంలో చేశారు? భోజనం ఏర్పాట్లు ఎక్కడ చేశారు? పురుషులు, మహిళలు కూర్చున్న ప్రాంతాలు ఏవి? అని రాజ్ పాకాలను ప్రశ్నించి.. సమాధానాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ మద్దూరి ఫోన్ కోసం వెతకగా దొరకలేదు. పార్టీకి సంబంధించి అనుమానాలున్న ఇతర ఈ ఆధారాలు కూడా లభించలేదు. తర్వాత రాజ్ పాకాలను తీసుకుని తిరిగి మోకిల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అక్కడ తిరిగి ప్రశ్నించారు.

సుదీర్ఘంగా కొనసాగిన విచారణ..

జన్వాడ ఇంట్లో పార్టీ విషయంగా పోలీసులు 4 పేజీల్లో సుమారు 100 ప్రశ్నలను సిద్ధం చేసుకుని ప్రశ్నించినట్టు తెలిసింది. ''మీ బావ కేటీఆర్ పార్టీకి ఎందుకు రాలేదు? జన్వాడలో భూమి ఎప్పుడు కొన్నారు? ఇంటి నంబర్ ఎలా తీసుకున్నారు? పన్ను చెల్లింపులు? విజయ్ మద్దూరితో పరిచయం? పార్టీలో పాల్గొన్న వారితో ఉన్న పరిచయాలు?''వంటి అంశాలపై ప్రశ్నలు వేయగా.. రాజ్ పాకాల ఓపిగ్గా సమాధానం ఇచ్చినట్టు సమాచారం. చివరికి రాత్రి 8.20 గంటలకు పోలీసులు రాజ్ పాకాల ఫోన్‌ను సీజ్ చేసి, 35(3) కింద నోటీసులు ఇచ్చి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అయితే రాజ్ పాకాల స్టేట్‌మెంట్ నమోదు క్రమంలో పోలీసులు చేసిన పొరపాట్ల కారణంగా తీవ్ర ఆలస్యం జరిగింది. రెండు సార్లు వివరాలు సరిగ్గా రాసుకోకపోవడంతో.. మూడోసారి స్టేట్‌మెంట్ తీసుకోవాల్సి వచ్చినట్టు తెలిసింది.

ఆస్పత్రిలో విజయ్ మద్దూరి!

ఇక డ్రగ్ టెస్టులో పాజిటివ్‌గా తేలిన విజయ్ మద్దూరి అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన తరఫు న్యాయవాదులు మోకిల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పలు రకాల అనారోగ్య సమస్యలతో విజయ్ మద్దూరి బాధపడుతున్నారని.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులకు వివరించారు.

రేవ్ పార్టీ పేరిట బద్నాం చేశారు

జన్వాడలోని మా ఇంట్లో జరిగిన పార్టీకి సంబంధించి పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి, పూర్తిగా సహకరించా. వాళ్లు ప్రస్తుతానికైతే నన్ను మళ్లీ రమ్మని పిలవలేదు. ఫ్యామిలీ ఫంక్షన్‌ను రేవ్ పార్టీ అని ప్రచారం చేస్తూ, మమ్మల్ని బద్నాం చేశారు. డ్రగ్ నేను ఇచ్చినట్లు విజయ్ మద్దూరి చెప్పలేదు. అది అబద్ధం. అయినా ఆయనకు పాజిటివ్ వస్తే నాకేం సంబంధం? కావాలనే చిన్న విషయాన్ని పెద్దదిగా చేసి చూపిస్తున్నారు.

- రాజ్ పాకాల, కేటీఆర్ బావమరిది

అవసరమైతే మళ్లీ పిలుస్తాం

రాజ్ పాకాల ఇంట్లో అనుమతి లేకుండా నిర్వహించిన పార్టీపై విచారణ కొనసాగుతోంది. బుధవారం రాజ్ పాకాల విచారణ పూర్తయింది. అవసరముంటే.. మళ్లీ పిలిపించి విచారిస్తాం.

- రమణగౌడ్, నార్సింగి ఏసీపీ

మీరే అసిస్టెంట్లు మీకెందుకు అసిస్టెంట్లు!

ఏఈవోల పట్ల వ్యవసాయ శాఖ కార్యదర్శి అనుచిత వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్

'మీరే అసిస్టెంట్లు.. మీకెందుకు అసిస్టెంట్లు'అని వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడటంపై ఏఈవోలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే సందర్భంగా తమకు అసిస్టెంట్లు కావాలని వారు కోరుతున్న నేపథ్యంలో రఘునందన్‌రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ విస్తరణ అధికారులతో రఘునందన్‌రావు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. చర్చల్లో భాగంగా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఏఈఓలు చర్చలను మధ్యలోనే బహిష్కరించి వచ్చేశారు. డిజిటల్ క్రాప్ సర్వే చేయడం లేదనే కారణంగా ఉన్నతాధికారులు వేధింపులకు చేస్తున్నారని ఏఈఓలు విమర్శించారు. మహిళల భద్రతపై కనీసం కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 30 రోజులుగా శాంతియుత నిరసనలు తెలుపుతున్న తమపై ఉన్నతాధికారుల ఏకపక్ష వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పట్టనున్నట్లు తెలిపారు. దీపావళి తర్వాత స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ క్రాప్ సర్వే మూలన పడింది. వారం రోజుల కిందట 160 మంది ఏఈఓలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వారి సస్పెన్షన్ ఎత్తివేతపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంతేకాకుండా మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఇప్పటివరకు చర్చలు జరపలేదు.

మా ఇంటి 'మహా లక్ష్మి'ని నిలబెట్టండి..

- చిన్నారికి 'డికాంపెన్సటేడ్ లివర్ డిసీజ్'
- వైద్య ఖర్చుల కోసం రూ.22 లక్షలు అవసరం
- కూలి పనికి వెళ్తేనే పూటగడిచే స్థితిలో తల్లిదండ్రులు.. దాతల సాయం కోసం ఎదురుచూపు

ప్రాణాపాయ స్థితిలో చిన్నారి



టేకుమట్ల: రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. తండ్రి ఆటోడ్రైవర్, తల్లి దినసరి కూలీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఉన్నట్టుండి వారి కూతురు అనారోగ్యం పాలవడంతో ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించగా పెద్దరోగం వచ్చిందని డాక్టర్లు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన దండ్రె రమేష్, కవిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు మహాలక్ష్మి నెల రోజుల క్రితం అనారోగ్యం పాలవడంతో వివిధ ఆస్పత్రులకు తీసుకువెళ్లి చికిత్స చేయించారు. చివరకు ఆ బాలికకు 'డికాంపెన్సటేడ్ లివర్ డిసీజ్'అని డాక్టర్లు తేల్చడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్సనందిస్తున్నారు. ప్రస్తుతం పాప ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికే అందినకాడ అప్పు చేసి వైద్యం చేయించారు. ఇంకా రూ.22 లక్షల మేర ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడంతో ఆ తల్లిదండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. కూలీ పని చేసుకుని జీవించే తమ బతుకుల్లో పెద్దకష్టం వచ్చిందని, పాపకు వైద్యం చేయించేందుకు దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సాయం చేసేవారు ఈ నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపాలని (97013 29434) కోరుతున్నారు.

ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు చదివిస్తా..

- పేద విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి అండ
- వైద్య కళాశాలకు ఫీజు చెల్లింపు



సుమలతను ఆశీర్వదిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కౌడిపల్లి(నర్సాపూర్): చదువుల తల్లి సుమలతకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా నిలిచారు. ఆమె ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు ఫీజు చెల్లించి.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ భద్యతండాకు చెందిన కాట్రోత్ శివరాం, గంసీల కూతురు కాట్రోత్ సుమలతకు ఎంబీబీఎస్ సీటు వచ్చినా.. ఆర్థిక ఇబ్బందులతో కూలి పనులకు వెళ్తోందని బుధవారం సాక్షి దినపత్రికలో 'ఎంబీబీఎస్ సీటొచ్చినా కూలీ పనులకు'శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. సుమలత, ఆమె తండ్రి శివరాంను హైదరాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకుని మంత్రి మాట్లాడారు. సుమలత చదువుకు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా వైద్య కళాశాలకు రూ.1.5 లక్షలు చెల్లించారు. ఇతర ఖర్చులకు రూ.50 వేలు అందజేశారు. సుమలత ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాగా చదివి వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రికి సుమలత తండ్రి శివరాం కృతజ్ఞతలు తెలిపారు.

సీజేఐ లెటర్ పేరుతో డాక్టర్‌కు టోకరా

డిజిటల్ అరెస్టు ఫ్రాడ్ చేసి రూ.3 కోట్లు స్వాహా

సాక్షి, హైదరాబాద్: తాము పోలీసులమంటూ సైబర్ నేరగాళ్లు నగరంలోని ఓ డాక్టర్‌ను మోసం చేశారు. తాను ఐపీఎస్ అధికారినని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశాలు ఇచ్చారంటూ డాక్టర్‌ను డిజిటల్ అరెస్టు చేశారు. నిర్దోషిత్వం నిరూపించుకోవాలంటే నగదు చెల్లించాలంటూ గుడిమల్కాపూర్‌కు చెందిన ఆ డాక్టర్ నుంచి ఏకంగా రూ.3 కోట్లు స్వాహా చేశారు. మోసపోయిన విషయం తెలుసుకున్న బాధితురాలు వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు సదరు డాక్టర్‌కు ఫోన్ చేసి.. మొబైల్ బ్లాక్ చేస్తున్నామని, ఈ నంబర్ ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ బెదిరించారు. అయితే ఆ డాక్టర్ నమ్మకపోవడంతో ఢిల్లీ పోలీసులకు చెందినది అంటూ స్కైప్‌కు కనెక్ట్ చేశారు. ఐపీఎస్ అధికారినంటూ శశాంక్ జైస్వాల్ అనే వ్యక్తి పరిచయం చేసుకుని, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేరిట ఉన్న ఆర్డర్ కాపీని చూపించి బెదిరించాడు. మనీలాండరింగ్‌కు పాల్పడలేదని నిరూపించుకోవాలంటే ఆర్‌బీఐకి చెందిన ఖాతాలంటూ, వాటిలో డబ్బులు జమ చేయాలని, నిరపరాధిగా రుజువయ్యాక తిరిగి డబ్బు ఇచ్చేస్తామని చెప్పాడు. లేదంటే కుటుంబసభ్యుల ప్రాణాలకే ప్రమాదమని బెదిరించాడు. కుటుంబసభ్యులతోపాటు డాక్టర్‌కు సంబంధించిన ఆస్తులు, బ్యాంకు ఖాతాల వివరాలు ఆ నకిలీ ఐపీఎస్ అప్పటికే తెలుసుకున్నాడు. ఈ వివరాలన్నీ చెబుతుండటంతో డాక్టర్ భయంతో పలు దఫాలుగా ఆ ఖాతాల్లో రూ.3 కోట్లు జమ చేశారు. చివరకు తాను మోసపోయినట్టు గుర్తించిన సదరు డాక్టర్ సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పాట్లు



కామారెడ్డి జిల్లా బీబీపేటలో పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

బీబీపేట: కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం చేయూత పెన్షన్లను పంపిణీ చేశారు. పింఛన్ తీసుకోవడానికి వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తరలివచ్చారు. పోస్టల్ శాఖకు సంబంధించిన ఒక్క ఉద్యోగే పెన్షన్ పంపిణీ చేస్తుండడంతో క్యూ పెరిగిపోయింది. దీంతో కొంతమంది బీడీ కార్మికులు వరుసలో పాస్‌బుక్ ఉంచి, చెట్టుకిందకు వెళ్లి బీడీలు చుట్టారు. పింఛన్ కోసం వస్తే రోజంతా అక్కడే సమయం గడిచిపోతోందని బీడీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే బీడీ ఆకు, తంబాకు తెచ్చుకుని పనిచేసుకుంటున్నామన్నారు. పింఛన్ డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేస్తే ఇలాంటి ఇబ్బందులు తప్పుతాయని పేర్కొంటున్నారు.

సచివాలయం రక్షణ టీజీఎస్పీఎఫ్‌కు..

- అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆందోళనల నేపథ్యంలో టీజీఎస్పీపై వేటు
- పాత సచివాలయం రక్షణ చూసిన టీజీఎస్పీఎఫ్‌కే మళ్లీ బాధ్యత



సాక్షి, హైదరాబాద్: అత్యంత కీలకమైన సచివాలయం రక్షణ బాధ్యతల నుంచి తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)ను రాష్ట్ర ప్రభుత్వం తప్పించింది. వారి నుంచి తక్షణమే బాధ్యతలను స్వీకరించాలని తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్)ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏక్ స్టేట్–ఏక్ పోలీస్ నినాదంతో రాష్ట్రంలోని పలు బెటాలియన్లలో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనలు నిర్వహించిన నేపథ్యంలో ఆ విభాగాన్ని సచివాలయం రక్షణ బాధ్యతల నుంచి తప్పించడం గమనార్హం. కొత్త సచివాలయం నిర్మాణం పూర్తయిన తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 ఏప్రిల్25న టీజీఎస్పీకి రక్షణ బాధ్యతలను అప్పగించింది. దాదాపు 600 మంది టీజీఎస్పీ సిబ్బంది నిత్యం భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేవారు. పరిశ్రమలు, భవనాలు, విమానాశ్రయాలు వంటి వాటికి రక్షణ కల్పించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన టీజీఎస్పీఎఫ్‌కు సచివాలయం రక్షణ బాధ్యతలను అప్పగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆ విభాగం డీజీకి సూచిస్తూ డీజీపీ గత ఆగస్టు 13న లేఖ రాశారు. దీని ఆధారంగా టీజీఎస్పీఎఫ్‌కు సచివాలయం భద్రత బాధ్యతల్ని అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. సచివాలయం వద్ద సాయుధ పహారా, పెట్రోలింగ్, రాకపోకల నియంత్రణ, తనిఖీల బాధ్యతలను ఇప్పటివరకు టీజీఎస్పీ చూడగా, ఇకపై టీజీఎస్పీఎఫ్ చూడనుంది. కొత్త సచివాలయం నిర్మాణానికి ముందు 25 ఏళ్లపాటు పాత సచివాలయం రక్షణ బాధ్యతలను ఎస్పీఎఫ్ విభాగం చూడగా, మళ్లీ వారికే తిరిగి బాధ్యతలను అప్పగించడం గమనార్హం. సచివాలయం వద్ద క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్టీ) బాధ్యతల్లో ఆక్టోపస్, శాంతిభద్రతలు, ట్రాఫిక్ బాధ్యతల్లో హైదరాబాద్ నగర పోలీసులు యథాతథంగా కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది.

సీఎం భద్రత నుంచి టీజీఎస్పీ ఔట్!

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యక్తిగత భద్రత బాధ్యతల నుంచి సైతం టీజీఎస్పీ బలగాలను ప్రభుత్వం తప్పించినట్టు తెలిసింది. ఆ బాధ్యతలను టీజీఎస్పీఎఫ్‌కు అప్పగించినట్టు సమాచారం. రేవంత్ గాంధీ భవన్‌కు వచ్చినప్పుడు ఆయన వెంట టీజీఎస్పీఎఫ్ బలగాలు రావడం గమనార్హం.

సాయం చేస్తే డాక్టర్ అవుతా..

- బీహెచ్‌ఎంఎస్ సీటు సాధించిన పేద విద్యార్థి సంతోష్‌కుమార్
- ఫీజు కట్టలేని స్థితిలో దాతల చేయూత కోసం ఎదురుచూపు



అనంతగిరి: డాక్టర్ కావాలనుకుంటున్న ఆ విద్యార్థి కలకు పేదరికం అడ్డుపడుతోంది. మనసున్న దాతలు ఎవరైనా ఆర్థికంగా చేయూతనందిస్తే.. భవిష్యత్‌లో సమాజ సేవకు పాటుపడతానని చెబుతున్నాడు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్ద చెల్మెడ గ్రామానికి చెందిన సంతోష్.. వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేట మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివి, 959 మార్కులు సాధించాడు. నీట్‌లోనూ ఉత్తమ ర్యాంకు రావడంతో హైదరాబాద్‌లోని రామంతాపూర్ జేఎస్‌పీఎస్ హోమియో మెడికల్ కాలేజీలో బీహెచ్‌ఎంఎస్ (బ్యాచ్‌లర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసన్ అండ్ సర్జరీ) సీటు వచ్చింది. ఇంతవరకూ బాగానే ఉన్నా ఫీజు, వసతి కోసం నవంబర్ 2న లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉందని తెలిపాడు. అనారోగ్యం బారిన పడిన తండ్రి అశోక్ 11 నెలల క్రితం మృతిచెందగా.. తల్లి పుష్పమ్మ కూలి పనులు చేస్తోంది. తండ్రి మరణంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఫీజు కట్టే స్తోమత లేదని సంతోష్ వాపోతున్నాడు. ఆర్థిక సాయం చేయాలనుకునే దాతలు సెల్ నంబర్ 9963870085లో సంప్రదించాలని కోరాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఇందిరాగాంధీకి సీఎం రేవంత్ నివాళి

సాక్షి, హైదరాబాద్: తన ప్రతి రక్తపు బొట్టు దేశ పటిష్టతకు దోహదపడుతుందని ప్రకటించిన మహనీయురాలు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియా డారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె సేవలను స్మరించుకున్నారు. తన ప్రాణా లకు ముప్పు పొంచి ఉన్నా.. దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకున్నారని సీఎం గుర్తు చేసుకున్నారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీ కరణ, 20 సూత్రాల కార్యక్రమం వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ మహనీయుడు

సంస్థానాల విలీనం ద్వారా స్వాతంత్ర్య భారతదేశ సార్వభౌమత్వానికి నిండుదనాన్ని చేకూర్చిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరిం చుకున్నారు. ప్రథమ ఉప ప్రధానిగా, హోం శాఖమంత్రిగా ఆయన చూపిన చొరవ, సమర్థతతోనే వందలాది సంస్థానాలు దేశంలో విలీనమయ్యాయని తెలిపారు.

మెడిసిన్ విద్యార్థినికి సీఎం ఆర్థిక సాయం



సాక్షి, హైదరాబాద్: మెడిసిన్‌లో సీటు సాధిం చినా కాలేజీ ఫీజు కట్టే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్న గిరిజన విద్యార్థినికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలిచారు. ఫీజు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న కుమురం భీం జిల్లా జైనూరు మండలం జెండాగూడ గ్రామానికి చెందిన సాయిశ్రద్ధ విషయం తన దృష్టికి రాగానే సీఎం ఆమెను తన నివాసానికి పిలిపించుకున్నారు. ఆమె డాక్టర్ కావాలన్న కల నెరవేర్చే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని హామీనిచ్చి ఆర్థికసాయం అందించారు. ముఖ్యమంత్రి స్వయంగా పిలిచి ఆర్థిక సాయం చేయడంపై సాయిశ్రద్ధ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టుకు.. 'పేట' పుట్టినిల్లు

నాటి, నేటి తరాలకు సరికొత్త డిజైన్లు ● ఫ్యాషన్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి.. దేశవ్యాప్తంగా విక్రయాలు



నారాయణపేట నేతన్న నేసిన పట్టుచీరను కట్టుకున్న దివంగత ప్రధాని ఇందిరమ్మ (ఫైల్)

పట్టు, కాటన్ చీరలకు నారాయణపేట ప్రసిద్ధి. మారుతున్న డిజైన్లు, ఫ్యాషన్‌కు అనుగుణంగా చీరలను నేయడం పేట కార్మికుల ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా పేట పట్టుచీరలు గుర్తింపు పొందాయి. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సైతం 'పేట'చీరను ధరించారంటే ఇక్కడి పట్టు ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతానికి వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, వీఐపీలు పేట పట్టు, కాటన్ చీరలు తీసుకెళ్లడం పరిపాటిగా మారింది.

– నారాయణపేట

124 ఏళ్ల చరిత్ర..

నారాయణపేట చీరలకు పట్టణ ప్రాంతాల్లో ఎంతో ఆదరణ ఉంది. 124 ఏళ్లకు పైగా ఈ చీరలకు చరిత్ర ఉంది. 1900 నుంచే నారాయణపేటలో చేనేత కార్మికులు మగ్గాలపై కళ్లు చెదిరే పట్టు చీరలు నేసి, తమ నైపుణ్యాన్ని చాటుతూ వస్తున్నారు. తొమ్మిదేళ్ల క్రితం పేటెంట్ హక్కును కూడా సాధించుకున్నారు. పూణె, ముంబయి, సాంగ్లీ, షోలాపూర్, గుల్బార్గా, యాద్గీర్, నాగ్‌పూర్, ఏపీ, తెలం గాణలోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ చీరలకు ఆర్డర్లు చేసేవారు ఉన్నారు. కర్ణాటక ప్రాంత వాసులు సైతం ఇక్కడకు వచ్చి చీరలు కొనుగోలు చేస్తారు.

నారాయణపేట పట్టుచీరకు రుద్రాక్ష, కోటకొమ్మతో బార్డర్ ఉంటుంది. అదే ఐకాన్‌తో పేట పట్టుచీరలను గుర్తిం చాలని వ్యాపారస్తులు చెబుతున్నారు. ప్రస్తుతం పట్టు చీరల్లో నారాయణపేట పట్టు, నివాళి ధనవతి, ప్లైన్, నివాళి ధనవతికడ్డి, నివాళి శంభుప్లేన్, నివాళి శివశంభుకడ్డి, నిపాణి ప్లేన్‌బార్డర్, టెంపల్ డిజైన్ వంటివి ముఖ్యమైనవి. నేటి యువత అభిరుచులకు తగ్గట్టు చీరలను ఆర్డర్‌పై నేస్తుంటారు.



శివశంభు బార్డర్ చీర

నారాయణపేటలో తయారయ్యే పట్టుచీరలు వాటి ధరలు (రూ.లలో)

పట్టు చీరలు	కనిష్ట	గరిష్ఠం
టెంపల్ గర్భరేషన్	3,200	5,000
ధనవతి టెంపల్ ప్లేన్	3,700	6,000
ధనవతి టెంపల్ చెక్స్	3,800	7,800
గోమి బాడర్	3,750	6,750
నిపానీ బాడర్	3,800	6,800
నిఖిల్ బాడర్	3,850	7,000
శంభు బాడర్	3,900	8,000
పారాస్ బాడర్	4,000	8,500
నారాయణపేట బాడర్	4,500	12,000
న్యూ నారాయణపేట	5,000	15,000
ఫైటానియా సాదాబుట్టా	4,500	12,000
ఫైటానియా మీద బుట్టా	5,000	15,000
ఫైటానీ టర్నింగ్ బుట్ట	14,000	0,000
ఫైటానీ ఫుల్‌టర్నింగ్	20,000	25,000

మాది ఆరవ జనరేషన్



మా ముత్తాతల నుంచి పట్టు, కాటన్ చీరలను నేసి విక్రయిస్తున్నాం. మా తాతలు తుకారాం, మోనప్ప, నాగూరావుల వారసత్వంగా మాది ఆరవ జనరేషన్. ఇక్కడ తయారు చేసిన పట్టు, కాటన్ చీరలను దేశంలోని మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణలోని నగరాలు, పట్టణాల్లో వ్యాపారుల ద్వారా విక్రయిస్తాం.

– విజయ్‌కుమార్ బసూదే, చేనేత వస్త్రాల వ్యాపారి

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలందరికీ శాసన మం డలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధిం చిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుం టామని పేర్కొన్నారు. అజ్ఞానాంధకారాన్ని పారదోలి జ్ఞానపు కాంతులు ప్రసరింపజేయాలనే తత్వాన్ని దీపావళి నేర్పుతుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాం తులతో, సిరిసంపదలతో తులతూగాలని మనసారా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

దీపావళిని పర్యావరణహితంగా జరుపుకోవాలి

అటవీ శాఖమంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: వెలుగులు పంచే దీపావళి పం డుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని అటవీ, పర్యావరణ శాఖమంత్రి కొండా సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు. బాణసంచా కాల్చే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీపావళి రోజున వెలిగించే దీపాలు మనిషిలో జ్ఞానచైతన్యాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మంత్రి సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాం గ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నిం పేందుకు నిష్టతో అడుగులు వేస్తోందని వెల్లడించారు.

జీవితాల్లో వెలుగులు పంచేలా దివ్వెల పండుగ

పీఆర్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: అసమానతల చీకట్లను పారదోలి తోటి వారి జీవితాల్లో వెలుగులు పం చేలా దివ్వెల పండుగ జరుపుకోవాలని పీఆర్ శాఖ మంత్రి సీతక్క ఆకాంక్షించారు. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్టుగా ఒకరికొకరు చేయూతగా నిలిచి ప్రజా ప్రభుత్వ లక్ష్యమైన సకల జనుల సం క్షేమానికి, తెలంగాణ ప్రగతికి పాటు పడాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు సీతక్క దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో నియంతృత్వ చీకట్లను తరిమి ప్రజాస్వామ్య వెలుగులు పూయించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వెలుగుల పం డుగ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నిం పాలని బుధవారం ఒక ప్రకటనలో ఆకాంక్షిం చారు. బాణసంచా కాల్చి సంబురాలు చేసుకునే ఈ పండుగను జాగ్రత్తగా, భద్రంగా జరుపుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు ఆ ప్రకటనలో మహేశ్‌గౌడ్ హృ దయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

కొత్తగా ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ స్కూల్స్

బీసీ గురుకుల సొసైటీ పరిధిలో ఏర్పాటుకు నిర్ణయం ● ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పణ...త్వరలో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుక బడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్) పరిధిలో కొత్తగా ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) పాఠశాలలు ఏర్పాటు కానున్నా యి. ఈ మేరకు సొసైటీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సం బంధించిన ప్రతి పాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరగా... అతి త్వరలో వీటిని ఆమోదించనుంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ స్కూళ్ల లక్ష్యం. ప్రధానంగా ఎం సెట్, నీట్, జేఈఈ, క్లాట్‌తోపాటు ఇతర ప్రఖ్యాత వర్సిటీలు, కాలేజీల్లో ప్రవేశాలకు ఈ పాఠశాలల్లో శిక్షణ ఇస్తారు.

ఇప్పటివరకు రెండు మాత్రమే సీఓఈలు

ప్రస్తుతం బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 295 గురుకుల పాఠశాలలుండగా... రెండు మాత్రమే సీఓఈలు ఉన్నాయి. ఇందులో ఒకటి బాలుర, మరొకటి బాలికల పాఠశాలలు. తాజాగా ఎనిమిది పాఠశాలలను సీఓఈలుగా ఏర్పాటు చేయడంతో ఎక్కువమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర నుంది. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 30 సీఓ ఈలు ఉండగా...ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 16 సీఓఈలున్నాయి. ఎక్కువ సంఖ్యలో సీఓఈలు ఉండటంతో ఈ రెండు సొసైటీల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొంటూ సీట్లు సాధిస్తున్నారు. తాజాగా బీసీ గురుకుల సొసైటీలో కూడా సీఓఈల ఏర్పాట్లు ర్యాంకర్లు పెరుగుతారని సొసైటీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


డెడికేటెడ్ కమిషన్‌నే ఏర్పాటు చేయాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వా నికి హైకోర్టు జారీ చేసిన ఆదేశాలపై బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ హర్షం వ్యక్తంచేశారు. ఈ తీర్పును స్వాగతిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ, కుల సర్వే అం శంపై ప్రభుత్వం సంపూర్ణమైన అధ్య యనం చేయకుండా ముందుకు పోతోందని విమర్శించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకా లకు విరుద్ధంగా, మరోవైపు బీసీ మేధావులు, న్యాయ కోవిదుల అభిప్రాయాలను స్వీకరించకుండానే ఏకప క్షంగా విధానపర నిర్ణయాలను తీసుకుంటోందని ధ్వజ మెత్తారు. ఈ తొందరపాటు విధానాల వలన బీసీల ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదముందని, అందుకే ముం దు నుంచే తాము పలు మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని సురేశ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాల వల్ల రాబోయే స్థానిక సంస్థల్లో మొత్తంగా బీసీ రిజర్వేష న్లనేవి గల్లంతయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. నిర్ణీత సమయంలో కులగణనను పూర్తిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించేలా ముఖ్యమంత్రి నిబద్ధతతో వ్యవహరించాలని సురేశ్ డిమాండ్ చేశారు.

● సోలార్ ప్రాజెక్టు ●





అలలపై సౌర వెలుగులు

భారతావనిలో అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

రూ.800 కోట్లతో 176 మెగావాట్ల సోలార్ విద్యుత్ విస్తరణ ● నవంబర్‌లో ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన!

ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన

నవంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా రూ. 800 కోట్ల వ్యయం తో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబం ధించి ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్మాణ కాంట్రాక్టు పొందింది. ప్రాజెక్టుకు అవసరమైన సోలార్ ప్యానళ్లు **ఇతర** పరికరాలు ప్లాంట్‌కు చేరుకున్నాయి. **100** ఫ్లోటింగ్, 10 మెగావాట్ల సర్ఫే**స్** సోలార్ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు కొత్తగా నిర్మించబోయే 176 మెగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణం పూరెతై 286 మెగావాట్ల సోలా**ర్ వెలుగులతో అతిపెద్ద** ప్రాజెక్టుగా పెద్దపల్లి ఎన్టీపీసీ అవతరించనుంది.

సాక్షి, పెద్దపల్లి: భారతావనిలో అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటుగా పెద్దపల్లి జిల్లా రామగుండం ఆవిర్భవించనుంది. అలలపై సౌర వెలుగులును ప్రజలకు పంచనుంది. ప్రస్తుతం ఎన్టీపీసీ రామగుండం రిజర్వాయర్ లో 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 10 మెగావాట్ల గ్రౌండ్‌మౌంట్ సోలార్ ప్రాజెక్టు నిర్మితమై ఉంది. ఐతే ఎన్టీపీసీ ఇటీవల గ్రీన్ ఎనర్జీ (సాంప్రదాయేతర) పై ప్రత్యేక దృష్టిసా రించి వాటి ఉత్పత్తి పెంచేలా ప్రాజెక్టులను విస్తరిస్తుంది. ఈక్రమంలో సోలార్‌ప్లాంట్‌ను విస్తరించేందుకు రిజర్వాయర్‌లో కొత్తగా 56 మెగావాట్ల ఫ్లోటింగ్, 120 మెగావాట్ల గ్రౌండ్ మౌంట్ సోలార్ ప్రాజెక్టును నిర్మించేందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. లాంఛనంగా నిర్మాణ పనులకు భూమి పూజ సైతం చేశారు. ఇప్పటికే 100 మెగావాట్లతో దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సౌర ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ, మరో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుత్ యూనిట్‌ను నిర్మించి 156 మెగావాట్లతో అలలపై సోలార్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌గా రామగుండం ఎన్టీపీసీ మారనుంది.

గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంలో భాగంగా..

అణు, బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ కేం ద్రాలతో కర్బన ఉద్గారాల కారణంగా కాలు ష్యం రోజురోజుకూ పెరుగుతోంది. దీనిపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతుం డగా, మన దేశంలో థర్మల్ విద్యుత్ వాటానే అధికం. భూతాప నివారణ లక్ష్యాలతో భాగం గా దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ అయిన ఎన్టీపీసీ 2032 నాటికి 6వేల గిగావాట్ల గ్రీన్‌పవర్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిలో భాగంగా రామగుండంలోని ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్‌ను విస్తరిస్తున్నారు.

ఎన్టీపీసీ సోలార్ ప్రాజెక్టు ఇలా...

ఇప్పటికే నిర్మితమైంది:
- 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్
- 10 మెగావాట్ల గ్రౌండ్‌మౌంట్ సోలార్

కొత్తగా నిర్మించబోయేది:
- 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్
- 120 గ్రౌండ్‌మౌంట్ సోలార్



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

శ్రీనివాస్‌రెడ్డితో సమాచార శాఖ కమిషనర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిష నర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీశ్.. బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్‌కే భవన్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కమిషనర్‌కు చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంపై ఉభయులు చర్చించారు.

సమష్టి సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించా

రిటైర్మెంట్ కార్యక్రమంలో సమాచార శాఖ అదనపు సంచాలకుడు నాగయ్య



సాక్షి, హైదరాబాద్: సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో అదనపు సం చాలకుడిగా విధులు నిర్వర్తిస్తున్న నాగయ్య కాంబ్లే బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ శాఖ పూర్వ కమిషనర్ హనుమంతరావు, ప్రస్తుత కమిషన ర్ హరీశ్, అధికారులు, ఉద్యోగులు నాగయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ సమష్టి సహకారంతో సమర్థవం తంగా విధులు నిర్వర్తించానన్నారు. ఐ అండ్ పీఆర్ కమిషనర్ హరీశ్ మాట్లాడుతూ సమాచార శాఖలో సుదీర్ఘకాలం పాటు విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను, కఠిన పరిస్థితులను ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతల ను విజయవంతంగా ముగించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్‌బాబు, సంయుక్త సంచాలకుడు జగన్, కన్నెగంటి వెంకటరమణ, శ్రీనివాస్, ఉప సంచాలకుడు వెంకటేశ్వర్లు, ప్రసాద్, హష్మీ, సమాచారశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


చినుకు పడితే వణుకే!

చినుకు పడితే చాలు చేనేత కార్మికులు వణికిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చేనేత మగ్గాల్లో నీరు ఊటబావిలా ఊరుతుండటంతో మగ్గం నడవడంలేదు. ఫలితంగా బతుకు బండి సాగడంలేదు. ఓ వైపు చాలీచాలని కూలీతో కుటుంబాన్ని ఎలా నడపాలో తెలియని పరిస్థితి.. మరోవైపు నీటిఊట వల్ల మగ్గాన్ని చుట్టేసి ఖాళీగా ఉండాల్సిన దుస్థితి. మోటార్లతో నీటిని తోడేస్తున్నా మళ్లీ నీరు ఉబికి వస్తుండడంతో నేతన్నలకు దిక్కు తోచడంలేదు. నిజానికి.. గతంలో ఎప్పుడైనా వర్షం వచ్చిందంటే రెండు, మూడ్రోజులు మాత్రమే పనిలేకుండా ఖాళీగా ఉండేవారు. అయితే, ఇటీవల వరుస తుపాన్ల కారణంగా వాగులు, వంకలు నిండుగా ఉండటంతో మగ్గాల్లో నీరు ఊరుతోంది. దీంతో రెండు నెలలుగా కార్మికులది మగ్గం నేయలేని పరిస్థితి. ఆదుకోవాల్సిన ప్రభుత్వం వీరివైపు కన్నెత్తి చూడటంలేదు. – ధర్మవరం

ఉపాధిలేక ఉసూరుమంటున్న నేతన్న
మగ్గం గుంతల్లో ఊరుతున్న నీరు

- మోటార్లతో తోడినా మళ్లీ చేరుతున్న ఊట
- వరుస తుపాన్లతో నాలుగు నెలలుగా పి కరువు
- రెండువేల మందికి పైగా ఇదే పరిస్థితి
- వర్షం తగ్గినా ఊట తగ్గకపోవడంతో దిక్కుతోచని స్థితిలో నేతన్నలు
- ప్రభుత్వ సాయం మచ్చుకైనా కానరాని పరిస్థితి


ఊటనీటితో నిండిన మగ్గం గుంతలు


చేనేత మగ్గం

మూడు లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని ధర్మవరం, సోమందేపల్లి, గోరంట్ల, తాడిపత్రి, యాడికి, పెదపప్పూరు, నార్పల, కోటంక, ముదిరెడ్డిపల్లిలలో మొత్తం 52 వేలకు పైగా చేనేత మగ్గాలున్నాయి. చేనేత రంగంపై ఆధారపడి ప్రత్యక్షంగా మూడు లక్షలకు పైగా కార్మికులు జీవనం సాగిస్తున్నారు. కానీ, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని చేనేత కేంద్రాల్లో నీటి ఊట కారణంగా రెండువేల మంది దాకా ఉపాధిలేక చేనేత మగ్గాలు మూతపడ్డాయి. ముఖ్యంగా ధర్మవరంలోని లోతట్టు ప్రాంతాలైన జోగోని కుంట, కేశవనగర్, శాంతినగర్, మాధవనగర్, ఎల్‌సీకేపురం, ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్ కాలనీ, శివనగర్, గ్యాస్‌గోడౌన్ తదితర ప్రాంతాల్లో అయితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఇక్కడ భారీ వర్షాలు, అస్తవ్యస్త డ్రైనేజీల కారణంగా చేనేత మగ్గాలలో నీటి ఊట తగ్గడంలేదు.

మచ్చుకైనా కానరాని ప్రభుత్వ సాయం..

చేనేత కార్మికులు ఇంత దుర్భర పరిస్థితిలో ఉంటే సాక్షాత్తు ఏపీ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత జిల్లాకు చెందిన వారే అయినప్పటికీ ఆమెకు ఇదేమీ పట్టడంలేదు. రెండునెలలుగా ఉపాధి కరువైన వీరికి ఇంతవరకు ప్రభుత్వ సాయంలేదు. పైగా.. జిల్లా మొత్తంగా కేవలం 750 చేనేత కార్మికులు మాత్రమే నష్టపోయారని.. ధర్మవరంలో అయితే 252 కుటుంబాలు మాత్రమే నష్టపోయాయని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఠంఛన్‌గా సాయం..

వాస్తవానికి.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వర్షం వచ్చినప్పుడు నీటి ఊట కారణంగా చేనేతలు ఉపాధిని కోల్పోతే ప్రతి చేనేత కుటుంబానికి రూ.2 వేల తక్షణ సాయం, నిత్యావసరాలు అందజేసేవారు. ప్రభుత్వ విధి, విధానాల ప్రకారం నీటి ఊటతో నష్టపోయే చేనేత కార్మికులకు సాయం అందించే నిబంధన లేనప్పటికీ నాటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణ సాయం, నిత్యావసరాలను అందించేలా చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాలో ఉన్న చేనేత కార్మికులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాయం అందింది.


భారీ వర్షం కారణంగా చేనేత కార్మికుల ఇళ్లలోకి చేరిన వర్షం నీరు

మా పరిస్థితి దయనీయంగా ఉంది..



ప్రస్తుతం చేతి మగ్గం నేస్తూ జీవనం సాగించే మాలాంటి కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. రోజంతా కష్టపడినా కూలి గిట్టుబాటు కావడంలేదు. దీనికితోడు నెలల తరబడి నీటి ఊట కారణంగా ఉపాధిని కోల్పోతున్నాం. మాకు చేతి మగ్గం తప్ప వేరే పని తెలీదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.
– బండారు శ్రీరాములు, చేనేత కార్మికుడు, ధర్మవరం

రెండు నెలలుగా ఖాళీగా ఉన్నాం



మగ్గం గుంతల్లో నీటి ఊట కారణంగా రెండు నెలలుగా ఉపాధిలేక ఖాళీగా ఉన్నాం. మోటార్లతో నీటిని తోడేసినా మళ్లీ ఊరుతుండటంతో మగ్గం నేయలేని పరిస్థితి ఉంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.
– గడ్డం లక్ష్మీనారాయణ, చేనేత కార్మికుడు, ధర్మవరం

కాలికి పుండ్లు ఏర్పడుతున్నాయి..



నీటి ఊటతో మగ్గం గుంతల్లో నీరు చేరుతోంది. దాన్ని తోడి మళ్లీ నీరు ఊరేలోపు మగ్గం నేస్తున్నాం. నిత్యం నీళ్లలోనే మగ్గం నేయడంవల్ల కాలికి పుండ్లు ఏర్పడి అనారోగ్యం బారిన పడుతున్నాం. ఇంతటి దారుణమైన పరిస్థితి మునుపెన్నడూ చూడలేదు.
– రంగం బాలకృష్ణ, చేనేత కార్మికుడు, ధర్మవరం

చేనేత కార్మికులను ఆదుకోవాలి..



భారీ వర్షాలు పడినప్పుడు చేనేత కార్మికులకు నీటి ఊట కారణంగా నెలల తరబడి మగ్గం నేయలేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయితే ఇలా నష్టపోయే కార్మికులకు తక్షణ సాయంగా రూ.2 వేలతోపాటు నిత్యావసర సరుకులు ఇచ్చేవారు. ప్రస్తుతం నెలల తరబడి ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం.
– భైముతక రమణ, చేనేత కార్మికుడు, ధర్మవరం

సాయం అందించేందుకు చర్యలు..

భారీ వర్షాలతో నష్టపోయిన చేనేత కార్మికుల వివరాలను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వ జీఓ ప్రకారం భారీ వర్షాలకు మగ్గాలు దెబ్బతిన్న కార్మికులకు మాత్రమే సాయం చేయాలని నిబంధన ఉంది. ఊట నీటితో మగ్గం నడవక ఉపాధి కోల్పోయే వారికి సాయంపై మార్గదర్శకాల్లేవు. అయితే, ఈ సమస్యను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో సాయం అందించేందుకు చర్యలు చేపడతాం.
– శ్రీనివాసరెడ్డి, హ్యాండ్‌లూమ్ ఏడీ (ఇన్‌చార్జ్) సత్యసాయి జిల్లా

రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

అనంతపురం అర్బన్: ఏ రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చారో.. అదే రైతులకు అన్నివిధాలా అన్యాయం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కూటమి ప్రభుత్వం, టీడీపీ ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. బుధవారం అనంతపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రంతో ఏమాత్రం లాలూచీ పడినా ప్రభుత్వానికి నూకలు చెల్లినట్టేనని హెచ్చరించారు. ప్రజలపై విద్యుత్ భారం మోపమని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ఎగ్గొట్టడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

ఆ నాలుగు జిల్లాల్లో అన్నీ కరువు మండలాలే

రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, కర్నూలు జిల్లాల్లోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నాలుగు జిల్లాల్లోని రైతులు తొలుత వేసిన పంటలను తొలగించి మరో పంట వేసినా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారని చెప్పారు. నష్టపోయిన రైతులందరికీ వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023–24 సీజన్‌లో రైతుల తరపున చెల్లించాల్సిన ప్రీమియం వాటా మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే బీమా కంపెనీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించండి

సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రతి విద్యార్థి చదువుకుని ఉన్నత లక్ష్యాలకు చేరుకునేలా వారి భవిష్యత్‌కు ఉపాధ్యాయులు మార్గం చూపాలని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. సమగ్ర శిక్షా, యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'యునిసెఫ్ కెరీర్ సర్టిఫికెట్ కోర్సు రూపకల్పన' వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు ప్రేరణ, భవిష్యత్ ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా ఉపాధ్యాయులకు తెలుగులో కెరీర్ సర్టిఫికెట్ కోర్సు రూపొందిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువులో భాగంగా తమ జీవిత లక్ష్యాలను ఎంచుకోవడానికి, ఉపాధ్యాయులు మార్గదర్శనం చేయడానికి ఈ కోర్సు వినియోగపడుతుందన్నారు. విద్యార్థుల ఆసక్తులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అంశాలపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దిశానిర్దేశం చేయాలని ఎస్పీడీ సూచించారు.

భూకుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాలి

సీపీఎం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన, ఫ్రీ హోల్డ్‌కు మార్చిన, ఇతర అన్ని రకాల ప్రభుత్వ, అసైన్డ్ భూ వివాదాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వామపక్షాలు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు డ్యూటీ అలవెన్స్‌లు చెల్లించాలి

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు రెండు నెలలుగా నిలిపివేసిన డ్యూటీ బేస్డ్ అలవెన్స్, నైట్ అవుట్ అలవెన్స్‌లను వెంటనే చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఎన్నో ఏళ్లుగా ఇస్తున్న అలవెన్స్‌లను రద్దు చేయడం అన్యాయమని పేర్కొంది. ఆర్టీసీ ఉద్యోగులకు డ్యూటీ అలవెన్స్‌లను జీతాలతోపాటు కలిపి చెల్లించాలని కోరుతూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించింది.



వరద బారినపడి పొట్టదశకు వచ్చిన వరి పంట నాశనమైపోయింది. పొలాల్లో వేసిన ఇసుకమేటలు నెలలు గడుస్తున్నా అలాగే ఉన్నాయి. ఇంతవరకూ అధికారులుగానీ, నాయకులుగానీ పట్టించుకోలేదు. కనీసం అంచనాలు కూడా వేయలేదు. ఒకపక్క పంట పోయింది. వేరేపంట వేద్దామంటే పొలం నిండా ఇసుక, మట్టి మేటలు వేసి ఉంది. దాన్ని తొలగించాలంటే ఎకరానికి రూ.30 వేల నుంచి రూ. 40 వేలు ఖర్చవుతుంది. కాలువలకు పడిన గండ్లు కూడా ఇంకా పూడ్చలేదు. పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదు. ఏంచేయాలో దిక్కుతోచడంలేదు.
– ముప్పిడి శ్రీనివాసరెడ్డి, కౌలురైతు, రాపర్తి, పిఠాపురం మండలం

పిఠాపురం మండలం రాపర్తి వద్ద పంట పొలాల్లో ఇసుక మేటలు



మేటల తొలగింపు మాటల వరకే

మట్టి, ఇసుక మేటల తొలగింపుపై మాట మార్చేసిన సర్కారు

- పరిహారం ఇచ్చేది లేదంటూ చేతులెత్తేసిన వైనం
- దిక్కుతోచని స్థితిలో ఏలేరు వరద బాధిత రైతులు
- ఇక మా భూములు ఎందుకు పనికొస్తాయంటూ ఆవేదన


పిఠాపురం మండలం రాపర్తి వద్ద గొర్రికండి కాలువకు పడిన గండి

పిఠాపురం: ఏటా మూడు పంటలు పండే మాగాణి ఇసుక దిబ్బలా కనిపిస్తోంది. వరద సమయంలో వచ్చి మేమున్నామని హామీ ఇచ్చిన నాయకులు, అధికారులు పత్తాలేకుండా పోయారు. నెలలు గడిచిపోతున్నాయి. పొలానికి వెళ్తే కాలువకు పడిన గండ్లు వెక్కిరిస్తున్నాయి. పంట పోయి, పొలం నాశనమై ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తుంటే.. సర్కారు నాలుక మడతెట్టింది. ఇసుకమేటలు తొలగించేందుకు పరిహారం ఇచ్చేది లేదని, ఉపాధి హామీ ద్వారా పనులు చేయిస్తామంటూ చేతులెత్తేయడంతో రైతులు నిరాశలో కూరుకుపోయారు. సెప్టెంబర్ నెలలో కురిసిన భారీవర్షాల కారణంగా ఏలేరు కాలువ ముంచెత్తడంతో కాకినాడ జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, పెద్దాపురం, కిర్లంపూడి తదితర మండలాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏలేరు కాలువకు గండ్లుపడి సుమారు 500 ఎకరాల్లో ఇసుక, మట్టి భారీఎత్తున మేటలు వేశాయి. పిఠాపురం మండలం రాపర్తి ఏరియాలోని వరి పొలాల్లో సుమారు 2 అడుగుల మేర ఇసుక మేటలు వేసింది. దీంతో ఇసుక తొలగిస్తే తప్ప తరువాతి పంట వేయలేమని రైతులు వాపోతున్నారు.

హెక్టారుకు రూ. 17 వేలు ఇస్తామన్నారు..

వరద ప్రభావం వల్ల పంటలు నాశనమైన పొలాలకు ఎకరానికి రూ.10వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, ఇసుక మేటలు వేసిన పొలాలకు హెక్టారుకు రూ.17 వేలు ఇస్తామని అప్పట్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రకటించారు. 3 అంగుళాల మేర ఇసుక మేట ఉంటే పరిహారానికి అర్హులుగా పరిగణిస్తామన్నారు. అయితే పొలాల్లో 8 నుంచి 10 అంగుళాల మేర ఇసుక మేటలు ఉన్నట్టు గుర్తించామన్నారు. జిల్లాలో 75 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగాయని, 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం జరిగితేనే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని తెలిపారు. ప్రత్యేక బృందాలతో పంటనష్టం అంచనాలు తయారు చేసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. రైతులు ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందని ఎదురు చూస్తున్న నేపథ్యంలో ఇప్పుడు ఇసుకమేటలకు పరిహారం రాదనడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

పొట్టదశలో పంట తుడిచిపెట్టుకుపోయింది



సకాలంలో వర్షాలు కురవడంతో ఈ ఏడాది పంటలు బాగా పండుతాయన్న ఆశతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేశాను. అంతా బాగుంది, పంట పొట్టదశకు చేరుకుంటుందన్న సమయంలో వరద ఒక్కసారిగా పంటను తుడిచిపెట్టేసింది. పెట్టుబడి అంతా నీటి పాలయ్యి అప్పులు మిగిలాయి. ప్రభుత్వం చూస్తే ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఇస్తారో ఇవ్వరోకూడా తెలియదు. పంట పోతే పోయింది. పొలాల్లో వేసిన ఇసుక మేటలు మాపై మరింత భారాన్ని వేశాయి. నిబంధనల పేరుతో ఇసుకమేటలు తొలగింపుకు పరిహారం ఇవ్వమని అధికారులు చెబుతున్నారు. గతంలో హెక్టారుకు రూ. 17 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు లేదంటున్నారు. పొలాల్లో వేసిన ఇసుకమేటలు తొలగించాలంటే ఎకరాకి రూ. 40 వేలకు పైనే ఖర్చవుతుంది.
– చింతపల్లి నీలారెడ్డి, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

మట్టి, ఇసుక మేటలకు పరిహారం రాదు



వరద వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులకు పరిహారం వచ్చే అవకాశం లేదు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట పొలాల్లో ఇసుక, మట్టి మేటలు తొలగించడానికి చర్యలు తీసుకుంటారు. అది ఎప్పుడనేది ఇంకా నిర్ణయించలేదు.
– ఎ.అచ్యుతరావు, వ్యవసాయశాఖ అధికారి, పిఠాపురం మండలం

రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొట్టిన లారీ...

హెడ్ కానిస్టేబుల్ మృతి

తిరుపతి రూరల్: జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వేగంగా దూసుకొచ్చిన ఓ మినీలారీ... బైక్‌ను ఢీకొట్టడంతో హెడ్ కానిస్టేబుల్ మృతిచెందారు. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వకుళమాత ఆలయం సమీపంలో బుధవారం జరిగింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లక్ష్మీనారాయణ (51) తిరుపతిలోని ఎస్‌ఎల్ నగర్‌లో తన కుటుంబంతో కలిసి ఉంటున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం పాకాల కోర్టుకు వెళ్లి తిరిగి తిరుపతికి వస్తుండగా... జాతీయ రహదారిపై వకుళమాత ఆలయం వద్ద రాంగ్ రూట్‌లో ఎదురుగా టమాటా ఖాళీ బాక్స్‌లతో వస్తున్న మినీలారీ ఢీకొట్టింది. తలకు, కాలికి తీవ్ర గాయాలైన లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతిచెందారు. నిర్లక్ష్యంగా మినీలారీని నడిపి లక్ష్మీనారాయణ మృతికి కారణమైన డ్రైవర్ దార మోహన్ పారిపోయాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతిచెందిన లక్ష్మీనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శాస్త్రవేత్త రామారావు సేవలు ఆదర్శనీయం

సాక్షి, అమరావతి: సుప్రసిద్ధ ఉద్యాన శాస్త్రవేత్త (రిటైర్డ్) డాక్టర్ మొవ్వ రామారావు మృతి బాధాకరమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంతాపం ప్రకటించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రధానాచార్యులుగా, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తగా ఎనలేని సేవలు అందించిన రామారావు నేటి తరం వారికి ఆదర్శనీయమని తెలిపారు. తెగుళ్ల తట్టుకునే నూతన వంగడాలను సృష్టించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రామారావు మృతి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అచ్చెన్నాయుడు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బాబొచ్చారు.. కరువొచ్చింది

- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి
- నైరుతి అనుకూలించినా రాయలసీమలో కరువొచ్చింది
- ప్రజలపై భారం మోపుతున్న చంద్రబాబును మీడియా ప్రశ్నించాలి

సాక్షి, అమరావతి: చంద్రబాబు, కరువు కవల పిల్లలు అనే విషయం ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతీసారి నిరూపణ అవుతూనే ఉందని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. ఇప్పుడు అదే మరోసారి నిరూపితమవుతోందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. «ఈ ఏడాది నైరుతి అనుకూలించినా రాయలసీమలో కరువు వెంటాడుతోంది. ఐదు జిల్లాల్లో 54 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్ల పాటు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని పక్కన పెట్టి రైతుల ఉసురు తీస్తోంది» అని మండిపడ్డారు. సంపద సృష్టిస్తానని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు విశాఖలో ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారని, అయిన ఎవరూ నోరుమెదపటంలేదని అన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ హయాంలో బాదుడే బాదుడు అంటూ రోజూ నానా హంగామా చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రజలపై విపరీతంగా భారం వేస్తున్నారని మండిపడ్డారు. ఓ పక్క నిత్యావసరాల ధరలు మండుతున్నాయని, మరోపక్క చంద్రబాబు విద్యుత్ చార్జీలు భారీగా పెంచి, ప్రజల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. అయిదేళ్లు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. నాలుగు నెలల్లోనే ప్రజలపై ఏకంగా రూ.6,073 కోట్ల భారం వేస్తున్నా, ఎవరూ నోరుమెదపకుండా చూస్తూ కూర్చొన్నారని అన్నారు. కనీసం నైతిక బాధ్యతగా.. 4 నెలలకే మాట తప్పడం ఏమిటని చంద్రబాబును మోస్తున్న ఆ మీడియా ప్రశ్నించాలని సూచించారు.

వరదల్లో దెబ్బతిన్న ఇంజన్లు, మోటార్లకు పరిహారం ఇవ్వాలి

ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కృష్ణా, బుడమేరు వరదల్లో నష్టపోయిన సన్న, చిన్నకారు, కౌలురైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను ఎన్యుమరేషన్ చేసి పరిహారం ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ కౌలు రైతుల సంఘం నాయకులు బుధవారం సచివాలయంలో విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 'లంకల్లో ఇసుక మేట వేసిన భూములను ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం పెంచి ఇవ్వాలి. మేట వేసిన ఇసుకను తొలగించడానికి ఎకరాకు 50మంది ఉపాధి కూలీలను కేటాయించాలి. అసైన్డ్, లంక భూములు, ప్రభుత్వ పోరంబోకు, గ్రామ కంఠం భూముల్లో సాగు చేసిన పంటలకు కూడా పరిహారం ఇవ్వాలి. వరద ముంపునకు గురైన ఇళ్లకు విజయవాడలో ఇచ్చినట్టుగానే గ్రామాల్లోను కనీసం రూ.25వేల పరిహారం అందజేయాలి...' అని కోరినట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు వెల్లడించారు.




శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 59,140 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 16,937 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.31 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కన్నుల పండువగా అష్టోత్తర పూజలు


ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి అష్టోత్తర పూజలు ఆలయ అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి మొక్కులు తీర్చుకునేందుకు అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షించారు.

వెండి ఆభరణాల సమర్పణ



తుని రూరల్: కాకినాడ జిల్లా లోవ దేవస్థానం తలుపులమ్మ తల్లికి గుంటూరుకు చెందిన అలూరి అనురాధ, శశిధర్ దంపతులు రూ.1.3 లక్షల విలువైన వెండి పాదుకలను ఈఓ పెన్మత్స విశ్వనాథరాజుకు అందజేశారు. వారికి వేదాశీస్సులు అందజేశారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.22 కోట్లు



అన్నవరం: రత్నగిరి సత్యదేవుడికి గత 30 రోజులకు హుండీల ద్వారా రూ.1,22,41,967 ఆదాయం సమకూరింది. బుధవారం హుండీలను తెరిచి లెక్కించగా నగదు రూ.1,18,20,962, చిల్లర నాణాలు రూ.4,21,005 వచ్చాయ చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితో బాటు బంగారం 10.500 గ్రాములు, వెండి 410 గ్రాములు వచ్చిందని తెలిపారు. గత 30 రోజుల్లో సరాసరిన రోజుకు రూ.4,08,065 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



అడ్వెంచర్ క్యాంప్‌నకు మహిళా వర్సిటీ వలంటీర్లు

తిరుపతి సిటీ: హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో నవంబర్ 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న ఎన్‌ఎస్‌ఎస్ అడ్వెంచర్ క్యాంప్‌నకు పద్మావతి మహిళా వర్సిటీ వలంటీర్లు ఎంపికయ్యారు. అలాగే ఏపీ కంటింజెంట్ లీడర్‌గా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నీరజ వ్యవహరించనున్నారు. బుధవారం ఈ మేరకు వలంటీర్లు కావ్య, ప్రణవి, మధు యామిని, మహిత, వెంకటేశ్వరమ్మను వీసీ ఉమ అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వలంటీర్లలో ధైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వెల్లడించారు.



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ




తిరుపతి సిటీ: చిత్తూరు జిల్లా మదనపల్లి బీటీ కళాశాల వేదికగా గత రెండు రోజులుగా జరుగుతున్న ఎస్వీయూ అంతర్ కళాశాల మెన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో వర్సిటీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి విన్నర్స్‌గా నిలిచారు. రన్నర్స్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు రెండవ స్థానం సాధించారు. గెలుపొందిన జట్లకు బీటీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణవేణి, ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి జ్ఞాపికలను, ధృవపత్రాలను అందజేసి అభినందించారు.

రక్తదానం చేసిన ఎన్‌ఎస్‌యూ వాలంటీర్లు



తిరుపతి సిటీ: స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బ్లడ్ బ్యాంక్ క్యాంప్‌లో జాతీయ సంస్కృత వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం పోలీసు అధికారులు విద్యార్థులను అభినందించి, ధృవ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చందులాల్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, బ్లడ్ బ్యాంక్ సూపర్‌వైజర్ డాక్టర్ ఠాగూర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మేరీ సుజాత, డాక్టర్ జగన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.





ధన్వంతరి... నారాయణాంశ సంభూతుడు. మానవజాతికి చికిత్సా విధానాన్ని అనుగ్రహించిన ఆదివైద్యుడు. శ్రీభాగవతం సహా వివిధ పురాణాల్లో ధన్వంతరి ప్రస్తావన ఉంది. అనేక ప్రాంతాల్లో ఆ ఆరోగ్య ప్రదాతకు గుడికట్టి పూజిస్తున్నారు. అందులో ఒకటి తెలుగు నేల మీదా ఉంది.

ఆంధ్రదేశంలో ఆది వైద్యుడి ఆలయం

ధన్వంతరి అంటే...

మనసుకు పట్టిన జాడ్యాల్నీ, శరీరాన్ని కమ్ముకున్న వ్యాధుల్నీ తొలగించేవాడనీ ధన్వంతరి అనే పదానికి అర్థం. పురాణాల ప్రకారం...ధన్వంతరి ఆరోగ్యానికి అధిపతి. పరిపూర్ణ ఆయువు కోసం ఘనంగా ధన్వంతరీ వ్రతం చేయడం ప్రాచీన సంప్రదాయం. ధనత్రయోదశినాడు లక్ష్మీదేవితో పాటూ ధన్వంతరినీ పూజిస్తారు. ఏటా కార్తికమాసంలో ధన్వంతరి జయంతిని జరుపుకుంటారు. సముద్ర తీరంలోనో స్వగృహంలోనో వైద్యశాలలోనో కలశాన్ని స్థాపించి...పురాణాంతర్గతమైన ధన్వంతరి మహామంత్రాన్ని పఠించి... వైద్యులకూ సంపూర్ణ ఆరోగ్యవంతులకూ తాంబూలాలు ఇచ్చి ఆశీస్సులు తీసుకుంటారు. పెసర పులగాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం.



ఒకవైపు దేవతలూ మరోవైపు రాక్షసులూ – క్షీరసాగర మథనం ఓ యుద్ధంలా మహా తీవ్ర స్థాయిలో జరుగుతోంది. కల్పవృక్షం, కామధేనువు, లక్ష్మీదేవి... ఆ వరుసలో పదకొండవవాడిగా పాలకడలిలోంచి స్ఫురద్రూపి అయిన ఓ పురుషుడు పుట్టుకొచ్చాడు. పెద్దపెద్ద కళ్లూ, ఒత్తయిన కేశాలూ, అంతెత్తు ఆకారం, చిరుదరహాసం ... ఆ రూపాన్ని ముక్కోటి దేవతలూ రెప్పవాల్చకుండా చూశారు. అతను ధగ ధగ మెరిసే పీతాంబరాన్ని కట్టుకున్నాడు, మణికుండలాలు ధరించాడు, మెడలో దివ్యమాల మెరిసిపోతోంది. ఓ చేతిలో అమృతభాండం ఉంది. మరో చేతిలో వనమూలికలున్నాయి. అచ్చంగా శ్రీమన్నారాయణుడిలా ఉన్నాడు – కాదు కాదు, సాక్షాత్తూ నారాయణుడి అంశే! బ్రహ్మాదులు అతనికి ధన్వంతరి అని నామకరణం చేశారు.

పురాణగాథలు...

ఓసారి, దుర్వాస మహాముని శాపం కారణంగా... ముక్కోటి దేవతలూ ముక్కుతూ మూలుగుతూ మూలన పడాల్సిన పరిస్థితి వచ్చిందట. ఆ సమయంలో ధన్వంతరి అరుదైన వనమూలికలతో చికిత్సలు చేసి... అమరుల్ని ఆరోగ్యవంతుల్ని చేశాడని ఐతిహ్యం. ధన్వంతరి ప్రస్తావన ఒక్కో పురాణంలో ఒక్కోలా కనిపిస్తుంది. బ్రహ్మవైవర్త పురాణం ప్రకారం...ధన్వంతరి సూర్యనారాయణుడి ప్రియశిష్యుడు. ఆయన దగ్గరే ఆయుర్వేదం నేర్చుకున్నాడు. విష్ణుమూర్తి ఆదేశం ప్రకారం... ద్వితీయ ద్వాపరయుగంలో కాశీ రాజ్యాన్ని పాలించిన చంద్రవంశ రాజు ధనపాలుడి కొడుకుగా అవతరించిన ధన్వంతరి... ఆయుర్వేదాన్ని శాస్త్రంగా మలిచి శుశ్రుతుడితో సహా ఎంతోమందికి బోధించాడనీ... అనేక సంవత్సరాల పాలన తర్వాత.. తిరిగి దైవత్వాన్ని పొందాడనీ పురాణ కథనం. ఆయుర్వేద వైద్యులకు ధన్వంతరే తొలిదైవం. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ధన్వంతరి ఆలయాలున్నాయి.

చింతలూరు గ్రామాన...

తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలంలోని చింతలూరు గ్రామంలో ధన్వంతరి స్వామి ఆలయం ఉంది. గౌతమీ తీరాన, పచ్చని పంటపొలాల మధ్య, సుమారు రెండెకరాల సువిశాల ఆవరణలో స్వామివారు కొలువుదీరి ఉన్నారు. ఆ ఆలయంలో అడుగు పెట్టినంత మాత్రానే... సమస్త రోగాలూ నయమైపోతాయని భక్తుల నమ్మకం. ఆలయ ప్రాంగణంలో ఎత్తయిన ధ్వజస్తంభం కనిపిస్తుంది. విశాలమైన ముఖ మండపం ఉంది. గర్భాలయంలో ధన్వంతరి దివ్య మంగళరూపం దేదీప్యమానంగా దర్శనమిస్తుంది. కాశీలో ఏకశిలతో మలచిన పాలరాతి విగ్రహాన్ని తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. నాలుగు హస్తాలతో...ఒక చేతిలో శంఖం, ఒక చేతిలో చక్రం, ఒక చేతిలో అమృతకలశం, ఒక చేతిలో జలగతో స్వామి దర్శనమిస్తాడు. ప్రాచీన ఆయుర్వేదంలో జలగ చికిత్స ఓ భాగం. చెడురక్తాన్ని పీల్చుకునే శక్తి ఉందా జీవికి. చింతలూరు వెంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకులు ద్విభాష్యం వెంకటేశ్వర్లు 1942లో ఈ ఆలయాన్ని నిర్మించారు. పూజాదికాలకు ఏ లోటూ లేకుండా శాశ్వత ప్రాతిపదికన గ్రామంలోనే పద్దెనిమిది ఎకరాల భూమిని కేటాయించారు. ఆయన వంశీకులైన ద్విభాష్యం వెంకట శ్రీరామమూర్తి చలువరాతితో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈ గుడి రాజమండ్రి నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏటా కార్తిక బహుళ త్రయోదశినాడు ధన్వంతరి జయంతిని వైభవంగా నిర్వహిస్తారు.

తమిళనాట... ఇతర ప్రాంతాల్లో...


తమిళనాడులోని సుప్రసిద్ధ వైష్ణవక్షేత్రం శ్రీరంగం. అక్కడున్న రంగనాథ స్వామి ఆలయంలో ధన్వంతరి ఉపాలయం ఉంది. ఏ గుడిలో అయినా తీర్థంగా అభిషేక జలం ఇస్తారు. మహా అయితే, పంచామృతం పోస్తారు. ఇక్కడ మాత్రం వనమూలికలతో కూడిన కషాయాన్ని ఇస్తారు. ఆ తీర్థాన్ని తీసుకుంటే మొండివ్యాధులు సైతం మటుమాయమైపోతాయని ఓ నమ్మకం. కంచి వరద రాజ పెరుమాళ్ ఆలయ ఆవరణలోనూ ఆ ఆరోగ్య దేవుడి విగ్రహం ఉంది. కేరళలోని గురువాయూర్ సమీపంలో కూడా ధన్వంతరి ఆలయాన్ని నిర్మించారు. కొత్తగా ఆయుర్వేద వైద్యవృత్తిని చేపట్టేవారు...ముందుగా స్వామిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించడం ఇక్కడి సంప్రదాయం. కాలికట్ దగ్గర్లోనూ ఓ ధన్వంతరి క్షేత్రం ఉంది.

– డి.వి.ఆర్.

పరిహారం

తరచు ధననష్టాలు ఎదురవుతున్నాయా?

వృత్తి ఉద్యోగాల్లోను, వ్యాపారాల్లోను రాబడి బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా కొందరికి తరచు అనుకోని ధననష్టాలు ఎదురవుతూ ఉంటాయి. ఎంత రాబడి వస్తున్నా అంతకు మించిన ఖర్చులు ముంచుకొస్తుంటాయి. పొదుపు ప్రణాళికలు ఎన్ని వేసుకున్నా వాటిని ఆచరణలో పెట్టడం సాధ్యం



కాదు. ఇలాంటి పరిస్థితులను నివారించాలంటే... ఈ పరిహారాలను పాటించండి.

- చిన్నారులు ఉండే ఇళ్లకు వెళ్లే సందర్భాల్లో వాళ్ల కోసం మిఠాయిలు తీసుకువెళ్లండి. దక్షిణావర్త శంఖాన్ని సేకరించి, ఇంట్లోని పూజ గదిలో ఉంచి, దానికి నిత్యం ధూపదీపాలు సమర్పించండి.
- అరచేతిలో పట్టేంత పరిమాణంలో ఉన్న మట్టికుండను ప్రవహిస్తున్న నీటిలో విడిచిపెట్టండి. ఇలా ఐదు బుధవారాలు చేయండి. ఆర్థిక అవరోధాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి.
- మీ కోసం పనిచేసే వారికి చెల్లించాల్సిన ప్రతిఫలాన్ని సకాలంలో చెల్లించడాన్ని అలవాటు చేసుకోండి. ఇతరుల వద్ద తీసుకున్న చేబదుళ్లను వీలైనంత త్వరగా తీర్చేయండి.
- ప్రతి శనివారం ఆలయాల వద్ద కనీసం పదకొండు మంది నిరుపేదలకు రొట్టెలు పంచిపెట్టండి. గోశాలలకు పెసలతో కూడిన దాణాను దానంగా ఇవ్వండి.
- ఇంట్లో ప్రతిరోజూ చేసే నిత్యపూజలో లక్ష్మీస్తోత్రాన్ని పఠించండి. లక్ష్మీపూజను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకండి. లక్ష్మీదేవి ఎదుట నేతిదీపం వెలిగించండి.

– సాంఖ్యాయన



పురాగాథ

సాంగత్య బలం



ఆదిశేషుడు సమస్త భూమండలాన్ని తన వేయి పడగలపై మోస్తున్నాడు. ఒకరోజు బ్రహ్మదేవునికి దీటుగా సృష్టికి ప్రతి సృష్టి గావించిన రాజర్షి విశ్వామిత్రుడు వచ్చి ఆదిశేషువును తనతో రమ్మన్నాడు. ఆదిశేషుడు మిక్కిలి వినయ విధేయతలతో ''ఓ మహర్షీ! ఈ సమస్త భూమండలం నా శిరస్సుపైనే వుంది. దీనిని పరిరక్షించడమే నా కర్తవ్యం. నేను ఈ కార్యాన్ని విస్మరిస్తే, ఈ భూమండలం పాతాళం వైపు పడిపోవడం తథ్యం. అప్పుడు కోటానుకోట్ల జీవరాశులు నా మూలంగా నాశనమైపోతాయి'' అన్నాడు.

ఆ మాటలకు విశ్వామిత్ర మహర్షి చిరునవ్వు నవ్వి ''అటువంటిదే గనక జరిగితే నేను నా అమోఘమైన తపశ్శక్తితో దానిని ఆపుతాను'' అన్నాడు.

ఆదిశేషువు అందుకు ఒప్పుకోలేదు. విశ్వామిత్రుడు ఎన్ని విధాలుగా నచ్చజెప్ప చూసినా ఆదిశేషుడు తన నిర్దేశిత కార్యాన్ని వదలనని మొండిపట్టు పట్టాడు. ఆదిశేషుని మంకుపట్టు చూసి విశ్వామిత్రునికి తీవ్రమైన కోపం వచ్చింది. కమండలం ఎత్తి శపించబోయాడు. ఆదిశేషుడు భయపడి చేసేది లేక భూమిని పక్కకు పెట్టి వచ్చాడు.



అంతలోనే ఘోరమైన విపత్తు సంభవించింది. ఆదిశేషుని వేయిపడగలపై భద్రంగా వున్న భూగోళం వెంటనే పాతాళం వైపు పడిపోవడం ప్రారంభించింది. దానిపై నివాసముంటున్న వేల కోట్ల జీవరాశులు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేయడం ప్రారంభించాయి. జరిగిన దానిని చూసి తీవ్రమైన దుఃఖంతో ఆదిశేషుడు మాన్పడిపోగా, తపశ్శక్తి సంపన్నుడన్న గర్వంతో విశ్వామిత్రుడు తన కమండలంలోని నీరు ధారపోసి 'ఆగు' అంటూ భూమిని ఆజ్ఞాపించాడు. భూగోళ పతనం ఆగకపోగా, మరింత వేగంగా పడిపోవడం ప్రారంభించింది. విశ్వామిత్ర మహర్షి పట్టరాని ఆగ్రహంతో ''నా తపశ్శక్తి అంతా ధారపోస్తున్నాను, వెంటనే ఆగు'' అంటూ ఆజ్ఞాపించాడు. అయినా ఫలితం లేకపోయింది.

దాంతో విశ్వామిత్రునికి అహంకార మైకం తొలగిపోయింది. భూమిని ఆపడానికి తన తపఃశక్తి చాలదని తెలుసుకున్నాడు. ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా నారద మహర్షి అక్కడికి వచ్చి జరిగిన దానిని తెలుసుకొని ''నీవు ఎప్పుడైనా సజ్జన సాంగత్యం చేసి వుంటే ఆ ఫలితాన్ని వెంటనే ధారపోయి. భూపతనం ఆగిపోతుంది'' అని చెప్పాడు.

విశ్వామిత్రుడు ఆలోచనలో పడ్డాడు. తాను అందరితో తగవులు పెట్టుకోవడమే కాని సజ్జన సాంగత్యం చేసింది లేదు. సాటి ముని పుంగవులతోనూ తగవులే. సత్సంగం చేసింది లేదు. అయినా తాను వశిష్ఠ మహర్షి వద్దకు వెళ్ళిన సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని ఆ పుణ్యాన్ని ధారపోయగా వెంటనే భూగోళ పతనం ఆగిపోయింది. ఆదిశేషుడు యధావిధిగా తిరిగి భూమండలాన్ని తలకు ఎత్తుకున్నాడు.

సజ్జన సాంగత్యం మనలో రజో తమో గుణాలను తగ్గించి సాత్విక భావాలను పెంచుతుంది.

– భాస్కర్

నిమిషం విషయం

పుష్పాలతోనే ఎందుకు పూజించాలి?



నిత్యం మనం భగవంతునికి చేస్తున్న పూజలలో పుష్పాలదే అగ్రస్థానం. ఏ స్వామి పూజ అయినప్పటికీ, ఏ తల్లి పూజ అయినప్పటికీ, వారి వారి పూజలలో పుష్పాలకే ప్రాముఖ్యత. ఎన్నో పూజా ద్రవ్యాలుండగా, పుష్పాలకే ఎందుకు ఇంత ప్రాముఖ్యత అని అనిపించవచ్చు. పుష్పామూలే వసేద్బ్రహ్మ మధ్యేచ కేశవః పుష్పాగ్రేచ మహాదేవః సర్వదేవాః స్థితాదళే పుష్పం మొదట్లో బ్రహ్మ, పుష్పమధ్యమంలో కేశవుడు, పుష్పపు కొనలో మహాదేవుడు నివసిస్తుంటారని, పుష్ప దళాలలో సర్వదేవతలుంటారని ప్రతీతి.

పరంజ్యోతిః పుష్పగతం పుష్పేణైవ ప్రసీదతి త్రివర్గ సాధనం పుష్పం పుష్టిశ్రీ స్వర్గమోక్షదమ్

పువ్వులలో ఉన్న పరమాత్మ పువ్వులతోనే ప్రసన్నుడవుతుంటాడట. కాబట్టి పుష్పం త్రివర్గ సాధనం. అంటే సంపదలను, స్వర్గాన్ని, మోక్షాన్ని కలిగిస్తుంది.

మీకు తెలుసా?



ధర్మ శాస్త్రం ప్రకారం .. మన ఇంట్లో మీకు పని వత్తిడులవల్ల వస్తున్నాను ఆగమని చెప్పి .... అన్నీ వడ్డించిన విస్తరి/పళ్లెం ముందు కూర్చోరాదు, మనం కూర్చున్న తరువాతే అన్నీ వడ్డించుకుని భుజించాలి... ఎందుకంటే అన్నం కోసం మనం ఎదురుచూడాలి తప్ప మనకోసం అన్నం ఎదురు చూడరాదు .. అలా చేస్తే దరిద్రం అంటే అవకాశం ఎక్కువ.

తూర్పునకు ముఖం పెట్టి భోజనం చేయడం వల్ల దీర్ఘాయుష్షు వస్తుంది
తూర్పుదిక్కు ఇంద్రునికి ఆధిపత్యస్థానం, సూర్యునికి నివాస స్థానం కావడం వలన ప్రాధాన్యమెక్కువ.
పడమర ముఖంగా కూర్చుంటే ... బలం
ఉత్తర ముఖంగా కూర్చుంటే ... సంపద
దక్షిణ ముఖంగా కూర్చుంటే ... కీర్తి

కలలో ఏనుగు కనిపిస్తే..?



ఎవరికైనా సరే కలలు రావడం సహజంగా జరుగుతూ ఉంటుంది. కలలో పర్వతాలు .. నదులు .. అడవులు .. జంతువులు కనిపిస్తూ ఉంటాయి. పులులు .. సింహాలు .. ఏనుగులు కనిపించడం జరుగుతూ ఉంటుంది. అలాంటి జంతువులు కలలో కనిపించినప్పుడు భయం కలుగుతుంది. మరుసటి రోజు ఉదయం ఆ విషయాన్ని ఇతరులతో పంచుకుని, ఏం జరుగుతుందోననే ఆందోళనకి లోనవుతుంటారు. అయితే కలలో ఏనుగు కనిపిస్తే మంచిదేనని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏనుగు కుంభస్థలం .. లక్ష్మీదేవి నివాస స్థానంగా చెప్పబడుతోంది. అందువలన కలలో ఏనుగు దర్శనం వలన సంపదలు లభిస్తాయని అంటారు. ఏనుగును దర్శించుకోవడం వలన దారిద్ర్యం .. దుఃఖం దూరమవుతాయని చెబుతారు. అదృష్టం .. ఐశ్వర్యం చేకూరతాయని నమ్ముతారు. ఆయా పుణ్య క్షేత్రాల్లో గజ వాహనంగా ఏనుగులు భగవంతుడి సేవలో తరిస్తుంటాయి. గజ ముఖంతోనే వినాయకుడు తొలి పూజలు అందుకుంటూ ఉంటాడు .. అందరి విఘ్నాలను తొలగిస్తూ ఉంటాడు. అలాంటి ఏనుగును కలలోనే కాదు .. బయట చూసినా ఇలాంటి ఫలితాలే కలుగుతాయట.



సువార్త

అపొస్తలుల బోధల సారం



ఒకప్పుడు ఈ భూమి మీద దేవుని నివాసం ఏదెను వనము. ఆది దంపతులైన ఆదాము, హవ్వలను బట్టే దేవుడు ఏదెను వనమునకు వచ్చేవాడు. చల్లపూట వేళలలో ఆదాము, హవ్వలను పరామర్శిస్తూ ఆ మహా దేవుడు ఏదెనుకు రాక పోకలు సాగించేవాడు.

ఈ పితరుల యుగంలో -- నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడను అంటూ దేవ దేవుడు తన చిరునామాను ఇలా చెప్పుకుంటూ వచ్చాడు. వినయ సంపన్నులైన వారి ఆత్మ వికాస హృదయమను ఇల్లే ఆయన నివాసం. యాకోబుకు ఇశ్రాయేలు అను కొత్త పేరు దేవుడే పెట్టాడు. ఈ ఇశ్రాయేలు ఇంకా ఉన్నతంగా దేవుని చిరునామాను మార్చేశాడు. ఇశ్రాయేలీయుల దేవుడే దేవుడు అంటూ ఆయనను గొప్ప చేసాడు.

ఇక మోషే యుగంగా చెప్పబడే ధర్మ శాస్త్ర యుగంలో మాత్రం – దేవుని నివాసాన్ని చూస్తే, దేవుని నివాసం ప్రత్యక్ష గుడారం. అక్కడే దేవుడు అగ్ని రూపంలో తన ప్రజలకు దర్శనమిస్తూ తన స్వరాన్ని వినిపిస్తూ ఉండేవాడు. ఆ రోజులలో, సకల యుగములలో రాజైన అద్వితీయ సత్య దేవునికి యెరూషలేము నివాస (చిరునామా) కేంద్రం కూడా. మహారాజు పట్టణంగా క్రీస్తు పేర్కొన్న యెరూషలేము యెహోవా అనబడే సత్య దేవుని ఇల్లుగా వర్ధిల్లింది. అక్కడి సొలోమోను దేవాలయంలో దేవుని మహిమ ఉండేది.

ఇప్పుడైతే, ఈ కొత్త నిబంధన కాలంలో, ఈ క్రీస్తు యుగాన దేవుని నివాసం క్రీస్తు ప్రభువు వారి సంఘము. క్రీస్తు నందున్న వారే నూతన సృష్టి. నూతన సృష్టి సంబంధులే, అట్టి సమూహమే సంఘమే నేడు దేవుని నివాస కేంద్రము. దేవుని నివాసంగా ఉన్నామో లేమో అన్నది పట్టు విడువని లేఖనాల పరిశోధనతో ఎవరికి వారే స్వపరీక్ష చేసుకోవాలి. క్రీస్తు నందు ఉండుటకు సమాయత్తం కావాలి. క్రొత్త నిబంధన అను ఈ క్రీస్తు యుగంలో దేవుని నివాసం క్రీస్తునందే క్రీస్తు సంఘము నందే అన్నది అపొస్తలుల బోధల సారం.


అప్పుడైనా ఇప్పుడైనా ఇశ్రాయేలు దేవుడే దేవుడు. ఇదే బైబిలు సత్యం. ఇశ్రాయేలు దేవుడను అనునదే ఆయన ప్రసిద్ధ చిరునామా. నేను ఇశ్రాయేలు దేవుడను అంటూ దేవుడు చెప్పుకోవడానికి, తన గూర్చి తనను తాను హుందాగా పరిచయం చేసుకోవడానికి ఎంతో ఇష్టపడుతున్నాడు. అయితే ఇక్కడ ఇశ్రాయేలు ఎవరు? ఇశ్రాయేలు అనగా దేవుని ఇశ్రాయేలు. ఆత్మ సంబంధ ఇశ్రాయేలీయులు. ఆత్మ సంబంధ ఇశ్రాయేలీయులు అనగా క్రీస్తు సంఘ సభ్యులు. క్రీస్తు నందున్న వారు. క్రైస్తవులు. దేవుడు ఏమాత్రం సిగ్గుపడక, కేవలం క్రీస్తును బట్టే నేను ఇశ్రాయేలు దేవుడను అంటూ ఇప్పుడు చెప్పుకుంటున్నాడనేది నేడు ఆత్మ సంబంధులు చెప్పే మాట.

సంఘ భవనం అను చర్చి బిల్డింగ్ దేవ దేవుని చిరునామా కాదు. సంఘము అనే చర్చే, ఏకత్వము గల ఆ ఆత్మ సంబంధ దైవిక ప్రేమ సమాజమే, దేవ స్వభావం గల ఆ జనాంగమే అనగా నాట్యమాడు వారి అంతరంగాలే దేవుని చిరునామా.

– జేతమ్

పుస్తకం

ఆలయ విజ్ఞానం.. ఆచారాల అంతరార్థం



రచయితగా, సంపాదకుడిగా దాదాపు అరవైకి పైగా పుస్తకాలు వెలువరించిన డా. కప్పగంతు రామకృష్ణకు ఎంత క్లిష్టమైన విషయాన్నయినా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినంత సులువుగా చెప్పడం కలంతో పట్టుబడిన విద్య. ఆయన వ్యాసాలు లేని ఆధ్యాత్మిక పత్రికలు దాదాపుగా లేవంటే అతిశయోక్తి కాదు. గతంలో ఆయన రచించిన 'నిత్యోత్సవం', 'భక్తి మకరందం' విశేష పాఠకాదరణ పొందాయి. ప్రస్తుత విషయానికి వస్తే... 'దేవుణ్ణి చూద్దాం... రండి!'అంటూ వెలువడ్డ తాజా రచన ఆలయ నిర్మాణం, మంత్ర విజ్ఞానం, దేవతలకు చేయవలసిన షోడశ ఉపచారాలు... వాటి అంతరార్థం, హారతులెన్ని, అవి ఏవి, ప్రదక్షిణలోని పరమార్థం, మంత్రపుష్పానికి ప్రతిపదార్థ వివరణ తదితర విషయాల గురించిన వ్యాస సంపుటం. ఒక్క ముక్కలో చెప్పాలంటే... ఆలయ విజ్ఞాన సర్వస్వం... ప్రతి ఒక్కరూ తెలుసుకోదగ్గ విశేషాలెన్నో ఉన్న ఈ పుస్తకానికి ముందుమాట రాసిన పెద్దలందరూ ప్రశంసల వర్షం కురిపించారు.

దేవుణ్ణి చూద్దాం... రండి! రచన: డా. కప్పగంతు రామకృష్ణ, పుటలు: 128; వెల రూ. 81, ప్రతులకు: ఎస్.ఆర్. పబ్లికేషన్స్, డి.ఆర్.ఆర్. వీధి, ఇన్నర్ రింగ్ రోడ్(అంబాపురం), విజయవాడ రూరల్– 520 012. ఫోన్: 84948 75959, 90324 28516.

– దోర్బల

ప్రవక్త పలుకు

విలువలే కొలమానం



సమాజంలో మానవుల గౌరవాదరణలకు సంబంధించి అనేక కొలమానాలున్నట్లుగానే, అల్లాహ్ దృష్టిలో, ధర్మం దృష్టిలో అసలు కొలమానం మానవుల సచ్ఛీలత, నీతి, నిజాయితీ, మంచితనం, వారిలో ఉన్నటువంటి దైవభక్తి, దైవభీతి మాత్రమేనని ముహమ్మద్ ప్రవక్త (స) తెలియజేశారు.

ఒకసారి ముహమ్మద్ ప్రవక్త(స) సహచరులతో సమావేశమై ఉన్నారు. అప్పుడు వారిముందు నుండి ఒక వ్యక్తి అటుగా వెళ్ళాడు. ప్రవక్త వారు ఆ వ్యక్తిని సహచరులకు చూపిస్తూ, ''అతడి గురించి మీ అభిప్రాయం ఏమిటి?'' అని అడిగారు.

''ప్రవక్తా! ఈయన చాలా పెద్ద మనిషి. గొప్ప ధనవంతుడు. అధికారం, హోదా, పలుకుబడి కలవాడు. అందరూ అతని మాట వింటారు. ఎవరూ అతని మాటకు ఎదురు చెప్పరు. అతనేదైనా సిఫారసు చేస్తే, అది తప్పక స్వీకరించబడుతుంది'' అని చెప్పారు సహచరులు.

మరి కాసేపటికి మరో వ్యక్తి అటుగా వెళ్ళాడు. అప్పుడు కూడా ప్రవక్త వారు, %%ఇతని విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?'' అని సహచరులను మళ్ళీ అడిగారు. దానికి వారు, ''దైవ ప్రవక్తా! ఇతను పేదవాడు. కాని సుగుణ సంపన్నుడు. నికార్సయిన దైవ విశ్వాసి. నిరాడంబరుడు. చాలా మంచి మనిషి. కాని ఎంత మంచివాడైనా, పేదవాడి మాటను ఎవరు పట్టించుకుంటారు? అందుకని ప్రజలు అంతగా ఇతని మాటను వినరు. ధనసంపదలు, అధికారం, హోదా లేని కారణంగా ఇతని సిఫారసు కూడా స్వీకరించబడదు.' అన్నారు సహచరులు.

అప్పుడు ప్రవక్త మహనీయులు, 'మీ దృష్టి వాస్తవికతపై లేదు. మీరు చాలా గొప్పవాడని చెప్పిన పెద్దమనిషి లాంటి అవిశ్వాసులు ఎంతమందైనా, ఈ ఒక్క విశ్వాసికి సమానం కాజాలరు. దేవుని దృష్టిలో అందరికన్నా ఎక్కువ గౌరవనీయుడు ఎవరంటే.., అందరికంటే అధికంగా దైవానికి భయపడేవాడు, సమాజాన్ని, సాటి మానవులను అధికంగా ప్రేమించేవాడు, నైతిక విలువలు కలవాడు మాత్రమే దైవానికి అత్యంత ప్రీతిపాత్రుడు.' అని చెప్పారు. కనుక ఆస్తులు, అంతస్తులు, అధికారం, హోదా చూసి మనుషులను గౌరవించడం మానుకోవాలి. మంచినీ, మానవత్వాన్ని, నైతిక, మానవీయ విలువలను చూసి మాత్రమే సాటి మానవుల పట్ల ఒక అంచనాకు రావాలి. అంతేతప్ప, దుష్టుడైనా, దుర్మార్గుడైనా, సిరి సంపదలను చూసి గౌరవించడం లాంటి అలవాటును దూరం చేసుకోవాలి. నీతి, నిజాయితీ, నైతికత, సచ్ఛీలత, మానవీయత లాంటి సుగుణాలు మాత్రమే గౌరవాదరణలకు నిజమైన కొలమానం. అల్లాహ్ అందరికీ దుర్మార్గాలకు వ్యతిరేకంగా, మంచిని, మానవత్వాన్ని ప్రేమించే, దాన్ని సర్వ సామాన్యం చేసే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

దీపావళి మెరుపుల్..!

- కొత్త సంవత్ 2081లో సానుకూలంగా లార్జ్ క్యాప్స్
- మిడ్, స్మాల్ క్యాప్స్‌పై ఆచితూచి వ్యవహరించాలి
- కన్సాలిడేషన్‌కు అవకాశం
- ఆకర్షణీయంగా ఫైనాన్స్, ఫార్మా, ఐటీ
- కొంత పసిడి, వెండిలో కూడా పెట్టుబడులు
- మార్కెట్ నిపుణుల సూచనలు

అంతర్జాతీయంగా భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, అస్తవ్యస్త ఆర్థిక పరిస్థితులు, అధిక వడ్డీ రేట్లు వంటి సవాళ్లు నెలకొన్నప్పటికీ సంవత్ 2080లో దేశీ సూచీలు కొత్త రికార్డు స్థాయులను తాకాయి. నిఫ్టీ50 దాదాపు 26,250 మార్కును, బీఎస్ఈ సెన్సెక్స్ 85,900 మార్కును దాటాయి. గత దీపావళి నుంచి దాదాపు 25 శాతం పెరిగాయి. కొన్నాళ్లుగా అంతర్జాతీయ సూచీల్లో భారత్‌కి వెయిటేజ్ గణనీయంగా పెరుగుతోంది. దిగ్గజ గ్లోబల్ ఫండ్స్ దృష్టిని భారత మార్కెట్లు ఆకర్షిస్తున్నాయి. అమెరికా డాలరు బలహీనత, ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం వంటి అంశాలు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను (ఎఫ్‌పీఐలు) మన మార్కెట్ల వైపు మళ్లించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. టెక్నికల్ చార్ట్స్ ప్రకారం చూస్తే నిఫ్టీ 22 శాతం, సెన్సెక్స్ 27 శాతం పెరగవచ్చనే అంచనాలున్నాయి. అయితే, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, కొంత ఉద్దీపన చర్యలతో చైనా మార్కెట్లు పుంజుకోవడం వంటి అంశాల ప్రభావం మన మార్కెట్లపైనా ఉంటుందని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. దీంతో మార్కెట్లో కన్సాలిడేషన్ జరగవచ్చని, 2080 సంవత్‌తో పోలిస్తే కొత్త సంవత్ 2081లో రాబడులు తక్కువగానే ఉండొచ్చనే అంచనాలు నెలకొన్నాయి. గత 12-18 నెలలుగా ర్యాలీ చేసిన మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్ .. ఆదాయ అంచనాలను అందుకోలేకపోతే గణనీయంగా తగ్గవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం మిడ్, స్మాల్ క్యాప్స్‌తో పోలిస్తే కాస్త స్థిరంగా, మెరుగైన వేల్యుయేషన్స్‌తో లార్జ్ క్యాప్స్ ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. క్యాపిటల్ గూడ్స్, విద్యుత్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్, కన్‌స్ట్రక్షన్, ఫైనాన్స్ తదితర రంగాలు సానుకూలంగా ఉంటాయనే అంచనాలు నెలకొన్నాయి. అలాగే పసిడి, వెండికి కూడా కొంత కేటాయించాలనే సూచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పలు బ్రోకరేజీలు కొత్త సంవత్ 2081లో పరిశీలించతగిన స్టాక్స్‌ను సూచించాయి. వాటిలో కొన్ని ..

– సాక్షి, బిజినెస్‌డెస్క్



పసిడి పరుగు..!

70,000 -87,000

గణనీయంగా పెరిగిన బంగారం ధరలు రాబోయే రోజుల్లోనూ అదే ధోరణి కొనసాగించే అవకాశం ఉంది. ఈ ఏడాది అక్టోబర్ 30న అంతర్జాతీయంగా పసిడి రేటు ఔన్సుకి (31.1 గ్రా) ఆల్ టైమ్ గరిష్టం 2,801 డాలర్లని దాటింది.. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ. 79,775కి ఎగిసింది. 2080 సంవత్ నాటి నుంచి చూస్తే అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు, సెంట్రల్ బ్యాంక్‌ల పాలసీల కారణంగా గ్లోబల్‌గా గోల్డ్ ధరలు 41 శాతం పైగా, ఎంసీఎక్స్‌లో 27 శాతం పైగా పెరిగాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు చైనాలో పటిష్టమైన డిమాండ్, స్పెక్యులేటివ్ కొనుగోళ్లు కూడా పసిడికి ఊతమిస్తున్నాయి. దేశీయంగా ఇటీవల పసిడిపై దిగుమతి సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించడంతో దీనిపై ఆసక్తి మరింత పెరిగింది. 2081 సంవత్‌లో పసిడి రేట్లు మరింత బలపడొచ్చు. ఎంసీఎక్స్‌లో పది గ్రాముల పసిడి రూ. 70,000-87,000 శ్రేణిలో తిరుగాడవచ్చు. అంతర్జాతీయంగా ఔన్సు ధర 3,030 డాలర్ల స్థాయికి తాకే అవకాశం ఉంది. అమెరికా ఆర్థిక గణాంకాల వల్ల పెరుగుదలకు కాస్త అడ్డుకట్ట పడినా, మొత్తం మీద చూస్తే మాత్రం సానుకూల అంచనాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న తరుణంలో ఇన్వెస్టర్లకు బంగారం సురక్షితమైన పెట్టుబడి సాధనంగా ఉంటుంది.



– కాయనాత్ చైన్‌వాలా, అసోసియేట్ వీపీ, కమోడిటీ రీసెర్చ్, కోటక్ సెక్యూరిటీస్



బ్రోకరేజి సంస్థ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రస్తుత ధర: రూ. 107.35
టార్గెట్ ధర: రూ. 132
పటిష్టమైన క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తి, నికర వడ్డీ మార్జిన్లు .. అసెట్ క్వాలిటీ మెరుగుపడటం వంటివి సానుకూలాంశాలు. వ్యవసాయ, ఎస్ఎంఈ సెగ్మెంట్లలో అసెట్ నాణ్యత పడిపోయే అవకాశాలు, మొండిబాకీల పరిష్కారం ఆశించినంత స్థాయిలో ఉండకపోవడం, ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీము వర్తింపచేయడం ప్రతికూలాంశాలు.

జ్యోతిల్యాబ్స్
ప్రస్తుత ధర: రూ. 513.55
టార్గెట్ ధర: రూ. 600
ప్రమోటర్ ఆధారిత, దక్షిణాది కేంద్రంగా, సింగిల్ ప్రోడక్ట్ కంపెనీగా పని చేయడం నుంచి ప్రొఫెషనల్స్ నిర్వహణలో, బహుళ ఉత్పత్తులతో, దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించిన సంస్థగా ఎదిగింది. నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపడటం మార్జిన్లకు దన్నుగా ఉండగలవు. ప్రతికూల వర్షపాతం, ద్రవ్యోల్బణం ప్రతికూలతలు.

నాల్కో
ప్రస్తుత ధర: రూ. 227.20
టార్గెట్ ధర: రూ. 270
అంతర్జాతీయంగా డిమాండ్ పెరుగుతుండటం, నరఫరా అంతగా లేకపోవడంతో అల్యూమినియం ధరలు పెరుగుతుండటం కంపెనీకి సానుకూలాంశాలు. నియంత్రణ విధానాలపరమైన మార్పులు, ముడివస్తువుల ధరల పెరుగుదల, అల్యూమినా రేట్లలో హెచ్చుతగ్గులు మొదలైనవి ప్రతికూలంగా ఉండవచ్చు.

నవీన్ ఫ్లోరిన్
ప్రస్తుత ధర: రూ. 3,331.95
టార్గెట్ ధర: రూ. 3,948
సీడీఎంవో, స్పెషాలిటీ కెమికల్ సెగ్మెంట్స్ విభాగాలు వృద్ధి చెందుతుండటం కలిసి రానున్నాయి. ప్రోడక్ట్ మిక్స్ మెరుగ్గా ఉండటం వల్ల వచ్చే మూడేళ్లలో మార్జిన్లు750 బేసిస్ పాయింట్ల మేర మెరుగుపడొచ్చు. ముడి సరుకుల ధరల్లో హెచ్చుతగ్గులు, చైనా కంపెనీల నుంచి పోటీ, వ్యాపార విస్తరణలో జాప్యాలు మొదలైనవి మైనస్.

ఎన్‌సీసీ
ప్రస్తుత ధర: రూ. 292.20
టార్గెట్ ధర: రూ. 363
మౌలిక రంగంపై ప్రభుత్వ వ్యయాలు సానుకూల అంశం. ఆర్డర్ బుక్, బ్యాలెన్స్ షీట్ బాగుంది. ప్రాజెక్టుల అమలు వేగవంతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మధ్యకాలికంగా కంపెనీ ఆరోగ్యకరమైన స్థాయిలో వృద్ధి నమోదు చేయవచ్చు. ముడి సరుకుల ధరల్లో హెచ్చుతగ్గులు, ప్రాజెక్టుల వ్యయాలు పెరిగిపోవడం, జాప్యం వంటి రిస్కులు ఉన్నాయి.

చాయిస్ ఈక్విటీ బ్రోకింగ్

బజాజ్ ఆటో
ప్రస్తుత ధర: రూ. 9,917
టార్గెట్ ధర: రూ. 12,483
మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్నాయి. అమ్మకాలను పెంచుకునేందుకు ఎగుమతులపై దృష్టి పెడుతుండటం, కొత్త వాహనాలు, ఈవీ చేతక్‌కు డిమాండ్ పెరుగుతుండటం, సీఎన్‌జీ ఆధారిత టూ-వీలర్లు, ఎలక్ట్రిక్ వేరియంట్ల విక్రయాలను పెంచుకునే వ్యూహాలు మొదలైనవి కలసి రానున్నాయి.

భారత్ డైనమిక్స్
ప్రస్తుత ధర: రూ. 1,063.70
టార్గెట్ ధర: రూ. 1,501
భద్రతా బలగాల అవసరాల ఉత్పత్తులను అందిస్తోంది. భారీ ప్రాజెక్టులు 2025 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్నాయి. ఎగుమతులను పెంచుకునే క్రమంలో 4-5 దేశాలతో చర్చలు జరుగుతున్నాయి. సాయుధ బలగాలకు సంబంధించి డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో ఉంది. 2024 ఏప్రిల్ 1 నాటికి రూ. 19,500 కోట్ల ఆర్డర్ బుక్ ఉంది.

ఏసీసీ
ప్రస్తుత ధర: రూ. 2,337.80
టార్గెట్ ధర: రూ. 2,795
దేశీయంగా సిమెంట్‌కు డిమాండ్ 7-8 శాతం మేర వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి ఉత్పత్తిని 140 మిలియన్ టన్నుల స్థాయికి రెట్టింపు చేసుకోవాలని సంస్థ నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఇది 89 మిలియన్ టన్నులుగా ఉంది. వ్యయాల నియంత్రణపై మరింతగా దృష్టి పెడుతోంది.

టీసీఎస్
ప్రస్తుత ధర: రూ. 4,085.60
టార్గెట్ ధర: రూ. 4,664
వృద్ధికి అవకాశమున్న వర్ధమాన మార్కెట్లలో కార్యకలాపాలను విస్తరించేందుకు గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తోంది. టోటల్ కాంట్రాక్ట్ వేల్యూ దాదాపు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో ఉండటం, జెన్‌ఏఐపై క్లయింట్ల ఆసక్తి పెరుగుతుండటం వంటివి వ్యాపార వృద్ధికి దోహదపడే సానుకూలాంశాలు.

గ్రాన్యూల్స్ ఇండియా
ప్రస్తుత ధర: రూ. 551.60
టార్గెట్ ధర: రూ. 723
ఎఫ్‌డీ సెగ్మెంట్‌వైపు వ్యూహాత్మకంగా మళ్లుతుండటం, యూరప్‌లో పారాసెటమాల్ ఏపీఐల అమ్మకాలు స్థిరపడుతుండటం మొదలైనవి సానుకూలాంశాలు. అలాగే, కొత్త ఎఫ్‌డీ ప్లాంటు అందుబాటులోకి రావడం, ఉత్తర అమెరికాలో కొత్త ఉత్పత్తుల లాంచింగ్ వంటి అంశాలు వ్యాపార వృద్ధికి తోడ్పడగలవు.

ఎస్‌బీఐ సెక్యూరిటీస్

కోల్ ఇండియా
ప్రస్తుత ధర: రూ. 449.55
టార్గెట్ ధర: రూ. 593
భారీ ఉత్పత్తి లక్ష్యాలు నిర్దేశించుకుంది. ఫస్ట్ మైల్ కనెక్టివిటీ ప్రాజెక్టుల ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడంలో పురోగతి సాధించింది. లాభసాటి కాని భూగర్భ గనుల నుంచి తప్పుకోవడం ద్వారా వ్యయాలను నియంత్రించుకుంటోంది. గ్రాఫైట్ వంటి ఇతర విభాగాల్లోకి కూడా విస్తరిస్తోంది.

మ్యాక్రోటెక్ డెవలపర్స్
ప్రస్తుత ధర: రూ. 1,181.80
టార్గెట్ ధర: రూ. 1,398
రియల్ ఎస్టేట్ రంగంలో దిగ్గజ సంస్థగా రాణిస్తోంది. రెసిడెన్షియల్, కమర్షియల్, వేర్‌హౌసింగ్ వంటి వివిధ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. 2019 ఆర్థిక సంవత్సరంలో రూ. 23,363 కోట్లుగా ఉన్న రుణ భారాన్ని గత ఆర్థిక సంవత్సరంలో గణనీయంగా రూ. 7,680 కోట్లకు తగ్గించుకుంది.

భారతి హెక్సాకామ్
ప్రస్తుత ధర: రూ. 1,420.90
టార్గెట్ ధర: రూ. 1,747
రాజస్థాన్, ఈశాన్య టెలికం సర్కిళ్లలో కార్యకలాపాలు సాగిస్తోంది. 25,704 టవర్లు, 79,835 మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ స్టేషన్లతో పటిష్టమైన మౌలిక సదుపాయాల నెట్‌వర్క్ ఉంది. భారతి ఎయిర్‌టెల్‌తో అనుబంధం వల్ల డిజిటల్ ఇన్‌ఫ్రా, మేనేజ్‌మెంట్ నైపుణ్యాలపరంగా ప్రయోజనాలను పొందుతోంది.

నిప్పన్ లైఫ్ ఏఎంసీ
ప్రస్తుత ధర: రూ. 683
టార్గెట్ ధర: రూ. 825
ఈక్విటీ, ఈటీఎఫ్ ఏయూఎంపరంగా పటిష్ట వృద్ధి కనబరుస్తోంది. 2024-26 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఏయూఎం వృద్ధి రెండంకెల స్థాయిలో ఉండొచ్చనే అంచనాలున్నాయి. బలమైన రిటైల్ నెట్‌వర్క్, దేశీయంగా మ్యుచువల్ ఫండ్ విస్తృతి తక్కువగా ఉండటం తదితర అంశాలు ఇందుకు తోడ్పడనున్నాయి.

ఎస్కార్ట్స్ కుబోటా
ప్రస్తుత ధర: రూ. 3,642.45
టార్గెట్ ధర: రూ. 4,408
12 హెచ్‌పీ నుంచి 120 హెచ్‌పీ వరకు వివిధ సామర్థ్యాలున్న ట్రాక్టర్లతో బలమైన పోర్ట్‌ఫోలియో ఉంది. మూడు తయారీ ప్లాంట్లు, ఏటా 12 లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. హైడ్రాలిక్ మొబైల్ క్రేన్లకు సంబంధించి దేశీ మార్కెట్‌లో అగ్రగామిగా ఉంటోంది. 1,200 పైచిలుకు డీలర్లతో మార్కెట్లలో విస్తరిస్తోంది.

సిస్టమాటిక్స్ షేర్స్ అండ్ స్టాక్స్ (ఇండియా)

పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్
ప్రస్తుత ధర: రూ. 925
టార్గెట్ ధర: రూ. 1,333
దేశీయంగా మూడో అతి పెద్ద హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ. ఏయూఎం రూ. 71,243 కోట్లుగాను, లోన్ బుక్ రూ. 65,358 కోట్లుగా ఉంది. రిటైల్ లోన్ బుక్‌ను 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 1 లక్ష కోట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. వార్షికంగా 50 చొప్పున 2026 నాటికి మొత్తం 400 శాఖలు ఏర్పాటు చేయనుంది.

శ్రీరామ్ ప్రాపర్టీస్
ప్రస్తుత ధర: రూ. 106.95
టార్గెట్ ధర: రూ. 152
దక్షిణాదిలో దిగ్గజ రెసిడెన్షియల్ డెవలపర్లలో ఒకటిగా వ్యాపార వృద్ధి. లాభదాయకతపై మరింతగా దృష్టి పెడుతోంది. వచ్చే మూడేళ్లలో 15 ఎంఎస్ఎఫ్ స్థాయిలో విక్రయాలను లక్ష్యంగా పెట్టుకుంది. పరిశ్రమపై సానుకూల అంచనాలు ఉండటం, మిడ్ సెగ్మెంట్‌లో అగ్రగామిగా ఉండటం వంటివి సంస్థకు సానుకూలాంశాలు.

జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్
ప్రస్తుత ధర: రూ. 464.85
టార్గెట్ ధర: రూ. 700
ఇది దేశీయంగా నాలుగో అతి పెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్. 2021 ఆర్థిక సంవత్సరంలో 40 శాతంగా ఉన్న సెక్యూర్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో 2024 ఆర్థిక సంవత్సరంలో 60 శాతానికి పెరిగింది. నికర వడ్డీ మార్జిన్లు స్థిరంగా ఉండటం, నికర ఎన్‌పీఏలు తగ్గుతుండటంతో లాభాల మార్జిన్లు మెరుగుపడనున్నాయి. ఏయూఎం వృద్ధి 19-20% అంచనా.

పేటీఎం
ప్రస్తుత ధర: రూ. 752.25
టార్గెట్ ధర: రూ. 900
ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని రూ. 2,000 కోట్లకు జొమాటోకి విక్రయించడం ద్వారా కీలకమైన పేమెంట్, ఆర్థిక సేవలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఈ డీల్‌తో నగదు నిల్వలు పెరిగి, భవిష్యత్‌లో పెట్టుబడులకు కాస్త వెసులుబాటు లభిస్తుంది. విస్తృతమైన మర్చంట్ నెట్‌వర్క్, పటిష్టమైన సౌండ్-బాక్స్ సబ్‌స్క్రయిబర్లు సానుకూలాంశాలు.

జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
ప్రస్తుత ధర: రూ. 80.70
టార్గెట్ ధర: రూ. 108
దేశంలోనే రద్దీగా ఉండే రెండు విమానాశ్రయాలను (డీఐఏఎల్, జీహెచ్ఐఏఎల్) నిర్వహిస్తోంది. ఈ రెండింటిలో ప్యాసింజర్ ట్రాఫిక్ గత ఆర్థిక సంవత్సరంలో వరుసగా 13%, 19% మేర వృద్ధి చెందింది. డ్యూటీ-ఫ్రీ సర్వీసెస్ వంటి నాన్-ఏరోనాటికల్ ఆదాయ వనరులను పెంచుకుంటోంది. గ్రూప్ ఏడీపీతో భాగస్వామ్యం వల్ల ఆర్థిక స్థిరత్వం మెరుగుపడింది.

యాక్సిస్ సెక్యూరిటీస్

గ్రావిటా ఇండియా
ప్రస్తుత ధర: రూ. 2,000.70
టార్గెట్ ధర: రూ. 3,000
వచ్చే ఏడాది వ్యవధిలో కంపెనీ పటిష్టమైన ఎబిటా నమోదు చేసే అవకాశం ఉంది. వాల్యూమ్స్, ప్రతి టన్నుపై ఎబిటా వృద్ధి మెరుగ్గా ఉండగలవు.

అరవింద్ స్మార్ట్ స్పేసెస్
ప్రస్తుత ధర: రూ. 918.75
టార్గెట్ ధర: రూ. 1,085
ఎన్‌హెచ్47 సూరత్, సౌత్ అహ్మదాబాద్ ప్రాజెక్టుల బుకింగ్స్ సానుకూలంగా ఉండవచ్చు. వీటి నుంచి వరుసగా రూ. 1,100 కోట్లు, రూ. 1,450 కోట్ల మేర రావచ్చని అంచనా.

ఐనాక్స్ విండ్
ప్రస్తుత ధర: రూ. 218.70
టార్గెట్ ధర: రూ. 270
2023-24 నుంచి 2026-27 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో కంపెనీ రెవెన్యూ/ఎబిటాలు వార్షిక ప్రాతిపదికన 83 శాతం/90 శాతం మేర వృద్ధి చెందవచ్చని అంచనా.

కేపీఐటీ టెక్నాలజీస్
ప్రస్తుత ధర: రూ. 1,386.10
టార్గెట్ ధర: రూ. 2,150
ఆర్డర్ బుక్ పటిష్టంగా ఉండటంతో దీర్ఘకాలంలో అధిక వృద్ధిని కొనసాగించగలమని మేనేజ్‌మెంట్ ధీమాగా ఉంది.

హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్
ప్రస్తుత ధర: రూ. 1,331.85
టార్గెట్ ధర: రూ. 1,700
వ్యూహాత్మక డైవర్సిఫికేషన్‌పై దృష్టి పెడుతుండటం సంస్థకు గణనీయంగా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది.

నితీశ్ కుమార్ రెడ్డి సత్తా చాటేనా!

మెకే: ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు సిరీస్‌లో భారత తుది జట్టులో స్థానం దక్కించుకోవాలని భావిస్తున్న భారత యువ ఆటగాళ్లు సత్తా చాటి టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టిలో పడే అవకాశం వచ్చింది. సీనియర్ టీమ్‌లోకి ఎంపికైన ముగ్గురు ప్లేయర్లు ఇప్పుడు భారత 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగబోతున్నారు. నేటి నుంచి జరిగే నాలుగు రోజుల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో భారత్ 'ఎ' జట్టు తలపడుతుంది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్, పేస్ బౌలర్ ప్రసిధ్ కృష్ణ, బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 'ఎ' టీమ్ తరఫున బరిలోకి దిగబోతున్నారు. 'ఎ' జట్టుతో జరిగే రెండు మ్యాచ్‌లలో బాగా ఆడితే నవంబర్ 22 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య బోర్డర్–గావస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో బరిలోకి దిగే ఆటగాళ్లలో ఈ ముగ్గురూ రేసులో నిలుస్తారు.

దేశవాళీల్లో సత్తా చాటి...

11 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఈశ్వరన్ భారీగా పరుగులు సాధించినా దురదృష్టవశాత్తూ ఇప్పటి వరకు జాతీయ జట్టుకు ఆడే అవకాశం రాలేదు. 99 మ్యాచ్‌లలో అతను 7638 పరుగులు సాధించగా, ఇందులో 27 సెంచరీలు ఉన్నాయి. నేటి నుంచి జరిగే పోరు అతనికి 100వ ఫస్ట్ క్లాస్ మ్యాచ్ కానుంది. ఇంతటి అపార అనుభవం ఉన్న ఈశ్వరన్ పేరు పెర్త్‌లో జరిగే తొలి టెస్టు కోసం ఇప్పటికే పరిశీలనలో ఉంది. వ్యక్తిగత కారణాలతో కెప్టెన్ రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరం అయ్యే అవకాశం ఉండటంతో రెగ్యులర్ ఓపెనర్‌గా ఈశ్వరన్‌కే తొలి ప్రాధాన్యత ఉంది.

ఈశ్వరన్, ప్రసిధ్‌లపై సెలక్టర్ల దృష్టి

- నేటి నుంచి భారత్ 'ఎ', ఆసీస్ 'ఎ' జట్ల మధ్య నాలుగు రోజుల మ్యాచ్

గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేసిన తర్వాత దులీప్ ట్రోఫీ, ఇరానీ, రంజీలలో పేసర్ ప్రసిధ్ కృష్ణ ఆడాడు. వీటిలో ప్రదర్శన గొప్పగా లేకపోయినా... అతని బౌలింగ్ శైలికి ఆసీస్ పిచ్‌లు సరిగ్గా సరిపోతాయి. ఇదే కారణంతో అతను సీనియర్ టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు తన ఫామ్‌ను అందుకోవడంతో పాటు ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు కూడా ప్రసిధ్‌కు ఇది సరైన వేదిక కానుంది.

ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి పరిస్థితి వీరితో పోలిస్తే భిన్నం. ఐపీఎల్‌లో మెరుపు బ్యాటింగ్‌తో పాటు ఇటీవల బంగ్లాదేశ్‌పై టి20లో చెలరేగిన నితీశ్ ఫస్ట్ క్లాస్ రికార్డు అద్భుతంగా ఏమీ లేదు. ఇటీవల దులీప్ ట్రోఫీలో కూడా ఐదు ఇన్నింగ్స్‌లలో రెండు సార్లు డకౌట్ అయిన అతను... 48 ఓవర్లు బౌలింగ్ చేసి రెండే వికెట్లు తీశాడు. అయినా సరే శార్దుల్ ఠాకూర్‌లాంటి ఆల్‌రౌండర్‌ను కాదని నితీశ్‌ను సెలక్టర్లు టెస్టు టీమ్‌కు ఎంపిక చేశారు. గత ఏడాది రంజీ సీజన్‌లో 25 వికెట్లు తీసిన నితీశ్ ప్రదర్శన కూడా ఒక కారణం కాగా... వికెట్‌కు ఇరువైపులా బంతిని చక్కగా స్వింగ్ చేసే అతని నైపుణ్యం ఆసీస్ పిచ్‌లపై పనికొస్తుందని వారు భావించారు. ఈ నేపథ్యంలో తానేంటో నిరూపించుకోవాల్సిన బాధ్యత నితీశ్‌పైనే ఉంది.

టెస్టు క్రికెటర్లు కూడా...

భారత్ తరఫున ఇంకా టెస్టులు ఆడని రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో భారత 'ఎ' జట్టు బరిలోకి దిగుతోంది. ఇప్పటికే భారత్‌కు ఆడిన ఇషాన్ కిషన్, నవదీప్ సైనీ, దేవదత్ పడిక్కల్, ముకేశ్ కుమార్‌లాంటి ప్లేయర్లు మరోసారి ఎరుపు బంతితో తమ ఆటకు పదును పెట్టాల్సి ఉంది. రంజీ, దులీప్ ట్రోఫీలో రాణించి ఈ టీమ్‌కు ఎంపికైన బాబా ఇంద్రజిత్, రికీ భుయ్, ఖలీల్, తనుశ్ కొటియాన్, సాయిసుదర్శన్ ఎలా రాణిస్తారనేది ఆసక్తికరం. మరోవైపు ఆస్ట్రేలియా 'ఎ' జట్టులో కూడా పలువురు టెస్టు క్రికెటర్లు ఉన్నారు. మైకేల్ నెసర్, మార్కస్ హారిస్, స్కాట్ బోలండ్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్, టాడ్ మర్ఫీ ఆసీస్ ప్రధాన జట్టులోకి పునరాగమనం చేసే ప్రయత్నంలో తమ అదృష్టాన్ని మరోసారి పరీక్షించుకోనున్నారు. పరిమిత ఓవర్ల పోటీల్లో సత్తా చాటిన జోష్ ఫిలిప్ కూడా ఇక్కడ రాణించి టెస్టు అరంగేట్రాన్ని ఆశిస్తున్నాడు. అందరికంటే ఎక్కువగా న్యూసౌత్‌వేల్స్‌కు చెందిన 19 ఏళ్ల ఓపెనర్ స్యామ్ కొన్‌స్టాస్‌పై ఆస్ట్రేలియా సెలక్టర్లు ఎక్కువగా దృష్టి పెట్టారు. 'జూనియర్ రికీ పాంటింగ్'గా అందరూ పిలుస్తున్న ఈ బ్యాటర్ 6 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 2 సెంచరీలు సహా 45.70 సగటుతో పరుగులు సాధించాడు. ఇక్కడ బాగా ఆడితే భారత్‌తో టెస్టుకు అతను కొత్త ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో 'ఎ' జట్ల పోరు కూడా ఆసక్తికరంగా సాగడం ఖాయం.



సహచరులు తనుశ్ కొటియాన్, మానవ్ సుతార్, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్‌లతో నితీశ్ కుమార్ రెడ్డి (మధ్యలో)

2027 వరకు కోచ్‌గా మెక్‌డొనాల్డ్

క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటన



సిడ్నీ: ఆస్ట్రేలియా పురుషుల జట్టు హెడ్ కోచ్‌గా ఆండ్రూ మెక్‌డొనాల్డ్‌కు పొడిగింపు ఇచ్చారు. 2027 సీజన్ ముగిసేదాకా మెక్‌డొనాల్డే హెడ్ కోచ్‌గా కొనసాగుతాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బుధవారం ప్రకటించింది. అంటే దక్షిణాఫ్రికాలో జరిగే వన్డే ప్రపంచ కప్ దాకా మెక్‌డొనాల్డ్ ఆసీస్ జట్టుతో ఉంటాడు. జస్టిన్ లాంగర్ తప్పుకోవడంతో 2022లో మెక్‌డొనాల్డ్‌కు కోచింగ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన కోచింగ్‌లోనే ఆస్ట్రేలియా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సాధించింది. భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ఇంగ్లండ్‌లో ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌నూ కైవసం చేసుకుంది. వన్డే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునే లక్ష్యంతోనే ఆయన పదవీకాలాన్ని పొడిగించినట్లు తెలిసింది. ఈ లోపే వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ కూడా ఉండటంతో మెక్‌డొనాల్డ్‌పై సీఏ నమ్మకం పెట్టుకుంది. హెడ్ కోచ్‌గా మెక్‌డొనాల్డ్ ఇప్పటికే నిరూపించుకున్నాడని, జట్టు నిలకడైన విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడని, దీంతో కోచింగ్ బృందాన్ని మరింత పటిష్ట పరిచేందుకే పొడిగింపు ఇచ్చామని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈఓ నిక్ హాక్లీ తెలిపారు. తనకు లభించిన పొడిగింపుపై హర్షం వ్యక్తం చేసిన మెక్‌డొనాల్డ్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిబద్ధతతో పూర్తి చేస్తానని చెప్పారు.

దక్షిణాఫ్రికా 575/6 డిక్లేర్డ్

సఫారీ ఇన్నింగ్స్‌లో మరో సెంచరీ • శతక్కొట్టిన ముల్డర్ • బంగ్లాదేశ్ 38/4

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. రెండో రోజు వియాన్ ముల్డర్ (105 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా 'శత'క్కొట్టడంతో ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం మూడు సెంచరీలు నమోదయ్యాయి. తొలి రోజే ఓపెనర్ టోని డి జోర్జి, వన్‌డౌన్ బ్యాటర్ ట్రిస్టన్ స్టబ్స్ శతకాలు బాదారు. ఓవర్‌నైట్ స్కోరు 307/2తో బుధవారం ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 144.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 575 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు జోర్జి (177; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు), బెడింగ్‌హామ్ (59; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 116 పరుగులు జోడించారు. వేగంగా ఆడి అర్ధసెంచరీ సాధించిన బెడింగ్‌హామ్‌ను తైజుల్ బౌల్డ్ చేశాడు. జోర్జి తన శతకాన్ని డబుల్ సెంచరీగా మలచుకోలేకపోయాడు. 141 క్రితం రోజు స్కోరుతో ఆట కొనసాగించిన అతను 36 పరుగులు జోడించి తైజుల్ బౌలింగ్‌లోనే ఎల్బీగా వెనుదిరిగాడు. తన మరుసటి ఓవర్లో కైల్ వెరియెన్ (0)ను తైజుల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో తొలి సెషన్‌లో 5 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు పడ్డాయి. జట్టు స్కోరు 400 పరుగులు దాటాక... రెండో సెషన్‌లో రికెల్టన్ (12) నహీద్ రాణా బౌలింగ్‌లో అవుటయ్యాడు. అయితే చకచకా నాలుగు వికెట్లు తీసిన ఆనందం ఆవిరయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. రెండో సెషన్‌లో మరో వికెట్ పడకుండా ముల్డర్, సెనురన్ ముత్తుస్వామి (75 బంతుల్లో 68 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆరో వికెట్‌కు అబేధ్యమైన భాగస్వామ్యాన్ని నిర్మించారు. ఇద్దరు 152 పరుగులు జోడించారు. టి విరామం తర్వాత ముత్తుస్వామి అర్ధసెంచరీ, ముల్డర్ సెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ (5/198) ఐదు వికెట్లు తీయగలిగాడు కానీ దాదాపు 200 పరుగులు సమర్పించుకున్నాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 38 పరుగులే చేసి 4 కీలకమైన వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. టాప్–3 బ్యాటర్లు షాద్‌మన్ (0), హసన్ (10), జాకీర్ హసన్ (2) చేతులెత్తేశారు. దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ రబడ 2 వికెట్లు తీయగా, నైట్‌వాచ్‌మన్ హసన్ (3)ను స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అవుట్ చేశాడు. మోమినుల్ హక్ (6 బ్యాటింగ్), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.


2020 చివరిసారి టెస్టుల్లో దక్షిణాఫ్రికా జట్టు స్కోరు 500 పరుగులు దాటిన సంవత్సరం. 2020లో సెంచూరియన్‌లో శ్రీలంక జట్టుతో జరిగిన 'బాక్సింగ్ డే' టెస్టులో దక్షిణాఫ్రికా 621 పరుగులకు ఆలౌటైంది.

2 ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు తమ తొలి సెంచరీని నమోదు చేయడం ఇది రెండోసారి మాత్రమే. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్టులో దక్షిణాఫ్రికా తరఫున టోనీ జోర్జి, స్టబ్స్, ముల్డర్ సెంచరీలు సాధించారు. 1948లో భారత్‌తో ఢిల్లీలో జరిగిన టెస్టులో వెస్టిండీస్ తరఫున గెర్రీ గోమెజ్, రాబర్ట్ క్రిస్టియాని, క్లైడ్ వాల్కట్ తమ తొలి సెంచరీలను నమోదు చేశారు.



ముల్డర్

సాకేత్ జంట సంచలనం



సాక్షి, హైదరాబాద్: సియోల్ ఓపెన్ ఏటీపీ–100 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ సంచలన విజయంతో బోణీ చేసింది. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఈ టోర్నీ లో పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో సాకేత్–రామ్‌కుమార్ జంట 7–6 (7/5), 6–4తో రెండో సీడ్ క్రిస్టియన్ రోడ్రిగెజ్ (కొలంబియా)– రొమియోస్ (ఆస్ట్రేలియా) జోడీని కంగుతినిపించింది. 86 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్ జంట ఐదు ఏస్‌లు సంధించింది. ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

అనిరుధ్ జోడీ ముందంజ

ఇదే టోర్నీలో ఆడుతున్న హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ భారత్‌కే చెందిన తన భాగస్వామి నిక్కీ కలియంద పూనాచాతో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో మూడో సీడ్ అనిరుధ్–నిక్కీ ద్వయం 6–3, 7–5తో ఎస్కోఫియర్–బెనోట్ పెయిర్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో దివిజ్ శరణ్ (భారత్)–ఇసారో (థాయ్‌లాండ్) జంట 3–6, 5–7తో మొరెనో (అమెరికా)–రూబిన్ స్థాతమ్ (న్యూజిలాండ్) జోడీ చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్ ఫైనల్లో రష్మిక జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో ఓడిపోయిన రష్మిక... డబుల్స్ విభాగంలో భారత్‌కే చెందిన తన భాగస్వామి వైదేహి చౌదరీతో కలిసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రపంచ 422వ ర్యాంకర్ గాబ్రియేలా డ సిల్వా ఫిక్ (ఆస్ట్రేలియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 300వ ర్యాంకర్ రష్మిక 5–7, 3–6తో ఓడిపోయింది. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక–వైదేహి జోడీ 7–6 (7/3), 6–4తో మూడో సీడ్ లీ యు యున్ (చైనీస్ తైపీ)–నీనా వర్గోవా (స్లోవేకియా) జంటపై సంచలన విజయం సాధించింది.

తలైవాస్ 'టాప్' షో

గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తమిళ్ తలైవాస్ జోరు కొనసాగుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోరులో తమిళ్ తలైవాస్ 44–25 తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. తలైవాస్ తరఫున నరేందర్ ఖండోలా 15 పాయింట్లతో సత్తా చాటగా... సచిన్, సాహిల్ సింగ్ చెరో 5 పాయింట్లు సాధించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున గుమాన్ సింగ్ 7 పాయింట్లు సాధించాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి 18–14 తేడాతో ముందంజలో నిలిచిన తమిళ్ తలైవాస్... ద్వితీయార్ధంలో మరింత చెలరేగి ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ వెళ్లి విజయం సాధించింది. తాజా సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడిన తమిళ్ తలైవాస్ 3 విజయాలు, ఒక ఓటమి, ఒక 'డ్రా'తో మొత్తం 19 పాయింట్లు ఖాతాలో వేసుకొని అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు నాలుగు మ్యాచ్‌ల్లో మూడో పరాజయం మూటగట్టుకున్న గుజరాత్ జెయింట్స్ 7 పాయింట్లతో పట్టిక పదో స్థానానికి పరిమితమైంది. హోరాహోరీగా జరిగిన మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 30–28 తేడాతో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. హరియాణా స్టీలర్స్ తరఫున వినయ్ 8 పాయింట్లు, సంజయ్ ధుల్ 6 పాయింట్లతో ఆకట్టుకున్నారు. యూపీ యోధాస్ తరఫున గగన్ 9 పాయింట్లతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. గురువారం జరగనున్న మ్యాచ్‌ల్లో పట్నా పైరెట్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8 గంటల నుంచి), యు ముంబాతో జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.

తరుణ్‌కు నిరాశ


సార్‌బ్రుకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ షట్లర్లు మన్నెపల్లి తరుణ్, కెయుర మోపాటిలకు నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో తరుణ్ 19–21, 19–21తో ఆస్ట్రియాకు చెందిన కొలిన్స్ వాలెంటైన్ ఫిలిమోన్ చేతిలో... మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో కెయుర 8–21, 12–21తో అన్న సియెస్ రిబెర్గ్ (డెన్మార్క్) చేతిలో ఓడిపోయారు. మిగతా భారత షట్లర్లలో ఆయుశ్ షెట్టి, సతీశ్ కుమార్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. ఆయుశ్ 21–12, 21–17తో ఫిన్లాండ్ ప్లేయర్ జొకిమ్ ఒల్డార్ఫ్‌పై, సతీశ్ కుమార్ 22–20, 22–24, 21–17తో చిరాగ్ సేన్‌పై చెమటోడ్చి నెగ్గాడు.

రిత్విక్ ద్వయం ముందంజ



సాక్షి, హైదరాబాద్: స్లొవాక్ ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–అర్జున్ ఖడే (భారత్) జోడీ ముందంజ వేసింది. స్లొవేకియా రాజధాని బ్రాటిస్లావాలో ఈ టోర్నీ జరుగుతోంది. తొలి రౌండ్‌లో రిత్విక్–అర్జున్ ద్వయం 6–4, 6–4తో భారత్‌కే చెందిన జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ జంటను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇటీవల కజకిస్తాన్‌లో జరిగిన అల్మాటీ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో టైటిల్ నెగ్గిన రిత్విక్–అర్జున్ ఈ మ్యాచ్‌లో కీలకదశలో పాయింట్లు గెలిచింది. తొలి సెట్‌లో ఒకసారి, రెండో సెట్‌లో ఒకసారి ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను బ్రేక్ చేసి తమ సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని దక్కించుకుంది. భారత్‌కే చెందిన శ్రీరామ్ బాలాజీ కూడా డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)–గిడో ఆంద్రెజి (అర్జెంటీనా) ద్వయం 6–3, 6–7 (2/7), 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)–మాట్వే మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది.


దీపావళి సందర్భంగా బుధవారం అయోధ్యలో లేజర్ షో వెలుగుల్లో సరయూ నదీ తీరం


దీపావళి సందర్భంగా ఢిల్లీ-గురుగ్రాం ఎక్స్‌ప్రెస్ వేపై సర్‌హౌల్ టోల్ ప్లాజా వద్ద బుధవారం రాత్రి భారీ ట్రాఫిక్ జామ్

ఫ్రాన్స్‌కు ఆఫ్రికన్ల టాటా

మూలాలను వెతుక్కుంటూ ఇంటిబాట

- అంతులేని జాతి వివక్షను భరించలేకే!
- ఏకంగా 91 శాతం మందికి తరచూ వివక్ష
- విద్య, ఉద్యోగాలు, అద్దె... అన్నింటా సమస్యలే

అలెక్స్ హేలీ 'రూట్స్'. ఆఫ్రికా ఖండంలోని తనవారి మూలాలు వెతుక్కుంటూ వెళ్లిన ఓ నల్లజాతి అమెరికన్ చరిత్ర. ఆ నవల వెనక 12 ఏళ్ల ఎడతెగని అన్వేషణ, అధ్యయనం, పరిశోధన ఉన్నాయి. ఇప్పుడు ఫ్రాన్స్‌లోని నల్లజాతీయులు కూడా అలాగే తమ మూలాలు వెతుక్కుంటూ వెళ్లిపోతున్నారు. అయితే వారు వెళ్తున్నది పరిశోధనల కోసం కాదు. కాస్త మెరుగైన భవిష్యత్తు వేటలో. ఫ్రాన్స్‌లో వారికి ఎదురవుతున్న తీవ్ర జాతి వివక్షే ఈ వలసలకు ప్రధాన కారణం. ఫ్రెంచివారి మితిమీరిన జాతీయవాదాన్ని భరించలేక ఫ్రాన్స్‌ను వీడుతున్న ఆఫ్రికన్ల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఫ్రాన్స్‌లోనే పుట్టి పెరిగి, జీవితమంతా ఆ దేశంతోనే ముడిపడిందని అనుకున్న ఆఫ్రికన్లు కూడా అన్వేషిస్తూ ఈ జాబితాలో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది...

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫ్రాన్స్‌ను వీడుతున్న నల్లజాతీయుల సంఖ్య బాగా పెరిగింది. ప్రధానంగా సెనెగల్ వాసులు ఫ్రాన్స్‌ను వీడి స్వదేశీ బాట పడుతున్నారు. ముస్లిం దేశమైన సెనెగల్ పురాతన ఫ్రెంచ్ కాలనీ. సెనెగల్‌తో ఫ్రాన్స్ సంబంధాలకు మూడు శతాబ్దాల పై చిలుకు చరిత్ర ఉంది. 1960లో సెనెగల్‌కు రాజకీయ స్వాతంత్య్రం వచ్చినా వ్యాపారం, జాతీయ భద్రత, సైనిక ఒప్పందాలు, భాగస్వామ్య సాంస్కృతిక ప్రోత్సాహం తదితరాల రూపంలో ఫ్రాన్స్‌తో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తోంది. సెనెగల్ నుంచి వలస వెళ్లిన వారు ఫ్రాన్స్‌లో పలు రంగాల్లో స్థిరపడ్డారు. కానీ 'ప్రత్యేక సంబంధం'ఇప్పుడు బీటలు వారుతోంది.

పెరిగిన జాత్యాహంకార నేరాలు

ఫ్రాన్స్‌లో నల్లజాతీయులపై నిర్వహించిన సర్వేలో ఏకంగా 91 శాతం మంది తాము జాతి వివక్షకు గురైనట్టు చెప్పుకొచ్చారు. 85% మంది చర్మం రంగు ఆధారంగా వివక్షకు గురయ్యారు. ఇది బహిరంగ స్థలాల్లో 41 శాతం, పని ప్రదేశాల్లో 31 శాతముంది. చర్మం రంగు వల్ల ఉద్యోగం నుంచి ప్రమోషన్ల దాకా నల్ల జాతీయులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యాపరంగా కూడా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇల్లు కొనడం, అద్దెకు తీసుకోవడంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వాపోయారు. ఒక్క గత ఏడాదిలోనే ఫ్రాన్స్‌లో జాత్యహంకార నేరాలు మూడింట ఒక వంతు పెరిగినట్టు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. 15,000 పై చిలుకు జాతి, మతాధార నేరాలు నమోదయ్యాయి. 2023 జూన్‌లో అల్జీరియా సంతతికి చెందిన నహెల్ మెర్జౌక్ (17) అనే టీనేజర్‌ను పోలీసులు కాల్చిచంపారు. వీటన్నింటి కారణంగా విద్యాధికులైన ఫ్రెంచ్ ఆఫ్రికన్ ముస్లింలు భారీ సంఖ్యలో నిశ్శబ్దంగా వలస బాట పట్టినట్టు పలు పరిశోధనల్లో తేలింది. అయితే వీరి సంఖ్య ఇదమిత్థంగా తెలియరావడం లేదు. జాతి, మతాధారిత గణాంకాల సేకరణపై ఫ్రాన్స్‌లో నిషేధమే ఇందుకు కారణం.

మా విశ్వాసాలంటే చులకన

2015లో ఇస్లామిక్ ముష్కరులు పారిస్‌లో పలుచోట్ల దాడులకు పాల్పడ్డారు. వాటిలో ఏకంగా 130 దుర్మరణం పాలయ్యారు. నాటినుంచీ ఫ్రాన్స్‌లో ఇస్లామోఫోబియా తారస్థాయికి చేరింది. లౌకిక దేశమైన ఫ్రాన్స్‌లో హిజాబ్ ధారణ కూడా వివాదాస్పదంగా మారింది. దాన్ని 20 ఏళ్ల క్రితమే ప్రభుత్వ స్కూళ్లలో నిషేధించారు. ఈ మార్పులు ఆందోళనకరమని కాంగో సంతతికి చెందిన ఆడ్రీ మొంజెంబా అనే టీచర్ తెలిపారు. ఆమె రోజూ తన చిన్న కుమార్తెతో కలిసి బస్సు, రైలు మారి స్కూలుకు వెళ్తుంది. అక్కడ బురఖా తీసేసి లోనికి వెళ్లాల్సి వస్తుంది. ఇటీవలే కుటుంబంతో పాటు సెనగల్‌లో స్థిరపడ్డారామె. ''ఫ్రాన్స్ నాది కాదని అనుకోవడం లేదు. కానీ మా విశ్వాసాలను, విలువలను గౌరవించే వాతావరణంలో నేను, నా పిల్లలు ఎదగాలనేది నా ఆకాంక్ష''అంటోంది 35 ఏళ్ల మొజెంబా. సెనెగల్‌కు చెందిన 34 ఏళ్ల ఫటౌమాటా సిల్లాదీ ఇలాంటి కథే. ''మా కుటుంబానికి మెరుగైన జీవితం కోసం మా నాన్న ఆఫ్రికా వదిలి ఇక్కడికొచ్చారు. అయితే మూలాలను ఎన్నటికీ మరవొద్దని నిత్యం చెప్పేవారు. ఆ వారసత్వాన్ని నేను మరిచిపోలేదు. అందుకే ఈ వివక్షను భరించే బదులు సెనెగల్ తిరిగి వెళ్తున్నా. అక్కడ టూరిజం వ్యాపారం చేసుకుంటా''అని ఆయన చెప్పుకొచ్చారు.

వెంటాడుతున్న వివక్ష..

మెంకా గోమెస్‌దీ ఇదే కథ. వివక్షను తట్టుకోలేక ఫ్రాన్స్‌ను వీడి తమ మూలాలకు తిరిగి వెళ్లాలనుకుంటున్న ఆఫ్రికన్ల కోసం సెనెగల్‌లో ట్రావెల్ ఏజెన్సీనే ఏర్పాటు చేశారాయన. ''నేను ఫ్రాన్స్‌లోనే పుట్టి పెరిగా. కానీ ఇక్కడ జాత్యహంకారం భరించలేనంతగా పెరిగింది. ఆరేళ్ల వయసులో స్కూల్లో నన్ను ఎన్-వర్డ్ అని పిలిచేవారు. నేను ఫ్రెంచివాన్నే అయినా నా తల్లిదండ్రులు ఎక్కడి నుంచో రావడమే ఇందుకు కారణం. ఆ వివక్ష నీడలా వెంటాడుతూనే ఉంది. ఇక చాలనిపించింద.ఇ అందుకే కుటుంబాన్ని, స్నేహితులను అందరినీ విడిచి మరీ సెనెగల్ వెళ్లిపోతున్న. ఇక నా భవిష్యత్తంతా ఆఫ్రికాలోనే''అని చెప్పుకొచ్చారు. పుట్టినప్పటి నుంచీ ఫ్రాన్స్‌లోనే గడిపిన ఫాంటా గుయిరాస్సీ కూడా తల్లి జన్మస్థలమైన సెనెగల్ వెళ్లే ఆలోచనలో ఉంది. ''కొన్నేళ్లుగా ఫ్రాన్స్‌లో రక్షణ లేదు. నా 15 కొడుకు వీధిలో స్నేహితులతో మాట్లాడుతుంటే పోలీసులు అవమానకరంగా తనిఖీ చేశారు. టీవీలో ఎప్పుడు చూసినా మాకు సంబంధించి ఏదో ఒక న్యూస్! ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన వెంటాడుతోంది''అన్నారామె.

పరిధులు దాటుతున్న మస్క్

హారిస్‌ను ట్రంప్ తన్నుతున్నట్టు వీడియో

- నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు అతి సమీపానికి వచ్చిన నేపథ్యంలో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతిచ్చే క్రమంలో స్పేస్ ఎక్స్ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పరిధులు దాటుతున్నారు. డెమొక్రటిక్ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై హింసాత్మక, అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారు. ట్రంప్, హారిస్ పోటీని గ్లాడియేటర్ నేపథ్య పోరాటంగా అభివర్ణిస్తూ మస్క్‌కు చెందిన అమెరికా సూపర్ పీఏసీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో దుమారం రేపుతోంది. రెచ్చగొట్టే, హింసాత్మక చిత్రాలతో రూపొందించిన ఈ వీడియోపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్‌ను చేతిలో కత్తులతో గ్లాడియేటర్‌లా చూపారు. మైదానంలో హారిస్ తలపడుతున్నట్టు, ఆమె ముఖంపై తన్నుతున్నట్టు రూపొందించారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన పెన్సిల్వేనియా ర్యాలీని చూపుతూ మస్క్ వాయిస్ ఓవర్‌తో వీడియో మొదలవుతుంది. ఈ ఎన్నికలు అమెరికాతో పాటు పాశ్చాత్య నాగరికత భవితవ్యాన్ని నిర్ణయిస్తాయని భావిస్తున్నట్టు మస్క్ చెబుతారు. రాకెట్లు, జెట్లు, హల్క్ చొక్కా విప్పడం, ట్రంప్ ప్రసంగాలు, పలు సినీ క్లిప్పింగులు వీడియలో చోటుచేసుకున్నాయి. దీని సృష్టికర్తలు నియో–నాజీలంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ పీఏసీ ఎక్స్ గతంలోనూ హారిస్ లక్ష్యంగా ఇలాంటి వీడియోలు చేసింది. ఆమెను 'సి-వర్డ్'(కమ్యూనిస్టు)గా అభివర్ణిస్తూ పోస్ట్ చేసిన ఆ వీడియోను వెంటనే తొలగించింది. ట్రంప్‌కు మద్దతుగా, డెమొక్రాట్లను విమర్శిస్తూ ప్రకటనల కోసం సూపర్ పీఏసీ ఇప్పటికే భారీగా ఖర్చు చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్


బుధవారం నింగిలోకి దూసుకెళ్తున్న షెంజౌ-19 రాకెట్

చైనా అంతరిక్ష కేంద్రంలోకి.. ముగ్గురు వ్యోమగాములు

బీజింగ్: చైనా షెంజౌ–19 వ్యోమనౌక బుధవారం సొంత స్పేస్‌స్టేషన్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. ఒక మహిళ సహా మొత్తం ముగ్గురు వ్యోమగాములను సొంత అంతరిక్ష కేంద్రమైన తియాంగాంగ్ స్పేస్‌స్టేషన్‌కు చేర్చింది. ఈ ముగ్గురు రాబోయే ఆరు నెలలు తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలో ఉండనున్నారు. ఇప్పటికే అక్కడున్న ముగ్గురు త్వరలో భూమికి తిరిగి వస్తారని చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ (సీఎంఎస్ఏ) బుధవారం వెల్లడించింది. షెంజౌ–19 అత్యంత వేగంగా, ఆటోమేటెడ్ మోడ్‌లో అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమైందని తెలిపింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చైనాకు ప్రవేశమివ్వడానికి పాశ్చాత్యదేశాలు వి ముఖత వ్యక్తం చేశాయి. సైనిక కార్యాకలాపాలకు అంతరిక్ష అనుభవాన్ని చైనా వాడుకుంటుందనేది వాటి భయం. దాంతో చైనా సొంతంగా తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకుంది. ఈ ఘనత సాధించిన తొలి దేశంగా నిలిచింది.


వ్యోమగాములు వాంగ్ హౌజే, సాంగ్ లింగ్‌డాంగ్, కై జుహే అభివాదం

రక్షణ ఉత్పత్తుల్లో మన ప్రయాణం గర్వకారణం

- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- రక్షణ రంగంలో పాలుపంచుకోవాలని పిలుపు



న్యూఢిల్లీ: దేశంలో రక్షణ ఉత్పత్తులు, వాటి ఎగుమతులు భారీగా పెరుగుతుండడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. రక్షణ ఉత్పత్తుల్లో మన దేశ ప్రయాణం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని చెప్పారు. రక్షణ రంగంలో పాలుపంచుకోవాలని కావాలని స్టార్టప్‌లు, తయారీదారులు, వ్యాపారవేత్తలకు, యువతకు పిలుపునిచ్చారు. ఈ రంగంలో నవీన ఆవిష్కరణలు సృష్టించేందుకు ముందుకు రావాలని సూచించారు. చరిత్రలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ మేరకు మోదీ బుధవారం 'లింక్డ్‌ఇన్'లో పోస్టు చేశారు. ''మీ అనుభవం, శక్తి సామర్థ్యాలు, ఉత్సాహం దేశానికి అవసరం. నవీన ఆవిష్కరణకు ద్వారాలు తెరిచి ఉన్నాయి. మన ప్రభుత్వ విధానాలు మీకు అనుకూలంగా పని చేస్తున్నాయి. రక్షణ రంగంలో లెక్కలేనన్ని అవకాశాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. మనమంతా కలిసి రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధిద్దాం. అంతేకాదు రక్షణ ఉత్పత్తుల తయారీలోని భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా మార్చాలి. బలమైన, స్వయం సమృద్ధితో కూడిన ఇండియాను నిర్మిద్దాం. గతంలో మనం విదేశాల నుంచి రక్షణ పరికరాలు, ఆయుధాలు దిగుమతి చేసుకొనే పరిస్థితి ఉండేది. ఇప్పుడు మనమే విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఈ అద్భుత ప్రయాణం దేశంలో ప్రతి పౌరుడికీ గర్వకారణమే. ఇండియా రక్షణ ఉత్పత్తుల విలువ 2023–24లో రూ.1.27 లక్షల కోట్లకు చేరింది. ఇక ఎగుమతి విలువ 2014లో కేవలం రూ.1,000 కోట్లు ఉండగా, ఇప్పుడు రూ.21,000 కోట్లకు చేరుకుంది. 12,300 రకాల పరికరాలు, ఆయుధాలు దేశీయంగానే తయారు చేసుకుంటున్నాం. రక్షణ రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థలు రూ.7,500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి. రక్షణ పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ) నిధుల్లో 25 శాతం నిధులను ఇన్నోవేషన్‌కే ఖర్చు చేస్తున్నాం. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో రెండు అధునాతన డిఫెన్స్ కారిడార్లు రాబోతున్నాయి''అని ప్రధాని మోదీ వెల్లడించారు.

భారతీయ యువతకు తిరుగులేదు

నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతలో భారతీయ యువతకు తిరుగులేదని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వారు అత్యుత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారని కొనియాడారు. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత్ నిర్విరామ ప్రగతి సాధిస్తోందంటూ గిట్‌హబ్ సంస్థ సీఈఓ థామస్ డోహ్మెక్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు ప్రధాని మోదీ బుధవారం స్పందించారు. కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంలో అమెరికా తర్వాత భారత్ ముందంజలో ఉందని థామస్ పేర్కొన్నారు.

1,600 'ఓటర్ల' తొలగింపు సబబే

- వర్జీనియా నిర్ణయంపై సుప్రీంకోర్టు

వాషింగ్టన్: 1,600 మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తూ వర్జీనియా రాష్ట్రం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు సమర్థించింది. అది సబబేనంటూ బుధవారం మెజారిటీ తీర్పు వెలువరించింది. ఓటర్ల తొలగింపును ఆరుగురు న్యాయమూర్తులు సమర్థించగా ముగ్గురు వ్యతిరేకించారు. సుప్రీంకోర్టు తీర్పును రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ స్వాగతించగా డెమొక్రాట్లు తప్పుబట్టారు. తొలగించిన ఓట్లలో అర్హులైన ఓటర్లూ ఉన్నారని అధ్యక్షుడు జో బైడెన్‌తో పాటు పలు ఓటర్ల హక్కుల సంస్థలు కూడా వాదిస్తున్నాయి. సదరు 1,600 మంది అమెరికా పౌరులు కాదంటూ వారిని ఓటర్ల జాబితా నుంచి వర్జీనియా ఇటీవలే తొలగించింది. వివాదాలు, అభ్యంతరాల నడుమ వ్యవహారం కోర్టుకెక్కింది. వారు అమెరికా పౌరులు కాదనేందుకు సరైన ఆధారాల్లేవంటూ వర్జీనియా నిర్ణయాన్ని జిల్లా కోర్టు జడ్జి ప్యాట్రసియా టోలీవర్ గైల్స్ కొట్టేశారు. దాన్ని వర్జీనియా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

సరిహద్దు నుంచి భారత్, చైనా బలగాల ఉపసంహరణ సంపూర్ణం

న్యూఢిల్లీ: భారత్–చైనా సరిహద్దులోని డెమ్‌చోక్, డెప్‌సాంగ్ నుంచి ఇరుదేశాల సైనిక బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ ప్రారంభమవుతుందని భారత సైనిక వర్గాలు బుధవారం వెల్లడించాయి. భారత్, చైనా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బలగాల ఉపసంహరణ పూర్తయిన నేపథ్యంలో, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఇరుపక్షాలు మిఠాయిలు ఇచ్చిపుచ్చుకొనే కార్యక్రమం ఉంటుందని తెలిపాయి. పెట్రోలింగ్ విషయంలో స్థానిక కమాండర్ల స్థాయిలో చర్చలు కొనసాగుతాయని అధికారులు చెప్పారు. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వద్ద సైనిక పెట్రోలింగ్ 2020 ఏప్రిల్ నాటి స్థాయిలో ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి కొనసాగిన ఉద్రిక్తతలు ఇటీవలే చల్లారాయి. మరోవైపు బలగాల ఉపసంహరణపై భారత్‌లోని చైనా రాయబారి ఫెయ్‌హోంగ్ స్పందించారు. భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాలు సజావుగా కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. రెండు దేశాల నడుమ విభేదాలను ఎలా పరిష్కరించుకోవాలన్నదే ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు.

కన్నడ నటుడు దర్శన్‌కు మధ్యంతర బెయిల్

బళ్లారి/ బెంగళూరు: సొంత అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడైన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు కర్ణాటక హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. వెన్నుముకకు శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉందని, అనారోగ్య కారణాలరీత్యా తనకు బెయిల్ మంజూరు చేయాలనే దర్శన్ విజ్ఞప్తి దృష్టిలో పెట్టుకొని బుధవారం ఆరువారాల పాటు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. జస్టిస్ విశ్వజిత్ శెట్టి, ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. బెయిల్ లభించడంతో దర్శన్ బుధవారం సాయంత్రం బళ్లారి జైలు నుంచి విడుదలయ్యారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా దర్శన్ బెంగళూరు చేరుకుంటాడని తెలుస్తోంది. రెండు లక్షల రూపాయల వ్యక్తిగత బాండుతో పాటు, ఒక్కొక్కటి రెండు లక్షల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని జస్టిస్ విశ్వజిత్ షరతులు విధించారు. ట్రయల్ కోర్టుకు పాస్‌పోర్ట్ అప్పగించాలని ఆదేశించింది. బెయిల్‌పై ఉన్న కాలంలో ట్రయల్ కోర్టు పరిధిలోనే ఉండాలని షరతు విధించింది. బెంగళూరులో నచ్చిన ఆసుపత్రిలో వెన్నుముకకు శస్త్రచికిత్స చేయించుకోవచ్చని తెలిపింది. దర్శన్ ఆరోగ్య పరిస్థితిని, శస్త్రచికిత్స చేపట్టే తేదీని, తర్వాత అందించాల్సిన చికిత్స తదితర వివరాలను హైకోర్టుకు సదరు ఆసుపత్రి తెలియజేయాలని స్పష్టం చేసింది. అభిమాని రేణుకా స్వామి హత్య కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్ర గౌడతో మొత్తం 17 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ 11 నుంచి జైలులో ఉన్న దర్శన్ అనారోగ్య కారణాలతో హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తాత్కాలిక ఉపశమనం లభించింది.

ఢిల్లీలో ఫ్రాన్స్ రాయబారి ఫోన్ చోరీ

- ఇద్దరు యువకుల అరెస్టు.. ఫోన్ స్వాధీనం

న్యూఢిల్లీ: ఇండియాలో ఫ్రాన్స్ రాయబారిగా పనిచేస్తున్న థియెర్రీ మాథౌకు చేదు అనుభవం ఎదురైంది. ఈ నెల 20న మధ్యాహ్నం ఢిల్లీలోని చాందినీ చౌక్ ప్రాంతంలో భార్యతో కలిసి షాపింగ్ చేస్తుండగా, ఆయన మొబైల్ ఫోన్‌ను దుండగులు కొట్టేశారు. ఆ సమయంలో మాథౌ వెంట భద్రత సిబ్బంది లేరు. అంతేకాదు షాపింగ్‌కు వస్తున్నట్లు స్థానిక పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వలేదు. రాయబారి ఫోన్ చోరీకి గురైనట్లు ఈ నెల 21న ఫ్రెంచ్ ఎంబసీ నుంచి ఢిల్లీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో వారు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. 50 సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు. షాదాబ్, ఉమేశ్ అనే ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. వారే ఫోన్ కొట్టేసినట్లు గుర్తించారు. రాయబారి ఫోన్‌ను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. షాదాబ్, ఉమేశ్‌కు గతంలోనే నేర చరిత్ర ఉందని పోలీసులు చెప్పారు. ఢిల్లీ పర్యటనకు వచ్చే విదేశీయులను వీరు టార్గెట్ చేస్తుంటారని తెలిపారు.

బీటీఆర్‌లో ఏడు ఏనుగులు మృతి

- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

ఉమరియా (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని బాంధవ్‌గఢ్ అభయారణ్యం (బీటీఆర్)లో ఏనుగుల మరణాల సంఖ్య 7కు చేరింది. ఉమరియా జిల్లాలోని బీటీఆర్‌లో తాజాగా మరో మూడు ఏనుగులు మృతి చెందాయని అటవీ అధికారి ఒకరు బుధవారం తెలిపారు. ఇంకో మూడు ఏనుగుల పరిస్థితి విషమంగా ఉందన్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు అటవీ శాఖ మంత్రి రాంనివాస్ రావత్ ఆదేశించారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోడో మిల్లెట్ తిని ఏనుగులు చనిపోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని బీటీఆర్ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ వర్మ తెలిపారు. కచ్చితమైన కారణం శవపరీక్ష తర్వాతే తెలుస్తుందన్నారు. ప్రముఖ పర్యాటక ఆకర్షణ అయిన ఖితోలీ రేంజ్ పరిధిలోని సల్ఖానియా, బకేలి ప్రాంతాల్లో మంగళవారం నాలుగు ఏనుగులు చనిపోయి ఉన్నట్టు ఫారెస్ట్ గార్డులు గుర్తించిచారని ఆయన చెప్పారు. ఆ గుంపులోని మిగతా ఏనుగుల కదలికలను పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఒడిలో బిడ్డ తలతో తల్లి రోదన

- ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో ఘటన

జౌన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో హృదయవిదారకమైన ఘటన చోటుచేసుకుంది. రెండు కుటుంబాల మధ్య నెలకొన్న భూవివాదం 17 ఏళ్ల బాలుడి ప్రాణాలను బలి తీసుకుంది. ప్రత్యర్థులు ఆ బాలుడి తలను కత్తితో నరికేశారు. తెగిపోయిన తలను బాలుడి తల్లి తన ఒడిలో పెట్టుకొని గంటలపాటు రోదించింది. గౌరబాద్ షాపూర్ పోలీసు స్టేషన్‌పరిధిలోని కబీరుద్దీన్‌పూర్ గ్రామంలో రామ్‌జీత్ జాదవ్, లల్తా యాదవ్ కుటుంబాల మధ్య దశాబ్దాలుగా భూవివాదం కొనసాగుతోంది. బుధవారం లల్తా యాదవ్ కుమారుడు రమేశ్ యాదవ్ ఆ భూమిని చదును చేస్తుండగా, అవతలి వర్గం అడ్డుకుంది. ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. రమేశ్ యాదవ్ కత్తితో రామ్‌జీత్ యాదవ్ కుమారుడు అనురాగ్ యాదవ్ తల నరికేశాడు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. అనురాగ్ యాదవ్ తలను ఒడిలో పెట్టుకొని అతడి తల్లి రోదించడం గ్రామస్థులను కలిచివేసింది. లల్తా యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. రమేశ్ యాదవ్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. కబీరుద్దీన్‌పూర్ గ్రామంలో జరిగిన హత్యను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఖండించారు.

పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, సక్సెస్ స్టోరీలు మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

విపత్తుల నిర్వహణ

విపత్తులు - ప్రాథమిక భావనలు

ఒక భౌగోళిక ప్రాంతంలో సంభవించిన దుర్ఘటన విపత్తు అవుతుందా/ కాదా అనే విషయాన్ని నిర్ధారించాలంటే విపత్తు నిర్వహణకు సంబంధించిన కొన్ని ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి. అవి..

1. వైపరీత్యం (Hazard)
2. దుర్బలత్వం (Vulnerability)
3. సామర్థ్యం (Capacity)
4. ఆపద (Risk)

వైపరీత్యం

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనానికి, ఆస్తులకు, పర్యావరణానికి నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలనే వైపరీత్యాలు అంటారు. 'Hasard' అనే అరబిక్, Az-Zhar అనే ఫ్రెంచి పదాల నుంచి వైపరీత్యం (Haz-ard) అనే పదం వచ్చింది.

వైపరీత్యాలు అనేవి ప్రకృతి, మానవ చర్యల వల్ల లేదా రెండింటి వల్ల సంభవిస్తాయి. వైపరీత్యాలు సంభవించే కారణాల ఆధారంగా విపత్తులను కిందివిధంగా విభజించవచ్చు. అవి..

A) భౌగోళిక వైపరీత్యాలు: ఇవి భూనిర్మాణం లో వచ్చే మార్పుల వల్ల సంభవిస్తాయి. ఉదా: భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, భూపాతాలు, ఆనకట్టలు తెగిపోవడం, గనుల్లో అగ్నిప్రమాదాలు.

B) నీరు, వాతావరణ సంబంధ వైపరీత్యాలు: భూ వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల ఏర్పడతాయి.
ఉదా: చక్రవాతాలు, టోర్నడోలు, వరదలు, కరువు, కుంభవృష్టి, భూపాతం, హిమ సంపాతాలు, వేడి, శీతల గాలులు.

C) జీవసంబంధ వైపరీత్యాలు:
ఉదా: అంటు వ్యాధులు, తెగుళ్ల దాడులు, కలుషిత ఆహారం, సామూహిక జనహనన ఆయుధాలు.

D) పర్యావరణ సంబంధిత వైపరీత్యాలు: ఉదా: పర్యావరణ కాలుష్యం, అడవుల నరికివేత, ఎడారీకరణ.

E) మానవ నిర్లక్ష్యం వల్ల ఏర్పడే వైపరీత్యాలు: పారిశ్రామిక దుర్ఘటనలు, అగ్ని ప్రమాదాలు, చమురు ప్రమాదాలు, గ్యాస్ లీకేజీలు, రోడ్డు/ రైల్వే ప్రమాదాలు, భవనాలు కూలిపోవడం, తొక్కిసలాటలు.

F) సామాజిక- సహజ విపత్తులు: ఇవి ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత కారణాలు రెండింటి వల్ల ఏర్పడతాయి.
ఉదా: వరదలు, దుర్భిక్షం, భూపాతాలు.

వైపరీత్యాలు సంభవించే వేగం, ప్రభావ కాలం ఆధారంగా వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి..



1) Rapid-Onset Hazards: ఇవి ఆకస్మికంగా సంభవిస్తాయి. వీటి ప్రభావం స్వల్పకాలం లేదా దీర్ఘకాలం ఉండొచ్చు. ఉదా: భూకంపాలు, సునామీలు, వరదలు, చక్రవాతం, అగ్నిపర్వత విస్ఫోటనాలు.

2) Slow - Onset Hazards: ఇవి చాలా నెమ్మదిగా సంభవిస్తాయి. వీటి ప్రభావం సుదీర్ఘకాలం ఉంటుంది.
ఉదా: పర్యావరణ క్షీణత, తెగుళ్ల దాడి, దుర్భిక్షం.

విపత్తు నిర్వహణపై 1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధి కారిక కమిటీ' (High Powered Com-mittee) దేశంలోని వివిధ ప్రాంతాల్లో 31 రకాల వైపరీత్యాలను గుర్తించి, వాటిని 5 సబ్ గ్రూపులుగా విభజించింది. 2005లో ఏర్పాటు చేసిన విపత్తు నిర్వహణ సంస్థ 'వేడిగాలులను' వైపరీత్యంగా పేర్కొనలేదు. అన్ని వైపరీత్యాలు విపత్తు రూపాన్ని పొందలేవు. కొన్ని మాత్రమే విపత్తు రూపాన్ని సంతరించుకుంటాయి. ఒక వైపరీత్యాన్ని విపత్తుగా గుర్తించాలంటే ఆ ప్రాంతంలో కింద తెలిపిన నష్టాలు జరిగి ఉండాలి. అవి..

1. ధన, ప్రాణ నష్టం అధికంగా ఉండాలి.
2. ప్రజల జీవనోపాధి దెబ్బతిని ఉండాలి.
3. ఆ ప్రాంత పర్యావరణ, సాంస్కృతిక వనరులు దెబ్బతిని ఉండాలి.
4. గాయాల బారిన పడినవారి సంఖ్య అధికంగా ఉండాలి.
5. వైపరీత్యం సంభవించిన ప్రాంతంలో జనాభా పరిమాణం, సాంద్రత అధికంగా ఉండాలి.

దుర్బలత్వం (Vulnerability)

ఏదైనా ఒకే భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల అక్కడ ఉన్న సమాజంలో నష్ట తీవ్రతను పెంచే కారకాలనే ఆ ప్రాంత దుర్బలత్వం అంటారు. ఉదా: 2001 గుజరాత్ లోని 'భుజ్' ప్రాంతంలో సంభవించిన భూకంపం కారణంగా శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నవారి కంటే ఇరుకైన రోడ్లు, ఎత్తయిన, సురక్షితం కాని భవనాలు, అధిక జనసాంద్రత ఉన్న, నిరుపేదలు నివసిస్తున్న భుజ్ పాత నగరానికి చెందినవారే ఎక్కువ గాయపడ్డారు, మరణించారు. శివారు ప్రాంతాల ప్రజలు విశాలమైన రోడ్లను కలిగి ఉండటమే కాకుండా, జనసాంద్రత తక్కువగా ఉండి, ఒకటి లేదా రెండు అంతస్తుల భవనాలనే కలిగి ఉండటం వల్ల ఆయా ప్రాంతాల్లో నష్ట తీవ్రత తక్కువగా ఉంది.

సామర్థ్యం (Capacity)

ఏదైనా భౌగోళిక ప్రాంతంలో సంభవించే వైపరీత్యం వల్ల జరిగే నష్ట తీవ్రతను తట్టుకొని తిరిగి జీవనోపాధిని పునరుద్ధరించుకునే అవకాశా లున్న ఒక సమాజం స్థితిని దాని సామర్థ్యంగా పేర్కొనవచ్చు. ఉదా: రిక్టరు స్కేలుపై 6 తీవ్రత ఉన్న భూకంపం మురికివాడలో సంభవించినప్పుడు ప్రాణనష్టం, గాయాల బారిన పడినవారి సంఖ్య, జీవనోపాధి ని పునరుద్ధరించుకోలేని వారి సంఖ్య అధికంగా ఉంటుంది. అక్కడి సమాజానికి దుర్బల పరిస్థితుల నుంచి కోలుకునే సామర్థ్యం తక్కువగా ఉండటమే దీనికి కారణం. అదే బంజారాహిల్స్ లాంటి ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 8 తీవ్రత ఉన్న భూకంపం సంభవించినా నష్ట తీవ్రత తక్కువగా ఉంటుంది. దీనికి కారణం అక్కడ పేదరికం, బలహీనమైన ఇళ్లు, ఇరుకైన రోడ్లు లాంటి దుర్బల పరిస్థితులు లేకపోవడం. అంటే ఈ ప్రాంతానికి దుర్బలత్వాన్ని ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉంది అని అర్థం.

ఆపద (లేదా) విపత్కర స్థితి (Risk)

వైపరీత్యాలు, దుర్బల పరిస్థితుల మధ్య పరస్పర చర్యల కారణంగా ఒక సమాజ ఆర్థిక కార్య కలాపాల్లో అంతరాయం, పర్యావరణ క్షీణతతో పాటు మరణాలు, గాయాలు, ఆస్తి, జీవనోపాధి దెబ్బతినడం లాంటి పర్యవసానాలు జరిగే సంభావ్యతనే ఆపద అంటారు. దీన్ని కిందవిధంగా వ్యక్తపరచ వచ్చు.

విపత్కర స్థితి (ఆపద) =
(వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో 'విపత్తు'కు సంబంధించి సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ) అనుకోకుండా సంభవించే ఒక దుర్ఘటన
బి) నియంత్రించడానికి వీలు లేని దుర్ఘటన
సి) ప్రకృతి (లేదా) మానవ చర్యల వల్ల కలిగే దుర్ఘటన
డి) పైవన్నీ

2. భూనిర్మాణంలో వచ్చే మార్పుల వల్ల (విరూపాకార కారకాల వల్ల) సంభవించే వైపరీత్యానికి ఉదాహరణ ఏది?
ఎ) చక్రవాతాలు బి) వరదలు
సి) దుర్భిక్షం డి) భూకంపాలు

3. ఒక సమాజం విపత్తుకు గురయ్యే సున్నితత్వాన్ని లేదా ఘటనను ప్రతిస్పందించే సామర్థ్యాలను దెబ్బతీసే భౌతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ కారకాల సమూహాన్ని ఏమని పిలుస్తారు?
ఎ) వైపరీత్యం బి) విపత్తు
సి) విపత్కర స్థితి డి) దుర్బలత్వం

4. కిందివాటిలో నాలుగు రకాల విపత్తులు (కరువు, వరదలు, చక్రవాతం, భూ కంపం) ఎదుర్కొనే రాష్ట్రం ఏది?
ఎ) ఉత్తరప్రదేశ్
బి) పశ్చిమబెంగాల్
సి) ఆంధ్రప్రదేశ్ డి) ఒడిశా

5. విపత్తులకు సంబంధించి కిందివాటిలో వాస్తవం ఏది?
ఎ) ఒక ప్రాంతం ఒకే రకమైన విపత్తుకు లోనవుతుంది
బి) విపత్తు సహజ లేదా మానవ తప్పిదాల వల్ల సంభవించవచ్చు
సి) విపత్తు ఎల్లప్పుడు మీడియాలో విస్తృతంగా ప్రసారమవుతుంది
డి) విపత్తు ముందుగా తెలిసి, క్రమంగా ప్రారంభమవుతుంది

6. కిందివాటిలో పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?
ఎ) భూకంపాలు
బి) భూపాతాలు
సి) కుండపోత వర్షాలు
డి) పైవన్నీ

7. కిందివాటిలో పర్యావరణ క్షీణత వల్ల ఏర్పడే వైపరీత్యం ఏది?
ఎ) వరదలు బి) దుర్భిక్షం
సి) భూపాతం డి) భూకంపాలు

8. 1999లో కె.సి. పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికారిక కమిటీ' దేశం లో ఎన్ని రకాల విపత్తులను గుర్తించింది?
ఎ) 20 బి) 10
సి) 21 డి) 31

9. కిందివాటిలో ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపితమైన విపత్తు కానిదేది?
ఎ) అడవుల కార్చిచ్చు
బి) దుర్భిక్షం సి) భూపాతం
డి) అగ్నిపర్వతాలు

10. సునామీలను ఏ సంవత్సరం తర్వాత విపత్తుల జాబితాలో చేర్చారు?
ఎ) 2001 బి) 1989
సి) 2004 డి) 2005

11. ఏదైన భౌగోళిక ప్రాంతంలో ప్రజా జీవనా నికి, ఆస్తులకు నష్టాన్ని కలుగజేసే శక్తి ఉన్న ఆకస్మిక సంఘటనలను ఏమని పిలుస్తారు?
ఎ) విపత్తులు
బి) దుర్బలత్వం
సి) వైపరీత్యం
డి) విపత్కర స్థితి

12. 'ఆపద' అనే ఫలితాన్ని (Risk) కింది విధంగా వ్యక్తపర్చవచ్చు?
ఎ) (వైపరీత్యం × సామర్థ్యం)/ దుర్బలత్వం
బి) (వైపరీత్యం × దుర్బలత్వం)/ సామర్థ్యం
సి)(వైపరీత్యం × సామర్థ్యం)/ విపత్కర స్థితి
డి)(విపత్కర స్థితి× సామర్థ్యం)/ వైపరీత్యం

13. కింద తెలిపిన ఏ సందర్భాల్లో వైపరీత్యం విపత్తుగా మారుతుంది?
ఎ) సమాజంలోని ఒక వర్గం ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలకు వైపరీత్యం కారణమైనప్పుడు
బి) వైపరీత్యం మానవ సంచారం లేని ప్రాంతాల్లో సంభవించినా, దీర్ఘకాలంలో సమీప మానవ సమాజాల్లో దాని ప్రభావం ఉన్నప్పుడు
సి) ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దెబ్బతిని, వారు నిరాశ్రయులు అయినప్పుడు
డి) పైవన్నీ

14. అత్యంత దుర్బలత్వ ప్రాంతాల్లో, అతి తీవ్రత ఉన్న వైపరిత్యం సంభవిస్తే అది దేనికి దారి తీస్తుంది?
ఎ) బలమైన విపత్తు
బి) బలహీన విపత్తు
సి) ఏ ప్రమాదం ఉండదు
డి) ఏమీ చెప్పలేం

15. కిందివాటిలో మానవ నిర్లక్ష్యం వల్ల సంభవించే విపత్తులు?
ఎ) అడవుల కార్చిచ్చు
బి) అణు విస్ఫోటనాలు
సి) రోడ్డు, రైల్వే ప్రమాదాలు
డి) పైవన్నీ

సమాధానాలు

1) డి 2) డి 3) డి 4) బి 5) బి
6) డి 7) బి 8) డి 9) డి 10) సి
11) సి 12) బి 13) డి 14) ఎ 15) డి.

మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం

శాసన భాష

శాసనాల్లో వినియోగించిన భాషనే శాసన భాష అంటారు. ప్రాజ్ఞన్నయ యుగం నాటి ప్రాచీనాంధ్ర భాషా స్వరూపాన్ని గుర్తించడానికి శాసనాలు ముఖ్య ఆధారాలు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 1000 వరకున్న కాలాన్ని సాహితీ చరిత్ర కారులు ప్రాజ్ఞన్నయ యుగంగా నిర్ధారించారు. నన్నయకు పూర్వం రాజులు, సామంతరాజులు తమ జైత్రయాత్రల్లో కొత్త రాజ్యాలు, భూభాగాలను గెలిచినప్పుడు పండితులు, పురోహితులకు అగ్రహారాలు దానం చేసేవారు. మత ధార్మిక విషయాలను చాటిచెప్పేందుకు శాసనాలు వేయించేవారు. శాసనాలు రెండు రకాలు. ఒకటి శిలా శాసనాలు. రెండు తామ్ర శాసనాలు.

శాసనాల స్వరూపాన్ని బట్టి భాషావేత్తలు ప్రాజ్ఞన్నయ యుగాన్ని రెండు భాగాలుగా వర్గీకరించారు. క్రీ.పూ 200 నుంచి క్రీ.శ 575 వరకు ఉన్న కాలాన్ని తొలి దశగా, క్రీ.శ 575 నుంచి క్రీ.శ 1000 వరకు ఉన్న కాలాన్ని మలిదశగా పేర్కొన్నారు. తొలి దశలో శాసనాలన్నీ సంస్కృత, ప్రాకృత శాసనాలు. వాటిలో అక్కడక్కడా వ్యక్తి నామాలు, గ్రామ నామాలు, సంఖ్యా వాచకాలు, విశేషణాలు మాత్రం తెలుగులో ఉన్నాయి. క్రీ.శ 575లో కడప జిల్లా కమలాపురంలో ఎరుకల్ ముత్తురాజు వేయించిన ఎర్రగుడిపాడు శాసనాన్ని తొలి గద్య శాసనంగా భాషావేత్తలు గుర్తించారు. అదే కాలానికి చెందిన ధనుంజయుని కలమళ్ల శాసనాన్ని ఇటీవల కొందరు పరిశీలకులు తొలి గద్య శాసనంగా పేర్కొన్నారు. దీన్ని భాషావేత్తలు నిర్ధారించాల్సి ఉంది. పుణ్యకుమారుడి పొట్లదుర్తి మాలెపాడు శాసనం (క్రీ.శ 610)లో ఎక్కువ తెలుగు పదాలు ఉన్నాయి. జయసింహవల్లభుని విప్పర్ల శాసనం (క్రీ.శ 640)లో తెలుగు, సంస్కృతం కలిసిన పదాలు ఉన్నాయి.

తెలుగులో తొలి పద్య శాసనం అద్దంకి పండరంగని శాసనం (క్రీ.శ 848). అందులో తరువోజ పద్యాలు ఉన్నాయి. అదే కాలానికి చెందిన గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనం (క్రీ.శ 848)లో సీస పద్యం ఉంది.

బెజవాడ యుద్ధమల్లుని శాసనంలో (క్రీ.శ 885) మధ్యాక్కర పద్యాలు ఉన్నాయి. గూడూరు విరియాల కామసాని శాసనంలో (క్రీ.శ 1000) చంపక, ఉత్పలమాలలు ఉన్నాయి. ధర్మవరం శాసనంలో ఆటవెలది పద్యాలు ఉన్నాయి. కె.వి.సుబ్రహ్మణ్య అయ్యర్ ప్రచురించిన దక్షిణ హిందూ దేశ శాసనాల సప్తమ సంపుటి లో 27 తెలుగు శాసనాలు ఉన్నాయి. డా. బూదరాజు రాధాకృష్ణ ప్రాజ్ఞన్నయ యుగంలోని 269 తామ్ర శాసనాలను నిశితంగా పరిశోధించి ప్రచురించారు. జయంతి రామయ్య పంతులు సంపాదకత్వంలో దక్షిణ హిందూ దేశ శాసనాల పదో సంపుటిలో 781 తెలుగు శాసనాలను ప్రచురించారు. 14వ శతాబ్దం నాటికి దాదాపు రెండువేల శాసనాలు ప్రచురితమైనట్లు భాషావేత్తలు నిర్ధారించారు. తొలిదశ శాసనాల్లో కొన్నింటిలో బ్రాహ్మీలిపి, ఇంకొన్నింటిలో కొంత భాగం దేవనాగరిలిపి, మరికొంత భాగం తెలుగు-కన్నడ లిపి ఉన్నాయి. కొన్ని శాసనాలు వేంగీచాళుక్యుల లిపిలో ఉన్నాయి. అప్పట్లో భాష ద్రవరూపంలో ఉన్నందున స్పష్టత, నిబద్ధత శాసన భాషలో కనిపించదు. శాసన భాషలో 23 హల్లులు, 10 అచ్చులు గల దేశ్య వర్ణమాల ఉండేది. వీటిలో లేఖన దోషాలు విరివిగా కనిపి స్తాయి. రేఫ బదులు వలపలి గిలక ఉపయోగిం చేవారు.



- శాసన భాషలో కనిపించే 'ఱ' వర్ణం క్రమేపి తెలుగులో డ కారంగా, రేఫగా మారింది.
- శాసనభాషలో అనుస్వరానికి బదులు వర్గ పంచమాక్షరాన్ని సంయుక్తంగా రాసేవాళ్లు.
ఉదాహరణ: పణ్డు (పండు)
- శాసనభాషలో శకట రేఫ ప్రయోగం విరివిగా ఉంది.
- నేటి భాషలో శకట రేఫకు బదులు సాధు రేఫను ఉపయోగిస్తున్నారు. శకట రేఫ అదృశ్యమైపోయింది.
- శాసన భాషలో ఉన్న 'ఙ', 'ళ'లు నేటి భాషలో 'న', 'ల' లుగా మారాయి.
ఉదా: ఆణతి – (ఆనతి), సంవత్సరంబుళు (సంవత్సరంబులు).
- సంస్కృత శాసనాల్లో గ్రామ నామాలను సంస్కృతీకరించిన రూపాలున్నాయి. ఉదా: చేబ్రోలు (తామ్రపురీ), కొలను (సారసపురీ)
- శాసన భాషలో ఎన్నో భాషా విశేషాలు గమనించవచ్చు.
- తొలి తెలుగు మాట 'నాగబు' పదం (క్రీ.శ.మొదటి శతాబ్ది) అని వేటూరి ప్రభాకరశాస్త్రి నిర్ధారించారు.
- తెలుగు భాష ప్రాచీనతను నిర్ధారించే సందర్భంలో ఫిబ్రవరి, 2006లో కొత్తూరు శాస నం (క్రీ.పూ 2 వ శతాబ్ది)లోని 'తమ్మయ' పదాన్ని తొలి తెలుగు మాటగా భాషా వేత్త లు నిర్ధారించారు.

గ్రాంథిక భాష

ఆదికవి నన్నయ నుంచి చిన్నయసూరి వరకు కావ్య రచనలో ఉపయోగించిన వ్యాకరణ నియమబద్ధమైన భాషనే గ్రాంథిక భాష అంటారు. 19వ శతాబ్ది ఉత్తరార్థం నాటికి గ్రాంథిక భాషే ప్రామాణిక భాషగా ఉండేది. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, వ్యావహారిక భాషను నిరసిస్తూ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యంలో కాకినాడలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు సంస్థ ఏర్పడింది. వేదం వేంకటరాయశాస్త్రి, కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, వావిలకొలను సుబ్బారావు త దితరులు దీనిలో సభ్యులు. గ్రాంథిక భాషను సమర్థిస్తూ, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పా రావుల వ్యావహారిక భాషోద్యమాన్ని అవహేళన చేస్తూ పానుగంటి లక్ష్మీనరసింహారావు 'గ్రామ్య వాదుల భాషాపవాదం' అనే గ్రంథాన్ని రచిం చారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో 1912, డిసెంబరు 11, 12 తేదీల్లో వావిలకొలను సుబ్బారావు అధ్యక్ష తన జరిగిన సదస్సులో తెలుగు భాష ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసించారు. అక్షరసంఖ్యను బట్టి చూసినా తెలుగు.. ఇంగ్లిష్ భాష కంటే అభివృద్ధి చెందిందని అన్నారు. గ్రాంథిక భాష ఉత్కృష్టతను వివరిస్తూ, ఆ భాషలో అన్యదేశ్యాలు కొద్దిగా ఉన్నా మాండలి కాలు లేవన్నారు. వ్యావహారిక భాషకు వ్యాకర ణం, నిఘంటువు లేనందున వ్యావహారికంలో రచనలు చేయడం తగదని అధిక్షేపించారు.

జయంతి రామయ్య పంతులు.. గిడుగు వారి 'ఎ మెమోరాండమ్ ఆఫ్ మోడరన్ తెలుగు' వ్యాసాన్ని ఖండిస్తూ 'ఎ డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు' అనే వ్యాసాన్ని ప్రచురించారు.

గ్రాంథిక భాష మహాకవుల ప్రయోగాల నుంచి సిద్ధించినందున అది గొప్పదని, దాన్ని అనుసరించడం మంచిదని వాదించేవారు. వ్యావహారిక భాష శిష్టేతరుల వ్యవహారికం నుంచి సిద్ధించినందున దానికి ప్రామాణికత, సంస్కారం లేవని వారి ఆరోపణ. గ్రాంథిక భాష నన్నయ నుంచి ఆధునిక యుగం వరకు మారకుండా స్థిరంగా ఉన్నందున ప్రామాణిక వ్యవహారానికి అది అనుకూలమని వారి అభిప్రాయం. కందుకూరి వీరేశలింగం గారి ప్రత్యర్థి కొక్కొండ వెంకటరత్నం పంతులు నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడేవారు.

సరళ గ్రాంథిక భాష

గ్రాంథికభాషలో మారుమూల తెలుగు పదాలు, కన్నడ పదాలతో అర్థం కాని సంస్కృత పదాలు, కఠోరమైన వ్యాకరణ నియమాలు, అన్యదేశ్యాలున్నందున గ్రాంథిక భాషావాదులు పనికట్టుకొని వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. పెద్ద సంక్లిష్ట వాక్య నిర్మాణాలతో గ్రాంథిక భాష చదివేందుకు, రాసేందుకు కఠినంగా ఉన్నందున ఈ లోపాలను సవరించాలన్న నిర్ణయంతో సరళ గ్రాంథిక వాదులు చిన్నచిన్న సమాసాలు, సరళమైన సామాన్య వాక్యాలు, ప్రసిద్ధమైన తెలుగు, సంస్కృత పదాలతో రచనలు చేయాలని నిర్ణయించారు. అందమైన తెలుగు నుడికారాలు, జాతీయాలు, సామెతలతో, ఆకర్షణీయమైన శైలిలో తిరుపతి వేంకటకవులు, విశ్వనాథ సత్యనారాయణ, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, దివాకర్ల వేంకటావధాని, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామ శాస్త్రి మొదలైనవారు సరళ గ్రాంథిక శైలిలో రచనలు చేసి పాఠకులను కొంతమేర ఆకర్షించ గలిగారు. 20వ శతాబ్ది పూర్వార్థంలో నవలలు, కథానికలు, పత్రికా రచనలు, ఆధునిక విజ్ఞాన శాస్త్ర గ్రంథాలు, వ్యాసాలు సరళ గ్రాంథిక శైలిలో వచ్చాయి.

గ్రాంథిక భాషా సమర్థనతో వచ్చిన రచనలు

1. ఎ డిఫెన్స్ ఆఫ్ మోడరన్ లిటరరీ తెలుగు – జయంతి రామయ్య పంతులు
2. గ్రామ్యవాదుల భాషాపవాదం – పానుగంటి లక్ష్మీనరసింహారావు
3. ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి – జయంతి రామయ్య పంతులు

మాదిరి ప్రశ్నలు

1. శాసనాల్లో తత్సమ శబ్దాలకు తెలుగు పద్ధతిలో సంధి చేయడానికి ఉదాహరణ?
ఎ) మన్న్యణ్ణ బి) నీలీశ్వర
సి) మీనవమ్మ డి) తిక్కనయ్య

2. శిష్టోచ్చారణలో జరిగే మార్పు?
ఎ) హ కారం పోతుంది
బి) చకారం సకారమవుతుంది
సి) శ-ష-సల భేదం ఉంటుంది
డి) హల్లులు సమీకరణ పొందుతాయి

3. క్రీ.శ 1100 ముందునాటి శాసనాల్లో కనిపించే దేశ్య తత్సమ మిశ్ర సమాసాలు?
ఎ) కణ్ణసామి, గొల్లపల్లు
బి) అమృతపడి జయమాడ
సి) చౌషష్ఠ, ఘనరాచమణి
డి) దేవొనొజ్జ, మొగమాడున్

4. శాసనభాషలో స్త్రీ, పురుషోభయ వాచకాలైన ప్రత్యయాలు?
ఎ) అయ్య, అన్న బి) అవ, ఇయ
సి) పిడుగు, పోతు డి) అమ్మ, పోటి

5. భాషా చరిత్రకు ముఖ్యమైన జయసింహవల్లభుని శాసనం?
ఎ) బెజవాడ బి) అద్దంకి
సి) మైదవోలు డి) విప్పర్ల

6. శాసనాల్లో కనిపించని ప్రసిద్ధమైన ఛందస్సు
ఎ. ఉత్పలమాల బి. చంపకమాల
సి. శార్దూలం డి. కందం

7. శాసన భాషలో 'ళ' వర్ణం ఏ శతాబ్ది వరకు కనిపిస్తుంది?
ఎ) క్రీ.శ 5వ శతాబ్ది బి) క్రీ.శ 6వ శతాబ్ది
సి) క్రీ.శ 9వ శతాబ్ది డి) క్రీ.శ 10వ శతాబ్ది

8. గూడూరు కామసాని శాసనంలో ఉన్న పద్యాల ఛందస్సు?
ఎ) రెండు చంపకమాలలు- మూడు ఉత్పలమాలలు
బి) మూడు చంపకమాలలు – రెండు ఉత్పలమాలలు
సి) ఒక ఉత్పలమాల- నాలుగు చంపకమాలలు
డి) నాలుగు చంపకమాలలు-ఒక తేటగీతి

9. జన వల్లభుడి హర్కానల శాసనంలో ఉన్న పద్య ఛందస్సు?
ఎ) తేటగీతి బి) మధ్యాక్కర
సి) కందం డి) ఆటవెలది

10. పొట్లదుర్తి మాలెపాడు శాసనం వేయించిన రాజు
ఎ) ఎరుకల్ ముత్తురాజు
బి) జయసింహ వల్లభుడు
సి) రేనాటి పుణ్యకుమారుడు
డి) గుణగ విజయాదిత్యుడు

11. 1910లో ప్రారంభమైన భాషోద్యమం?
ఎ) గ్రాంథిక బాషోద్యమం
బి) ప్రామాణిక భాషోద్యమం
సి) అధికార భాషోద్యమం
డి) వ్యావహారిక భాషోద్యమం

12. గ్రాంథిక భాషలో 'ప్రాందెనుగు కమ్మ' పుస్తకం రచించిన పండితుడు
ఎ) గురజాడ అప్పారావు
బి) గిడుగు రామ్మూర్తి పంతులు
సి) కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి
డి) జయంతి రామయ్య పంతులు

13. నిత్య వ్యవహారంలో గ్రాంథిక భాషనే మాట్లాడిన పండితుడు?
ఎ) కందుకూరి వీరేశలింగం
బి) వేదం వేంకటరాయ శాస్త్రి
సి) కొక్కొండ వెంకటరత్నం పంతులు
డి) జయంతి రామయ్య పంతులు

14. గ్రాంథిక భాషా పరిరక్షణకు నిర్వహించిన పత్రిక
ఎ) ఆంధ్ర భారతి బి) ఆంధ్ర పత్రిక
సి) భారతి డి) ఆంధ్ర సాహిత్య పరిషత్

సమాధానాలు

1. బి; 2. సి; 3. సి; 4. బి; 5. డి;
6. సి; 7. బి; 8. బి; 9.సి; 10. సి
11. డి; 12. బి; 13.సి; 14.డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. 'ప్రాణ సమానుండవైన చెలివి' అన్న శాసన ప్రయోగం
ఎ) నామవాచకం మీద ప్రథమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
బి) నామవాచకం మీద ఉత్తమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
సి) నామవాచకం మీద మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం చేరింది.
డి) నామవాచకం మీద ప్రథమ పురుష బహువచన ప్రత్యయం చేరింది.

2. శాసనభాషలో కనిపించే వెలసును అనే తద్ధర్మార్థక రూపానికి ధాతు రూపం?
ఎ) వెలుచు బి) వేచు
సి) వెలుగు డి) వెలయు

3. శాసనభాషలో క్రీ.శ 6వ శతాబ్దికి ఈ విశిష్టత ఉంది?
ఎ) శాసనంలో తెలుగురాజుల పేర్లుండటం
బి) శాసనాల్లో తెలుగు రాజ్యాల ప్రత్యేక ప్రస్తావన
సి) మొత్తం తెలుగులో ఉన్న శాసనాలు లభించడం
డి) శాసనాల్లో తెలుగు పదాలు ఉండడం

4. 100 సంఖ్యను సూచించే తెలుగు శబ్దాల్లో ప్రాజ్ఞన్నయ యుగ శాసన భాషలో కనిపించని శబ్దం?
ఎ) శతము బి) నూట
సి) వంద డి) నూఱు

5. ఎక్కువమంది ప్రజలకు సమ్మతంగా ఉండటం లక్షణంగా కలది?
ఎ) జానపద భాష
బి) వ్యావహారిక భాష
సి) ప్రామాణిక భాష
డి) మాండలిక భాష

6. మాట్లాడే భాషలో సాధారణంగా కనిపించే లక్షణం?
ఎ) చందోబద్ధత
బి) సుదీర్ఘ వాక్య నిర్మాణం
సి) సమాచార పునరుక్తి
డి) దీర్ఘ సమాస భూయిష్ఠత

సమాధానాలు

1) సి 2) డి 3) సి
4) సి 5) సి 6) సి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సిగ్నల్స్‌లో ఎరుపు రంగు వాడటానికి కారణం?

పరమాణు నిర్మాణం

ద్రవ్యరాశి ఉండి కొంత ప్రదేశాన్ని ఆక్రమించే ధర్మమున్న దేనినైనా పదార్థం అంటారు. పురాతన కాలం నుంచే పదార్థ నిర్మాణాన్ని గురించి, పదార్థ మౌలిక కణాల గురించి వివిధ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. పదార్థం అతిసూక్ష్మ కణాలైన 'అణువు', 'పరమాణువు'ల సమ్మిళితమని 'కణాదుడు' అనే మహర్షి వేదకాలంలోనే ప్రతిపాదించాడు. తర్వాత గ్రీక్ తత్వవేత్త 'డిమోక్రటిస్' పదార్థాలు అతి సూక్ష్మమైన 'పరమాణువులు' కలిగి ఉంటాయని ప్రతిపాదించాడు. గ్రీక్ భాషలో 'Atom (పరమాణువు)' అంటే విభజించే వీలు కానిది అని అర్థం. ఒక సిద్ధాంత రూపంలో వివరించింది మాత్రం 'జాన్ డాల్టన్' (క్రీ.శ. 1808) అనే శాస్త్రవేత్త. ఈ సిద్ధాంతం ప్రకారం పదార్థం 'అవిభాజ్యమైన అత్యంత సూక్ష్మ కణమే' పరమాణువు. ఒక మూలకానికి చెందిన పరమాణువులన్నీ ఒకేరకంగా ఉండి ఒకే ధర్మాలను కలిగి ఉంటాయి. 20వ శతాబ్దం లో జరిగిన అనేక పరిశోధనల ఫలితాల్లో పరమాణువులో ఎన్నో మౌలిక కణాలున్నాయని తేలింది. వాటిలో ముఖ్యమైనవి ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌లు. వీటినే ప్రాథమిక లేదా మౌలిక కణాలంటారు.

- జె.జె.థామ్సన్ 'విద్యుత్ ఉత్సర్గ నాళికా' ప్రయోగంలో కనుగొన్న 'రుణ విద్యుత్ కిరణాల' కు జె.జె.స్టోనీ అనే శాస్త్రవేత్త 'ఎలక్ట్రాన్‌లు' అని నామకరణం చేశాడు. ఏకమాత్ర రుణావేశం ఉన్న ఈ కణాలు అత్యంత తేలికైనవి. ప్రోటాన్ ద్రవ్యరాశిలో 1/1836వ వంతు ఉంటుంది.
- గోల్డ్ స్టెయిన్ కనిపెట్టిన ధన ధృవకిరణాలే ప్రోటాన్‌లు. ఇవి ఏకమాత్ర ధనావేశం ఉన్న ఎలక్ట్రాన్ల ద్రవ్యరాశి కంటే 1837 రెట్లు అధిక ద్రవ్యరాశిని కలిగి ఉంటాయి.
- ప్రాథమిక కణాల్లో అత్యంత భారమైన, ఆవేశ రహిత కణాలు న్యూట్రాన్లు. వీటిని జేమ్స్ చాడ్విక్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- పరమాణువులో ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్ల అమరికను 'పరమాణు నమూనా' అంటారు. జె.జె. థామ్సన్, రూథర్ ఫర్డ్, నీల్స్ బోర్‌లు ప్రతిపాదించిన పరమాణు నమూనాలు ముఖ్యమైనవి.
- 'పుచ్చపండు' నమూనాగా ప్రసిద్ధి చెందిన థామ్సన్ నమూనాలో పుచ్చపండు గుజ్జు లో గింజలు పొదిగినట్లు ధనావేశ పూరిత పరమాణు కేంద్రకంలో ఎలక్ట్రాన్‌లన్నీ పొదిగి ఉంటాయని ప్రతిపాదించారు. వ్యతిరేక ఆవేశాలు ఉన్న ఎలక్ట్రానులు, ప్రోటాన్లను కలిపి ఉంచడం సాధ్యం కాదు. కాబట్టి ఈ నమూనా తిరస్కారానికి గురైంది.
- 'గ్రహమండల నమూనా'గా పేరు గాంచిన రూథర్‌ఫర్డ్ నమూనా ప్రకారం పరమాణు ద్రవ్యరాశి, ధనావేశ పరమాణు కేంద్రం వద్ద కేంద్రీకృతమై ఉంటుంది. దీన్నే పరమాణు కేంద్రకం అంటారు. దాని చుట్టూ ఎలక్ట్రాన్‌లు వృత్తాకార కక్ష్యల్లో తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించారు. ఈ నమూనాలోని లోపాలను సవరిస్తూ కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్‌లు సంచరించడానికి వృత్తాకార మార్గాల (కర్పరాలు)ను బోర్ నమూనా ప్రతిపాదించింది. బోర్ నమూనా విజయవంతానికి కాంతి స్వభావం, పరమాణు వర్ణపటం, ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం, ఐన్‌స్టీన్ కాంతి విద్యుత్ ఫలితం మొదలైన అంశాలు కారణమయ్యాయి.

కాంతి స్వభావం విద్యుదయస్కాంత వర్ణపటం

- కాంతికి కణ స్వభావంతో పాటు, తరంగ స్వభావం కూడా ఉంటుంది. కాంతి వివిధ విద్యుదయస్కాంత వికిరణాల సమూహం. వీటి శక్తి తగ్గే క్రమం: కాస్మిక్ కిరణాలు > γ కిరణాలు > X – కిరణాలు > అతి నీలలోహిత(UV) కిరణాలు > దృగ్గోచర కిరణాలు > పరారుణ (IR) కిరణాలు > సూక్ష్మ తరంగాలు (Micro waves) టి.వి. తరంగాలు > రేడియో తరంగాలు.
- వీటి శక్తి తగ్గుతున్న కొద్దీ తరంగదైర్ఘ్యం పెరుగుతుంది. అంటే γ కిరణాల శక్తి ఎక్కువ, తరంగదైర్ఘ్యం తక్కువ. రేడియో తరంగాలకు శక్తి తక్కువ,తరంగదైర్ఘ్యం ఎక్కువ.
- కోబాల్ట్–60 అనే రేడియో ధార్మిక మూలకం ఉద్గారం చేసే γ కిరణాలను క్యాన్సర్ కారక కణాలను నశింప చేయడానికి, కూరగాయలు, గింజధాన్యాలను ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు క్రిమిరహితం చేయడానికి ఉపయోగిస్తారు. లెడ్ నుంచి γ కిరణాలు ప్రయాణించవు.
- X కిరణాలను రాంట్‌జన్ కనిపెట్టాడు. కంటికి కనిపించని ఈ కిరణాలు మామూలు కాంతి చొచ్చుకుపోని పదార్థాల ద్వారా చొచ్చుకుని పోగలవు. విరిగిన ఎముకల గురించి, శరీరంలో ఇతర అంగవైకల్యాలు, పరిశ్రమల్లో పరికరాల్లోని పగుళ్ల గురించి తెలుసుకోవడానికి ఈ కిరణాలను విరివిగా వాడతారు. అణువుల నిర్మాణం, స్ఫటిక నిర్మాణం తెలుసుకోవచ్చు. కస్టమ్స్ శాఖ అధికారులు X–కిరణాలను ఉపయోగించి దొంగ రవాణా చేస్తున్న వస్తువులు, ఆయుధాల గురించి తెలుసుకుంటారు.
- అతినీలలోహిత కిరణాల (UV)ను నీటిని క్రిమిరహితం చేయడానికి, నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించడానికి ఉపయోగిస్తారు.
- దృగ్గోచర కాంతి కంటికి కనిపిస్తుంది. ఇది VIBGYOR అనే ఏడురంగుల సమ్మిళితం.
- పరారుణ (IR) కిరణాలను టి.వి. రిమోట్‌లలో, చీకట్లో చూడడానికి ఉపయోగించే 'నైట్ విజన్' కళ్లద్దాలలో ఉపయోగిస్తారు.
- వంట చేయడానికి మైక్రో తరంగాలను ఉపయోగిస్తారు. నీరు, కొవ్వు కణాలను మైక్రో తరంగాలు కంపనం చెందించడం వల్ల వేడి జనించి పదార్థాలు ఉడుకుతాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

కెమిస్ట్రీ

- అయనోస్ఫియర్ నుంచి అధిక తరంగ దైర్ఘ్యం ఉన్న రేడియో తరంగాలు పరివర్తనం చెందుతాయి. అందువల్ల వీటిని కమ్యూనికేషన్ల వ్యవస్థలో ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. పరమాణు కేంద్రకంలో ప్రోటాన్లు ఉంటా యని తెలిపిన శాస్త్రవేత్త?
   1) బోర్ 2) రూథర్‌ఫర్డ్
   3) థాంసన్ 4) చాడ్విక్
2. మానవ శరీర అంతర నిర్మాణాన్ని చూడటానికి ఉపయోగించే కంప్యూటర్ టోమో గ్రఫీ (CT)కి ఆధారం?
   1) X–కిరణాలు 2) ధ్వని తరంగాలు
   3) అయస్కాంత అనునాదం
   4) రేడియో ఐసోటోపులు
3. రాత్రి చూడటానికి ఉపయోగించే పరికరాల్లో వాడే కిరణాలు?
   1) రేడియో తరంగాలు 2) మైక్రో తరంగాలు
   3) పరారుణ తరంగాలు 4) ఏవీ కావు
4. సిగ్నల్స్‌లో ఎరుపు రంగును వాడటానికి కారణం?
   1) ఎరుపు డేంజర్‌ను సూచించడానికి సింబాలిక్‌గా వాడతారు
   2) అల్ప తరంగదైర్ఘ్యం ఉండటం
   3) అధిక తరంగదైర్ఘ్యం ఉండటం
   4) చవకైంది
5. అయనోవరణం అనే భూ వాతావరణం లోని ఒక పొర, రేడియో కమ్యూనికేషన్లకు వీలు కలిగిస్తుంది. ఎందుకు?
   ఎ) ఓజోన్ ఉనికి వల్ల రేడియో తరంగాలు భూమిపైకి పరావర్తనం చెందడం
   బి) రేడియో తరంగాలకు సుదీర్ఘమైన తరంగదైర్ఘ్యం ఉండటం.
   పై వాటిలో సరైంది?
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) రెండూ కాదు



6. రాడార్‌లో ఉపయోగించే విద్యుదయ స్కాంత కిరణాలు?
   1) X–కిరణాలు 2) పరారుణ
   3) మైక్రో తరంగాలు 4) గామా
7. కాంతి విస్తరణను అధ్యయనం చేయడానికి ఉపయోగించే సాధనం?
   1) మైక్రోస్కోప్ 2) స్పెక్ట్రోమీటర్
   3) టెలిస్కోప్ 4) ఫొటోమీటర్
8. కిందివాటిలో సరైన వాక్యం?
   ఎ) కాస్మిక్ కిరణాలు అతి తక్కువ తరంగ దైర్ఘ్యం, అత్యధికశక్తి కలిగిన ఎలక్ట్రో మాగ్నటిక్ తరంగాలు
   బి) అన్ని విద్యుదయస్కాంతాలు కాంతి వేగం (3×10^8 మీ/సె)తో ప్రయాణి స్తాయి
   సి) ఓజోన్ పొర కాస్మిక్ కిరణాలను, అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరకుండా ఫిల్టర్ చేస్తుంది
   డి) ఏదైనా పదార్థాన్ని మైక్రో తరంగాలు వేడి చేయాలంటే అందులో తప్పని సరిగా నీటి అణువులుండాలి
   1) ఎ మాత్రమే 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
9. సూక్ష్మ తరంగ భట్టీ (Microwave Oven) ఏ గుణకాన్ని ఉపయోగిస్తుంది?
   1) నీళ్ల సూక్ష్మ తరంగ శోషణం
   2) వంటచేసే పాత్ర సూక్ష్మ తరంగ శోషణం
   3) వంట సూక్ష్మ తరంగ పరావర్తనం
   4) ఏదీ కాదు
10. సెల్‌ఫోన్‌లలో ఉపయోగించే విద్యుద యస్కాంత తరంగాలు?
    1) మైక్రో తరంగాలు 2) పరారుణ కాంతి
    3) రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలు
    4) కాస్మిక్ కిరణాలు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3; 5) 2;
6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 3

కాల్షియం, మెగ్నీషియం

ఆరోగ్యవంతమైన దంతాలు, ఎముకల కోసం కాల్షియం అత్యంత ఆవశ్యకమైంది. యుక్త వయసులో మానవ శరీరంలో సుమారు 25 గ్రాముల మెగ్నీషియం (Mg), 1200 గ్రాముల కాల్షియం (Ca) ఉంటాయి. శరీరంలో ఉండే కాల్షియంలో 99 శాతం ఎముకలు, దంతాల్లో ఉంటుంది. కండరాల్లోని నరాల పనుల్లోనూ, రక్తం గడ్డకట్టడంలోనూ కాల్షియం ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

కాల్షియం ముఖ్యమైన సమ్మేళనాలు: కాల్షియం కార్బొనేట్, కాల్షియం హైడ్రాక్సైడ్, సిమెంట్, జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్.

- సున్నపురాయి, సుద్ద, చలువరాతి ముక్కలను రసాయనికంగా 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)' అంటారు. సున్నపురాయిని బట్టీల్లో కాల్చినప్పుడు పొడిసున్నం (కాల్షియం ఆక్సైడ్) వస్తుంది. దీనికి పరిమితంగా నీటిని కలిపితే రాళ్లు పగిలి ముద్దగా మారుతాయి. ఈ ప్రక్రియనే 'స్లేకింగ్ ఆఫ్ లైమ్' అంటారు. ఇది కాల్షియం హైడ్రాక్సైడ్. విలీన కాల్షియం హైడ్రాక్సైడ్(సున్నపు తేట)ను మిల్క్ ఆఫ్‌లైమ్ అంటారు.
- గాజు తయారీ, చర్మం శుద్ధి, బ్లీచింగ్ పౌడర్ తయారీ, చక్కెర శుద్ధి ప్రక్రియల్లో కాల్షియం హైడ్రాక్సైడ్ ఉపయోగపడుతుంది.
- సున్నపురాయిని పొడిసున్నం తయారీలో వాడతారు.సిమెంట్ తయారీకి ప్రధాన ముడి పదార్థాలు– సున్నపురాయి, బంకమట్టి.
- ప్రత్యేకంగా అవక్షేపించిన కాల్షియం కార్బొనేట్‌ను మేలు రకం కాగితం తయారీలో, ఆమ్ల విరోధిగా, టూత్‌పేస్ట్‌లో సున్నితమైన అపఘర్షకంగా, చ్యూయింగ్ గమ్‌లో, సౌందర్య సాధనాల్లో పూరకంగానూ వాడతారు.
- కాల్షియం సల్ఫేట్ డై హైడ్రేట్ ($CaSO_4 . 2H_2O$)ను 'జిప్సం' అంటారు. దీన్ని ప్రత్యేక ఉష్ణోగ్రత 393K వద్ద వేడిచేస్తే 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ($CaSO_4 . ½H_2O$)' ఏర్పడుతుంది. దీన్ని గృహ నిర్మాణాల్లో, విరిగిన విగ్రహాలను అతికించడంలో, ఎముకలు కదలకుండా కట్టు కట్టడంలో, దంత వైద్యంలో, నగలు పోతపోయడానికి, విగ్రహాల తయారీలో ఉపయోగిస్తారు.
- సున్నం(కాల్షియం ఆక్సైడ్)తోపాటు సిలికా (SiO_2), అల్యూమినా(Al_2O_3), మెగ్నీషియం ఆక్సైడ్‌లతో కూడిన బంకమట్టి మిశ్రమమే 'సిమెంట్'.
- మొక్కల్లో ఉండే ఆకుపచ్చ వర్ణద్రవ్యం'క్లోరోఫిల్'. ఇందులో ఉండే లోహ అయాన్ 'మెగ్నీషియం'.
- ఆమ్ల విరోధిగా పనిచేసే 'మెగ్నీషియం హైడ్రాక్సైడ్'ను 'మిల్క్ ఆఫ్ మెగ్నీషియా' అంటారు.
- ఎక్కువ బలం ఉన్న స్ప్రింగ్‌ల తయారీలో కాపర్ –బెరీలియం మిశ్రలోహాలను ఉపయోగిస్తారు.
- మెగ్నీషియం పొడిని ఫ్లాష్ పౌడర్ తయారీలో, బల్బులు, సిగ్నల్‌లలో వాడతారు.
- రేడియం అనేది రేడియోధార్మిక మూలకం. దీని లవణాలను 'రేడియో థెరపీ' (కేన్సర్ చికిత్స)లో వాడతారు.
- ముత్యంలో కాల్షియం కార్బొనేట్, ఎమరాల్డ్‌లో బెరీలియం ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. ముత్యంలో ప్రధాన అనుఘటకాలేవి?
   1) సోడియం కార్బొనేట్, కాల్షియం కార్బొనేట్
   2)కాల్షియం కార్బొనేట్,మెగ్నీషియం కార్బొనేటు
   3) కాల్షియం ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్
   4) కాల్షియం సల్ఫేట్, కాల్షియం కార్బొనేట్
2. కిందివాటిలో ఏది లోపించడం వల్ల ఎముకలు, దంతాలు బలహీనపడతాయి?
   1) కాల్షియం 2) ఫాస్ఫరస్
   3) ఫ్లోరైడ్ 4) పైవన్నీ
3. సిమెంట్ వేటి మిశ్రమం?
   1) కాల్షియం కార్బొనేట్, కాల్షియం సిలికేట్
   2) కాల్షియం సిలికేట్, కాల్షియం అల్యూమినేట్
   3) ఇసుక, సున్నం, నీరు
   4) జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్
4. మార్బుల్ రసాయన సంకేతం ఏది?
   1) $Ca(OH)_2$ 2) $CaCO_3$
   3) CaO 4) $CaHCO_3$
5. ఎమరాల్డ్‌లో ఉండే ప్రధాన మూలకం ఏది?
   1) కాల్షియం 2) మెగ్నీషియం
   3) బెరీలియం 4) సిలికాన్
6. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
   1) గట్టిదనం కోసం 2) బూడిద రంగు కోసం
   3) నీరు కలిపినప్పుడు ప్రారంభ దశలో నెమ్మదిగా సెట్టింగ్ జరగడానికి
   4) బరువు తూగడానికి
7. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను ఏ పదార్థం నుంచి తయారు చేయవచ్చు?
   1) తడిసున్నం 2) జిప్సం
   3) సిమెంట్ 4) మార్బుల్
8. సముద్రపు నీటి నుంచి సంగ్రహించే లోహం?
   1) బంగారం 2) సిల్వర్
   3) మెగ్నీషియం 4) మెర్క్యురీ
9. బాణాసంచా కాల్చినప్పుడు మిరుమిట్లు గొలిపే తెల్లని కాంతినిచ్చే లోహం ఏది?
   1) మెగ్నీషియం 2) కాల్షియం
   3) స్ట్రాన్షియం 4) బేరియం
10. టపాకాయలు కాల్చినప్పుడు సింధూర ఎరుపు రంగునిచ్చే లోహం ఏది?
    1) మెగ్నీషియం 2) కాల్షియం
    3) బేరియం 4) స్ట్రాన్షియం

సమాధానాలు

1) 2 2) 4 3) 2 4) 2 5) 3
6) 3 7) 2 8) 3 9) 1 10) 4

The antonym of Conciliatory is..



MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The greater Hyderabad Municipal Corporation is caught in a catch 22 situation (1)/ to enforcing (2)/ its own flat on stoppage of road cutting (3)/ and evacuation work during monsoon. (4)/ No error (5)
2. The Supreme Court upheld the validity of a Income Tax law (1)/ amendment linking PAN with Aadhar for filling tax returns (2)/ and making Aadhar compulsory (3)/ to apply for a PAN card. (4)/ No error (5)
3. Numismatists felt (1)/ that the demonetization (2)/ exercise was a call on duty (3)/ for them. (4)/ No error (5)
4. Savings remained unclaimed in dormant EPF accounts (1)/ for seven years will be used (2)/ to fund a new scheme (3)/ for providing medical benefits to pensioners. (4)/ No error (5)
5. Sri Lanka skipper Angelo Mathews thanks (1)/ quite a few people (2)/ after the stunning win (3)/ over India on Thursday. (4)/ No error(5)

Directions (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The media should not be <u>cowed by</u> the government's efforts to encroach upon its freedom.
   1) cowed for
   2) cowed down by
   3) cowed at 4) cowed by for
   5) No correction required
7. Despite her fear of heights, she was thrilled to be <u>up</u> the mountain.
   1) so up 2) far up
   3) so far up 4) on up
   5) No correction required
8. The minister also claimed that all the formalities had been completed and would be implemented <u>in immediate effects.</u>
   1) With immediate effect
   2) In immediate effect
   3) As immediate effects
   4) Immediately effect
   5) No correction required
9. Raghu moved <u>earth as well as heaven</u> to pass the exam but he could not.
   1) Earth as heaven
   2) Heaven as earth
   3) Earth and as heaven
   4) Earth and heaven
   5) No correction required
10. The yoga session on the international yoga day is <u>most likelihood to start at. 6.00 a.m.</u>
    1) Like to start from 6.00 a.m
    2) Most like to start at 6.00 a.m.
    3) Most likely to start at 6.00 a.m
    4) Likely to start on 6.00 a.m
    5) No correction required

Directions (Q.No. 11 - 15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The WHO paper asks to integrate traditional and complementary medicine services, where appropriate, into health care service delivery and self-health care and to promote an improved universal health coverage by doing so
B) WTO, WIPO and WHO ask for respect for both the economic value and the social and cultural significance of traditional knowledge
C) Traditional medicine has a long history of use in health maintenance and in disease prevention and treatment, particularly for chronic diseases
D) Traditional medicine, including Ayurveda, contributes significantly to the health status of many communities, and is increasingly used within certain communities in developed countries
E) Suitable recognition of traditional medicine is an important element of national health policies and has as well important basis for new products with significant export potential
F) And supports documentation of traditional medical knowledge and enhanced regulation of quality, safety and efficacy of such products

11. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) D 4) C 5) E
15. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. A major tragedy was _____ after an Air India plane suffered a brake failure and skidded beyond the _____ before coming to a halt.
    1) occurred; aisle
    2) averted; runway
    3) halted; passage
    4) diverted; take off
    5) stopped; trajectory
17. The government is _____ a new data protection law to protect personal data of citizens.
    1) reporting 2) considering
    3) mulling 4) sharing5) responding
18. The _____ weather patterns of the tropical island meant tourists had to carry both umbrellas and sunglasses.
    1) impertinent 2) supplicant
    3) preeminent 4) illustrative
    5) kaleidoscopic
19. The eager members of the audience found the lecture topic _____, but unfortunately the lecturer' droning voice had a _____ effect.
    1) Interesting; rousing
    2) Advantageous; beneficial
    3) Rudimentary; reassuring
    4) Insipid; bland
    5) Stimulating; soporific
20. Hari's ability to analyze issues fairly and competently has earned him the _____ of even his most _____ peers.
    1) solicitation; unbiased
    2) attention; sympathetic
    3) suspicion; discerning
    4) reputation; knowledgeable
    5) respect; exacting

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

With Brexit negotiations set to commence soon, the result will also raise fundamental questions about Britan's Brexit strategy, though perhaps not in the way some had foreseen. The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit just the Conservatives, but labour gained from them too, suggesting that the disillusionment that UKIP in part reflected did not necessary involve policies focused around cutting immigration. While Labour has pledged "fair rules and reasonable management of migration", its immigration strategy would be big departure from the tough Conservative approach, making allowances for family reunions and a more welcoming environment for students. However, the results also suggested that there was limited public **appetite** for the Liberal Democrat pledge to hold a second referendum on the terms of the Brexit deal, as the party failed to make the comeback it had hoped to. At the same time, Labour has pledged to **rip up** the Conservatives' white paper and adopt a more **conciliatory** approach to the negotiations, which would include retaining the benefits of the single market and customs union.

21. Which statement is true?
    a) Family reunions and student friendly programs are going to have a tough time.
    b) The immigration policy of the Labour falls in line with the Conservative approach.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
22. Identify the statement which is false.
    a) The collapse of support for the right-wing UK Independence party had been expected to benefit the Conservatives.
    b) The collapse of support for the right-wing UK Independence party was expected to benefit both the Conservatives and the Labour.
    1) Only a 2) Only b
    3) Both a & b 4) Either a or b
    5) Neither a nor b
23. The antonym of Conciliatory is:
    1) Provocative 2) Pacifying
    3) Appeasing 4) Pacific
    5) Placatory
24. The meaning of the phrase "rip up" is:
    1) Through away 2) Down size
    3) Tear into pieces
    4) Collide together 5) Conjoin
25. The synonym of Appetite is:
    1) Taste 2) Hunger
    3) Food 4) Eatery 5) Desire

Directions (Q.No. 26 - 35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Seven years of rollercoaster _____ (26) over an India-Japan civil nuclear energy deal came to ___(27) on Wednesday when Japan's Parliament, the Diet, _____(28) the pact. Opposition parties voiced ___(29) against the deal, highlighting ____ (30) that India has provided ____ (31) guarantees for Japan's right to ____ (32) the agreement in the event of New Delhi ____ (33) a nuclear test. Nonetheless, the ruling coalition pushed the ____ (34) through with a majority vote. The agreement is set to take _____(35) in early July.

26. 1) negotiations 2) discussion
    3) debate 4) talk
    5) possessions
27. 1) result 2) fruition 3) execution 4) termination 5) conclusion
28. 1) standard 2) official
    3) approved 4) permission
    5) agree
29. 1) object 2) approval
    3) complain 4) protest
    5) gripe
30. 1) consent 2) concerning
    3) concerned 4) concern
    5) concerns
31. 1) insufficient 2) supply
    3) enough 4) adequate
    5) lacking
32. 1) expire 2) terminate
    3) permit 4) conceal
    5) pause
33. 1) organizing 2) managing
    3) conducting 4) participating
    5) performing
34. 1) harmony 2) unity
    3) settlement 4) accord
    5) concurrence
35. 1) after 2) along
    3) with 4) affect 5) effect

KEY

1) 2	2) 1	3) 3	4) 1	5) 1
6) 2	7) 3	8) 1	9) 4	10) 3
11) 2	12) 5	13) 3	14) 3	15) 5
16) 2	17) 3	18) 5	19) 5	20) 5
21) 5	22) 3	23) 1	24) 3	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 1	32) 2	33) 3	34) 4	35) 5